సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 340
సోమవారం 2-3-2026

నాకౌట్‌కూ అజేయంగానే...
జింబాబ్వేపై 5 వికెట్ల తేడాతో గెలుపు
దక్షిణాఫ్రికాకు ఏడో విజయం - 10లో

సలీమా టెటె సారథ్యంలో...
మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ బరిలోకి భారత్ -10లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

డీఎంకే సర్కార్ అవినీతిమయం
తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయంగా మారిపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



కాన్సులేట్ ముట్టడికి యత్నం
ఖమేనీ మృతికి నిరసనగా పాక్‌లోని కరాచీలో అమెరికా కాన్సులేట్ కార్యాలయాన్ని నిరసనకారులు ముట్టడించడానికి యత్నించారు.
వివరాలు 6లో ▸



పశ్చిమాసియాపైనే మార్కెట్ ఫోకస్..
పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధ భయాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను దెబ్బతీసే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.
వివరాలు 14లో ▸



రోబో సలహాలు మంచివే...
ఇన్వెస్ట్‌లో దేశంలో రోబో ఎడ్వైజర్లు వేగంగా పెరుగుతున్నాయి. ఫీజు నామమాత్రమే కావడంతో యువత వాటిపై ఆసక్తి చూపిస్తున్నారు.
వివరాలు 14లో ▸

అన్యాయాన్ని ప్రతిఘటించలేని ప్రభుత్వం ఎందుకు?

- రాయలసీమ ఎత్తిపోతల ఇన్సూరెన్స్‌లాంటి ప్రాజెక్టు
- మనవేలితో మనకంటినే పొడుస్తున్నారు.. ఇది చంద్రబాబు తెలిసి చేస్తున్న అన్యాయం
- ప్రజల్లో ధర్మాగ్రహం రావాలి
- గ్రేటర్ రాయలసీమ రౌండ్‌టేబుల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు

3 లో

అత్యంత విషమంగా క్షతగాత్రుల ఆరోగ్యం

- బాణసంచా విస్ఫోటనం ఘటనలో దయనీయ పరిస్థితి
- చికిత్స పొందుతూ ఇద్దరి మృతి.. 22కి చేరిన మృతుల సంఖ్య
- నిబంధనలు అతిక్రమించడం వల్లే ప్రమాదం
- పోలీసుల అదుపులో నిర్వాహకుడు.. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

3 లో

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల ట్రేటిల్ ధర ₹72	ఫారం దగ్గర లైవ్ బర్డ్	150 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	257 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	177 కిలో	స్కిన్ లెస్	292 కిలో

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీ చేయడమైనది

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి

కుమార్తె, అల్లుడు,మనవరాలు సహా కుటుంబ సభ్యులు మృతి

ఆర్మీ చీఫ్ మూసావీ కూడా.. క్షిపణి దాడుల్లో మట్టుబెట్టిన ఇజ్రాయెల్

- ఖమేనీ మృతిని ధ్రువీకరించిన ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా
- చరిత్రలోనే అత్యంత క్రూరమైన వ్యక్తి మరణించాడు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- అణు కార్యక్రమం అంతమయ్యేదాకా దాడులు ఆగవని స్పష్టీకరణ
- శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రతిజ్ఞ
- ఖమేనీ మృతికి సంతాప సూచికగా నల్లజెండాలు ఎగురవేసిన మద్దతుదారులు.. చర్చించుకుందామని ట్రంప్‌కు ఇరాన్ పిలుపు

వాషింగ్టన్/దుబాయ్

దశాబ్దాలపాటు ఇరాన్‌ను శాసించి, పశ్చిమ దేశాలకు కంట్లో నలుసులా మారిన సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ(86) కథ ముగిసింది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడిలో ఆయన మరణించారు. ఖమేనీతోపాటు ఆర్మీ చీఫ్ అబ్దుల్ రహీం ముసావీ, రక్షణ మంత్రి అమీర్ నజీర్‌జాదే తదితరులు కూడా మృతి చెందారు. రాజధాని టెహ్రాన్‌లోని ఆయన నివాసంపై శనివారం ఉదయం ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు క్షిపణుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో ఖమేనీ మృతిచెందినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ధ్రువీకరించింది. ఖమేనీ మృతిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ప్రకటన చేశారు. చరిత్రలోనే అత్యంత క్రూరమైన వ్యక్తి విగతజీవిగా మారిపోయాడని వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దేశాన్ని తిరిగి అధీనంలోకి తీసుకొనే ఏకైక అతిపెద్ద అవకాశం ఇరాన్ ప్రజలకు లభించిందని సూచించారు. ఇరాన్‌పై భారీ, పిన్‌పాయింట్ దాడులు మరో వారంపాటు.. అవసరమైతే ఆ తర్వాత కూడా యథాతథంగా కొనసాగుతాయని తేల్చిచెప్పారు. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేదాకా దాడులు తప్పవని ఉద్ఘాటించారు. తమ అత్యున్నత నిఘా వ్యవస్థ నుంచి ఖమేనీ తప్పించుకోలేకపోయాడని ట్రంప్ వెల్లడించారు. ఖమేనీ మృతిపై ఇజ్రాయెల్ కూడా స్పందించింది. ఇరాన్ సుప్రీం లీడర్‌తోపాటు రక్షణ శాఖ మంత్రి అమీర్ నజీర్‌జాదే, ఇరాన్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి, ఖమేనీ సలహాదారు, 30 మందికి పైగా ఇరాన్ రెవల్యూషనరీ గార్డు టాప్ కమాండర్ తదితరులు కూడా అంతమయ్యారని తేల్చిచెప్పింది. ఇజ్రాయెల్, అమెరికా దాడుల

మిగతా 2వ పేజీలో ▶

ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అరాఫీ

త్వరలో శాశ్వత సుప్రీం లీడర్ ఎంపిక రంగంలోకి 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'
- వివరాలు 6లో▶



పక్కా సమాచారంతో

- టెహ్రాన్‌లో సీనియర్ నేతలు, అధికారులతో ఖమేనీ భేటీ అవుతున్నట్లు గుర్తింపు
- 30 క్షిపణులు ప్రయోగించిన ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు

2 లో

నిప్పుల వర్షం

- పశ్చిమాసియాలో పూర్తి స్థాయి యుద్ధ పరిస్థితులు
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై విరుచుకుపడిన ఇరాన్

6 లో

సలామ్ సామ్సన్

50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్

టి20 ప్రపంచ కప్ సెమీస్‌లో భారత్

- 'సూపర్-8' మ్యాచ్‌లో 5 వికెట్లతో వెస్టిండీస్‌పై గెలుపు
- వెస్టిండీస్ 20 ఓవర్లలో 195/4
- టీమిండియా 19.4 ఓవర్లలో 199/5
- గురువారం ముంబైలో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్
- బుధవారం న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా ఢీ

10 లో

ధ్వజస్తంభానికి మొక్కి శ్రీవారి ఆలయం లోపలికి వెళ్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

మధ్యవర్తిత్వంతో మేలైన న్యాయం

కోర్టుల్లో కేసులు పేరుకుపోకుండా ఎంతో ఉపయోగం

- మన దేశ డీఎన్‌ఏలోనే మీడియేషన్
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- అమరావతిలో ఏపీ హైకోర్టు అతిథి గృహం, జుడీషియల్ అకాడమీలకు శంకుస్థాపన
- ఏపీ హైకోర్టు జడ్జీల నివాస సముదాయం ప్రారంభించిన సీజేఐ

3 లో

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి

▶ మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో ఖమేనీ సారథ్యంలోని సుప్రీం డిఫెన్స్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా దాడులు చోటుచేసుకున్నాయి.

40 రోజులపాటు సంతాప దినాలు

వైమానిక దాడిలో ఖమేనీ నివాసం చాలా వరకు ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలను బట్టి స్పష్టమవుతోంది. ఈ ఘటనలో ఆయన కుటుంబ సభ్యులు సైతం మరణించినట్లు తెలిసింది. వీరిలో ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు ఉన్నట్లు తెలిసింది. శత్రుదేశాల దాడిలో తమ అత్యున్నత నాయకుడు ఖమేనీ ప్రాణాలు కోల్పోయినట్టు ఇరాన్ కేబినెట్ ధ్రువీకరించింది. ప్రతీకారం తప్పదని తేల్చి చెప్పింది. శత్రువులు అతిపెద్ద తప్పు చేశారు, కచ్చితంగా సమాధానం చెబుతామని స్పష్టంచేసింది. ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో ఖమేనీతోపాటు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఉన్నతస్థాయి కమాండర్ మేజర్ జనరల్ మొహమ్మద్ పాక్‌పౌర్, ఖమేనీ అత్యున్నత భద్రతా సలహాదారు అలీ షామ్‌ఖనీ కూడా మృతిచెందినట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఖమేనీ కన్నుమూయడంతో దేశంలో 40 రోజలపాటు సంతాప దినాలు పాటించాలని ఇరాన్ ప్రభుత్వం ఆదేశించింది. ఆయన స్మారకార్థం వారం రోజులపాటు దేశవ్యాప్తంగా సెలవులు ప్రకటించింది. దాంతో సంతాప సూచకంగా జనం నల్ల జెండాలు ప్రదర్శించారు. షియా ముస్లింలకు పవిత్ర క్షేత్రమైన మషాద్ సిటీలోని ఇమామ్ రెజా మసీదుపై నల్ల జెండా ఎగరవేశారు.

ఒకవైపు విషాదం.. మరోవైపు ఆనందం

తమ అధినేత ఖమేనీ ఇక లేరన్న నిజాన్ని ఆయన మద్దతుదారులు జీర్ణించుకోలేకపోయారు. శోకసంద్రంలో మునిగిపోయారు. ఇజ్రాయెల్, అమెరికా దేశాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శాపనార్థాలు పెట్టారు. ఖమేనీ చిత్రపటాలు చేతబూని నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. మరోవైపు ఖమేనీ మరణించడం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ ఆయన వ్యతిరేకులు వీధుల్లోకి వచ్చారు. పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఆనందంతో నృత్యాలు చేశారు. నియంత పాలన అంతమైందంటూ నినదించారు. బూరలు ఊదుతూ పెద్ద ఎత్తున శబ్దాలు చేస్తూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోరుకుంటున్నామని వారు స్పష్టంచేశారు.

ఖమేనీ మృతి చెందినట్టు ప్రకటించడంతో ఆదివారం టెహ్రాన్‌లో భారీ సంఖ్యలో రోడ్లపైకి వచ్చిన ప్రభుత్వ మద్దతుదారులు

క్లుప్తంగా...

26 అరైవల్, 27 డిపార్చర్ విమానాల రద్దు

శంషాబాద్: పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం అంతర్జాతీయ విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దోహా, బహ్రెయిన్, అబుదాబితో పాటు పలు దేశాల గగనతలాలు మూసివేత కారణంగా హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే విమానాలు పెద్ద ఎత్తున రద్దవుతున్నాయి. ఆదివారం మొత్తం శంషాబాద్‌కు రావాల్సిన 26 అరైవల్, ఇక్కడి నుంచి బయల్దేరాల్సిన 27 డిపార్చర్ విమానాలను సంబంధిత ఎయిర్‌లైన్స్‌లు ముందస్తుగానే రద్దు చేశాయి. ఇందులో కువైట్, దుబాయ్, అబుదాబి, రస్‌అల్ ఖైమా, ధమామ్, జెడ్డా, షార్జా తదితర గమ్యస్థానాలకు రాకపోకలు సాగించే విమానాలున్నాయి. దుబాయ్ నుంచి యూఎస్ అనుసంధాన విమానాల్లో బయల్దేరే వారికి కూడా విమానాల రద్దు ప్రభావం పడింది. కార్గో విమానాల రాకపోకలపై కూడా ఈ ప్రభావం పడుతోంది. హాంగ్‌కాంగ్ నుంచి దుబాయ్‌కు బయల్దేరిన ఓ విమానాన్ని దారి మళ్లించడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పార్క్ చేశారు. అలాగే థాయ్‌లాండ్‌లోని క్రాబి నుంచి దుబాయ్‌కు బయల్దేరిన విమానాన్ని కూడా దారి మళ్లించి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. సోమవారం నాటి షెడ్యూల్‌లో కూడా గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన ఏడు విమానాలు రద్దు చేసినట్లు ముందస్తుగా ప్రకటించారు. విమానాల రద్దుతో ముందస్తు సమాచారం లేని కొందరు ప్రయాణికులు మాత్రం గందరగోళానికి గురవుతున్నారు. టికెట్ బుకింగ్ సమయంలో కాంటాక్ట్ ఫోన్ నంబరు ఉన్న వారికి మాత్రం ముందస్తు సమాచారం అందుతోంది.

బాంబుల వర్షం కురుస్తోంది

సన్యాసిరావు

సాక్షి, హైదరాబాద్: 'అబుదాబీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాను. మా సొంత ఊరు శ్రీకాకుళం రావాలని సెలవు పెట్టుకున్నాను. ఆదివారం మధ్యాహ్నం విమాన టికెట్ బుక్ అయ్యింది. యుద్ధం మొదలవడంతో విమాన సర్వీసులన్నీ రద్దయ్యాయి. మేముండే దగ్గరలోనే యూఎస్ ఎయిర్ బేస్ ఉంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి బాంబుల వర్షం కురుస్తోంది. మొబైల్ ఫోన్‌కు ప్రభుత్వం నుంచి అలర్ట్స్ వస్తున్నాయి. సైరన్ మోగుతోంది. జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. పగలంతా పొగలు, రాత్రయితే ఆకాశంలో చుక్కలు, డ్రోన్ల లైట్లకు పెద్ద తేడా తెలియడం లేదు. మా క్యాంపులో సుమారు 5 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. అందులో ఉత్తరాంధ్రకు చెందినవారే సుమారు 2 వేల మందికిపైగా ఉంటారు. అలారం మోగగానే ఇంట్లోకి వెళ్లిపోతున్నారు. ఇబ్బందికరమైన పరిస్థితులే ఉన్నాయి' అని సన్యాసిరావు చెప్పారు.

కేంద్ర పోర్టల్స్‌తో బోధనాస్పత్రుల అనుసంధానం: ఎన్‌ఎంసీ

సాక్షి, అమరావతి: వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రులను కేంద్ర ప్రభుత్వ పోర్టల్స్‌తో అనుసంధానించే దిశగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై), ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం), హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్‌ఎంఐఎస్) పోర్టల్స్‌తో బోధనాస్పత్రుల అనుసంధానాన్ని తప్పనిసరి చేసింది. దేశంలోని అన్ని వైద్య కళాశాలలు వారం రోజుల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్‌ఎంసీ కార్యదర్శి డాక్టర్ ఎల్.రాఘవ్ ప్రిన్సిపాళ్లు, డీన్స్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య కళాశాలల వార్షిక పునరుద్ధరణ (రెన్యూవల్), మదింపు (అసెస్‌మెంట్) ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు.

ఖమేనీ హత్య అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే

- ఇరాన్‌పై దాడులు అమానుషం
- కేంద్ర ప్రభుత్వం యుద్ధాన్ని ఆపేందుకు చొరవ చూపాలి
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ కూటమి జరిపిన దాడులను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఖమేనీ హత్య అమానుషమని, ఇది అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కడమేనని ఆయన మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జెనీవాలో ఇరాన్–అమెరికా మధ్య శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలోనే ఇరాన్‌పై దాడులు చేయడాన్ని తప్పుబట్టారు. ఇరాన్‌లోని ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 108 మంది విద్యార్థినులు మరణించడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ హింస ఇలాగే కొనసాగితే పశ్చిమాసియా మొత్తం అస్థిరత్వానికి గురవుతుందని, ఇది ప్రపంచ శాంతికి ముప్పు అని హెచ్చరించారు. ఇరాన్‌లో అనేకమంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని, వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని యుద్ధాన్ని ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఖమేనీ హత్యను ఖండించాలని, ఉద్రిక్తతలను తగ్గించి శాంతిని నెలకొల్పడంలో భారత్ నిర్మాణాత్మక పాత్ర పోషించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై, పాకిస్తాన్.. అఫ్గానిస్తాన్‌లపై దాడులు చేస్తూ అశాంతిని రేకెత్తిస్తున్నాయని ఒవైసీ విమర్శించారు. ఖమేనీ మరణంపై ఆయన సంతాపం వ్యక్తం చేశారు.

గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులకు శుభవార్త

- మస్కట్ ద్వారా స్వదేశానికి తిరిగొచ్చేందుకు అవకాశం
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్: ఇజ్రాయెల్– ఇరాన్ యుద్ధ నేపథ్యంలో దుబాయ్, ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా దేశాల్లోని ప్రవాస భారతీయులకు శుభవార్త. ఇకపై వారు ఆందోళన చెందనక్కర్లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. వారంతా స్వదేశానికి తిరిగి రావడానికి కేంద్రం చేసిన ప్రయత్నాలు ఫలించాయని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులు రోడ్డు మార్గం ద్వారా ఒమన్‌లోకి ప్రవేశించి అక్కడి నుంచి భారత్‌కు వచ్చేందుకు వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. ఈ మేరకు మస్కట్‌లోని భారతీయ రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసినట్టు తెలిపారు. ఈ లెక్కన దుబాయ్ నుంచి మస్కట్ ఎయిర్ పోర్టు వరకు రావాలంటే రోడ్డు మార్గాన 450 కి.మీ.లు ప్రయాణించాలి. ఇతర గల్ఫ్ దేశాల నుంచి మస్కట్‌కు రోడ్డు మార్గాన రావాలంటే దాదాపు వెయ్యి కి.మీ.ల వరకు ప్రయాణం చేయాలి. అలా చేరుకున్న వారంతా ఒమన్‌లోకి ప్రవేశించడానికి ముందుగానే విజిట్/టూరిస్ట్ వీసా పొందడం తప్పనిసరి. ప్రయాణికులు 'రాయల్ ఒమన్ పోలీస్ వెబ్‌సైట్'ద్వారా అనుమతించిన ట్రావెల్ ఏజెంట్ల ద్వారా ముందుగా ఈ–వీసాకు దరఖాస్తు చేయాలి. అమెరికా, యూకే, కెనడా, జపాన్ దేశాల చెల్లుబాటు అయ్యే వీసా లేదా నివాస అనుమతి ఉన్న భారత పాస్‌పోర్ట్ దారులకు 'ఆన్–అరైవల్ వీసా' సదుపాయం ఉంది. వారు రిటర్న్ టికెట్, హోటల్ బుకింగ్, ఆరోగ్య బీమా ఉన్నట్టయితే ముందస్తు వీసా లేకుండా గరిష్టంగా 14 రోజుల వరకు ఒమన్‌లో ప్రవేశించొచ్చు. గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలో నివసిస్తూ చెల్లుబాటు అయ్యే రెసిడెంట్ కార్డు కలిగిన భారత పౌరులకు కూడా ఆన్–అరైవల్ వీసా అందుబాటులో ఉంటుంది. వీసాకు దరఖాస్తు చేసే సమయంలో పాస్‌పోర్ట్ కనీసం 6 నెలలపాటు చెల్లుబాటు అయ్యేలా ఉండాలి. భారత్‌కు తిరిగి రావాలనుకునే గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులంతా ఏదైనా సమాచారం కావాలంటే ఒమన్‌లోని భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని బండి సంజయ్ తెలిపారు.

పాతబస్తీలో షియాల భారీ నిరసన

అమెరికా, ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తూ...

చార్మినార్/డబీర్ పురా: ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు, ఖమేనీ హత్యను నిరసిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని పాతబస్తీ పురానీ హవేలీ చౌరస్తా వద్ద షియా ముస్లింలు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖమేనీ చిత్రపటాన్ని చేతుల్లో పట్టుకొని నివాళులర్పించారు. పురానీ హవేలీ చౌరస్తా నుంచి దారుషిఫా వరకు నిరసన ర్యాలీ సాగింది. స్త్రీ, పురుషులు, పిల్లలు, పెద్దలు సహా భారీఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. దారి పొడవునా డెత్ టు అమెరికా.. డెత్ టు ఇజ్రాయెల్ అంటూ నినాదాలు చేస్తూ ఆదివారం రాత్రి ఆయా దేశాల జెండాలను రోడ్డుపై వేసి తొక్కుతూ నిరసన తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన అమెరికా, ఇజ్రాయెల్‌కు తగిన శిక్ష తప్పదని షియా పెద్దలు పేర్కొన్నారు.

మనోళ్లు ఎట్లున్నరో?

తమవారి క్షేమంపై కార్మికుల కుటుంబాల ఆందోళన

మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్‌లోని వివిధ దేశాలపై ఇరాన్ బాంబులతో విరుచుకు పడుతుండటంతో తెలంగాణకు చెందిన వలస కార్మికుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. బహ్రెయిన్, కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతర్ దేశాల్లో ఉన్న కార్మికులకు వారి కుటుంబ సభ్యులు గంటగంటకు వీడియో కాల్స్ చేస్తూ క్షేమ సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. కాగా, ఇజ్రాయెల్‌లో రెండు రోజుల నుంచి పనులకు సెలవు ప్రకటించారు. శనివారం ఒక్కరోజే 50 సార్లకు మించి సైరన్‌లు మోగడంతో రోజంతా బంకర్లలోనే తలదాచుకున్నామని తెలంగాణ జిల్లాలకు చెందిన పలువురు వలస కార్మికులు సాక్షికి తెలిపారు. ఆదివారం సైరన్‌లు ఐదు ఆరుసార్లు మాత్రమే మోగాయని, అయితే రాత్రిపూట పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయలేకపోతున్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బహ్రెయిన్, కువైట్, యూఏఈ, ఖతర్, సౌదీ అరేబియా దేశాల్లో అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. బహ్రెయిన్, ఖతర్‌లలోని కొన్నిచోట్ల సంస్థలకు సెలవు ఇవ్వడంతో వలస కార్మికులు క్యాంపులకే పరిమితమయ్యారు. కువైట్, యూఏఈ, సౌదీ దేశాల్లో మాత్రం పనులకు వెళ్తున్నట్లు వలస కార్మికులు తెలిపారు.

పక్కా సమాచారంతోనే దాడి

ఖమేనీ కోసం కొన్నినెలలుగా వేట సాగిస్తున్న అమెరికా నిఘా సంస్థ సీఐఏ

- టెహ్రాన్‌లో సీనియర్ నేతలు, అధికారులతో ఖమేనీ సమావేశమవుతున్నట్లు గుర్తింపు
- 30 క్షిపణులు ప్రయోగించిన ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు
- అక్కడికక్కడే మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్
- ఇరాన్ రక్షణ శాఖ మంత్రి సహా పలువురి మృతి
- సీఐఏకు ఉప్పందించిన ఖమేనీ వ్యతిరేకులు!
- యూదుల పండుగకు ముందే కీలక ఆపరేషన్ పూర్తి

ఖమేనీ నివాస సముదాయంపై దాడుల అనంతరం దట్టంగా వెలువడుతున్న పొగ

శత్రు దుర్భేద్యమైన భద్రత కలిగిన అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం సంచలనాత్మకంగా మారింది. ఖమేనీ కోసం కొన్ని నెలలపాటు కొనసాగిన వేట చివరకు రెండు గంటల ఐదు నిమిషాల ఆపరేషన్‌తో ముగిసింది. నిఘా వర్గాలు అందించిన పక్కా సమాచారంతోనే ఆయనను అంతం చేసినట్లు తెలుస్తోంది. ఖమేనీ నివాసంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఏకంగా 30 క్షిపణులను ప్రయోగించాయి. దాంతో ఆయన తప్పించుకోలేకపోయారు. అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. తమ హిట్‌లిస్ట్‌లో ఉన్న ఖమేనీపై అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఎప్పటినుంచో దృష్టి పెట్టింది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వేట మరింత ముమ్మరంగా సాగింది. టెహ్రాన్ నడిబొడ్డున ఖమేనీ నివాసంలో శనివారం తెల్లవారుజామున కీలక సమావేశం జరుగబోతున్నట్లు సీఐఏకు సమాచారం అందింది. ఖమేనీతోపాటు సీనియర్ నేతలు, సైనికాధికారులు హాజరుకాబోతున్నట్లు తెలిసింది. సీఐఏ వెంటనే ఇజ్రాయెల్‌ను అప్రమత్తంగా చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ ప్రభుత్వాలు మంతనాలు జరిపాయి. తెల్లవారకముందే చిమ్మచీకట్లోనే దాడికి దిగాలని తొలుత భావించారు. ఉదయం అయితే ఆపరేషన్ కచ్చితంగా విజయవంతం అవుతుందన్న ఉద్దేశంతో తెల్లవారిన తర్వాత దాడులకు టైమ్ ఫిక్స్ చేశారు.

సమాచారం ఇచ్చిందెవరు?

ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ రెండు వర్గాలుగా విడిపోయింది. ఇందులో ఖమేనీ వ్యతిరేకులు కూడా ఉన్నారు. అతడి కదలికల గురించి వారే అమెరికా సీఐఏకు సమాచారం చేరవేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖమేనీపై దాడికి ఎంచుకున్న సమయానికి కూడా యూదు మతంలో కొంత ప్రాముఖ్యత ఉంది. ఈ నెల 2న యూదులకు పూరిమ్ సెలవుదినం. ఇదొక పండుగ రోజు. ప్రాచీన కాలంలో యూదులను అంతం చేయడానికి అప్పటి పర్షియా(నేటి ఇరాన్) పాలకులు సాగించిన కుట్ర ఇదే రోజున విఫలమైంది. సరిగ్గా ఈ పండగకు ముందు ఖమేనీని అంతం చేయడం గమనార్హం.

క్షణాల్లోనే శిథిలాలుగా..

ఉన్నతస్థాయి వర్గాల నుంచి ఆదేశాలు అందిన వెంటనే స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం 6 గంటలకు ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు తమ స్థావరాల నుంచి గాల్లోకి లేచాయి. రెండు గంటల ఐదు నిమిషాల్లో.. ఇరాన్ కాలమానం ప్రకారం ఉదయం 9.40 గంటలకు టెహ్రాన్‌కు చేరుకున్నాయి. ఇజ్రాయెల్ లాంగ్ రేంజ్ మిస్సైళ్లు ఖమేనీ కాంపౌండ్‌ను శిథిలాలుగా మార్చేశాయి. ఖమేనీతోపాటు అక్కడే ఉన్న సైనికాధికారులు క్షణాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో సైనికాధికారుల ఒక భవనంలో, ఆ పక్కనే మరో భవనంలో ఖమేనీ ఉన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఈ రెండూ నామరూపాల్లేకుండాపోయాయి. లక్ష్యం ఎక్కడా గురితప్పలేదు. అంతా అనుకున్నట్లుగానే పూర్తయ్యింది. ఖమేనీపై దాడికి ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతోపాటు అమెరికా క్షిపణులు, డ్రోన్లు కూడా ఉపయోగించినట్లు సమాచారం. అమెరికా యుద్ధనౌకల నుంచి తోమహక్ క్రూయిజ్ మిస్సైళ్లను ప్రయోగించారు. ఖమేనీ కదలికలను తమ నిఘా వర్గాలు సక్సెస్‌ఫుల్‌గా ట్రాక్ చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు.

కీలక నేతలు, అధికారులు హతం

ఖమేనీ నివాసం చుట్టూ నిత్యం కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. నిజానికి ఇదొక భారీ కాంపౌండ్. ఇందులో ఖమేనీ కార్యాలయాలు, ఇరాన్ ప్రభుత్వ కార్యాలయాలు, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫీసులు ఉన్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు ఇదొక గుండెకాయ అని చెప్పుకోవచ్చు. ఖమేనీతో జరిగిన భేటీకి ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ ఇన్ చీఫ్ మొహమ్మద్ పాక్‌పౌర్, రక్షణ శాఖ మంత్రి అజీజ్ నజీర్‌జాదే, మిలటరీ కౌన్సిల్ అధినేత అడ్మిరల్ అలీ షామ్‌ఖనీ, ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ సయ్యద్ మాజిద్ మౌసావీ, డిప్యూటీ ఇంటెలిజెన్స్ మంత్రి మొహమ్మద్ షిరాజీతోపాటు మరికొందరు ముఖ్యులు హాజరయ్యారు. ఇజ్రాయెల్ క్షిపణి దాడుల్లో వీరంతా హతమయ్యారు.

ప్రవాసాంధ్రులు అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు సాంబశివారెడ్డి

సాక్షి, అమరావతి: మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల భద్రత, సంక్షేమంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్‌ఆర్‌ఐ వింగ్ గ్లోబల్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆరా తీశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్ దేశాల్లో ఉన్న పార్టీ కన్వీనర్లు, నాయకులతో ఆయన మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు.

సముద్రంలోకి పారిశ్రామిక వ్యర్థాలు

బిడ్లను ఆహ్వానించిన ఏపీఐఐసీ

సాక్షి, అమరావతి: పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసి సముద్రంలోకి విడుదల చేయనున్నారు. తీరప్రాంతాల్లోని పారిశ్రామిక పార్కుల్లో పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసి సముద్రగర్భంలోకి పంపేవిధంగా కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (సీఈటీపీ)ను ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఏర్పాటు చేయనుంది. అచ్యుతాపురం సెజ్, కాకినాడ సెజ్, శ్రీ సిటీ సెజ్, బల్క్ డ్రగ్ పార్కులతో పాటు ఫార్మా, కెమికల్, టెక్స్‌టైల్, ఆయిల్ అండ్ గ్యాస్, రిఫైనరీలు, ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్ నుంచి వచ్చే వ్యర్థాలను శుద్ధి చేసి జీరో లిక్విడ్ డిశ్చార్జ్ కింద మార్పు చేసి పైప్ లైన్ ద్వారా సముద్రగర్భంలోకి వదిలే విధంగా వీటిని రూపొందిస్తున్నారు. ఆసక్తిగల సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు (ఈఓఐ)లను ఏపీఐఐసీ ఆహ్వానించింది. మార్చి10లోగా టెండర్లు దాఖలు చేయడానికి గడువు ఇచ్చింది.

'తెలుగు'కు విస్తృత ప్రాచుర్యం

- ఆంధ్రా, తెలంగాణ గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ
- అమలాపురంలో అట్టహాసంగా ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు
- పాల్గొన్న హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు

తెలుగు మహాసభల్లో మాట్లాడుతున్న ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, అమలాపురం : 'తెలుగు భాషకు విస్తృత ప్రాచుర్యం కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తెలుగు భాషను, తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను మనం సంపూర్ణ జీవన విధానంగా మార్చుకున్నప్పుడే ఈ భాష కలకాలం మనుగడలో ఉంటుంది'.. అని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు రెండో రోజైన ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్లు మాట్లాడుతూ.. తెలుగు భాష ఔన్నత్యాన్ని, అతి ప్రాచీనమైన ఈ భాషకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపును సభికులకు వివరించారు. ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ చరిత్రను, మహోన్నత సాహిత్య సంపదను, అద్భుత సాంస్కృతిక వైభవాన్ని కలిగిన తెలుగు భాష మన ఆత్మగౌరవానికి ప్రతీకని కీర్తించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని ప్రకటించిన గవర్నర్, సభికుల హర్షధ్వానాల మధ్య వేమన శతకంలోని 'ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు' పద్యాన్ని చదివి వినిపించారు. వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషా వికాసంలో మహత్తర పాత్ర పోషించిన భాషావేత్త, సంస్కర్త అని కొనియాడారు. నేటి ఆధునిక యుగంలో తెలుగు భాష ప్రాచుర్యం పొందుతూనే ఉందని, అయితే దీనిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. తెలుగు మహాసభల ద్వారా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలతో పాటు తెలుగు భాషోద్ధరణకు వీలు కలుగుతుందని చెప్పారు. మాతృభాష మీద పట్టు సాధించినప్పుడే ఇతర భాషలపై కూడా సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు.

ప్రాచీన భాషగా తెలుగుకు ప్రత్యేక గుర్తింపు..

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లు కుటుంబ సమేతంగా ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. అమ్మభాష తెలుగును మరువకూడదన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచీ తెలుగు భాష తప్పనిసరిగా నేర్పించాలని సూచించారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలంటే ప్రాంతీయ భాషలకు గుర్తింపు తప్పనిసరని, ప్రాచీన భాషగా తెలుగుకు దేశంలో తనకుంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్, సినీ దర్శకుడు, రచయిత తనికెళ్ల భరణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంజిన్ లేని నౌక ఇండియాకు తిరిగొస్తోంది

నేడు ముంబై చేరుకోనున్న 'ఐఎన్‌ఎస్‌వీ కౌండిన్య'

ముంబై హార్బర్‌లోకి ప్రవేశించనున్న ఐఎన్‌ఎస్‌వీ కౌండిన్య నౌక

సింధియా (విశాఖ): భారత నావికాదళానికి చెందిన 'ఐఎన్‌ఎస్‌వీ కౌండిన్య' నౌక తన తొలి విదేశీ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని తిరిగి వస్తున్న సందర్భంగా సోమవారం రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ముంబై హార్బర్‌లో అధికారికంగా స్వాగతం పలకనున్నారు. ఒమన్ సుల్తానేట్‌కు వెళ్లి అరేబియా సముద్రం మీదుగా సాగిన ఈ చారిత్రాత్మక ప్రయాణం భారతదేశపు పురాతన సముద్ర వారసత్వాన్ని చాటిచెప్పడమే కాకుండా హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్–ఒమన్ దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ సంబంధాలను పునరుద్ఘాటిస్తోంది. ఐఎన్‌ఎస్‌వీ కౌండిన్య ఒక ప్రత్యేకమైన నౌక. ఇది పురాతన భారతీయ నౌకానిర్మాణ పద్ధతులను అనుసరించి ఎలాంటి ఇంజిన్ లేకుండా.. చెక్క పలకలను కొబ్బరితాడుతో చేతితో కుట్టి, సహజ రెసిన్లతో సీల్ చేసి నిర్మించారు. శతాబ్దాల నాటి భారతీయ సముద్ర నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ఈ నౌక మన సంస్కృతిని పునరుద్ధరించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. భారతీయ జ్ఞాన వ్యవస్థలను కాపాడుకోవడంలో దేశానికి ఉన్న నిబద్ధతకు ఈ నౌక నిర్మాణమే నిదర్శనం. 5వ శతాబ్దపు అజంతా గుహల్లోని చిత్రపటాల ఆధారంగా భారత నావికాదళ పర్యవేక్షణలో సంప్రదాయ కళాకారుల నైపుణ్యం, ఆధునిక ఇంజినీరింగ్ ప్రమాణాలతో దీనిని రూపొందించారు. గత ఏడాది డిసెంబర్ 29న పోర్‌బందర్ నుంచి బయలుదేరిన ఈ నౌక ప్రాచీన నావికులు ప్రయాణించిన మార్గాల్లోనే వెళ్లి ఈ ఏడాది జనవరి 14న ఒమన్‌లోని పోర్ట్ సుల్తాన్ ఖబూస్‌కు చేరుకుంది. అక్కడ ఒమన్ ప్రముఖులు, ప్రవాస భారతీయుల సమక్షంలో ఈ నౌకకు ఘనస్వాగతం లభించింది. ఈ యాత్ర ద్వారా భారత్–ఒమన్ సంబంధాలు బలోపేతం అవడమే కాకుండా, ఒకప్పుడు అరేబియా సముద్రం మీదుగా జరిగిన సుగంధ ద్రవ్యాలు, వస్త్రాల వాణిజ్య వైభవాన్ని, ఉమ్మడి సముద్రయాన సంప్రదాయాలను ఈ నౌక మరోసారి గుర్తు చేసింది.

ఇంకాజోక్

ఇప్పుడు ఈ స్టేట్‌మెంట్ ఎందుకిచ్చార్సార్! చూడండి.. ఎన్టీఆర్ నుంచి ఆడబిడ్డ వరకూ మీ మోసాల చిట్టా విప్పాడు!

క్లుప్తంగా...

తమిళనాడు సీఎం స్టాలిన్‌కు వైఎస్ జగన్ బర్త్ డే విషెస్

సాక్షి, అమరావతి: తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయు రారోగ్యాలతో స్టాలిన్ వర్థిల్లాలంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్ జగన్ ఆదివారం పోస్టు చేశారు.

37 కరువు మండలాల్లో అదనపు 'ఉపాధి'

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబరులో కరువు మండలాలుగా ప్రకటించిన 37 మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు అదనంగా 'ఉపాధి' కల్పనకు కేంద్రం ఆమోదం తెలిపింది. సాధారణంగా ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదిలో గరిష్టంగా 100 రోజుల పనిదినాలకు మాత్రమే అవకాశం ఉండగా, కరువు మండలాల్లో ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 150 పనిదినాల చొప్పున పనులు కల్పించేందుకు వీలుంటుంది. అన్నమయ్య జిల్లాలో 9, శ్రీసత్యసాయి జిల్లాలో 25, ప్రకాశం జిల్లాలో 3 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరులో కరువు మండలాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి నెలాఖరు వరకు ప్రామాణికంగా పనుల కల్పన జరుగుతుండగా.. ఆర్థిక సంవత్సరం ముగిసే ఈ మార్చి నెలాఖరులోగా ఆయా మండలాల్లో కుటుంబాలకు ఈ లబ్ధిని ఉపయోగించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

నష్టాల ఊబిలో చిక్కి రైతు బలవన్మరణం

- కర్బూజా, శనగ పంటలకు ధర దక్కక నష్టాలపాలు

రామాంజినేయులు

కళ్యాణదుర్గం: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కొత్తూరులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుల రామాంజినేయులు (50) కొత్తూరు గ్రామంలో తనకున్న పొలం 1.19 ఎకరాలతో పాటు తన తల్లి గోవిందమ్మకు చెందిన 3.52 ఎకరాల్లో కర్బూజా, వేరుశనగ పంటల్ని సాగు చేశాడు. ఇందుకోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. కర్బూజా పండ్లకు, వేరుశనగకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో నష్టాల పాలయ్యాడు. ఇదే సందర్భంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో అప్పులు తీర్చే దారిలేక ఆందోళనకు గురయ్యాడు. ఈ పరిస్థితుల్లో ఆదివారం గ్రామానికి సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబానికి ఆసరాగా ఉంటావనుకుంటే ఉసురు తీసుకున్నావా అంటూ భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు రోదించడం అందరినీ కలిచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గోవిందమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ట్రంప్‌వి ఉగ్రవాద తరహా చర్యలు

సీపీఐ జాతీయ నేత నారాయణ ఆగ్రహం

సాక్షి, అమరావతి: అమెరికా నియంతృత్వ పోకడలను, ట్రంప్ ఉగ్రవాద తరహా చర్యలను ప్రపంచ దేశాలన్నీ ఖండించాలని సీపీఐ జాతీయ నేత కె.నారాయణ పిలుపునిచ్చారు. విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావులతో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏ దేశాన్నైనా లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించడం ద్వారా ప్రపంచ శాంతి సాధ్యం కాదన్నారు. ఇరాక్, వెనిజులా, ఇరాన్ వంటి దేశాలపై జరిగిన చర్యలు ప్రపంచానికి పాఠాలు నేర్పాయన్నారు. ఇరాన్‌లో ఆయుధ శక్తుల గురించి అనవసర ఆరోపణలు చేస్తూ దానిని ఒంటరిచేయాలని అమెరికా ప్రయత్నిస్తోందన్నారు. వెనుజువెల్లా దేశాన్ని ఉగ్రవాద దేశంగా ముద్రవేసే ప్రయత్నం చేసిందని, ట్రంప్ చర్యల కంటే..ఉగ్రవాదం మరొకటి ఉండబోదన్నారు. అంతర్జాతీయ సంబంధాలలో సమతుల్యత, శాంతి, పరస్పర గౌరవం అవసరమని, ఇదే తమ పార్టీ అభిప్రాయమని నారాయణ స్పష్టం చేశారు.

278 మంది కౌన్సెలర్ల నియామకం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో కెరీర్ గైడెన్స్, మానసిక స్థైర్యాన్ని పెంపొందించడం కోసం కొత్తగా 278 మంది మానసిక ఆరోగ్య కౌన్సెలర్లను నియమించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష విభాగం కింద నియమితులైన వీరికి ఉద్యోగ బాధ్యతలు, పర్యవేక్షణ ఫ్రేమ్‌వర్క్‌తో పూర్తి వివరాలు రెండ్రోజుల్లో అందిస్తామని అధికారులు తెలిపారు. వీరు జిల్లా జీసీడీఓ ఆధ్వర్యంలో పనిచేస్తారని పేర్కొన్నారు.

మధ్యవర్తిత్వంతో మేలైన న్యాయం

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

సాక్షి, అమరావతి: కోర్టుల్లో కేసులు పేరుకుపోకుండా మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగపడుతుందని, కక్షిదారులకు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో మేలైన న్యాయం అందుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నేతృత్వంలో మధ్యవర్తిత్వంపై రాష్ట్ర స్థాయి సదస్సును ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీజేఐ మాట్లాడుతూ మధ్యవర్తిత్వాన్ని కేవలం ప్రత్యామ్నాయంగా కాకుండా ప్రాధాన్యం గల పద్ధతిగా చూడాలన్నారు. ఇదో అద్భుతమైన మార్గమని, మొదటి అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సదస్సు ఢిల్లీలో జరిగిందని చెప్పారు. వాస్తవానికి భారతదేశ డీఎన్‌ఏలోనే మధ్యవర్తిత్వం ఉందని, పురాణ కాలం నుంచే ఇది అమలులో ఉందన్నారు. కురుక్షేత్రం జరగకుండా పాండవులకు, కౌరవులకు మధ్య శాంతి కోసం శ్రీకృష్ణుడు చేసిన రాయబారాన్ని తొలి అధికారిక మధ్యవర్తిత్వంగా ఉదహరించారు.

ఆర్బిట్రేషన్‌పై విశ్వాసం పెంచుకోవాలి

మధ్యవర్తిత్వం(ఆర్బిట్రేషన్)తో పరిష్కారమయ్యే కేసులూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉండిపోతున్నాయని, ఆర్బిట్రేషన్ ప్రక్రియపై కక్షిదారులు నమ్మకం పొందడం చాలా ముఖ్యమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. 2023లో వచ్చిన మధ్యవర్తిత్వ చట్టంతో దీనికి ఒక చట్టబద్ధత లభించిందని, దీని ద్వారా జరిగే పరిష్కారాలు కోర్టు డిక్రీతో సమానంగా అమలు చేస్తారని స్పష్టం చేశారు. మధ్యవర్తులుగా వ్యవహరించే వారికి సరైన శిక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం అంతర్జాతీయంగానూ ఇప్పుడు ప్రముఖ పాత్ర పోషిస్తోందని, మలేషియాలో మధ్యవర్తిత్వానికి దొరుకుతున్న ప్రోత్సాహాన్ని తాను స్వయంగా చూసినట్టు జస్టిస్ సూర్యకాంత్ ఉదహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో మీడియేషన్ విషయంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రితో చేసిన మీడియేషన్ విజయవంతం అయిందన్నారు.

ప్రజలు రాజీ మార్గాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలి : హైకోర్టు సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రజలు న్యాయ పోరాటాల కంటే రాజీ మార్గాలను ఎంచుకునేలా ప్రోత్సాహించాలని సూచించారు. జమ్మూ కశ్మీర్‌లో జడ్జిగా ఉన్న సమయంలో అమెరికాలో సెటిల్ అయిన ఒక వ్యక్తి వారసత్వ ఆస్తి గురించి తనను ఓ న్యాయవాదిగా సంప్రదించారని, అప్పుడు తాను ''ఎందుకు మీరు మీ సోదరునితో మాట్లాడకూడదు'' అని ఆయనకు చెప్పినట్టు గుర్తు చేశారు. ఆరు నెలల తర్వాత ఆయన కనిపించి తన ఫ్యామిలీనీ, తన సోదరుడిని దూరం చేసుకోలేదని తనకు చెప్పారని వివరించారు. రాజీకి ఉన్న శక్తి అలాంటిదని వివరించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జితేంద్రకుమార్ మహేశ్వరి మాట్లాడుతూ.. చర్చల ద్వారా పరస్పర అంగీకారంతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. దీనివల్ల సంబంధాలు దెబ్బతినకుండా ఉంటాయన్నారు. ఏపీ లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం గొప్ప మార్గమని అభిప్రాయపడ్డారు. గతంలో మధ్యవర్తిత్వ చట్టం ద్వారా దాదాపు 2 లక్షల కేసులు పరిష్కరించినట్టు గుర్తు చేశారు. కేసులను మరింత సమర్థవంతంగా పరిష్కరించడానికి, ఇటీవలే దాదాపు 400 మంది న్యాయవాదులకు మధ్యవర్తుల అంశాలకు సంబంధించి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లా జడ్జిలు, జుడీషియల్ అధికారులు, న్యాయవాదులు, బెజవాడ బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సత్వర న్యాయంతో త్వరితగతిన అభివృద్ధి: సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, జుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్శిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కేంద్రాలను సమీకృతం చేస్తూ బెస్ట్ జుడీషియల్ సిటీని నిర్మిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో మధ్యవర్తిత్వం ద్వారా చాలా సమస్యలను పరిష్కరించేవారని, తన తండ్రి కూడా పెద్దరికం వహించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరిస్తే రూ.10 వేలు ఇస్తామని, కేసులు పరిష్కారం కాకున్నా రూ.3 వేలు ఇస్తామని సీఎం ప్రకటించారు. భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్లూ–గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి ఉంటుందని తెలిపారు.

న్యాయమూర్తుల గృహ సముదాయం ప్రారంభం

అమరావతిలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో రూ.210 కోట్లతో చేపట్టిన 36 మంది జడ్జిల బంగాళాల సముదాయాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించారు. ఇక్కడ ప్రతి నివాస గృహాన్ని 7,841 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 1 నమూనాలో నిర్మించారు. నివాస సముదాయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని సీజేఐ ఆవిష్కరించారు. అనంతరం సముదాయ ఆవరణలో మొక్కలు నాటారు. మధ్యాహ్నం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు మర్యాదపూర్వకంగా తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరయ్యారు.

అమరావతిలో ఏపీ జుడీషియల్ అకాడమీ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు, ఇతర న్యాయమూర్తులు

జుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన

తాడికొండ: అమరావతి సమీపంలోని పిచ్చుకలపాలెం వద్ద జుడీషియల్ అకాడమీ నిర్మాణానికి ఆదివారం భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. తొలుత జుడీషియల్ అకాడమీ రూపొందించిన ఆడియో, వీడియోను తిలకించిన అనంతరం ఆయన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ జుడీషియల్ అకాడమీని రూ.165 కోట్లతో నిర్మిస్తుండగా దీనిలో బ్లాక్ బీలో జీ ప్లస్–3 అంతస్తులతో అకడమిక్ బ్లాక్ నిర్మిస్తున్నారు. జీ ప్లస్–8 అంతస్తులతో హాస్టల్ బ్లాక్, జీ ప్లస్–3 అంతస్తుల్లో ఇండోర్ స్పోర్ట్స్, గెస్ట్ ఫెసిలిటీస్ కల్పిస్తున్నారు. మొత్తం భవన విస్తీర్ణం 2.05 లక్షల చదరపు అడుగులు. ఏపీ హైకోర్టు నుంచి ఈ అకాడమీ 5.7 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనికి 50 మీటర్ల వెడల్పు కలిగిన రహదారి సౌకర్యం ఉంది. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో సీజేఐకి ఘనస్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విజయవాడ, అమరావతిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.35 గంటలకు గన్నవరం చేరుకున్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దొనడి రమేష్, జస్టిస్ జయసూర్య, జస్టిస్ మహేశ్వరరావు, జస్టిస్ టీసీడీ శేఖర్ కూడా వచ్చారు. విమానాశ్రయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు స్వాగతం పలికారు. అదేవిధంగా సాయంత్రం ప్రత్యేక విమానంలో సీజేఐ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయనకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు తదితరులు వీడ్కోలు పలికారు.

న్యాయ వ్యవస్థపై విశ్వసనీయత పెరగాలి

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

తిరుపతి లీగల్: ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వసనీయత పెరిగేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు విధులు నిర్వహించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఆదివారం తిరుపతి మండలం దామినేడు వద్ద కోర్టు భవనాల సముదాయానికి భూమి పూజ, శిలాఫలకం ఆవిష్కరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాన్ని సీజేఐ, ఇతర న్యాయమూర్తులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ సత్వర న్యాయం పొందే హక్కు ఉందని చెప్పారు. న్యాయవాదులు న్యాయవ్యవస్థలో భాగమని, వారు ప్రత్యేకం కాదన్నారు. నూతన కోర్టు భవన సముదాయంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ సూచించారు.

న్యాయం ఎప్పటికీ ఆగదు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గతంలో కోర్టులలో సరైన వసతులు ఉండేవి కావని, మహిళా న్యాయవాదులు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు పరిస్థితులు క్రమేణా మెరుగుపడుతున్నాయని, కోర్టులలో మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ కనిపిస్తోందని వెల్లడించారు. న్యాయం ఎప్పటికీ ఆగదు.. అదే న్యాయమూర్తుల ఆత్మస్ఫూర్తి అని కొనియాడారు. 2023లో రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో ఏసీలను ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే మహేశ్వరి మాట్లాడుతూ న్యాయవ్యవస్థ గొప్పదనం భవనాల్లో కాదని, వాటి లోపల జరిగే న్యాయప్రక్రియ, నిష్పాక్షిక తీర్పుల్లో ఉంటుందని పేర్కొన్నారు. తిరుమల ఆధ్యాత్మిక క్షేత్రమే కాదని, ధర్మానికి ప్రతీకని అభివర్ణించారు. అనంతరం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిపాలన జడ్జి జస్టిస్ జయసూర్య, తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గొట్టి గజేంద్ర ప్రసంగించారు. భవన నిర్మాణాలకు సహకరించిన న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను సన్మానించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.రమేష్, జస్టిస్ మహేశ్వరరావు, జస్టిస్ శేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి అరుణ సారిక, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషాద్రి నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

భూమి పూజకు అటెండర్‌ను ఆహ్వానించిన సీజేఐ

నూతన కోర్టు భవనాల భూమి పూజ చేస్తున్నప్పుడు న్యాయమూర్తులు, ఇతర అధికారులందరూ ఇటుకలు పేర్చి పూజలు చేశారు. ఈ సమయంలో సీజేఐ సూర్యకాంత్ జిల్లా కోర్టు అటెండర్‌ను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఆయన చేత ఇటుక పెట్టించి పూజ చేయించారు. ఈ ఘటన అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది.

అన్యాయాన్ని ప్రతిఘటించలేని ప్రభుత్వం ఎందుకు?

- రాయలసీమ ఎత్తిపోతల ఇన్సూరెన్స్ లాంటి ప్రాజెక్టు
- మనవేలితో మనకంటినే పొడుస్తున్నారు
- ఇది సీఎం చంద్రబాబు తెలిసి చేస్తున్న అన్యాయం
- ప్రజల్లో ధర్మాగ్రహం రావాలి
- చంద్రబాబు సర్కార్ చేస్తున్న ద్రోహంపై క్షేత్రస్థాయి పోరాటాలకు సన్నాహాలు
- గ్రేటర్ రాయలసీమ రౌండ్‌టేబుల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో పార్టీ ముఖ్య నాయకులు

సాక్షి ప్రతినిధి, కడప: పక్క రాష్ట్రాలు అన్యాయం చేస్తుంటే ప్రతిఘటించలేని ప్రభుత్వం ఎందుకని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. రాయలసీమకు జీవనాడి వంటి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల్ని వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కలిసొచ్చే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో ఉద్యమాన్ని చేపడతామని చెప్పారు. కడపలో ఆదివారం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తికోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాలు చేస్తున్న అన్యాయానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఒక ఇన్సూరెన్స్ లాంటిదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును చేపట్టి 80 శాతం పనులు పూర్తి చేశారన్నారు. ఇది ఒక జిల్లాకో, నాలుగు జిల్లాలకో సంబంధించిన సమస్య కాదని, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయమని చెప్పారు. ఇది రాయలసీమకు చంద్రబాబు తెలిసి తెలిసి చేస్తున్న అన్యాయమన్నారు. రాయలసీమలోని మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులపై కూడా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రాజెక్టే అవసరం లేదని, 20 టీఎంసీలతో ఒరిగేదేం లేదని, ప్రాజెక్టు మొదలేకాలేదని దుష్ప్రచారం చేయడం దారుణమని చెప్పారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తికాకపోతే ఈ ప్రాంతం నాలుగు దశాబ్దాలు వెనక్కిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు లేవంటున్నారు సరే...అల్మట్టి ఏ అనుమతులతో కట్టారు, తెలంగాణలోని కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు ఏ అనుమతులతో నిర్మించారో చెప్పాలని కోరారు. అల్మట్టి ఎత్తు పెంచేటప్పుడు, తెలంగాణలో ప్రాజెక్టులు కట్టేటప్పుడు కూడా చంద్రబాబే సీఎంగా ఉన్నారని గుర్తుచేశారు. పక్క రాష్ట్రాలు అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అల్మట్టి, దిండి, పాలమూరు–రంగారెడ్డి తదితర అక్రమ ప్రాజెక్టుల గురించి చంద్రబాబు ఎందుకు మాట్లాడరని నిలదీశారు. పొరుగు రాష్ట్రాలు చేపట్టిన అక్రమ ప్రాజెక్టులను చట్టపరంగా అడ్డుకోవాలని కోరారు. కర్ణాటక, తెలంగాణ వారు వారి అవసరాల కోసం ప్రాజెక్టులు కట్టుకుంటున్నారని, మనం కూడా ఆ విధంగా నిర్మించుకోకుండా పోతే భవిష్యత్ తరాలు నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. కేంద్రంలో చంద్రబాబుకు పలుకుబడి ఉండి కూడా ఈ ప్రాజెక్టును పూర్తి చేసుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. శ్రీశైలం నుంచి 101 టీఎంసీలను తీసుకోవడానికి ఉద్దేశించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ ప్రాజెక్టును చేపట్టారని, ఇదే తప్పు అన్నట్టు ప్రచారం చేయడం దారుణమని పేర్కొన్నారు. మనవేలితో మనకన్నే పొడిచే విధంగా చేస్తున్నారని, దీన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో సీఎం చంద్రబాబు చేస్తున్న ద్రోహంపై చర్చ జరిగే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. కళాశాలలు, యూనివర్సిటీల్లోని యువతలో కూడా చర్చ జరిగే దిశగా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజలు కిందిస్థాయి టీడీపీ నాయకుల నుంచి చంద్రబాబు వరకు ఈ అంశంపై ప్రశ్నించాలని కోరారు. టీడీపీతోపాటు కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులను సైతం ప్రశ్నించాలని సూచించారు. రాయలసీమ లిఫ్ట్ కోసం జరిగే ఉద్యమంలో రానున్న రోజుల్లో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రత్యక్షంగా పాల్గొంటారని చెప్పారు.

రైతులు, విద్యార్థులను భాగస్వాములను చేసి పోరాటం

రాయలసీమ లిఫ్ట్ సాధన కో–ఆర్డినేటర్ సాకే శైలజానాథ్, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి (వైఎస్సార్ కడప), కాకాణి గోవర్ధన్‌రెడ్డి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు), అనంత వెంకట్రామిరెడ్డి (అనంతపురం), ఉషశ్రీ చరణ్ (శ్రీసత్యసాయి), ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి (అన్నమయ్య), ఎస్.వి.మోహన్‌రెడ్డి, (కర్నూలు), కాటసాని రాంభూపాల్‌రెడ్డి (నంద్యాల) మాట్లాడుతూ కృష్ణా పరీవాహక ప్రాంతం భవిష్యత్‌లో నీళ్లలేని దుర్భిక్షప్రాంతంగా మారనుందని చెప్పారు. రానున్న రోజుల్లో శ్రీశైలం నిండి రాయలసీమకు నీరు రావడం గగనమవుతుందన్నారు. ఎంతో ముందుచూపుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం మార్చిలో జిల్లాస్థాయిలో, ఏప్రిల్, మే నెలల్లో నియోజకవర్గస్థాయిలో, జూన్, జూలై నెలల్లో మండలస్థాయిలో, ఆగస్టులో గ్రామస్థాయిలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలని రచ్చబండ కార్యక్రమాల్లో తీర్మానాలు చేయాలన్నారు. నాలుగుసార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు రాయలసీమలో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదని విమర్శించారు. మొదట 17 టీఎంసీలున్న అల్మట్టి సామర్థ్యాన్ని చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే కర్ణాటక 125 టీఎంసీలకు పెంచిందని, ఇప్పుడు మళ్లీ ఆయన సీఎంగా ఉన్నప్పుడే 229 టీఎంసీలకు పెంచబోతోందని వారు పేర్కొన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానాలను సాకే శైలజానాథ్ చదివి వినిపించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత విషమంగా క్షతగాత్రుల ఆరోగ్యం

- బాణసంచా విస్ఫోటనం ఘటనలో దయనీయ పరిస్థితి
- చికిత్స పొందుతూ ఇద్దరు మృతి.. 22కి చేరిన మృతుల సంఖ్య
- 100–150 కిలోల మందు గుండు నిల్వ ఉంచడం వల్లే భారీ ప్రమాదం
- పోలీసుల అదుపులో నిర్వాహకుడు
- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

వాహనంలో వచ్చిన మృతదేహాలను చూసి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భార్యాపిల్లలతో లోవరాజు

రాజు (ఫైల్)

కాకినాడ క్రైం/సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌లో విస్ఫోటనం ఘటనలో తీవ్రంగా గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారింది. శనివారం జరిగిన పేలుడులో 20 మంది మృతి చెందడం, మరో 11 మంది మంది గాయపడటం తెలిసిందే. వీరిలో తొమ్మిది మందిని చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, వీరిలో సామర్లకోట కుమ్మరి వీధికి చెందిన దర్శిపాటి లోవరాజు (40) ఆదివారం తెల్లవారుజామున, దర్శిపర్తి రాజు (28) ఆదివారం రాత్రి మృతి చెందారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 22కు చేరింది. మిగిలిన క్షతగాత్రుల్లో సప్పా సత్య వెంకట లక్ష్మి, మొర్తా శ్రీను, చిటికెల లక్ష్మిలను క్యాజువాలిటీ ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరి ఆరోగ్యం కూడా బాగా క్షీణించింది. మిగిలిన క్షతగాత్రులు కాతేటి శ్రీను, వేమగిరి లోవరాజు, వేమగిరి దావీదు, పల్లాపాటి వేద శ్రీనులను బర్న్ వార్డుకు తరలించారు. బాధితులు మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇక్కడ కేవలం నలుగురు మాత్రమే పని చేయాల్సి ఉండగా, ప్రమాదం జరిగిన సమయంలో కనీసం 45 మంది ఉన్నారని అధికారులు చెబుతున్నారు. పేలుడు ఘటనలో కొందరు అక్కడికక్కడే మరణించగా, కొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. మరికొందరు షెడ్ల నుంచి బయటకు వచ్చి ద్విచక్ర వాహనాల్లో అక్కడి నుంచి తప్పించుకున్నారని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ కేవలం 5 కిలోల ముడి సరుకు మాత్రమే ఉంచేందుకు అనుమతి ఉండగా, 100–150 కిలోల మందు గుండు ఉంచడం వల్లే ఇంతటి భారీ విస్ఫోటనం సంభవించిందన్నారు.

మృతదేహాల అప్పగింత

21 మంది మృతదేహాలకు ఆదివారం పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆ మృతదేహాలను మహాప్రస్థానం వాహనాలు, అంబులెన్సుల్లో ఆయా గ్రామాలకు తరలించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాణసంచా తయారీకి వెళ్లవద్దని చెప్పినా వినకుండా వెళ్లి కుటుంబానికి ఆసరా లేకుండా చేశారని మృతుల కుటుంబ సభ్యులు రోదించారు. ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కాగా, ప్రమాదానికి గురైన సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ లైసెన్సుదారు అడబాల అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాను శనివారం బాణసంచా ఆర్డర్ల కోసం బయటకు వెళ్లానని, ఆ సమయంలో తయారీ కేంద్రంలో ఉన్న తన తండ్రి శ్రీను కూడా చనిపోయారని అర్జున్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో అర్జున్‌కు నోటీసు ఇచ్చి, తండ్రి అంత్యక్రియలకు అనుమతించామని సీఐ చెప్పారు. కాగా, ఆదివారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జీజీహెచ్ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు.

పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రమాదం

బాణసంచా పేలుడులో ప్రాణాలు కోల్పోయిన 20 మంది కుటుంబాలను రాష్ట్ర మంత్రులు అనిత, పి.నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్ ఆదివారం పరామర్శించారు. వారికి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులు అందజేశారు. బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలించి, ప్రమాదంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను నిల్వ చేయడం, కార్మిక శాఖలో నమోదు చేసిన వారి కంటే ఎక్కువ మందిని పనిలో పెట్టడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఇప్పటికే నలుగురు అధికారులను సస్పెండ్ చేసి, సమగ్ర విచారణకు ఆదేశించామని చెప్పారు. ఇళ్లు లేని కుటుంబాలకు ఇళ్లు కట్టించడంతో పాటు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.

తన రికార్డులను తానే తిరగరాస్తూ....

- స్టీమ్ కోల్ హ్యాండ్లింగ్‌లో విశాఖపోర్టు సరికొత్త అధ్యాయం



సాక్షి, విశాఖపట్నం: మేజర్ పోర్టులతో పోటీపడుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) సరకు రవాణాలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. పోర్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆదివారం నాటికి సరికొత్త మైలురాయిని అధిగమించింది. బల్క్ కార్గో హ్యాండ్లింగ్‌లో మరో రికార్డు సృష్టించింది. శనివారం ఒకే రోజులో 1,01,287 మెట్రిక్ టన్నుల స్టీమ్ కోల్‌ని అన్‌లోడ్ చేసి పోర్టు చరిత్రలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. 2025లో నమోదైన 77,266 మెట్రిక్ టన్నుల అత్యధిక హ్యాండ్లింగ్ రికార్డును అధిగమించింది. పోర్టు సామర్థ్యాన్ని పెంచుతూ, అత్యాధునిక నిర్వహణ పద్ధతులతో బల్క్ కార్గో రంగంలో తన సత్తాను మరోసారి చాటుకుంది. ఈ విజయానికి కారణమైన పోర్టు సిబ్బంది, స్టేక్ హోల్డర్లని వీపీఏ చైర్మన్ డా.అంగముత్తు అభినందించారు.

ప్రశాంతంగా ఉండటం అంటే
మనమంతా ఒకేలా ఉండటం కాదు.
మనం భిన్నంగా ఉన్నప్పటికీ అందరం కలిసే ఉండటం!

– మిఖాయిల్ గోర్బచేవ్

సాక్షి

సోమవారం, 2 మార్చి 2026

రంగుల కల

ప్రకృతి వర్ణభరితంగా ఉంటుంది. వసంతాగమన వేళ చెట్టు చేమలు హరితహాసాలు చిందిస్తాయి. చెట్లకు, మొక్కలకు పూచే పువ్వులు రకరకాల రంగులతో కనువిందు కలిగిస్తాయి. నేల మీద మట్టిలోనూ రకరకాల వన్నెలు కనిపిస్తాయి. ప్రతిరోజూ పొద్దుపొడుపు నుంచి పొద్దుగూకే లోపు నీలాకాశం కూడా వన్నెలు మారుతూ ఉంటుంది. నింగిలో ఎగిరే పక్షులు, నేల మీద సంచరించే జీవులు నానా రంగుల్లో ఉంటాయి. వర్షర్తువులో ఆకాశంలో మెరిసే ఇంద్రచాపం సప్తవర్ణాలతో అలరిస్తుంది. దేశదేశాల్లోని మనుషుల్లోనూ వర్ణవైవిధ్యం కనిపిస్తుంది. జీవవైవిధ్యమే కాదు, అందులోని వర్ణవైవిధ్యమూ ప్రకృతి సహజ లక్షణం. నేలకూ నింగికీ నడుమ కనిపించే వన్నెచిన్నెలే ప్రకృతి చేవ్రాలు.

ఒకవేళ రంగులే లేకుంటే, ప్రకృతి ఎంత నిస్సారంగా ఉండేది! ఒకవేళ అన్నీ ఏకవర్ణంలోనే ఉంటే, ప్రకృతి ఎంత నిర్లిప్తంగా ఉండేది! వర్ణహీనత అయినా, ఏకవర్ణ పరివ్యాప్తి అయినా ప్రకృతికి స్వభావ విరుద్ధాలు. వర్ణవైవిధ్యాన్ని పండుగ చేసుకోవడానికి వసంతోత్సవం లాంటి వేడుకలు మొదలయ్యాయి. ఒకరి మీద మరొకరు రంగులు చల్లుకోవడం ఒక సామూహిక వినోదమే కాదు, వైవిధ్యానికి ఆమోదం కూడా!

రుతువులు మారినప్పుడల్లా ప్రకృతి తన వర్ణాలను మార్చుకుంటుంది. ప్రకృతి తన భావోద్వేగాలను వర్ణలిపిలో వ్యక్తం చేస్తుంది. ‘రంగులు కూడా స్వభావాల మాదిరిగానే భావోద్వేగాలను అనుసరిస్తాయి’ అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో. రంగుల మర్మం చిత్రకారులకెరుక, కవులకెరుక!

‘కాలమనియెడు చిత్రకారుండు గీచినవి / ఆరు ఋతువుల శబల చిత్రాల వృత్త / నర్తనమ్మిది ఋతువైభవ శ్రేణి దీప్త / లలర చక్రమాగక నిరతము తిరుగుచుండు’ అన్నారు సాంధ్యశ్రీ.

వైవిధ్యం ప్రకృతి స్వభావం. వైవిధ్యం ప్రజాస్వామిక లక్షణం. ‘వైవిధ్యంతోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. నిరంకుశత్వం వైవిధ్యాన్ని వ్యతిరేకిస్తుంది’ అని అమెరికన్ దౌత్యవేత్త సామ్ బ్రౌన్‌బ్యాక్ అన్నారు. ప్రకృతిలో మనుషులూ భాగమే! ప్రకృతిలోని వైవిధ్యమంతా మనుషుల్లోనూ ఉంటుంది. అందుకే ప్రపంచంలో లెక్కకు మిక్కిలి భాషలు ఉన్నాయి; రకరకాల సంస్కృతులు ఉన్నాయి; మనుషులు సృష్టించిన కళలలో అనేకానేక శైలీభేదాలు ఉన్నాయి. వైవిధ్యమే లేకుంటే, మానవ సృజనకు ఆస్కారమెక్కడ? వైవిధ్యమే లేకుంటే మన జీవితాలు ఎంత నిస్సారంగా మారిపోతాయో ఊహించుకోగలమా?

అనాదిగా మానవాళి వైవిధ్యాన్ని ఆమోదిస్తూనే ఉంది. అందుకు నిదర్శనమే హోలీ వంటి వసంతోత్సవాలు. హోలీ పండుగ గురించిన పురాణగాథలు ఎలా ఉన్నా, ఇది వైవిధ్యాన్ని వేడుక చేసుకునే రంగుల పండుగ. హోలీ వంటి పండుగలు ఇతర దేశాల్లోనూ ఉన్నాయి. గ్రీస్ దేశంలో జరుపుకొనే ‘ఫ్లోర్ వార్’ తీరు దాదాపు హోలీ మాదిరిగానే ఉంటుంది. ఈ వేడుకలో జనాలంతా వీధుల్లోకి చేరి, రంగులు కలిపిన పిండిని ఒకరిపై ఒకరు చల్లుకుంటారు. ఇరాన్‌లో జరుపుకొనే ‘చహార్‌శంబే సూరీ’ పండుగలో కూడా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటారు. గ్రీస్, ఇరాన్ దేశాల్లో కూడా ఈ రంగుల పండుగలను వసంతారంభంలోనే జరుపుకొంటారు.

ప్రకృతిలోనే వైవిధ్యం ఉన్నప్పుడు మనుషుల్లోని వైవిధ్యాన్ని ఆమోదించడానికి శషభిషలు పడటంలో అర్థంలేదు. అయినా, కొందరికి వైవిధ్యం నచ్చదు. ప్రపంచమంతా తమ తీరులోనే ఉండాలనే మంకుపట్టు వారిది. ఇలాంటి మొండిశిఖండులకు దేశాధికారం చేతికొస్తే, ప్రజలకు నిత్యనరకం తప్పదు. ఉదాహరణకు ఉత్తర కొరియానే తీసుకుందాం. కిమ్ జాంగ్ ఉన్ పాలనలో అక్కడ నెత్తిమీద జుట్టు కత్తిరించుకునే తీరుకూ పరిమితులు ఉన్నాయి. ప్రభుత్వామోదానికి భిన్నమైన తీరులో నెత్తిమీద జుట్టు పెంచుకుంటే, అక్కడ అంతే సంగతులు! వైవిధ్య వ్యతిరేక ధోరణులు ఇప్పుడు ప్రపంచమంతటా ప్రబలుతున్నాయి. ఆహార, ఆచార, ఆలోచనా వైవిధ్యాలను విభేదాలుగా పరిగణించి, అసహనానికి ఆజ్యంపోసే శక్తులు కల్లోలాలను రెచ్చగొడుతున్నాయి. జీవ వైవిధ్యాన్నే కాదు, మానవాళిలోని సమస్త వైవిధ్యాలను కాపాడుకుంటేనే అది అసలైన వసంతోత్సవం కాగలదు; అదే అసలైన రంగుల పండుగ కాగలదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చతుర్దశి సా.5.48 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.7.54 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.7.43 నుండి 9.16 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.34 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.40 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.21 నుండి 7.54 వరకు, తదుపరి తె.5.10 నుండి 6.46 వరకు.

సూర్యోదయం : 6.23
సూర్యాస్తమయం : 6.02
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

మిస్టర్ ‘కూల్’



నాలో మీకు కనిపించే ఆత్మ విశ్వాసం నిజమైనది కాదు. నేను దానిని తెచ్చిపెట్టుకుంటాను. నిజ జీవితంలో నేనసలు ‘కూల్’గానే ఉండను. అందుకే కెమెరా ముందు కూల్‌గా కనిపించటానికి చాలా కష్టపడతాను. మీరు మీలా ఉండటం మీ వృత్తిలో ఎప్పటికీ సాధ్యం కాదు.

– డేనియల్ క్రెయిగ్, ‘బాండ్’ యాక్టర్

ఉత్తీర్ణత

పరీక్షలలో ఉత్తీర్ణులు అయినంత మాత్రాన మీరు పట్టభద్రులైనట్లు కాదు. ప్రపంచాన్ని అందరికీ న్యాయమైన, యోగ్యమైన స్థలంగా మార్చేందుకు మీరు నేర్చుకున్న వాటిని ఉపయోగించండి. ఉత్తీర్ణత మీ ఫైల్‌లోని ఒక వ్యర్థ పత్రంగా మిగిలిపోకూడదు.

– భాల్‌చంద్ర ముంగేకర్, ఆర్థికవేత్త

ఆదరణ

కష్టాలలో ఉన్న వారితో దయగా, ప్రేమగా ఉండండి. వారిని ఆదరించండి. జీవితంలో వారు ముందుకు సాగటానికి చేయూతను ఇవ్వండి. అప్పుడే, సరిదిద్దుకోవటా నికి వారికి అవకాశం ఉంటుంది. అంతే తప్ప, స్వయంకృతాపరాధం అని వారిని నిందించకండి.

– లతా రజనీకాంత్, నిర్మాత–నేపథ్య గాయని

మానొద్దు!



కష్టపడి పైకి వచ్చినప్పుడు, ‘ఇకనేం, పైకి వచ్చాం కదా’ అని కష్టపడటం మానేయకండి. నిరంతరం పని చేస్తూ ఉండటం వల్ల మీరేమీ అలసటకు గురి కారు; పని మాని విశ్రాంతి తీసుకున్నప్పుడే మిమ్మల్ని నీరసం, నిస్పృహ ఆవహిస్తాయి.

– ఎం.కె. స్టాలిన్, తమిళనాడు సీఎం

గుర్తింపు

పాత పద్ధతిలో పనులు చేయటం సౌకర్యంగానే ఉంటుంది. కానీ అది మీ ఎదుగుదలకు సహాయపడదు. కొంచెం భయంగా అనిపించినా కొత్త పద్ధతిలో పని చేయటానికి, కొత్తది నేర్చుకోటానికి సిద్ధంగా ఉన్నప్పుడే మీ పనికి గుర్తింపు లభిస్తుంది.

– ఎస్.డి. శిబులాల్, ఇన్ఫోసిస్ మాజీ సీఈవో

జ్ఞానం

డిగ్రీలు ఉన్నంత మాత్రాన తెలివైన వారు కాకపోవచ్చు. పూట గడవటం కోసం పని చేసేవారే నిపుణులైనవారు. వారి దగ్గర నేర్చుకోవటానికి ఎంతో ఉంటుంది. పుస్తకాలలో జ్ఞానం ఉంటుంది నిజమే. సొంత కళ్లతో చూసినప్పుడే కదా, మీకు అనుభవం వస్తుంది.

– హరీశ్ హండే, మెగసెసె విజేత–‘సోలార్ మ్యాన్’

అగ్రరాజ్యం అనుకున్నట్లే అవుతుందా?

అభిప్రాయం

డాక్టర్ సనమ్ వకీల్

అమెరికా, ఇజ్రాయెల్‌లు శనివారం వేకువ జామున ఇరాన్‌పై పరస్పర సమన్వయంతో దాడులు నిర్వహించాయి. గత వేసవిలో 12 రోజులపాటు సాగిన యుద్ధం తర్వాత ఈ మూడు దేశాలు కుతకుతలాడుతూనే ఉన్నాయి. శనివారంనాటి దాడులు ఆ ఘర్షణను తిరిగి రగుల్కొలిపాయి. అమెరికా–ఇజ్రాయెల్‌ల సంయుక్త దాడులు ఇరాన్‌లోని కీలకమైన అధికార వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని సీనియర్ నాయకులను హతమార్చాయి. ముఖ్యంగా 1989 నుంచి ఇరాన్‌ను పాలిస్తూ వస్తున్న సుప్రీమ్ లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ నేలకొరిగారు. ‘‘చరిత్రలోని అత్యంత దుష్టమైన వ్యక్తులలో ఒకరు’’ గా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయనను అభివర్ణించారు. ఖమేనీని మట్టుబెట్టిన సంగతిని ట్రంప్ ఒక పోస్ట్ ద్వారా వెల్లడించారు. ‘‘ఈ ఘటనతో ఇరాన్ ప్రజానీకానికే కాదు, గొప్ప అమెరికన్లు అందరికీ న్యాయం చేకూరినట్లు అయింది’’ అని కూడా ట్రంప్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

నిర్ణయాత్మక సైనిక చర్య!

ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) కమాండర్ మహమ్మద్ పాక్పూర్, రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదె, డిఫెన్స్ కౌన్సిల్ అధినేత అడ్మిరల్ అలీ షంఖానీ, ఆఖరికి ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదినెజాద్ సైతం దాడుల్లో హతమైనట్లు ఇజ్రాయెల్ వార్తలు ప్రచురించింది. ఇరాన్ తన క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ప్రతి దాడులకు దిగింది. ఇరాక్, జోర్డాన్‌లతో సహా గల్ఫ్‌లో పలు ప్రాంతాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన కూడా ఇరాన్ విరుచుకుపడింది. త్వరితగతిన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. క్షణక్షణానికీ మారిపోతున్న పరిస్థితులు ఊహకు అందడం లేదు.

సహజంగానే సంతోషాతిరేకంతో ఉన్న ట్రంప్ దీన్ని పరిమిత చర్యగా భావించడం లేదు. అమెరికాకు దీర్ఘకాలికంగా ఉన్న ముప్పును తుదముట్టించే నిర్ణయాత్మక సైనికచర్యగా చెబుతున్నారు. గతంలో అమెరికా అధ్యక్షులుగా పనిచేసినవారు ఈ బెడదను నేరుగా ఎదుర్కొనేందుకు విముఖత చూపారనీ, తాను దాడికి సాహసించగలిగాననీ ఆయన చెబుతున్నారు.

దాడులకు దిగడానికి ముందు ఇరాన్‌కు చుట్టుపక్కలనున్న దేశాల మద్దతుతో అమెరికా దౌత్యపరమైన యత్నాలు సాగించింది. కానీ, అవి ఇరాన్ అణ్వస్త్ర నిర్మాణ సామర్థ్య శక్తిని కట్టడి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నవి. ఆ యత్నాలు ఫలవంతమయ్యే స్థాయి వరకు ట్రంప్ ఓపికపట్టి ఉండాల్సింది. కానీ, ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికాలోని కన్జర్వేటివ్ పిడివాదుల ప్రభావానికి లోనై, ఇరాన్ బలహీనంగా ఉందని భావిస్తున్న ప్రస్తుత సమయంలో దానిపై దాడి చేయడానికే మొగ్గు చూపారు. ఇరాన్ ప్రజానీకం తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలని ఆయన సూచించారు. ఇరాన్ ప్రభుత్వ మార్పునకు వాషింగ్టన్ మద్దతునిస్తుందని స్పష్టం చేశారు. ‘‘తమ దేశాన్ని తిరిగి తమ చేతుల్లోకి తీసుకునేందుకు ఇది ఇరాన్ ప్రజానీకానికి లభిస్తున్న ఏకైక మహత్తర అవకాశం’’ అంటూ ట్రంప్ శనివారం రాత్రి సోషల్ మీడియా వేదిక ‘ట్రూత్ సోషల్’లో పోస్ట్ చేశారు.

రెండేళ్ళ పైగా... రగులుతున్నదే!

ఇరాన్‌పై ఇప్పుడే ఎందుకు దాడికి దిగారో మనం తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఈ వారాంతపు దాడులు హఠాత్తుగా పుట్టుకొచ్చినవేమీ కావు. గత రెండేళ్లుగా ఇరాన్‌తో ఘర్షణ విస్తృత రూపం దాలుస్తూ వచ్చింది. ఇజ్రాయెల్ 2023 అక్టోబర్ 7 నుంచి గాజాలోని హమాస్‌పైనే కాకుండా, తమ ఉత్తర సరిహద్దు పొడవునా హిజ్బుల్లా పైన, ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులకు దిగుతున్న హూతీల పైన నిలకడగా సైనిక చర్యలను నిర్వహిస్తూ వచ్చింది. అది పరోక్షంగా ఇరాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకుందని వేరే చెప్పనక్కర లేదు. ఇజ్రాయెల్ సైనిక చర్యలు ఇరాన్ ఫార్వర్డ్ రక్షణ వ్యూహానికి కోత పెడుతూ వచ్చాయి. దాని కేంద్ర సైనిక సామర్థ్యాలను బలహీనపరచాయి. సాపేక్షంగా చూస్తే, ఇంతవరకు చెక్కు చెదరకుండా ఉన్నది ఇరాన్ భూభాగం, చెదిరిపోకుండా ఉన్నది క్షిపణి కార్యక్రమం, అన్నింటికన్నా ముఖ్యంగా నాయకత్వ వ్యవస్థ అని చెప్పాలి.

అమెరికా–ఇజ్రాయెల్‌ల దాడులు తక్షణ ఫలితాలనైతే ఇచ్చాయి. కానీ, యుద్ధాలు చాలా అరుదుగా మాత్రమే తొలుత రూపొందించుకున్న గతిన సాగుతాయి. అమెరికాకు సైనికపరంగా ఇరాన్ సమ ఉజ్జీ కాదన్నది అందరికీ తెలిసిందే. కానీ, దాని వద్ద సాధనాలున్నాయి. రణరంగాన్ని విస్తరించడం అన్నది దానికి వాటమైన వ్యవహారం. యుద్ధ నష్టాలను ఇరుగు పొరుగు దేశాలు కూడా పంచుకోక తప్పని స్థితిని అది సృష్టించగలదు. ఆ విధంగా ప్రాంతీయ ప్రమాదాలను పెంచగలదు. ఇరాన్ ప్రతిదాడులు సరిగ్గా ఈ వ్యూహాన్నే సూచిస్తున్నాయి. గల్ఫ్‌లోని పొరుగు దేశాలతో టెహరాన్ సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కానీ, అంతిమ కాల్పుల విరమణను సాధించేందుకు ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని నిలకడగా కొనసాగించడమే తనకున్న ఏకైక మార్గమని అది భావిస్తోంది.

> ◆ ఇరాన్ ఈ యుద్ధాన్ని భరించి నిలువవచ్చు. కానీ, ఇంత కాలం ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మనుగడ సాగించిన ఆ దేశం మార్పు చెందకుండా మునుపటిలా తన అస్తిత్వాన్ని కొనసాగించలేదు. ఈ ఘర్షణలోని నిర్ణయాత్మక దశ మొదటగా దాడులకు దిగడంలో లేదు. స్థిరమైన సైనిక ఒత్తిడితో క్రమబద్ధ రాజకీయ వ్యవస్థ ఆవిర్భవించడంలో ఉంది.

ఎవరి లక్ష్యం వారిది!

కీలక పాత్రధారులైన మూడు దేశాలూ రణరంగంలోకి దిగడానికి, ఎవరికి వారికి ప్రత్యేక లక్ష్యాలున్నాయని గమనించాలి. ఇస్లామిక్ రిపబ్లిక్‌కేమో తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం మొదటి లక్ష్యం. దాడులను తట్టుకుని నిలబడి, తగినంత సైనిక, రాజకీయ పొందికను తమ వైపు నుంచి కనబరచడం, సైనిక ప్రతిస్పందనను కొనసాగించడం ఇరాన్ ముందున్న పని. సంప్రదాయ ధోరణిలో యుద్ధంలో గెలిచేందుకు ఇరాన్ పోరాడడం లేదు. పాలనా వ్యవస్థను కొనసాగించుకునేందుకు శక్తియుక్తులను ఒడ్డుతోంది.

దానికి విరుద్ధంగా, ట్రంప్ ఒక నిర్ణయాత్మక ఫలితాన్ని కోరుకుంటున్నారు. అమెరికాకున్న దీర్ఘకాలిక ప్రత్యర్థి మెడలు వంచినట్లు చాటుకోవాలని ఆయన తాపత్రయం. ‘‘ఈ వారం పొడుగూతా బాంబులు కురిపిస్తూనే ఉంటాం. మా లక్ష్యాన్ని సాధించే వరకు అవసరమైనంత కాలం పోరు సల్పుతాం’’ అని ఆయన చెప్పారు. ఇబ్బడి ముబ్బడి శక్తితో ఇరాన్ మౌలిక వసతులను, వ్యూహాత్మక ఆస్తులను ధ్వంసం చేస్తూ, సీనియర్ నాయకత్వాన్ని మట్టుబెడుతూ పోతే, ఇరాన్ వ్యూహాత్మక వైఖరి సడలిపోతుందనీ, అది లొంగివస్తుందనీ, లేదా దేశం లోపల అస్తవ్యస్త పరిస్థితులు పాలనా వ్యవస్థ మార్పునకు దారితీసి తీరుతాయనీ ట్రంప్ నమ్మకంతో ఉన్నారు.

ఇజ్రాయెల్ లక్ష్యాలు కూడా స్థూలంగా వాషింగ్టన్ వైఖరితో సరిపడినవే. కాకపోతే అది కొన్నింటిపైనే దృష్టి కేంద్రీకరిస్తోంది. ఇరానియన్లు తిరగబడాలనీ, పాలనా వ్యవస్థ మార్పునకు లభించిన చారిత్రక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ నెతన్యాహు పిలుపు నిస్తున్నారు. ఇరాన్ ఆంతరంగిక సమస్యలలో మునిగిపోతే చాలుననీ, శాశ్వతంగా కాకపోయినా... కనీసం ప్రస్తుతానికి వ్యూహపరంగా బలహీనపడాలనీ ఆయన కోరిక.

ఇరాన్‌లో ఏం జరగవచ్చు?

బాంబు దాడులు, ఖమేనీ అస్తమయం తర్వాత ఒకదానితో ఒకటి ముడిపడిన పలు మార్గాలు కళ్ళెదుట నిలువనున్నాయి. రానున్న కొద్ది రోజుల్లో, అమెరికా తన చర్యలను నిలుపు చేయవచ్చు. ఇరాన్ గణనీయంగా దెబ్బతిని ఉంది కనుక, ఒత్తిడి చేస్తే దారికి రావచ్చని వైట్‌హౌస్ భావన. దయనీయ స్థితి ఉద్రిక్తతల సడలింపునకు దారితీయవచ్చని దాని అభిప్రాయం. ప్రస్తుత పాలనా వ్యవస్థలో మిగిలిన నాయకత్వం, వాషింగ్టన్ డిమాండ్లకు అంగీకరించడం ద్వారా తమ పట్టును కొంతవరకైనా కాపాడుకున్నట్లు అవుతుందని భావించవచ్చు.

ఖమేనీ రంగంలో లేకపోయినంత మాత్రాన, వ్యవస్థ దానికంతట అది కుప్పకూలదు. అధికార బదలీకి రాజ్యాంగ యంత్రాంగం ఏదో ఒక ఏర్పాటు చేస్తుంది. నిపుణులు నూతన అధినాయకుడిని అధికారికంగా నియమించవచ్చు. అయితే, ఆచరణలో మాత్రం, నిర్ణయాత్మక శక్తి రివల్యూషనరీ గార్డ్, భద్రతా వ్యవస్థ చేతుల్లోనే కొనసాగవచ్చు. అధికార బదలీ పకడ్బందీగా సాగేట్లు, ఉన్నత స్థాయి నాయకత్వం చెదిరిపోకుండా నివారించేటట్లు... ఆ రెండు వ్యవస్థలు ప్రయత్నించి తీరుతాయి. పాలన కొనసాగేందుకు, తాత్కాలికంగానైనా ఉమ్మడి నాయకత్వ ఏర్పాటు జరగవచ్చు. అది అమెరికా–ఇజ్రాయెల్‌ల ఒత్తిడికి మరింత లొంగకపోవచ్చు కానీ, దేశంలోని సైనిక ఒత్తిడికి అది లొంగిపోయేదిగానే ఉంటుంది.

సైనిక ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే ఇరాన్‌లోని ఉన్నతస్థాయి రాజకీయ వర్గాలలో ఉన్న విభేదాలు బయటపడనూవచ్చు. ఆర్థిక ఒడుదొడుకులు, సైనిక నష్టాలు, ఆంతరంగిక శత్రుత్వాలు కేంద్ర అధికారాన్ని బలహీనపరచి దేశీయంగా ఇతర వర్గాల నుంచి పోటీ ఎదురవడానికి పరిస్థితులు అనువుగా మారవచ్చు. ప్రతిపక్షాలు కూడా ఆ వర్గాలకు మద్దతు పలుకవచ్చు.

అడ్డూ ఆపూ లేకుండా పాలక వర్గాలు చీలిపోతే మాత్రం అత్యంత అస్థిర పరిస్థితులు దాపురిస్తాయి. లిబియాయే అందుకు తిరుగులేని తార్కాణం. అక్కడ గడాఫీ పతనం క్రమబద్ధమైన అధికార బదలీ పరిణామక్రమానికి ఏమీ దారితీయలేదు. వ్యవస్థలు కుప్పకూలాయి. మిలీషియాల మధ్య పోటీ, బాహ్య జోక్యాలు దేశంలో ప్రత్యర్థి వర్గాల మధ్య ఆజ్యం పోశాయి. లిబియా కన్నా సంక్లిష్టమైన దేశమైన ఇరాన్‌లో వ్యవస్థలు బలంగా ఉన్నాయి. అధికార యంత్రాంగాలు వేళ్ళూనుకుని ఉన్నాయి. రాజకీయ అధికార బదలీని నిర్వహించకుండా పెద్ద తలకాయను తీసేసినంత మాత్రాన పరిస్థితులు చక్కబడవు. సాయుధ వర్గాలు అధికారాన్ని చెలాయిస్తూనే ఉంటాయి. ప్రచ్ఛన్న పోటీకి తెరతీసినట్లు అవుతుంది.

ఒకటి మాత్రం నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ ప్రాంతంలో తాజా యుద్ధానికి ముందటి సమతుల్యత మాత్రం ఇక కచ్చితంగా ఉండదు. ఉద్రిక్తతలను సడలించేందుకు చొరవ చూపిన గల్ఫ్ దేశాలు ప్రతి దాడులను రుచి చూసి ఇపుడు మరింతగా బహిర్గతమయ్యాయి. ఇంధన మార్కెట్లు, ముఖ్యంగా కీలకమైన పాయింట్ల వద్ద సాగర భద్రత సున్నితమైన అంశాలుగా కొనసాగుతాయి. ఘర్షణలు మరింత ప్రబలడానికి కూడా అవి కారణాలుగా నిలువవచ్చు. అమెరికా – ఇజ్రాయెల్‌ల ప్రత్యక్ష చర్యను చూసిన ప్రాంతీయ దేశాలు తమ పొత్తులను, రక్షణ వైఖరులను పునః సమీక్షించుకుని తీరుతాయి.

ఇరాన్ ఈ యుద్ధాన్ని భరించి నిలువవచ్చు. కానీ, ఇంతకాలం ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మనుగడ సాగించిన ఆ దేశం మార్పు చెందకుండా మునుపటిలా తన అస్తిత్వాన్ని మాత్రం కొనసాగించలేదు. ఈ ఘర్షణలోని నిర్ణయాత్మక దశ మొదటగా దాడులకు దిగడంలో లేదు. స్థిరమైన సైనిక ఒత్తిడితో క్రమబద్ధ రాజకీయ వ్యవస్థ ఆవిర్భవించడంలో ఉంది. అమెరికా తన తక్షణ లక్ష్యాలను సాధించుకుని ఉండవచ్చు. అయితే, తదనంతరం రూపుదిద్దుకునే ఇరాన్, దాని ఇరుగు పొరుగు దేశాల యవనికకు అది సిద్ధంగా ఉందా అన్నదే ప్రశ్న!

వ్యాసకర్త ప్రతిష్ఠాత్మక రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్‌లో మధ్య ప్రాచ్య, ఉత్తర ఆఫ్రికా ప్రోగ్రామ్ డైరెక్టర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గణిత ప్రతిభా స్వరూపం

విజ్ఞాన శిఖరాలు-39

ఆధునిక భారతదేశపు తొలి మహిళా గణిత శాస్త్రవేత్త టీఏ సరస్వతి అమ్మ. కేరళ ప్రాంతం పాలక్కాడు జిల్లా చెర్పుల్‌సరి గ్రామంలో 1918 డిసెంబర్ 26న జన్మించారు. సంస్కృతం, ప్రాకృతం, ప్రాచీన కాలపు గణిత విజ్ఞానం... ఈ మూడింటిలో పాండిత్యం సాధించి, వాటిని సమన్వయం చేసి భారతదేశపు గణిత శాస్త్ర చరిత్ర సుసంపన్నమని చాటారు. బిభూతి భూషణ్ దత్తా, ఏఎన్ సింగ్‌లు ‘హిస్టరీ ఆఫ్ హిందూ మ్యాథమెటిక్స్: సోర్స్ బుక్’ను రెండు భాగాలు 1935, 1938లలో ప్రచురించారు. లాహోర్ నుంచి వెలువరించిన ఈ పుస్తకం మొదటి భాగం న్యూమరికల్ నొటేషన్స్, అరిథమెటిక్‌కు సంబంధించింది కాగా, రెండవది ఆల్జీబ్రాకు సంబంధించింది. ఈ పుస్తకానికి కొనసాగింపుగా రేఖా గణితం, త్రికోణమితి, కలన గణితం, ఇంకా ఇతర అంశాలతో కలిపి మూడో భాగం వెలువరించాలని వారాశించారు. కానీ అది వారి జీవిత కాలంలో సాధ్యపడలేదు. ప్రాచీన, మధ్యయుగాల భారతదేశపు రేఖా గణితం గురించి టీఏ సరస్వతి 1964లో రాంచీ విశ్వవిద్యాలయం నుంచి పరిశోధన కొనసాగించడం ఈ బృహత్తర కార్యక్రమానికి కొనసాగింపయ్యింది. ఆమె పర్యవేక్షణలో రాంచీ విశ్వవిద్యాలయం నుంచే 1971లో ఆర్.సి. గుప్తా భారత దేశపు ప్రాచీనకాలపు త్రికోణమితి గురించి పరిశోధన పూర్తి చేశారు. దీనిని బట్టి సరస్వతి చేసిన, చేయించిన పరిశోధన ఎంత ముఖ్యమైనదో గమనించవచ్చు.



టీఏ సరస్వతి అమ్మ

జైనుల గణితశాస్త్రానికి సంబంధించి సరస్వతి 1962లో పరిశోధనా పత్రం వెలువరించారు. ఆర్యభట్ట, రెండవ భాస్కరుడు, శ్రీధర, నారాయణ పండిత వంటి ప్రాచీన గణిత శాస్త్రవేత్తల రచనలను కూలంకషంగా అధ్యయనం చేసిన ఆమె పరిశోధన 1964లో పూర్తి అయ్యింది. ఆ సిద్ధాంత గ్రంథం 1979లో ప్రచురితమయ్యింది. యూరోపియన్ల కంటే మూడు శతాబ్దాలు ముందుగానే భారతీయులు ఆల్జీబ్రా, జామెట్రీ సంబంధించి ముందంజలో ఉన్నారని ఈ పరిశోధన ద్వారా తేటతెల్లమయ్యింది. రెండవ భాస్కరుడి తర్వాత భారత దేశంలో అభివృద్ధి చెందిన గణిత శాస్త్రం గురించి చేసిన పరిశోధన ద్వారా 12వ శతాబ్దంలోనే పై, సైన్, కొసైన్ శ్రేణుల పట్ల అవగాహన ఉందని బోధపడింది. 1972లో సంస్కృతం, గణిత శాస్త్రం సంబంధించి భారతదేశపు తొలి అంతర్జాతీయ సంస్కృత సమ్మేళనంలో సరస్వతి ప్రసంగించారు. గణిత శాస్త్రం కఠినమని నేటికీ ఎంతోమంది భావించే రంగంలో, తొలిసారి భారతీయ మహిళా కేతనాన్ని విజయవంతంగా ఎగుర వేసిన టీఏ సరస్వతి 2000 ఆగస్టు 15న కనుమూశారు. ఆమె కృషి చిరస్మరణీయం.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

నెలవారీ మత్తు ఖర్చు

డేటా పాయింట్

పట్టణాల్లో కంటే గ్రామాల్లోనే తమ సంపాదనలో అధిక శాతం పొగాకు, మత్తు పదార్థాల కోసం ఖర్చు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ నిర్వహించే ‘హౌజ్‌హోల్డ్ కన్జంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే’ ప్రకారం, తమ నెలవారీ నూరు రూపాయల తలసరి ఖర్చులో గ్రామీణులు సుమారు మూడు రూపాయలు వీటికే వెచ్చిస్తున్నారు. పాన్, పొగాకు, మత్తు పదార్థాల కోసం సంవత్సరాలుగా నూరు రూపాయల నెలవారీ ఖర్చు ఇలా ఉంది...



హరిధ్యాన ఫలం

జ్యోతిర్మయం

తమ కావ్యాలలో సందర్భానికి అనుగుణంగా శ్రీహరిని ధ్యానించడం వలన కలిగే ఫలాన్ని గురించి తెలుగు కవులు చెప్పారు. ‘హరి ఓం’ – అని ‘హరి’ శబ్దపూర్వకమగు ఓంకారాన్ని ఎవరైతే ఎప్పుడూ తన నాలుక చివరన ఉంచుకుని స్మరిస్తాడో... అతడికి ఆ ‘హరి ఓం’ శబ్దం, ఎన్నో జన్మల నుండి వెంటనంటి వస్తూండిన పాపాలను హరించడమే కాకుండా, తాను ఇకముందు చేయబోయే మంచి పనులకు రాగలిగే అవకాశం ఉన్న విఘ్నాలను అన్నిటినీ కూడా పరిహరించి, ఉగ్రమైన సర్వదోషాలను పోగొడుతుంది’ అని ‘భోజ రాజీయము’ అనే కావ్యంలోని ఒక పద్యంలో ఆ కావ్యకర్త అనంతామాత్యుడు చెప్పాడు.

‘రాబోయే ఆపదను రాకుండా ఆపడానికైనా, కొంత తడవు మరల్చడానికైనా, పోతున్న సంపదను పోకుండా లక్ష్మీదేవిని బుజ్జగించి ఆపినట్లుగా ఆపడానికైనా, శ్రీహరికి తప్ప బ్రహ్మ, మహేశ్వరాది దేవతలు ఎవరికీ అలవి అయ్యే పని కాదు కదా!’ అని ‘మత్స్య పురాణము’ లోని ఒక పద్యంలో ఆ కావ్యకర్త హరిభట్టారకుడు చెప్పాడు.

తెలుగులోని పురాణ సాహిత్యంలో అల్లాడు నరసింహ కవి రచించిన ‘నారదీయ పురాణము’ ఒకటి. ఆ కావ్యం ద్వితీయాశ్వాసంలోని ఈ క్రింది పద్యంలో సరళమైన పోలికతో సులభమైన మాటలలో శ్రీహరిపై భక్తి కలిగి ఉండడం వలన వ్యక్తిలో వచ్చే మార్పును గురించి వివరించి చెప్పాడు.

కం. కలుగదు క్రోధము లోభము / గలుగదు గర్వంబు మదము గలుగదు హరిభ
క్తులకు బ్రదీపము క్రిందట /నిలుచునె ఘోరాంధకార నిచయం బెల్లన్.

శ్రీహరిని ఎల్లవేళలా ధ్యానించే వ్యక్తులకు కోపం రాదు. లోభిగా ఉండడం తగ్గిపోతుంది. నన్ను మించినవాడు లేడనే గర్వం నశిస్తుంది. అన్ని దిక్కులకూ బలమైన వెలుగులను చిమ్మే దీపశిఖ కింద ఎంత గాఢమైన అంధకారమైనా నిలవలేక పారిపోతుంది కదా! అటువంటిదే శ్రీహరి ధ్యానం వలన కలిగే ఫలం కూడా!’ అని మనోహరమైన పోలికతో శ్రీహరిని ధ్యానించడం వలన కలిగే ఫలం గురించి చెప్పాడు.

– భట్టు వెంకటరావు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

హైకోర్టు సీజేతోపాటు పలు రాష్ట్రాల న్యాయమూర్తులతో కలిసి ప్రత్యేక పూజలు

తిరుమల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన న్యాయమూర్తుల బృందంతో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా మహాద్వారం వద్దకు చేరుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్.వెంకయ్యచౌదరి ఆలయ అర్చకులతో కలిసి మేళతాళాల నడుమ, వేద మంత్రోచ్ఛారణలతో సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించి శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం వారికి టీటీడీ ఛైర్మన్, ఈవో స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ దొనడి రమేష్, జస్టిస్ మహేశ్వరరావు, జస్టిస్ టీసీడీ శేఖర్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిపిన్ గుప్త, జస్టిస్ చంద్రశేఖర్ శర్మ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంజూష అజయ్ దేశ్ పాండే, కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ పాటిల్ శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. కాగా, శ్రీవారి దర్శనానంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తిరుమలలోని శ్రీ వరాహస్వామి ఆలయాన్ని సందర్శించారు.

ఆలయ మహా ద్వారం వద్ద సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి


ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జితేంద్ర కుమార్ మహేశ్వరి


జస్టిస్ విజయ్ బిష్ణోయ్

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ దొనడి రమేష్, జస్టిస్ మహేశ్వర రావు, జస్టిస్ టీసీడీ శేఖర్

ప్రమాదంలో ముగ్గురి మృతి

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన అన్నదమ్ములైన శివకుమార్(35), చంద్రశేఖ (32), వారి పెదనాన్న కుమారుడు హనుమంతరాయుడు(40) ఆదివారం కర్ణాటకలోని మొలకల్మూర్ వద్ద జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యారు. కారులో సొంతూరికి తిరిగొస్తుండగా గూబనపల్లి వద్ద వేగంగా వచ్చిన రాయదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. కారులోని ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

17 ఏళ్లయినా చెక్కుచెదరని మృతదేహం!

చెక్కు చెదరకుండా ఉన్న నస్రీన్ మృతదేహం

ఇల్లెందు: 2009లో అనారోగ్యంతో పదేళ్ల బాలిక మృతిచెందగా ముస్లింల సంప్రదాయం ప్రకారం ఖబరస్థాన్‌లో ఖననం చేశారు. అయితే ఆ మృతదేహం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నంబర్–2 బస్తీకి చెందిన అబ్దుల్ అజమ్‌ఖాన్ 4 రోజుల కిందట గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన భౌతికకాయాన్ని 17 ఏళ్ల క్రితం మృతిచెందిన తన అన్న కూతురు నస్రీన్ సమాధి పక్కన ఖననం చేసేందుకు గొయ్యి తవ్వుతుండగా బాలిక మృతదేహం కనిపించింది. సహజంగా ఖననం చేసిన ఏడాదిలోపే మృతదేహం మట్టిలో కలిసిపోతుంది. కానీ 17 ఏళ్లయినా ఆ మృతదేహం అలాగే ఉండగా, పైన కప్పిన వస్త్రం రంగు మారకుండా, చెదలు పట్టకుండా ఉండటంతో అంతా షాక్ అయ్యారు. ఇదేదో మహిమగా భావించిన కుటుంబీకులు, మత పెద్దలు మరోమారు ప్రార్థన చేసి ఖననం చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఇల్లెందులో చర్చనీయాంశంగా మారింది.

జయహో.. బాలికా..

స్పేస్ కిడ్జ్ ఇండియా నేతృత్వంలో రాకెట్ రూపకల్పన

చెన్నై తీరంలో ప్రయోగం విజయవంతం

సాక్షి, చెన్నై: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 'స్పేస్ కిడ్జ్ ఇండియా నేతృత్వంలో' చెన్నై తీరంలో బాలికలు రూపకల్పన చేసిన రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. చెన్నైలోని ఉత్తండి బీచ్ వేదికగా ఆదివారం ఉదయం బాలికలు సిద్ధం చేసిన 'సాలిడ్ రాకెట్', స్వదేశీ సాంకేతికతతో తయారైన స్పేస్ కిడ్జ్ ఇండియా 'ఎలక్ట్రిక్ రాకెట్'లను విజయవంతంగా ప్రయోగించారు. పాఠశాల విద్యార్థినులు డిజైన్ చేసిన ఈ రాకెట్ 2 మీటర్ల ఎత్తు, 110 మిమీ వ్యాసం కలిగి 10 కిలోల బరువుతో ఉంది. ఈ రాకెట్ ప్రయోగం సుమారు ఒక కిలోమీటరు ఎత్తుకు దూసుకెళ్లింది. ఈ సందర్భంగా స్పేస్ కిడ్జ్ ఇండియా వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్రీమతి కేసన్ మాట్లాడుతూ తమ బాలికలు రాకెట్లను నిర్మిస్తూ భారతదేశాన్ని స్వావలంబన వైపు నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ రంగాల్లో మహిళా శక్తిని ఈ ప్రయోగం చాటిచెప్పిందన్నారు.

చంద్రబాబు సర్కారుకు రైతుల బాధలు పట్టవు

పంటలకు మద్దతు ధరలు లేక అల్లాడుతున్నా మొద్దునిద్ర

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాగిరెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: పంటలకు మద్దతు ధరలు లేక రైతులు అల్లాడుతున్నా చంద్రబాబు సర్కారు పట్టించుకోకుండా మొద్దునిద్ర పోతోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, రైతుల సంక్షేమం) ఎంవీఎస్ నాగిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శనగల కొనుగోలులోను, ఈ–క్రాప్ పూర్తి చేయడంలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు శనగ పంటను క్వింటాల్ రూ.8 వేలకు పైగా అమ్ముకున్నారని గుర్తు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మద్దతు ధర కంటే రూ.800 వరకు తక్కువకు అమ్ముకోవాల్సి రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.

కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం

రాష్ట్రంలోని రైతులు, ప్రస్తుతం శనగ పంట పరిస్థితులపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి తాను, ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, గురుమూర్తి లేఖ రాసినట్టు తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పంట ఉత్పత్తులపై వైఎస్సార్‌సీపీ హయాంలో ఉన్న తరహాలోనే దిగుమతి సుంకాలు విధించాలని, తద్వారా మన రైతులను ఆదుకోవాలని కోరినట్టు వెల్లడించారు. మద్దతు ధర పడిపోతే రైతులు నష్టపోతారనే విషయాన్ని కేంద్ర మంత్రికి గుర్తు చేశామన్నారు. ఇదే విషయాలను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామని, క్వింటా శనగలకు రూ.5,875 మద్దతు ధర ప్రకటించినా.. రూ.1,000 చొప్పున బోనస్ ఇవ్వకపోతే శనగ రైతులు నష్టపోతారనే విషయాన్ని ప్రస్తావించామన్నారు. 8 జిల్లాల్లో పండే ప్రధాన పంట శనగ ధరల విషయం రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. అసెంబ్లీలో పెద్ద పెద్ద ప్రకటనలు చేయడం కాదని.. క్షేత్రస్థాయిలో ఆచరణలో చూపాలని నాగిరెడ్డి కోరారు. శనగ పంట పూర్తయినా ఇప్పటికీ ఈ–క్రాప్ పూర్తికాకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులో బంతి పూలకు ధర లేక రోడ్లపై పారబోయడాన్ని తొలిసారి చూస్తున్నామన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు.

మల్లవల్లిలో గొర్రెల మృత్యువాత కలకలం

మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో ఆదివారం విషపూరిత ఆహారం తినడంతో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారుడు మందాడ ఏడుకొండలు యథావిధిగా మేత కోసం తన జీవాలను శనివారం గ్రామ సమీపంలోని అటవీప్రాంతం వైపు తోలుకువెళ్లాడు. గ్రామ సమీపంలో ఉన్న ఫ్యాక్టరీల ఆహార వ్యర్థాలను ఇక్కడ పారేయడంతో గొర్రెలు వాటిని తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. గొర్రెలను ఇంటికి తోలుకొచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా స్పృహ తప్పి పడిపోవడంతో ఏడుకొండలు ఆందోళన చెందాడు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రానికి 15 గొర్రెలు మృతి చెందాయి. మరో 20 గొర్రెలు తీవ్ర అస్వస్థతతో ఉన్నాయి. రేమల్లె ప్రభుత్వ పశువైద్యశాల సిబ్బంది ఆదివారం ఉదయం అస్వస్థతకు గురైన గొర్రెలకు వైద్యం అందించారు. మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వ పశువైద్యురాలు డాక్టర్ సుధారాణి నేతృత్వంలో పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెలు తిన్న విషపూరిత ఆహార వ్యర్థాలు పడేసిన ప్రాంతానికి వెళ్లి వాటిని పరిశీలించారు. ఆహార వ్యర్థాల శాంపిల్స్‌ను సేకరించారు. అకస్మాత్తుగా 15 గొర్రెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని ఏడుకొండలు ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రెల మృతిపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్‌లపై కేసులు పెట్టాలి

- లడ్డూ ప్రసాదం విషయంలో అబద్ధాలు వల్లె వేస్తున్నారు
- కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు
- తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ నాగ వరప్రసాద్ ఫిర్యాదు

తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న డీఎస్పీ నాగ వరప్రసాద్

తాడికొండ: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో అబద్ధాలు వల్లె వేస్తూ కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లపై డీఎస్పీ దేవరకొండ నాగవరప్రసాద్ ఫిర్యాదు చేశారు. అప్పటి టీటీడీ ఈవో శ్యామలరావు, టీటీడీ చైర్మన్, టీవీ–5 అధినేత బీఆర్ నాయుడు, ఈనాడు, ఈటీవీ అధినేత చెరుకూరి కిరణ్, ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ, మహా న్యూస్ వంశీకృష్ణ, ప్రైమ్–9 అధినేత తోపాటు లడ్డూ ప్రసాదం కల్తీ అంటూ న్యూస్ ఛానెల్స్‌లో చర్చా కార్యక్రమాలు నిర్వహించిన యాంకర్‌లు, చర్చల్లో పాల్గొన్న వ్యక్తులు, జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కోరారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగ వరప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంపై బాధ్యత కలిగిన పదవుల్లో ఉన్నవారంతా దుష్ప్రచారం చేస్తూ ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ చార్జ్‌షీట్ సైతం లడ్డూ ప్రసాదాల్లో ఏవిధమైన కొవ్వు కలవలేదని పొందుపరిచినప్పటికీ తప్పుడు ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. ఎస్వీబీసీ చానెల్ గౌరవానికి భంగం కలిగించిన ఎమ్మెల్యేపై సైతం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నెల్లూరు జీజీహెచ్‌లో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో పిల్లల వార్డులో పేలిపోయిన రెండు ఏసీలు

తృటిలో తప్పిన పెనుముప్పు

నెల్లూరు (అర్బన్): నెల్లూరులోని సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) ఎమ్సీహెచ్ బ్లాక్‌లోని హెచ్‌డీ వార్డులో ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రెండు ఏసీలు పేలిపోయాయి. అక్కడే డ్యూటీలో ఉన్న డాక్టర్ మాధురి సిబ్బంది సాయంతో అద్దాలు పగులగొట్టారు. సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ఒక్కసారిగా ఆస్పత్రిలో చీకట్లు అలుముకున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని భయంతో అరుస్తూ చీకట్లోనే బయటకు పరుగులు తీశారు. అప్రమత్తమైన సిబ్బంది ఫైరింజన్ వచ్చేలోపు అగ్నిమాపక పరికరాల సాయంతో మంటలను ఆర్పేశారు. అప్పటికే రెండు బెడ్లకు మంటలు అంటుకోగా, వాటినీ అదుపుచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆస్పత్రి అధికారులు డాక్టర్ సుశీల్, డాక్టర్ కళారాణి పిల్లలను ట్రామా వార్డులోకి మార్చి వైద్యసేవలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. ఎస్పీ అజిత, ఆర్డీఓ అనూష, విద్యుత్ శాఖ ఈఈ శ్రీధర్, డీఈఈ అశోక్ తదితరులు పరిశీలించారు.

హాజరు పేరుతో టీచర్లపై ఉక్కుపాదం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల హాజరు నిబంధనలను కఠినతరం చేస్తూ జారీ చేసిన తాజా ఉత్తర్వులు ఉపాధ్యాయులను అవమానించేలా ఉన్నాయని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ తెలిపింది. ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించడంలో విఫలమవుతున్నా, సమయానికి డీఏలు ఇవ్వలేకపోతున్నా, సకాలంలో మధ్యంతర భృతి, పీఆర్సీ ప్రకటించలేకపోతున్న ప్రభుత్వం ఉపాధ్యాయులు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా తప్పు, ఒక నిమిషం ముందుగా వెళ్లినా తప్పు, అవుట్ టైం నమోదు చేయకపోతే పాఠశాల వదిలి వెళ్లినట్టే అనే నియమాలు అమలు చేయడం నిరంకుశ వైఖరికి నిదర్శనమని పేర్కొంది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేశవరపు జాలిరెడ్డి, షేక్ జంషీద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డి శేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం ఉపాధ్యాయులపై అనుమానం పెంచేలా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు లేకపోవడం, ఏజెన్సీ ప్రాంతాలలో రోడ్లు లేకపోవడం, సుదూర గ్రామీణ ప్రాంతాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయుల పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయం ఉపాధ్యాయ వ్యతిరేక విధానంగా పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేట్రేగుతున్న పేకాట గ్యాంగ్

- పోలీసులకు సమాచారం ఇచ్చాడనే అనుమానంతో సర్పంచ్‌పై దాడి
- బ్లేడుతో గొంతు కోస్తామని బెదిరింపులు
- రక్షణ కల్పించాలంటున్న పలుకూరు సర్పంచ్

సర్పంచ్ వి.శ్రీను

కందుకూరు రూరల్: రాష్ట్రవ్యాప్తంగా పేకాట రాయుళ్లు పేట్రేగిపోతున్నారు. ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గంలో ఓ సర్పంచ్‌పై పేకాట నిర్వాహకులు దాడికి తెగబడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. పలుకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ఓ బడ్డీ కొట్టు నిర్వాహకుడి ఆధ్వర్యంలో స్థానిక పొలాలు, కుంటల సమీపంలో నిత్యం పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. పేకాట శిబిరానికి వచ్చేవారికి పి.జయరాం అనే వ్యక్తి అవసరమైన సరంజామా ఏర్పాటు చేస్తుంటాడు. ఈ క్రమంలో పోలీసులు ఇటీవల పేకాట నిర్వాహకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు. ఆదివారం ఉదయం పేకాట నిర్వాహకుడికి చెందిన బడ్డీ కొట్టు వద్ద సర్పంచ్ వి.శ్రీనుకు జయరాంతో మాటామాట పెరిగి గొడవకు దారి తీసింది. పేకాట నిర్వహణపై పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటావని అనుమానిస్తూ సర్పంచ్‌పై దాడికి దిగాడు. దాడిలో సర్పంచ్‌కు గాయాలయ్యాయి. బ్లేడ్లతో గొంతు కోసి చంపుతామని బెదిరిస్తున్నారని పోలీసులు తనకు రక్షణ కల్పించాలని సర్పంచ్ కోరుతున్నారు. టీడీపీకి చెందిన కొందరు కుట్రతోనే రెచ్చగొట్టి తనపై దాడికి ఉసిగొల్పారని సర్పంచ్ వాపోయారు. అయితే నిర్వాహకులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో పలుకూరులో పేకాట జోరుగా సాగుతోంది. గ్రామంలో రోజూ రూ.లక్షల్లో ఆట జరుగుతుండడంతో పేకాట నిర్వాహకుడితో పాటు స్థానిక నేతలకు భారీగా కమీషన్ ముడుతున్నట్లు సమాచారం.

బాబూ బోర్డు తిప్పేశారు

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామన్న హామీని తప్పిన చంద్రబాబు

ఆందోళన కార్యక్రమాలకూ స్పందించని వైనం

నేటి నుంచి విజయవాడలో బాధితుల నిరాహార దీక్ష

నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: హామీలతో నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, తమను ఆదుకునే చర్యలు చేపట్టకపోవడంతో అగ్రిగోల్డ్ బాధితులు మరోసారి ఆందోళన బాట పట్టారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో బాధితులకు అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు అమ్మి సొమ్ము చెల్లిస్తామనే హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడంతో బాధితులు మహా విజ్ఞాపన దినం, కన్నీటి పాదయాత్ర, అగ్రిగోల్డ్ ఆవేదన దీక్ష వంటి ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. అయినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మరోసారి ఉద్యమ కార్యాచరణ చేపట్టారు. తొమ్మిది ప్రధాన డిమాండ్లపై ఇప్పటికే రాష్ట్ర హోంమంత్రి అనితతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈ నెల 2వ తేదీ నుంచి మరోసారి విజయవాడ ధర్నా చౌక్‌లో నిరాహార దీక్షలు చేపట్టి తాజా ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు అగ్రిగోల్డ్ బాధిత సంఘం ప్రకటించింది. 4వ తేదీ వరకూ రిలే నిరాహార దీక్షాలు చేపట్టి, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే 5వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని ఆదివారం విజయవాడలో జరిగిన మీడియా సమావేశంలో ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, దానికి తోడు ప్రభుత్వం అలసత్వం, మోసపూరిత విధానాలను ఈ సందర్భంగా నిరసించారు.

హామీ ఇచ్చి ఆదుకున్న జగన్

2019 ముందు అధికారంలో ఉన్న చంద్రబాబు అగ్రిగోల్డ్ బాధితుల వేదనను పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు సాగాయి. అప్పట్లో వారిని కలిసి సంఘీభావం తెలిపిన వైఎస్ జగన్, బాధితుల పక్షాన పోరాడేందుకు ప్రస్తుత ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ అగ్రిగోల్డ్ బాధితుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. బాధితులకు అండగా అనేక ఆందోళనల్లో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొని మద్దతు పలికారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి చంద్రబాబుకు మనస్సు రాకపోతే తాను అధికారంలోకి వచ్చాక రూ.20వేల లోపు డిపాజిట్లు చెల్లించి ఆదుకుంటామని అప్పట్లో జగన్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10వేలు, రూ.20వేలు చొప్పున డిపాజిట్లు ఉన్న 10.40లక్షల మందికి రెండు విడతల్లో మొత్తం రూ.905.57 కోట్లు చెల్లించి జగన్ ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్ జగన్ తరహాలో మిగిలిన బాధితులను ఆదుకుని ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని చంద్రబాబుకు అగ్రిగోల్డ్ బాధితులు అల్టిమేటం ఇచ్చారు.

ఇరాన్‌పై దాడులను భారత్ ఖండించాలి

ఏపీ రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్

సాక్షి, అమరావతి: ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులను భారత ప్రభుత్వం తక్షణమే బహిరంగంగా ఖండించాలని ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాలు డిమాండ్ చేశాయి. అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కి ఇరాన్ సుప్రీం మరణానికి కారణమైన ఈ దాడులు ప్రపంచ శాంతికి విఘాతమని ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులు కేవీవీ ప్రసాద్, పీ.జమలయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయెల్‌తో కుదుర్చుకున్న రక్షణ, వాణిజ్య ఒప్పందాల వల్ల భారతదేశం తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కోల్పోతోందన్నారు. ఇరాన్‌పై దుర్మార్గంగా దాడి చేసి దేశ సుప్రీంను వారి కుటుంబ సభ్యులతో పాటు అనేక మంది ప్రజలు, పసిపిల్లల ప్రాణాలను బలితీసుకున్న అమెరికా, ఇజ్రాయిల్ దాష్టీకాన్ని భారత ప్రభుత్వం ఖండించక పోవడం దుర్మార్గమన్నారు. నేడు మనం మౌనంగా ఉంటే రేపు 'వ్యూహాత్మక భాగస్వామ్యం' పేరిట భారతీయ యువతను అమెరికన్ యుద్ధాలలో చనిపోవడానికి పంపిస్తారని హెచ్చరించారు.

ఆదివారం ఇజ్రాయెల్, అమెరికా బాంబు దాడులతో దద్దరిల్లుతున్న టెహ్రాన్

ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో భవనంపై క్షిపణి దాడి దృశ్యం

టెల్ అవీవ్‌లో ఇరాన్ క్షిపణి పడటంతో ఏర్పడిన భారీ గొయ్యి

ఇరాన్ క్షిపణి దాడితో షార్జా పారిశ్రామికవాడ నుంచి వెలువడుతున్న పొగ

చర్చించుకుందాం

- అమెరికాకు ఇరాన్ పిలుపు
- తర్వాత చూద్దాం: ట్రంప్
- సైనిక చర్య ఆగదన్న అధ్యక్షుడు

దుబాయ్: భారీ ఘర్షణల నేపథ్యంలో ఇరాన్ నూతన నాయకత్వం చర్చల వైపు మొగ్గుచూపింది. అమెరికాతో చర్చలకు తాము సిద్ధమని ఆదివారం ప్రకటించింది. ఇరాన్ అధికార వర్గాలను ఉటంకిస్తూ వైట్‌హౌస్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు ఈ మేరకు వెల్లడించారు. ఈ విషయాన్ని వెంటనే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు. అయితే "అంతిమంగా చర్చలకు నేను సుముఖమే. కానీ ఇప్పటికైతే ఇరాన్‌పై సైనిక చర్య నిర్విరోధంగా కొనసాగుతుంది" అని ట్రంప్ స్పష్టం చేశారన్నారు. ఇరాన్ తరఫున చర్చల ప్రతిపాదన చేసిందెవరో మాత్రం సదరు అధికారి వెల్లడించలేదు. ఇరాన్ నూతన నాయకత్వంతో తాను త్వరలో మాట్లాడతానని ట్రంప్ ఆదివారం అట్లాంటిక్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరానే ఈ మేరకు ప్రతిపాదించిందన్నారు.

ఒమన్ తీరంలో... ఆయిల్ ట్యాంకర్‌పై దాడి

సిబ్బందిలో 15 మంది భారతీయులు

మస్కట్: ఒమన్ తీరానికి సమీపంలో ఓ చమురు ట్యాంకర్‌పై ఆదివారం దాడి జరిగింది. ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడినట్టు ఒమన్ అధికారులు తెలిపారు. ఓడలోని మొత్తం 20 మంది సిబ్బందిలో 15 మంది భారతీయులు కాగా, ఐదుగురు ఇరానియన్లు. ముసందమ్ ప్రాంతంలోని ఖసబ్ పోర్టుకు 5 నాటికల్ మైళ్ల దూరంలో పలావ్‌లో రిజిస్టరైన స్కైలైట్ అనే చమురు ట్యాంకర్‌పై దాడి జరిగినట్టు ఒమన్ తెలిపింది. దాని అనంతరం ఆ ఓడలోని సిబ్బందిని ఖాళీ చేయించినట్టు వెల్లడించింది. ఇరాన్ చమురును దొంగచాటుగా తరలిస్తోందంటూ ఈ ట్యాంకర్‌పై అమెరికా ఆంక్షలు విధించినట్టు తెలిపింది. ట్యాంకర్‌పై జరిగిన దాడికి సంబంధించిన ఇతర వివరాలను ఒమన్ వెల్లడించలేదు. స్కైలైట్ నుంచి దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి.

నిప్పుల వర్షం

పశ్చిమాసియాలో పూర్తిస్థాయి యుద్ధ పరిస్థితులు

- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై విరుచుకుపడిన ఇరాన్
- గల్ఫ్ దేశాల్లోని 27 అమెరికా స్థావరాలపై దాడులు
- ఇజ్రాయెల్‌లో 8 మంది మృతి, 28 మందికి గాయాలు
- ముగ్గురు అమెరికా జవాన్లు బలి, ఐదుగురికి గాయాలు
- ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించిన అమెరికా, ఇజ్రాయెల్
- వందలాది మంది మరణించారని ప్రకటించిన ఇరాన్

టెహ్రాన్/దుబాయ్/జెరూసలేం: ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులకుతోడు తమ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య పట్ల ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది. ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా నిప్పుల వర్షం కురిపిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం దాకా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని పలు ప్రాంతాలపై క్షిపణులు ప్రయోగించింది. దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ప్రఖ్యాత బుర్జ్ అల్ అరబ్ హోటల్‌తో పాటు పలు ప్రాంతాలపై దాడులకు దిగింది. డ్రోన్ దాడిలో హోటల్‌లో స్వల్పంగా మంటలు చెలరేగాయని, వెంటనే ఆర్పేశామని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని దుబాయ్ ప్రభుత్వం ప్రకటించింది. జెబెల్ అలీ ఓడరేవులోని ఓ బెర్త్‌లో మంటలు వ్యాపించినట్టు తెలిపింది. ఇరాన్ దాడుల్లో మొత్తం నలుగురు గాయపడినట్టు వెల్లడించింది. వారికి తక్షణం వైద్య చికిత్స అందించామని పేర్కొంది. యూఏఈలో శనివారం రాత్రంతా సైరన్ల మోత వినిపించింది. పవిత్ర రంజాన్ మాసం కావడంతో జనం రాత్రి మేల్కొనే ఉన్నారు. అబుదాబీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుపై జరిగిన దాడిలో ఒకరు మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. అయితే, ఈ దాడిని అబుదాబీ ప్రభుత్వం ఇంకా ధ్రువీకరించలేదు. దోహాలో డజనుకు పైగా పేలుళ్లు సంభవించాయి. అమెరికా నౌకలకు మందుగుండు సరఫరా చేసే నౌకపైనా ఇరాన్ దాడి చేసింది. శనివారం బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో మృతుల సంఖ్య 185కు పెరిగినట్టు ఇరాన్ తెలిపింది.

ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ధ్వంసం

మరోవైపు యూఏఈ సైన్యం ఎదురు దాడికి దిగుతోంది. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులను, డ్రోన్లను నేలమట్టం చేస్తోంది. 165 బాలిస్టిక్ క్షిపణులు, 541 డ్రోన్లను కూల్చివేసినట్టు యూఏఈ రక్షణ శాఖ ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థ చురుగ్గా పని చేస్తున్నట్టు వెల్లడించింది. దుబాయ్ పేలుళ్లతో దద్దరిల్లింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, నౌకాశ్రయం కూడా బాంబు దాడుల్లో దెబ్బ తిన్నాయి. అబుదాబీలో పాఠశాలలను మంగళవారం దాకా మూసివేస్తూ ఆదేశాలిచ్చారు. ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియా అంతటా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో విమానాలు రద్దవుతున్నాయి. దాంతో ఎయిర్‌పోర్టుల్లో జనం పడిగాపులు కాస్తున్నారు. ఇరాన్ దాడుల్లో ఇప్పటిదాకా ముగ్గురు అమెరికా సైనికులు మరణించారని, 58 మంది గాయపడ్డారని ఆ దేశ రక్షణ శాఖ వెల్లడించింది. కువైట్‌పై ఇరాన్ ఇప్పటి వరకు 97 బాలిస్టిక్ క్షిపణులు, 283 డ్రోన్లు ప్రయోగించింది. ముగ్గురు కువైట్ సైనికులు గాయపడ్డారు. ఇరాన్‌కు చెందిన 49 డ్రోన్లను మధ్యలోనే అడ్డుకున్నామని జోర్డాన్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను విజయవంతంగా నిర్వీర్యం చేసినట్టు బహ్రెయిన్, ఖతార్ సైతం తెలియజేశాయి.

ప్రార్థనా మందిరంపై ఇరాన్ దాడి

ఇజ్రాయెల్‌పై ఇరాన్ వైమానిక దాడులు ఆదివారం సైతం కొనసాగాయి. ముఖ్యంగా సెంట్రల్ ఇజ్రాయెల్, అక్కడి రక్షణ రంగ సంస్థలు తదితరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. డజన్ల సంఖ్యలో రాకెట్లు ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లోని బెయిత్ షెమేష్‌లోని ఓ ప్రార్థనా మందిరంపై ఇరాన్ సైన్యం క్షిపణిని ప్రయోగించడంతో కనీసం ఎనిమిది మరణించారు. నాలుగేళ్ల బాలుడు సహా 28 మందికి పైగా గాయపడ్డారు. జెరూసలేంకు 35 కిలో మీటర్ల దూరంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. దీంతో ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో మరణాల సంఖ్య 10కి చేరుకుంది. క్షతగాత్రుల సంఖ్య 120కి చేరింది. అలాగే ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో పదుల సంఖ్యలో నివాస గృహాలు దెబ్బతిన్నాయి. పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు ఆగడం లేదు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతర్ తదితర దేశాల్లోని 27 సైనిక స్థావరాలపై దాడులు చేసినట్టు ఇరాన్ పేర్కొంది. ఇరాన్ దాడుల్లో అమెరికా సైన్యానికి ప్రాణనష్టం వాటిల్లుతోంది. ముగ్గురు జవాన్లు మరణించగా, ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు అమెరికా మిలటరీ ప్రకటించింది. మరోవైపు కల్లోలిత పశ్చిమాసియాలోని తమ పౌరులను స్వదేశానికి తరలించడానికి ఇతర దేశాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

టెహ్రాన్‌లో పేలుళ్ల మోత

అమెరికా–ఇజ్రాయెల్ సైన్యాలు ఇరాన్‌పై దాడులు ఉధృతం చేశాయి. ఆదివారం తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డాయి. రాజధాని టెహ్రాన్‌లో పెద్ద ఎత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. నగరంలో ఎక్కడ చూసినా బాంబుల మోతలే విన్పించాయి. పేలుళ్ల నుంచి పెద్ద ఎత్తున వెలువడుతున్న పొగలు సుదూరాల దాకా వ్యాపిస్తున్నాయి. ఇరాన్ గుండెకాయపై దాడి చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్‌పై దాడులు ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ తేల్చిచెప్పారు. ఇరాన్‌లోని పలు ఇతర నగరాలపై కూడా దాడులు తీవ్రస్థాయిలో కొనసాగాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో దేశవ్యాప్తంగా కొన్ని వందల మంది మరణించినట్టు ఇరాన్ పేర్కొంది. పలు నగరాల్లో భవన శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి.

ప్రతీకారం తప్పదు: ఇరాన్

ఖమేనీని పొట్టనపెట్టుకున్న శత్రువులను ప్రాణాలతో విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చిచెప్పింది. శత్రువులు రెడ్ లైన్ దాటేశారని, అందుకు వారు మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ పార్లమెంటరీ అధికార ప్రతినిధి మొహమ్మద్ బాఘర్ ఖాలిబాఫ్ ఆదివారం స్పష్టం చేశారు. ఈసారి కోలుకోలేని విధంగా గట్టిగా దెబ్బకొడతామని, ఖమేనీ మృతికి తప్పనిసరిగా ప్రతీకారం తీర్చుకుంటామని అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు.

9 యుద్ధ నౌకల్ని ముంచేశాం: ట్రంప్

ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్ చేసిన హెచ్చరికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొట్టిపారేశారు. తమపై ఎదురుదాడి ఆలోచన వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. ప్రతిదాడులకు దిగితే గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో బుద్ధి చెప్తామన్నారు. అమెరికా వైపు కన్నెత్తి చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఆదివారం 9 ఇరాన్ యుద్ధ నౌకల్ని ముంచేసినట్టు అధ్యక్షుడు వెల్లడించారు. నేవీ ప్రధాన కార్యాలయాన్నీ తీవ్రంగా దెబ్బ తీశామని చెప్పారు.

ఓ శకం ముగిసింది

విప్లవకారుడి నుంచి 'సుప్రీం' శక్తి దాకా ఎదిగిన ఖమేనీ

1981లో సైనిక దుస్తుల్లో ఖమేనీ (ఫైల్)

సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణంతో ఇరాన్‌లో ఓ శకం ముగిసింది. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌ను మత రాజ్యంగా రూపాంతరం చేసేందుకు ఆయన అవిశ్రాంతంగా శ్రమించి విజయం సాధించారు. ఇరాన్ పరిపాలన, సాయుధ వ్యవస్థలకు మూడున్నర దశాబ్దాలకుపైగా ఖమేనీ మాటే శాసనం. పశ్చిమాసియాలో మత కేంద్రంగా ఇరాన్‌ను సమున్నత స్థాయికి చేర్చాలనే పట్టుదలతో సంస్కరణవాదులను అణచివేస్తూ దేశాన్ని ఏకఛత్రంగా ఏలుతూ అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాలకు ఆయన కొరకరాని కొయ్యలా మారారు. దశాబ్దాలుగా ఇరాన్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకోవాలని అహర్నిశలు శ్రమిస్తున్న అమెరికాను ఎన్నోసార్లు దీటుగా ఎదుర్కొన్నారు. ఇస్లామిక్ విప్లవంలో చురుకైన విప్లవకారుడి నుంచి తిరుగులేని పాలకుని దాకా సాగిన ప్రస్థానం ఖమేనీది...

పహ్లావీ శకం ముగిశాక...

ఖమేనీ నగరం నుంచి వచ్చి మష్హాద్ సిటీలో స్థిరపడిన అజర్‌బైజాన్ టర్క్ వర్గానికి చెందిన దంపతులకు 1939 ఏప్రిల్ 19వ తేదీన ఖమేనీ జన్మించారు. ఎనిమిది మంది సంతానంలో రెండోవాడు. నాలుగో షియా ఇమామ్ అలీ అల్ సజ్జాద్‌కు ఖమేనీలు వారసులు. పాఠశాల విద్యకాలంలోనే ఆయన ఖురాన్‌ను లోతుగా చదివారు. యుక్తవయసులోనే పర్షియన్‌లో కవితలు రాసేవారు. కచ్చితమైన సమయానికి ప్రార్థనలు చేయాల్సిందేననే పట్టుదలతో ఓసారి వెళ్తున్న రైలు నుంచి దూకేసి మరీ మసీదుకు పరుగెత్తారట! మొహమ్మద్ రెజా పహ్లావీ రాజరిక పాలనలో విప్లవకారునిగా మారారు. ఆరుసార్లు అరెస్టయ్యారు. మూడేళ్లు దేశ బహిష్కరణను ఎదుర్కొన్నారు. నాటి ఇరాన్ అధ్యక్షుడు అక్బర్ హషేమీ రఫ్ సంజామీకి కుడిభుజంగా మారారు. 1980లో టెహ్రాన్ శుక్రవారం ప్రార్థనల ఇమామ్‌గా ఎంపికయ్యారు. 1981లో ఖమేనీని టేక్ రికార్డర్ బాంబుతో చంపేందుకు ముజాహిదీన్–ఇ–ఖల్ఫ్ వర్గం విఫలయత్నం చేసింది. ఆ పేలుడులో కుడి భుజం దెబ్బ తిని కుడిచేయి చచ్చుబడిపోయింది. స్వరపేటిక తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1981లో ఎన్నికల్లోఘనవిజయంతో ఖమేనీ తొలిసారి ఇరాన్ అధ్యక్షుడయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక శక్తులను ఉక్కుపాదంతో అణచివేసి కీలక నేతగా ఎదిగారు. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించిన అయతొల్లా రుహొల్లా ఖొమేనీకి కుడిభుజంగా మారారు. ఆయన 1989లో చనిపోయాక ఖమేనీ 'గ్రాండ్ అయతొల్లా' హోదా పొందారు. 1989 జూన్ 4న ఇరాన్ సుప్రీం లీడర్‌గా అవతరించారు. ఇరాక్‌తో యుద్ధం తర్వాత ప్రభుత్వంపై పట్టుసాధించారు. 36 ఏళ్లుగా ఇరాన్‌లో ఆయనే మాటే శాసనంగా సాగుతోంది. ఇరాన్ సాయుధ బలగాలకు కూడా ఆయనే కమాండర్ ఇన్ చీఫ్. గార్డియన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, అది సూచించేవారే పార్లమెంట్ అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేలా నిబంధనలు తెచ్చారు. షియా మతబోధకులకు ప్రభుత్వంలో కీలక పదవులు కట్టబెట్టారు. చీఫ్ జస్టిస్ సహా దేశంలోని అన్ని వ్యవస్థలపైనా పట్టు నిలుపుకున్నారు. బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే రెవల్యూషనరీ గార్డ్ విభాగం సైతం ఖమేనీ కనుసన్నల్లోనే పనిచేస్తుంది. రెవల్యూషనరీ గార్డ్ విభాగానికి సొంతంగా వ్యాపారం చేసుకునే అధికారం సైతం కట్టబెట్టారు. అలా అది అత్యంత శక్తివంతమైన సాయుధ వ్యవస్థగా ఎదిగింది.

పరోక్ష దళాల సృష్టికర్త

పశ్చిమాసియాలో ఇస్లాం మత ప్రభావాన్ని పెంచేందుకు పొరుగు దేశాల్లో పరోక్ష దళాలను ఖమేనీ ఏర్పాటు చేశారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ ఆవిర్భావానికి కృషి చేశారు. 2000లో దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనుతిరిగేలా చేశారు. 2006లో జరిగిన యుద్ధంలోనూ పాక్షిక విజయం సాధించారు. యెమెన్‌లో హూతీ రెబల్స్‌కు సాయపడ్డారు. పాలస్తీనాలో హమాస్‌కు ఖమేనీ అండదండలు దండిగా ఉండేవి.

ఇరాన్ తాత్కాలిక... సుప్రీం లీడర్‌గా అరాఫీ

త్వరలో శాశ్వత సుప్రీం లీడర్ ఎంపిక • రంగంలోకి 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'



దుబాయ్: అయతొల్లా అలీ ఖమేనీ హఠాన్మరణం నేపథ్యంలో ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన సీనియర్ మతబోధకునిగా సేవలందిస్తున్నారు. ఇరాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 ప్రకారం తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల 'గార్డియన్ కౌన్సిల్' దేశ పరిపాలన బాధ్యతలు తీసుకున్నట్టు ఇరాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే ఈ గార్డియన్ కౌన్సిల్‌లో దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, దేశ చీఫ్ జస్టిస్ గోలమ్ హుస్సేన్ మొహసేనీ ఎజేయీ, అలీ రెజా అరాఫీ ఉన్నారు. వారు సమష్టిగా దేశ పరిపాలనా బాధ్యతలు తాత్కాలికంగా నిర్వర్తిస్తారు. దీంతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత పరిపాలనా పగ్గాలు ఖమేనీ నుంచి గార్డియన్ కౌన్సిల్‌కు వచ్చినట్లయింది. ఇరాన్ రాజ్యాంగబద్ధ పర్యవేక్షక విభాగంగా గార్డియన్ కౌన్సిల్‌కు పేరుంది. త్వరలోనే శాశ్వత సుప్రీం నేతను ఎన్నుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆదివారం వెల్లడించారు. గార్డియన్ కౌన్సిల్ ఇప్పటికే తన పాలనను ఆరంభించిందని అధ్యక్షుడు పెజెష్కియాన్ చెప్పారు.

ఎవరీ అరాఫీ?

యాజ్ద్ ప్రావిన్స్‌లోని మేబోద్ పట్టణంలో 1959లో మతబోధకుల కుటుంబంలో అయతొల్లా అలీ రెజా అరాఫీ జన్మించారు. ఖ్వామ్ నగరంలో మతసంబంధ అంశాలను నేర్చుకున్నారు. తర్వాత సొంతంగా ఇస్లామిక్ చట్టాల ప్రకారం తీర్పులిచ్చే 'ముజ్తహీద్' స్థాయికి ఎదిగారు. అల్–ముస్తఫా అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి సారథ్యంవహించారు. అరాఫీ ప్రస్తుతం ఇరాన్ సీనియర్ మతబోధకుల్లో కీలకమైన వ్యక్తిగా కొనసాగుతున్నారు. 67 ఏళ్ల అరాఫీ గతంలో పలు కీలక పదవులను నిర్వర్తించారు. ఇస్లాం మతసంబంధ విద్యాసంస్థల నెట్‌వర్క్‌కు సారథిగా ఉన్నారు. మతబోధకుల కూటమి అయిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'లో సభ్యునిగా ఉన్నారు. ఈ కూటమిలో 88 మంది సభ్యులుంటారు. అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్‌లో ఒక్కో మతబోధకుని పదవీకాలం గరిష్ఠంగా ఎనిమిదేళ్లు ఉంటుంది. అరాఫీని దివంగత ఖమేనీ 2019లో గార్డియన్ కౌన్సిల్‌కు ఎంపిక చేశారు. గార్డియన్ కౌన్సిల్ సభ్యునిగా ఉండటం ద్వారా త్వరలో జరిగే శాశ్వత సుప్రీంలీడర్ అభ్యర్థుల్లోనూ అరాఫీ పేరు ఉండే ఆస్కారముంది. అటు మతబోధకునిగా ఉంటూనే పరిపాలనా అనుభవం గడించిన కారణంగా శాశ్వత సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఈయనకే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది.

సుప్రీం నేత రేసులో ఎవరు?

88 మంది సభ్యులున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఎవరిని శాశ్వత సుప్రీం లీడర్‌గా ఎన్నుకుంటుందన్న ఉత్కంఠ సగటు ఇరానియన్లలో నెలకొంది. దీంతో ఐదుగురు బలమైన అభ్యర్థుల పేర్లు తెరమీదకొచ్చాయి.

- **హొజతొల్ ఇస్లాం మొహసెన్ ఖ్వామీ:** ఖమేనీకి సీనియర్ సలహాదారుగా పనిచేశారు. ఖమేనీ అంతర్గత నెట్‌వర్క్‌తో సత్సంబంధాలున్న కారణంగా ఈయనగనక సుప్రీంనేత అయితే మతబోధకుల ఆధిపత్యాన్ని ఇక మీదట సైతం ఈయన ద్వారా కొనసాగించే వీలుందని వార్తలొచ్చాయి.
- **అలీరెజా అరాఫీ:** అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్‌లో, గార్డియన్ కౌన్సిల్‌లో సభ్యునిగా ఉన్నా రు. ఇరాన్‌లో ఇస్లాం విద్యావ్యవస్థ అయిన సెమీనరీలకు సారథ్యంవహిస్తున్నారు. మతబోధకుల వర్గాల్లో ఈయనకు మంచి పేరుంది.
- **అయతొల్లా మొహసెన్ అరాకీ:** అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్‌లో చాన్నాళ్లుగా సభ్యునిగా సేవలందిస్తున్నారు. సంప్రదాయవాదుల్లో ఈయనకు మంచి పలుకుబడి ఉంది. దీంతో అరాఫీకి ఆయన గట్టిపోటీ ఇవ్వొచ్చని భావిస్తున్నారు.
- **గోలమ్ హుస్సేన్:** ప్రస్తుతం దేశ న్యాయవ్యవస్థ చీఫ్‌గా, చీఫ్ జస్టిస్‌గా కొనసాగుతున్నారు. గతంలో నిఘా విభాగ అధికారిగా పనిచేశారు.
- **హాసీమ్ బుషేరీ:** ఖ్వామ్ నగరంలో అత్యంత పవిత్రమైన 'శుక్రవారం ప్రార్థనల ఇమామ్'గా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్‌లో సభ్యునిగా సేవలందిస్తున్నారు.

ఖమేనీ అంతానికి... ఎందుకంత పంతం?

సుప్రీం నేతతో అమెరికాది దశాబ్దాల వైరం

ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీతో అమెరికా వైరం దశాబ్దాల నాటిది. దీని మూలాలు ఇరాన్‌లో అపార చమురు నిక్షేపాల్లో దాగున్నాయి. 1950వ దశకంలో ఇరాన్ ప్రధాని మొహమ్మద్ మొసాదేగ్‌ను బ్రిటన్, అమెరికాలు 'ఆపరేషన్ బూట్' పేరుతో జరిగిన సైనిక తిరుగుబాటుతో గద్దె దించాయి. అంతకుముందు వరకు దశాబ్దాలు పరిపాలించిన రాజు మొహమ్మద్ రెజా పహ్లావీని మళ్లీ గద్దెనెక్కించాయి. కానీ అనూహ్యంగా కొంతకాలానికే రుహొల్లా మూసావీ ఖొమేనీ సారథ్యంలో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తలెత్తింది. అనంతరం ఆయన మరణంతో అధికార పగ్గాలు ఖమేనీ చేతికొచ్చాయి. నాటినుంచీ అమెరికాకు ఆయన కొరకరాని కొయ్యగా తయారయ్యారు. పశ్చిమాసియాపై పెత్తనం చేయడానికి అమెరికా చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఖమేనీ తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. పశ్చిమాసియాను అమెరికాకు వ్యతిరేక శక్తిగా మార్చేందుకు అవిశ్రాంతంగా కృషిచేశారు. అమెరికా కుయుక్తులను తన రాజకీయ చాణిక్యంతో తుత్తునియలు చేశారు. ఇరాన్‌కు తోడుగా పాలస్తీనా భూభాగంలో హమాస్‌ను, యెమెన్‌లో హూతీలను, లెబనాన్‌లో హెజ్‌బొల్లా ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ తన ఆధిపత్యాన్ని బలపర్చుకున్నారు. దాంతో ఖమేనీ ఆధిపత్యానికి గండికొట్టేందుకు అమెరికా శతథా ప్రయత్నించింది. ఇరాన్‌లో నిఘాను పెంచి సైబర్ దాడులు చేయించి, సున్నీలను రెచ్చగొట్టి తిరుగుబాటు లేవదీసి... ఇలా పలు రకాలుగా ప్రయత్నించి విఫలమైంది. ఖమేనీ పాలనకు చరమగీతం పాడేందుకు అమెరికా ఎన్నోసార్లు కోవర్ట్ ఆపరేషన్లు కూడా చేసింది. వాటికి సంబంధించిన ఆధారాలు లభించిన ప్రతిసారీ తనకేం సంబంధం లేదని బుకాయించింది. ఇస్లామిక్ విప్లవం వేళ 1979లో టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై విప్లవకారులు దాడిచేసి పలువురు దౌత్యవేత్తలు, సిబ్బందిని బంధించారు. వాళ్లను విడిపించేందుకు అమెరికా విశ్వప్రయత్నంచేసింది. ఆ విప్లవం తర్వాత ఇరాన్‌లో ఏర్పడిన మత రాజ్యాన్ని అస్థిరపరిచేందుకు అమెరికా స్థానిక తిరుగుబాటుదారులకు సాయపడింది. ముజాహిదీన్–ఇ–ఖల్ఫ్ (ఎంఈకే)కు ఆర్థికసాయం చేసింది. సున్నీ ఉగ్రవాద సంస్థ జున్‌దుల్లాకు

ఖమేనీ

అండదండలు అందించింది. ఇరాన్ ప్రభుత్వ నేతలు, కార్యాలయాలపై దాడులకు ఉసిగొల్పింది. మతపాలకుల పరువు పోగొట్టేందుకు పుకార్లను షికార్లు చేయించేది. అబద్ధాలను విస్తృతంగా ప్రచారం చేయించేది. ఇరాన్‌లో సైబర్, నిఘా ఆపరేషన్లనూ విస్తృతపరిచింది. అణు పరిశోధనలు కొనసాగకుండా తరచూ ఆటంకపరిచేది. ఈ విషయంలో అమెరికాకు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్ సైతం తన వంతు సాయం చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

తిరుగుబాట్లతో తలనొప్పులు

దమనకాండకు వ్యతిరేకంగా 2022లో ఇరాన్‌లో తలెత్తిన దేశవ్యాప్తంగా ఉద్యమం ఖమేనీ పాలనకు పెను సవాల్ విసిరింది. దాన్ని ఉక్కుపాదంతో అణచి మానహక్కులను కాలరాశారన్న అపవాదును ఖమేనీ మూటగట్టుకున్నారు. తాజాగా 2025 డిసెంబర్‌లో ఖమేనీని వ్యతిరేకంగా ఇరాన్‌లో వెల్లువెత్తిన ఆందోళనలు కూడా ప్రపంచమంతటా చర్చనీయంగా మారాయి. అణ్వస్త్రాలను సామూహిక మానవ హననాలుగా ఛీత్కరించే ఖమేనీ, లోలోపల మాత్రం అణుబాంబుపై మక్కువ పెంచుకున్నారని అమెరికా దశాబ్దాలుగా ఆరోపిస్తోంది. రహస్య ప్రాజెక్టుతో యురేనియం నిల్వలను పెంచుకుంటున్నారనే ఆగ్రహంతో ఖమేనీపై అమెరికా, ఇజ్రాయెల్‌లు కత్తులు నూరాయి. చివరికి అదే ఖమేనీ అంతానికి దారితీసింది. ఖమేనీకి అన్ని రకాలా సాయపడే సైనిక జనరల్స్, ముఖ్య నేతలను అంతమొందిస్తూ అమెరికా చివరకు ఆయనను ఏకాకిని చేసింది. గత జూన్‌లో ఇజ్రాయెల్ '12 రోజుల యుద్ధం' సందర్భంగా ఇరాన్ అణు స్థావరాలను అమెరికా బాంబు దాడులతో తుత్తునియలు చేసింది. ఆ తర్వాత ఇరు దేశాల నడుమ పలు దఫాలుగా చర్చలు జరుగుతున్నా ఇప్పటిదాకా పెద్దగా ఫలితం ఆలోపే ఇజ్రాయెల్, అమెరికా మెరుపు దాడులతో శనివారం ఖమేనీతో పాటు పలువురు సైనిక, పౌర అగ్ర నేతలను అంతం చేశాయి.

ఖమేనీ మూలాలు భారత్‌లో!

ఖమేనీ మూలాలు భారత్‌లోనే ఉన్నట్టు ఇరాన్ చరిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. షియా వర్గానికి చెందిన ఖమేనీ వంశస్థుడు సయ్యద్ అహ్మద్ మూసావీ 18వ శతాబ్దంలో ఇరాన్ నుంచి భారత్ వలస వచ్చారు. యూపీలో షియా జనాభా అత్యధికంగా ఉండే బారాబంకీ జిల్లాలోని కింటూర్ అనే గ్రామంలో స్థిరపడ్డారు. అక్కడ షియా మత బోధకుడిగా పేరుపొందాడు. తన పేరు చివర హిందీ అని కూడా తగిలించుకున్నారు. నేటికి ఇరాన్ చరిత్రకారుల గ్రంథాలు ఆయన పేరును సయ్యద్ అహ్మద్ మూసావీ హిందీ అనే పేర్కొంటారు. 1830లో ఆయన ఇరాన్‌లోని నజబ్ నగరానికి వెళ్లిపోయారు. తరవాత ఖమేనీ పట్టణంలో స్థిరపడ్డారు. ఖమేనీ తాతముత్తాతల బంధువుల ప్రభావంతోనే దక్షిణ భారతంలో, ముఖ్యంగా హైదరాబాద్, దక్కన్‌లో ఇరాన్ సంస్కృతి, సంప్రదాయాలు వర్ధిల్లినట్టు చెబుతారు. నాటి హైదరాబాద్ సంస్థానం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇరానీ కుటుంబాలు నేటికీ వందలాదిగా ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

కరాచీలో అమెరికా కాన్సులేట్ ముట్టడికి యత్నం

కాల్పుల్లో 21 మంది నిరసనకారులు మృతి

కరాచీ: అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ మృతిపై పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. కరాచీ నగరంలో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు తలెత్తాయి. ఖమేనీ మృతి విషయం తెలిసిన వెంటనే కరాచీలోని అమెరికా కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుపై పెద్ద సంఖ్యలో జనం గుమికూడారు. కాన్సులేట్‌ను ముట్టడించి గేట్లు బద్దలు కొట్టుకుని లోపలికి చొచ్చుకెళ్లేందుకు వారు ప్రయత్నించారు. కార్యాలయం అద్దాలను పగులగొట్టారు. అడ్డుకున్న పోలీసులతో బాహాబాహీకి దిగారు. దీంతో, పోలీసులు జరిపిన కాల్పుల్లో 21 మంది చనిపోగా మరో 30 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో నలుగురు పోలీసులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆందోళనకారులను అదుపు చేసేందుకు ముందుగా తాము రబ్బర్ బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించామని పోలీసులు చెప్పారు. పరిస్థితి చేయిదాటుతుండటంతో కాల్పులు జరపాల్సి వచ్చిందన్నారు. ఘటన నేపథ్యంలో తీర నగరమైన కరాచీలోని సున్నిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. కాన్సులేట్‌కు దారి తీసే అన్ని మార్గాలను మూసివేశారు. దేశ రాజధాని ఇస్లామాబాద్‌లోని అమెరికా కాన్సులేట్‌ను ముట్టడిస్తామంటూ తెహ్రీక్–ఇ–జఫారియా పార్టీ ప్రకటించడంతో కార్యాలయమున్న రెడ్ జోన్ ప్రాంతాన్ని మూసివేశారు.

డీఎంకే సర్కార్ అవినీతిమయం

పేదలు, రైతులు, యువతను దోచుకుంది: మోదీ

సాక్షి, చెన్నై/పుదుచ్చేరి: తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయంగా మారిపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. డీఎంకే మంత్రులు అవినీతిలో పరస్పరం పోటీ పడుతున్నారని విమర్శించారు. డీఎంకే సర్కారు అవినీతికి పాల్పడడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. పేదలు, రైతులు, యువతను దోచుకుందని ధ్వజమెత్తారు. ఈ అవినీతి ప్రభుత్వానికి ఇకపై అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ ఆదివారం తమిళనాడులో పర్యటించారు. రూ.4,400 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. అనంతరం మదురైలో బహిరంగ సభలో ప్రసంగించారు. అవినీతి, అసమర్థ పాలనతో తమిళనాడు ప్రజలు విసుగెత్తిపోయారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కచ్చతీవులను శ్రీలంకకు అప్పగించి తమిళనాడుపై కక్ష తీర్చుకుందన్నారు. తమకు అధికారం అప్పగిస్తే తమిళనాడును అత్యున్నత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఏఐఏడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి, ఏఎంఎంకే వ్యవస్థాపకుడు టీటీవీ దినకరన్, పీఎంకే నేత అన్బుమణి రాందాస్ సభలో పాల్గొన్నారు.

పుదుచ్చేరిని ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్

పుదుచ్చేరిని గతంలో ఢిల్లీలోని ఒక కుటుంబానికి ఏటీఎంగా కాంగ్రెస్ మార్చేసిందని మోదీ నిప్పులు చెరిగారు. ఆదివారం అక్కడ రూ.2,714 కోట్ల ప్రాజెక్టులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తర్వాత సభలో మాట్లాడారు. పుదుచ్చేరి అభివృద్ధికి ఆ కాంగ్రెస్, డీఎంకే స్పీడ్ బ్రేకర్‌గా మారాన్నారు. బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ డబుల్ ఇంజిన్ పాలనలో పుదుచ్చేరి ప్రగతి పథంలో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. మోదీ ఆదివారం తమిళనాడులో తిరుప్పరకుండ్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మోదీ దోతీ, కుర్తా ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణచేశారు. పూజల్లో పాల్గొన్నారు.

సాక్షి గుంటూరు

సోమవారం । 2 । మార్చి । 2026



కన్యక పరమేశ్వరికి పూజలు

దాచేపల్లి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నవమ వార్షికోత్సవ పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 539.20 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 10,322 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

చెన్నకేశవ బ్రహ్మోత్సవాలు



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న చెన్న కేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణ, పూజలతో వేడుకలను ఘనంగా ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రేపు శివాలయం మూసివేత

పెదకాకాని: శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాన్ని మార్చి 3వ తేదీన చంద్రగ్రహణం కారణంగా మూసివేయనున్నట్లు ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు. శివాలయంలో చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 నుంచి ఆలయం తలుపులు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 5.30 నుంచి 9 గంటలలోపు మాత్రమే భక్తులకు స్వామి వారి దర్శనం, అభిషేకాలు, వాహన పూజలు, రాహుకేతు పూజలు, ఇతర అన్ని ఆర్జిత సేవలకు అనుమతి ఉంటుందన్నారు. అన్నప్రసాదం నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. మార్చి 4న బుధవారం ఉదయం ఆలయ ప్రోక్షణ తర్వాత భక్తులకు ఉదయం 7 నుంచి స్వామివారి దర్శనం, ఇతర అన్ని ఆర్జిత సేవలకు యథావిధిగా అనుమతి ఉంటుందని తెలిపారు.

రేపు వైకుంఠపురాలయంలో ఆర్జిత సేవలు రద్దు

తెనాలి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 3వ తేదీన తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్ని ఆర్జిత సేవలను రద్దుచేసినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో వి.అనుపమ తెలియజేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 3వ తేదీన కేతుగ్రస్త గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం ఉందని గుర్తుచేశారు. ఆ రోజు ఉదయం స్వామి వారికి అర్చనాది కార్యక్రమాలను నిర్వహించి, బాలభోగం, మహానివేదన అనంతరం 8.15 గంటలకు దేవస్థానం తీర్మానం చేయనున్నట్టు చెప్పారు. తిరిగి 4వ తేదీ ఉదయం ఆరు గంటలకు యథావిధిగా దేవస్థానం తెరుస్తారు. దేవస్థానం ప్రాంగణం యావత్తూ శుద్ధి జరిపించి, 8 గంటల నుంచి పూజలు జరుగుతాయని వివరించారు. భక్తులు సహకరించాలని అనుపమ కోరారు.

ఆది పరాశక్తిగా బగళాముఖి

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో కొలువై ఉన్న బగళాముఖి అమ్మవారు ఆదివారం ఆదిపరాశక్తి అలంకరణలో పూజలు అందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో రావటంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

ఇద్దరు పిల్లలు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

రేపల్లె: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని మైనేనివారిపాలెం గ్రామానికి చెందిన చంద్రకళ తన భర్తతో గొడవల కారణంగా మనస్తాపానికి గురైంది. ఆదివారం రాత్రి పిల్లలతో కలిసి పెనుమూడి పులిగడ్డ వారధి వద్దకు చేరుకుంది. వారధిపై నిలబడి రోదిస్తూ కృష్ణా నదిలోకి దూకేందుకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆమెను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని తల్లి, పిల్లలను సురక్షితంగా స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

సచివాలయాల్లో నిత్య నరకం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జాబ్‌చార్ట్ ప్రకారం ఉద్యోగులు కార్యకలాపాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది రోజులపాటు సచివాలయ ఉద్యోగులకు ఎలాంటి పనులు అప్పగించలేదు. ఆ తర్వాత నుంచి క్షణం తీరిక లేకుండా పనులు అప్పగించి తీవ్ర మానసిక ఒత్తిడి పెంచుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ సర్వే జరిగినా అది సచివాలయ ఉద్యోగులే చేయాలనే దుస్థితి నెలకొంది.

మరణించిన సచివాలయ ఉద్యోగులకు నివాళులర్పిస్తూ తమపై పని ఒత్తిడి తగ్గించాలంటూ సచివాలయ ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ (ఫైల్)

- ప్రభుత్వ లక్ష్యాలు, అధికారుల వేధింపులతో తీవ్ర మానసిక క్షోభ
- రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ శాఖలోనే ఆకస్మిక మరణాలు
- ఏడేళ్లయినా దక్కని పదోన్నతులు
- సెలవు దినాల్లోనూ తప్పని విధులు

నెహ్రూనగర్: ఏపీ ఏకీకృత కుటుంబ సర్వే–2025, పీ–4 సర్వే (పేదరిక నిర్మూలన), అక్షరాంధ్ర, ఈకేవైసీ, పల్స్ సర్వే.. ఇలా ప్రతిదీ సచివాలయ ఉద్యోగుల నెత్తినే పడుతోంది. ఉదయం 6 గంటలకే పారిశుద్ధ్య పనుల పరిశీలన, పింఛన్ల పంపిణీకి వెళ్లాల్సి వస్తోంది. వీటితో పాటు ట్యాప్ కనెక్షన్లు, బాత్రూమ్ ఫొటోలు తీయడం, ఇళ్లకు స్టిక్కర్లు అంటించడం వంటి పనులు అప్పగిస్తున్నారు. వార్డు కార్యదర్శులకైతే సర్వేలతోపాటు ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలు విధించి, సమీక్షల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారు. ఓ వైపు సర్వేల ఒత్తిడి, మరో వైపు విధుల నిర్వహణతో సతమతమవుతున్నారు. ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలను అందిస్తున్నా చిన్నపాటి కారణాలు చూపిస్తూ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

రాజకీయ విమర్శలు

అధికార కూటమి నేతలు సచివాలయాలను 'దరిద్రాలయాలు' అని, ఉద్యోగులను 'ఎందుకూ పనికిరారు' అని దుర్భాషలాడిన సందర్భాలు ఉన్నాయి. కానీ తీరా చూస్తే ప్రభుత్వ ప్రచారాలకు, ప్రతి నెలా సర్వేలకు సచివాలయ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం వాడుకుంటోంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అని పేర్లు మార్చి ఉద్యోగుల విధులను మాత్రం అస్తవ్యస్తం చేసింది.

జిల్లాలో 568 సచివాలయాలు

ప్రజలకు ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను చేరువ చేసే ఉద్దేశంతో 2019 ఏడాదిలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 29 ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 543 రకాల ఈ– సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 568 సచివాలయాలు సేవలు అందిస్తున్నాయి. ఇందులో 5,563 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

అగమ్యగోచరం

గ్రామ, పట్టణ స్థాయిల్లో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి విరుద్ధంగా ఉన్నాయి. సంబంధం లేని పనులన్నీ సచివాలయ సిబ్బంది నెత్తిన రుద్దుతుండటంతో పనిభారంతో వారు అల్లాడిపోతున్నారు. ఒక వైపు గతంలో వలంటీర్లు చేసిన పనులు, మరో వైపు రోజుకో కొత్త సర్వేతో సిబ్బంది తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి మార్చుకోవాలని కోరారు.

ప్రాణాలు తీస్తున్న పని ఒత్తిడి

రాష్ట్రంలో 75 శాఖలు ఉండగా, అత్యధికంగా సచివాలయ శాఖలోనే ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయి. లక్ష్యాలు చేరుకోలేక, అధికారుల చీవాట్లు పడలేక కొందరు రాజీనామా చేస్తుంటే, మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ట్విట్టర్ క్యాంపెయిన్ ప్రకారం.. ఒత్తిడి తట్టుకోలేక సుమారు 40 మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఒక సమయంలో ఒకే పని ఇవ్వాలని, సీనియారిటీ జాబితా రూపొందించి ప్రశాంతంగా పనిచేసుకునే వాతావరణం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

విశ్రాంతి కూడా కరువు

సర్వీసుపరంగా ఏడో ఏట అడుగుపెడుతున్నా సచివాలయ ఉద్యోగులకు నేటికీ ఎలాంటి పదోన్నతులు లేవు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఇవ్వాలన్న డిమాండ్ నెరవేరలేదు. కనీసం సెలవు రోజుల్లో కూడా విశ్రాంతి లేకుండా పనులు పురమాయిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలు దాటిన తర్వాత కూడా డిప్యూటీ కమిషనర్లు, తహసీల్దార్లు గంటల తరబడి మీటింగులు పెడుతుండటంతో మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఏ ప్రభుత్వ శాఖలో లేని విధంగా వీరికి మాత్రమే బయోమెట్రిక్ హాజరును జీతాలతో ముడిపెట్టడం గమనార్హం.

న్యాయ విచారణ చేపట్టాలి

గడిచిన మూడు నెలల్లో సుమారు 40 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు మరణించారు. వీరిలో ఎక్కువ మంది 40 ఏళ్ల వయస్సు గలవారే. ఈ మరణాలకు కారణం తీవ్రమైన పని ఒత్తిడే. సచివాలయ శాఖలో సుమారు 15 వేల మందికిపైగా ఉద్యోగులు వివిధ శాఖలకు, అధికారుల వద్ద డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరందరి భారం మిగిలిన వారిపైనే పడి వారు తీవ్రమైన పని ఒత్తిడితో మరణిస్తున్నారు. సర్వేలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతోపాటు సచివాలయ ఉద్యోగుల మరణాలపై జ్యూడీషియల్ విచారణ చేపట్టాలి.

– షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

6 నుంచి విఘ్న విమోచక హనుమాన్ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విఘ్న విమోచక హనుమాన్ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి స్వీయ పర్యవేక్షణలో ఈ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా 5వ తేదీ సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అంకురారోపణ, 6వ తేదీ ఉదయం అరణిమథనం, అగ్నిప్రతిష్ఠ, మన్యుసూక్త హవనం, పంచగవ్య శుద్ధి, పూర్ణాహుతి, అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం అగ్నిముఖం, వాస్తు పూజ, హనుమద్వైభవ ప్రవచనం, పూర్ణాహుతి, 7వ తేదీ ఉదయం మన్యుసూక్త హవనం, మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, అదే రోజు సాయంత్రం అగ్నిముఖం, తత్త్వన్యాస హోమం, పూర్ణాహుతి, సామూహిక హనుమద్ పూజ, ఈనెల 8వ తేదీ ఉదయం 10.55 గంటలకు విఘ్న విమోచక హనుమాన్ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం, మహాకుంభ సంప్రోక్షణ, ప్రథమారాధన, అనంతరం తీర్థప్రసాద గోష్ఠి, విశేష తదీయారాధన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నుంచి 8వ తేదీ వరకు రోజూ సుందరకాండ పారాయణ, గోపూజ, హనుమాన్ చాలీసా పారాయణ, అఖండ హరేరామ నామ సంకీర్తన, హనుమద్ పూజలు, విశేష తదియారాధన జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామి వార్ల కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

కల్పవృక్ష వాహనంపై నారసింహుడు

స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

- పొన్న వాహనంపై చిన్ని కృష్ణుడు
- నేడు స్వామి వారి కల్యాణోత్సవం

కల్పవృక్ష వాహనంపై కొలువుదీరిన స్వామి వారు

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేదీప్యమానంగా వెలుగొందుతూ మాడ వీధుల్లో విహరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు పరవశించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణ అధికారి సునీల్‌కుమార్ పర్యవేక్షించగా, ఉత్సవ కైంకర్యపరులుగా తిరుపతికి చెందిన గొంటుముక్కల రమణయ్య, సుగుణ దంపతులు వ్యవహరించారు. రాత్రి పొన్న వాహన సేవ వైభవంగా జరిగింది. ఈ సమయంలో స్వామిని దర్శించిన వారికి దేహాభిమానం తొలగి స్వామి కృపకు పాత్రులు అవుతారని భక్తుల నమ్మకం. పొన్న వాహన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం వ్యవహరించింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు కల్యాణ వేడుక

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఉదయం అశ్వ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారని, రాత్రి ఎదురుకోలు ఉత్సవం కోలాహలంగా జరగనుందని పేర్కొన్నారు. కల్యాణ వేదికపై వేంచేసి దర్శనమిస్తారు. కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం వేదిక మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అధికారులు తెలిపారు.



పొన్న వాహనంపై చిన్ని కృష్ణుడుగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

నేటి నుంచి ఇంటర్ సంస్కృత పేపర్ల స్పాట్ వాల్యూయేషన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సంస్కృత పేపర్లకు స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమవుతుందని ఆర్‌ఐవో జి.సునీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ వాల్యూయేషన్‌కు నియమితులైన అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఎర్ర బుక్‌లు.. పసుపు బుక్‌లకు ఎవ్వరూ భయపడరు

అంబటి రాంబాబును పరామర్శిస్తున్న మాజీ మంత్రులు మేకతోటి సుచరిత, కొడాలి నాని, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అంబటి రాంబాబును కలిసిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఉభయ గోదావరి జిల్లాల కాపు నేతలు

- జైల్లో పెట్టినంత మాత్రాన వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు
- వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ప్రతి ఒక్కటి గుర్తుపెట్టుకుని తగిన బుద్ధి చెబుతాం
- మాజీ మంత్రులు మేకతోటి సుచరిత, కొడాలి నాని, కురసాల కన్నబాబు
- అంబటి రాంబాబుకు పరామర్శ

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్)/ నగరంపాలెం: నారా లోకేష్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎర్ర బుక్ పాలనకు.. పసుపు బుక్ పాలనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే రోజులు పోయాయని మాజీ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు నగరంలోని సిద్ధార్థ నగర్‌లో మాజీ మంత్రి అంబటి రాంబాబును మాజీ మంత్రులు కొడాలి నాని, కురసాల కన్నబాబు, మేకతోటి సుచరిత, దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, నంబూరు శంకర రావులు పరామర్శించారు. కొడాలి నాని మాట్లాడుతూ అంబటి రాంబాబు ఇంటిపై, కార్యాలయంపై, కార్లను ధ్వంసం చేసి ఇంట్లో ఆడపిల్లలను భయభ్రాంతులకు గురిచేసిన వారిని వదిలేశారని మండిపడ్డారు. కానీ అంబటి రాంబాబును 18 రోజులు జైల్లో పెట్టి ఇబ్బందులు గురిచేశారని ధ్వజమెత్తారు. అంబటిని రెచ్చగొట్టినప్పుడు నోరు జారి ఒక మాట మాట్లాడారని, దానికి ఆయన క్షమాపణ చెప్పినప్పటికీ కావాలనే టీడీపీ వారు ఇలా దాడి చేయించారని అన్నారు.

జగన్‌తో పెట్టుకుంటే లోకేష్‌కే ప్రమాదం

రెడ్‌బుక్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఉందో లేదో మీకు త్వరలో తెలుస్తుందని మంత్రి నారా లోకేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ బుక్‌లో వైఎస్ జగన్ పేరు రాస్తే లోకేష్‌కే ప్రమాదమని, వైఎస్ జగన్ ఏదైనా బుక్‌లో లోకేష్ పేరు రాసినా లోకేష్‌కే ప్రమాదమని హెచ్చరించారు. సిగ్గు ఉంటే ప్రజల ఇబ్బందులను పరిష్కరించడంపై పాలకులు దృష్టి సారించాలన్నారు.

అరెస్టులతో మరింత పట్టుదల

అంబటి రాంబాబు అరెస్టు తర్వాత వైఎస్సార్ సీపీలోని అన్ని స్థాయిల నాయకుల్లో మరింత పట్టుదల పెరిగిందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఇంట్లో మహిళలు ఉన్నారనే ఇంగితజ్ఞానం లేకుండా స్థానిక ఎమ్మెల్యే జనాలను వేసుకొచ్చి ఇలా దాడులు చేస్తే వాళ్లకి మద్దతు ఇస్తున్నారంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం దుస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. 2014–19 మధ్య కాపు నాయకులు ముద్రగడ పద్మనాభంపై దాడి చేశారని, వారి కుటుంబ సభ్యుల్ని హింసించారని, ఇప్పుడు కాపు నాయకుడైన అంబటిపై దాడికి తెగబడ్డారని మండిపడ్డారు. ఒక సామాజిక వర్గాన్ని అణగదొక్కాలనే ప్రయత్నం కొందరికి అలవాటుగా మారిపోయిందని స్పష్టం అవుతోందన్నారు.

కక్ష సాధింపు మానుకోకుంటే ఇబ్బందులే

ఎవరైనా కూటమి ప్రభుత్వం తప్పుల్ని ఎత్తి చూపితే వారి గొంతు నొక్కేయాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చెప్పారు. కేసులు పెట్టినప్పటికీ రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళతామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోని ప్రజాప్రయోజనాలపై దృష్టి సారించాలని హితవు పలికారు.

ఉభయ గోదావరి జిల్లాల నేతల పరామర్శ

గుంటూరు సిద్ధార్థనగర్‌లో మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఆదివారం ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కాపు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి మద్దతు పలికారు. జై జగన్, జై అంబటి, కాపుల ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ర్యాలీగా అంబటి నివాసానికి తరలివచ్చారు.

- భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ.. తనతోపాటు ఉభయ గోదావరి జిల్లాలోని ఒక్కో మండలం నుంచి కాపు ప్రముఖులు అంబటిని పరామర్శించేందుకు వచ్చారని అన్నారు. గత జనవరిలో అంబటి రాంబాబుపై, ఇల్లు, కార్యాలయంపై జరిగిన దాడి నిరంకుశ పరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఇది ముమ్మాటికీ కాపులపై జరిగిన దాడి అని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వంగవీటి మోహన రంగాను కిరాతంగా హత్య చేశారని, ఈ దారుణంతో యావత్తు కాపు జాతి మానసిక క్షోభకు గురైందని అన్నారు. తర్వాత ఎన్నికల్లో టీడీపీ మూల్యం చెల్లించుకోక తప్పలేదని గుర్తుచేశారు. మాయమాటలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. కాపు నేత ముద్రగడ పద్మనాభంను అనేక విధాలుగా హింసించారని గుర్తుచేశారు. ఆయన భార్య, కొడుకు, కోడలిని లాక్కెళ్లి అరెస్ట్ చేశారని అన్నారు. ఇందుకుగాను ప్రతి కాపు హృదయం ఆవేదన చెందిందని అన్నారు. ఈ క్రమంలోనే 2019లో టీడీపీని బంగాళాఖాతంలో కలిపారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి చంద్రబాబు వచ్చేందుకు కాపు నాయకుల మద్దతు కీలకంగా మారిందని అన్నారు. అంబటి రాంబాబుపై, ఇంట్లోని మహిళలు, పిల్లలను కూడా చూడకుండా దమనకాండ సృష్టించారని ఆరోపించారు. అంబటి రాంబాబుపై జరిగిన దాడిని ప్రతి కాపు మనసులో పెట్టుకున్నారని, రానున్న ఎన్నికల్లో మరోసారి బంగాళాఖాతంలోకి కలుపుతారని చెప్పారు.
- కాపు ఎస్‌ఎస్‌సీ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ అంబటి రాంబాబుపై జరిగిన దాడి కాపు కులంపై జరిగినట్టేనని అన్నారు. కాపు సంఘం నేతలపై కూటమి ప్రభుత్వం వచ్చాక దాడులు ఎక్కువ జరుగుతున్నాయని చెప్పారు. భీమవరంలో ఇటీవల కాపు టీడీపీ కార్యకర్తను తొక్కితొక్కి చంపారంటే వారికి కాపులపై ఎంత కసి ఉందో అర్థమవుతోందని అన్నారు. జనసేన పార్టీ 21 మంది ఎమ్మెల్యేలలో ఒక్కరూ దీనిని ఖండించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గళ్లా మాధవికి తమ సత్తా ఏంటో చూపుతామని హెచ్చరించారు. రంగా వంటి వ్యక్తి అంబటి రాంబాబు అన్నారు. కాపులపై దాడులను ఏక కంఠంతో ప్రతి ఒక్కరూ ఖండించాలని చెప్పారు.
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ (రాజమండ్రి), విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, వైజాగ్ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎం.అప్పారావు, కాపు నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అంబటికి సంఘీభావం తెలిపారు.

క్లుప్తంగా

అన్ని రంగాలపై ఏఐ ప్రభావం

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు రూరల్: ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ఉందని, దానిని మానవ జాతి సంక్షేమానికి ఉపయోగించే విధంగా చర్యలు ఉండాలని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు, వాల్‌మార్ట్ ఇండియా సైబర్ సెక్యూరిటీ లీడ్ ఎస్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నగర శివారు లాంలోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నో వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన వివిధ రంగాలలో ఏఐ పాత్రను వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రపంచంలో మూడు శతాబ్దాలుగా పారిశ్రామిక విప్లవం, సాంకేతిక విప్లవం జరిగాయన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విప్లవం జరగబోతున్నదని, విద్యార్థులు దానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. టెక్నాలజీకి సంబంధించిన ఏ మార్పులు అయినా మానవజాతి పురోగతికి, ఉపాధికల్పనకు దోహదపడాలని, కానీ కార్పొరేట్ కంపెనీల దృక్పథం ఆలోచనలకు, ప్రజా సంక్షేమానికి అనుగుణంగా ఉండవని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు కృషిచేస్తుందన్నారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్, మెడిసిన్, మెడికల్, న్యాయ విద్యా వ్యవస్థ కోసం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు లైఫ్ స్కిల్స్ సామాజిక స్కిల్స్ నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె యశ్వంత్, ప్రొఫెసర్ ప్రితి దాయ్, నిహారిక, జన విజ్ఞాన వేదిక నాయకుడు కె శ్రీనివాస్, మురళీధర్, చాందిని, రమేష్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): ఆర్మా డ్రాగన్స్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ లెవెల్ ఓపెన్ కారటే, కుంగ్‌ఫూ తైక్వాండో చాంపియన్‌షిప్–2026 పోటీలు ముగిశాయి. ఆదివారం స్థానిక గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసరావు, ఉగ్గిరాల సీతారామయ్య పాల్గొన్నారు. పోటీల నిర్వాహకుడు పి.రాంబాబు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 620 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. క్రీడాకారులు చక్కని క్రీడా స్ఫూర్తి చాటి పోటీల్లో తలపడ్డారన్నారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రధానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో పి.సరస్వతి, ఆలపాటి రవికుమార్, అంబటి నవ కుమార్, ఏ.సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ సెక్రటరీగా వజ్జా రామకృష్ణ ఎన్నికైనట్లు డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫిషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల అధికారి సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జరిగిన ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికలు నిర్వహించి, గెలిచిన అభ్యర్థులకు డిక్లరేషన్ పత్రాలను అందజేశామని తెలిపారు. స్టేడియంలో మొత్తం 2,160 మంది ఓటు హక్కు కలిగి ఉండగా, వారిలో 1267 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 20 ఓట్లు చెల్లలేదన్నారు. సెక్రటరీ పోస్టుకు పోటీ పడిన అభ్యర్థుల్లో వజ్జా రామకృష్ణకు 851 ఓట్లు పోల్ కాగా, దొడ్డపనేని రాజేంద్రకుమార్‌కు 396 ఓట్లు పోలయ్యాయన్నారు. వజ్జా రామకృష్ణకు 455 ఓట్లు మెజారిటీ రావడంతో ఆయన్ను సెక్రటరీగా గెలుపొందినట్లు డిక్లేర్ చేశామన్నారు. వైస్ ప్రెసిడెంట్ పోస్ట్‌కు దామా మహేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ పోస్టుకు పాకనాటి ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ పోస్టుకు కండె కాంతారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కి పురుషులలో ఇంకొల్లు వెంకటరత్తయ్య, జి.హనుమంతరావు, మహిళల్లో గుంటుపల్లి యామిని శివ జ్యోతి, లగడపాటి అంజలిలు గెలుపొందగా వారికి డిక్లరేషన్ పత్రాలను అందజేశామన్నారు.

ఉపాధ్యాయుల మెడపై కత్తి

- పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత పేరుతో ఒత్తిడి
- విద్యార్థుల ఎదుటే హెచ్‌ఎంను తిట్టిన డీఈఓ
- అధికారికంగా సెలవు పెట్టినా, హడావుడిగా పాఠశాలకు పిలిచి మరీ అవమానించడంతో మనస్తాపం
- ఆవేదనతో గుండెపోటుకు గురైన వైనం
- ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన ప్రధానోపాధ్యాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారు. బోధన కాలాన్ని హరించి వేస్తున్న యాప్‌లతోపాటు ఉన్నతాధికారుల నుంచి అర్జెంట్ పేరుతో అడిగిందే తడవుగా సమాచారాన్ని పంపాలంటూ పెడుతున్న ఒత్తిడిని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు భరించలేకపోతున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల పేరుతో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖాధికారులు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై విపరీతమైన ఒత్తిడి తెస్తున్నారు. పాఠశాల నుంచి పరీక్షలకు హాజరయ్యే ప్రతి ఒక్క విద్యార్థి ఖచ్చితంగా పాస్ అవ్వాల్సిందేనంటూ చేస్తున్న హెచ్చరికలతో రోజువారీ విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. ఎప్పుడు ఏ అధికారి వచ్చి, ఏ విధంగా మాట్లాడుతారో, క్రమశిక్షణా చర్యల పేరుతో ఎటువంటి పనిష్మెంట్‌లు ఇస్తారో అని ఆందోళన చెందుతున్నారు. పరీక్షలు రాసేది విద్యార్థులు అయితే అంతకు పదింతలు తీవ్ర ఒత్తిడితో ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అధికారంలోకి వస్తే జీవితాలను మార్చేస్తామని ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా, పదింతలు పని ఒత్తిడితో ఉపాధ్యాయుల మెడపై కత్తి పెట్టింది.

ఉపాధ్యాయ సంఘాల పరామర్శ

డీఈవో హెచ్చరికలతో ఆస్పత్రి పాలైన హెచ్‌ఎం శ్రీనివాసరావును పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరామర్శించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని, పరీక్షల పేరుతో తీవ్రమైన ఒత్తిడికి గురి చేయడంతోపాటు పాఠశాలల సందర్శన సమయంలో వ్యక్తిగతంగా దూషించడం మానుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని తోటి ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల ముందే తిట్టడం, అరవడం వంటి సంఘటనలపై గతంలో ఉపాధ్యాయ సంఘాలు ధర్నాలు, ఆందోళనకు దిగిన విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సంఘాల నాయకులు చెబుతున్నారు.

డీఈఓ హెచ్చరికలతో ఆస్పత్రి పాలైన ప్రధానోపాధ్యాయుడు

గుంటూరు కేవీపీ కాలనీలోని కేఎస్సార్ట్ నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు శనివారం గుండెపోటుతో లలితా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరారు. ఆయన గత గురువారం వ్యక్తిగత పనులపై అధికారికంగా సెలవు పెట్టారు. అదేరోజు పాఠశాలలను తనిఖీ చేసేందుకు వెళ్లిన జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీమ్ బాషా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎక్కడ అంటూ ఉపాధ్యాయులను ప్రశ్నించారు ?. అయితే ఆయన సెలవు పెట్టారని చెప్పినప్పటికీ, పాఠశాలకు రావాలంటూ హడావుడిగా ఫోన్ చేసి పిలిపించారు. డీఈఓ పిలిచారని తెలియడంతో సదరు హెచ్‌ఎం శ్రీనివాసరావు పాఠశాలకు హడావుడిగా వచ్చారు. హెచ్‌ఎం వచ్చిన సమయానికి డీఈఓ సలీమ్ బాషా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్నారు. తరగతి గదిలోకి వచ్చిన హెచ్‌ఎంపై విద్యార్థుల ఎదుటే అకారణంగా సీరియస్ అవడంతోపాటు వెళ్లి ఆఫీస్ రూమ్‌లో వేచి ఉండాలని డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫీస్ రూమ్‌కు వచ్చిన తరువాత ఇష్టారాజ్యంగా సెలవులు పెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈఓ ఏకవచనంతో మాట్లాడటంతో సంబంధిత హెచ్‌ఎం తీవ్ర మనస్థాపానికి లోనయ్యారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల ఎదుట ఏకవచనంతో సంబోధించడంతోపాటు అధికారికంగా లీవ్ యాప్‌లో సెలవు నమోదు చేసినా, వ్యక్తిగత పనులపై ఉన్న హెచ్‌ఎంను పాఠశాలకు పిలిపించిన సంఘటన ఆయనలో తీవ్ర ఆవేదన కలిగించింది. అదే రోజు సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన హెచ్‌ఎం శ్రీనివాసరావు జరిగిన సంఘటనపై తీవ్రంగా కలత చెందారు. మనోవేదనతో గుండెపోటుకు గురి కావడంతో శనివారం ఉదయం కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. హెచ్‌ఎంను పరీక్షించిన వైద్యులు ఆయనకు మెరుగైన చికిత్స నిమిత్తం ఐసీయూకు తరలించారు.

ఐదుగురికి నూతన జీవితాలను ప్రసాదించిన చైతన్య

- రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన యువకుడు
- గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ
- యువకుడి అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

నల్లపనేని చైతన్య

గుంటూరు మెడికల్: పెళ్లీడు కొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కళ్లెదుటే చనిపోయాడు. ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులకు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తున్న బిడ్డ ఏ అచ్చటా ముచ్చట తీరకుండానే అకాల మృత్యువుకు లోనయ్యాడు. యువకుడైన బిడ్డ చనిపోయి గుండెలు పిండేసే బాధలో ఉన్న తల్లిదండ్రులు తమ బాధను దిగమింగుకుంటూ ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి నూతన జీవితాలను ప్రసాదించేందుకు అవయవ దానం చేశారు. తల్లిదండ్రుల గొప్ప నిర్ణయంతో ఓ యువకుడి అవయవాలతో ప్రాణాపాయస్థితిలో ఉండి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురికి నూతన జీవితాలను ప్రసాదించారు. ఆదివారం గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌లో జరిగిన మహత్కర సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నల్లపనేని వెంకటశివ, ఆదిలక్ష్మిల దంపతుల కొడుకు చైతన్య (25) శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. డ్యూటీలో భాగంగా ఫిబ్రవరి 27న ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో తాటపూడి గ్రామం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చైత్యన్య మెదడుకు తీవ్ర గాయాలు అవ్వటంతో కుటుంబ సభ్యులు అతడిని గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌లో చికిత్స కోసం చేర్పించారు. చైతన్యకు ఆసుపత్రిలో వైద్యుల బృందం చికిత్స అందించినా ఫలితం లేకపోయేసరికి 28న బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ జీవన్‌దాన్ చీఫ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యలవర్తి కార్తిక్ చౌదరి, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్‌లు కొడాలి అనూష, చింతమనేని అఖిలేష్‌లు చైతన్య తల్లిదండ్రులకు అవయవదానం ప్రాముఖ్యత గురించి వివరించారు. దీంతో యవకుడి తల్లిదండ్రులు బిడ్డను పోగొట్టుకున్న బాధలో ఉండి కూడా తమ బిడ్డ అవయవాలు వేరొకరికి నూతన జీవితాన్ని ఇస్తాయని తెలుసుకుని ముందుకొచ్చి అవయవదానం చేశారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

తల్లిదండ్రుల పెద్దమనస్సు

చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గుంటూరు హాస్పటల్‌లో చైతన్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నవయస్సులోనే రోడ్డు ప్రమాదంలో చైతన్య చనిపోవటం చాలా బాధాకరమని పేర్కొన్నారు. పెంచి పెద్దచేసిన బిడ్డను కోల్పోయిన బాధలో ఉండి కూడా వెంకటశివ, ఆదిలక్ష్మి దంపతులు అవయవదానం చేయటం చాలా మంచి పని అని, వారి మంచి మనసుకు అభినందనలు తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు చైతన్య కుటుంబ సభ్యులను అభినందించి, వారి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేశారు. చైతన్య అవయవదానంతో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌లో తీవ్ర అనారోగ్యంలో ప్రాణాపాయస్థితిలో ఉండి చికిత్స పొందుతున్న ఇరువురు బాధితులకు ఆస్పత్రి వైద్య బృందం లివర్, కిడ్నీ అవయవాలు అమర్చి నూతన జీవితాన్ని ప్రసాదించారు. మరో కిడ్నీని విజయవాడ, రెండు నేత్రాలు ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు.

సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలి

నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ

సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి శివాజీ, వేదికపై యూనియన్ నాయకులు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల సమస్యలను మానతా దృక్పథంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని నేషనల్ యూనియన్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘం ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ అన్నారు. గుంటూరు పోస్టల్ డివిజన్‌లో ఆదివారం నేషనల్ యూనియన్ పోస్టల్ ఉద్యోగుల ద్వైవార్షిక సమావేశం జరిగింది. వాసిరెడ్డి శివాజీ మాట్లాడుతూ 8వపే కమిషన్‌లో జీడీఎస్ ఉద్యోగులను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. డిపార్ట్‌మెంట్‌లో ఉన్న సేవల్లో కొన్ని ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మార్పులు చెంది కొత్తవి రావాలని, ఇంకా వెల్ఫేర్ విషయంలో ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రైవేటైజేషన్ కి అనుకూలంగా ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలని ఖండించారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రసాద్, సర్కిల్ సెక్రటరీ డేవిడ్ రాజు, పోస్ట్‌మెన్ అండ్ ఎంటీఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ, డిప్యూటీ సర్కిల్ సెక్రెటరీ నవీన్ కుమార్, రిటైర్డ్ ఎంప్లాయిస్, జీడీఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ యోగేశ్వరరావు, సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేసిన గురజాల పోలీసులు

- నడిరోడ్డుపై నడిపించుకుంటూ కోర్టుకు..
- విస్మయం వ్యక్తం చేస్తున్న పరిశీలకులు

సాక్షి నరసరావుపేట: హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను గురజాల పోలీసులు బేఖాతరు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... గురజాల మండలంలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన ఒక పార్టీ నాయకుడిపై కొంతమంది దాడి చేసిన సంఘటనలో గురజాల పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. వారిని ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించి వారిని పోలీసులు రోడ్డుపై నడిపిస్తూ కోర్టుకు హాజరుపరిచారు. ఏదైనా కేసులో నిందితులుగా ఉన్న వారిని పోలీసులు రోడ్డుపై నడిపించకూడదనే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ గురజాల పోలీసులు నిందితులను రోడ్డుపై నడిపించి తీసుకువెళ్లడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులకు ఒక న్యాయం మరొకరికి ఒక న్యాయమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు రాజకీయ ప్రముఖులువారి అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు.

ప్రతి పల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి

సిరిపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న వజ్రబాబు

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వజ్రబాబు

మేడికొండూరు: ప్రతి పల్లెలోనూ వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో వివిధ విభాగాల కమిటీ అభ్యర్థులతో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీకి పునాదులని వివరించారు. పార్టీ కోసం పనిచేసే గ్రామ, మండలస్థాయిలోని వివిధ విభాగాల కమిటీ సభ్యులు, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రతి గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని టీడీపీ దౌర్జన్యాలు, అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకునేందుకు అందరూ కంకణ బద్ధులుగా కావాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాళ్లూరు వంశీకృష్ణ, సిరిపురం గ్రామ పార్టీ అధ్యక్షులు కంకణాల పరమేశ్వరరావు, జోసఫ్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు కాసు విజయమ్మ రాయప్ప రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు, స్టేట్ ఐటీ వింగ్ ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి ప్రదీప్ గొంది రవి, మిరియాల శివరామకృష్ణ, ఏరాబాబు, కన్నయ్య, అబ్దుల్లా, హబీబుల్లా, ఇక్బాల్, కరిముల్లా, విద్యాసాగర్, తదితర గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్లీల ఓటీటీలను నిషేధించిన కేంద్రం

మా – ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్ రాజా

సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలిటౌన్: అసభ్యకర, అశ్లీల కంటెంటులను ప్రదర్శిస్తున్న 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు ఇకపై భారతదేశంలో కనిపించకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధించినదని మా– ఏపీ వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. వీటికి సంబంధించిన 57 సోషల్ మీడియా ఖాతాలు, 10 యాప్‌లు, 19 వెబ్‌సైట్లను భారత ప్రభుత్వం బ్లాక్ చేసిందన్నారు. స్థానిక మా–ఏపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో 13 సంవత్సరాల్లోపు బాలబాలికలు ఉంకూడదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. శృంగార కంటెంటులను 16 ఏళ్ళ లోపు పిల్లలకు దూరంగా ఉంచేలా చట్టం చేయవలసిందిగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇక రోగుల ప్రాణాలతో సోషల్ మీడియ చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. ఒకరు తినగూడదని చెపితే మరొకరు తినొచ్చు అని వీడియోలు పెట్టడం వలన ప్రజలు లేని రోగాలను తెచ్చుకుంటున్నారని దిలీప్ రాజా వాపోయారు. శాశ్వత నివారణ లేని వ్యాధులను సైతం తగ్గిస్తామని వైద్యశాస్త్రం చదవని వ్యక్తులు సోషల్ మీడియాలో చెప్పటం వలన ప్రజలకు ఎంత ప్రాణాంతకమో ప్రభుత్వాలు ఆలోచించాల్సింది‌గా ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మనవి చేశారు. సమావేశంలో పినపాటి సురేష్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ గాజులపల్లి రాముడు పాల్గొన్నారు.

కారుకు నిప్పు పెట్టిన దుండగులు

కారు వద్ద ఆధారాలు సేకరణ

దుగ్గిరాల: శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుగ్గిరాలకు చెందిన దార్ల రవి కారు ను ఇంటి ముందు పార్క్ చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తు లు నిప్పు పెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. రాత్రి ఒంటి గంట దాటిన తరు వాత పెద్ద శబ్దం రావటంతో బయటకు వచ్చి చూడగా మంటలలో కాలుతున్న కారును గమనించిన స్థానికులు నీరు పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే వెనుక వైపు పూర్తిగా కాలిపోయింది. గుంటూరు నుంచి క్లూస్ టీం వచ్చి ఉన్న ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి ఎస్సై వెంకట రవి దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీని ఫిదా చేసిన గుంటూరు ఆతిథ్యం

- 'వేదిక'అంకితభావానికి దక్కిన అభినందన
- నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రశంసలు

బృందంతో కలిసి విజయచిహ్నంతో వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు: తెలుగు నాటక రంగానికి.. గుంటూరు ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో యడ్లపాడుకు చెందిన 'వేదిక' (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం) అసాధారణ విజయాన్ని సాధించింది. గుంటూరులో 25వ భారత్‌రంగ్ మహోత్సవ్–2026 అంతర్జాతీయ నాటకోత్సవం దిగ్విజయ నిర్వహణకు దేశ రాజధాని ఢిల్లీ ఫిదా అయింది. ఈ వేడుకల విజయవంతంపై న్యూఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబుపై ప్రశంసలు కురిపిస్తూ ఎన్ఎస్‌డీ డైరెక్టర్ చిత్తరంజన్ త్రిపాఠి ప్రత్యేక అభినందన పత్రాన్ని పంపించారు. ఆ విషయాలను ఆదివారం ముత్తవరపు మీడియాతో పంచుకున్నారు.

కళాకారుల గుండెల్లో చెరగని ముద్ర...

గత ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీవరకు గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరిగిన ఈ అంతర్జాతీయ నాటకోత్సవాలు కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, ఒక గొప్ప సాంస్కృతిక పండుగలా సాగాయని ఎన్.ఎస్.డి కొనియాడిందని సురేష్‌బాబు తెలిపారు. ముఖ్యంగా దేశ, విదేశీ కళాకారులకు కల్పించిన వసతులు, సాంకేతిక తోడ్పాటు ఉత్సవం నిర్వహణలో ప్రదర్శించిన క్రమశిక్షణ అద్భుతమని ప్రశంసించిందన్నారు. ఈ గౌరవం 'వేదిక' బృందం అంకితభావానికి, రెండు తెలుగు రాష్ట్రాల నాటక రంగ పెద్దలకు, గుంటూరు నగరవాసుల సహకారానికి దక్కిన ప్రతిఫలమన్నారు. దేశ, విదేశీ నాటక బృందాల మధ్య వేదిక ఒక వారధిగా నిలిచిందన్నారు. ఐదు రోజుల పాటు ఎక్కడా ఆటంకాలు లేకుండా పండుగ వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించడం గొప్ప అనుభూతినిచ్చిందని తెలిపారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సహకారంతో వేదిక కలిసి వేసిన ఈ తొలి అడుగును సుదీర్ఘ ప్రయాణంగా కొనసాగిస్తామని సురేష్ బాబు ధీమా వ్యక్తం చేశారు.

పిల్లలకు టిఫిన్ కోసం వెళ్లి మృత్యువాత

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనాస్థలంలో పడి ఉన్న మృతదేహం

కరేటి సురేష్(ఫైల్)

తెనాలిరూరల్: పిల్లలకు టిఫిన్ తీసుకువద్దామని వెళ్లిన తండ్రి రైలుఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన తెనాలిలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణ పినపాడుకు చెందిన కరేటి సురేష్(50) కలప వ్యాపారం చేసేవాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం కావడంతో పిల్లలకు టిఫిన్ తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. పినపాడు సమీపంలోని మద్రాసు గేటు వేసి ఉండడంతో పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. ఇటీవల నిర్మించిన నూతన రైలు మార్గం(మూడో లైను)లో ఓ రైలు వెళుతుండడంతో మరో పట్టాల వద్ద నిలచి ఉన్నాడు. ఆ పట్టాలపై మరో రైలు వచ్చి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలాన్ని ఇన్‌చార్జి జీఆర్పీ ఎస్‌ఐ ఎల్.సరస్వతి పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడరేవులో కార్డన్ సెర్చ్

చీరాల: ఆపరేషన్ వజ్రపహార్‌లో భాగంగా సమాజంలో మత్తు పదార్థాలు నివారించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్ పర్యవేక్షణలో చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాడరేవులో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వాడరేవులోని వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. గతంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా నాటుసారా ప్రభావం ఉండేదని, ఈ క్రమంలో పాత నేరస్తుల ఇళ్లను తనిఖీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చామని పోలీసులు తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పి.శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్, వేటపాలెం ఎస్సై జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

వైన్ షాపులో ఘర్షణ

ముప్పాళ్ల: మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడికి దిగిన సంఘటన ముప్పాళ్ల పెదనందిపాడు బ్రాంచి కాలువ పక్కనే ఉన్న వైన్‌షాపులో శనివారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముప్పాళ్లకు చెందిన జానకిరెడ్డి కొంత కాలంగా కాల్వ వద్ద నున్న వైన్‌షాపు వద్ద ఫుడ్‌కోర్టు నిర్వహిస్తున్నాడు. లంకెలకూరపాడు గ్రామానికి చెందిన యువకుడు, నరసరావుపేట మండలంలోని సాతులూరు కు చెందిన మరో యువకుడు దుకాణానికి వచ్చి ఫుడ్‌కోర్టు నిర్వాహకుడైన జానకిరెడ్డితో ఘర్షణ పడ్డారు. అనంతరం వారి వద్ద నున్న కత్తితో జానకిరెడ్డిపై దాడికి దిగారు. దాడిలో జానకిరెడ్డి తలపైన, కాలిపైన తీవ్ర గాయమైంది. ఘర్షణను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో యువకుడి చేతిపైన కత్తి గాయమైంది. గాయపడిన యువకుడ్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన వారిపై గతంలోను అనేక కేసులు ఉన్నట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ మేడికొండూరు మం॥ మందపాడు రెవెన్యూ గ్రామ పరిధిలో మందపాడు నుండి రావెల వెళ్ళు మెయిన్‌రోడ్డు ఫేసింగ్‌లో 5 1/2 ఎకరముల పొలం అమ్మబడును. 8074296586

WANTED

■ అకౌంట్స్ మేనేజర్ కావలెను. బికాం, 5సం॥ల అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్ వేయగలిగిన వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ మా సంస్థ నందు పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్‌గర్ల్స్ కావలెను. జీతం: 10,000/- వరకు, పార్ట్ టైం సౌకర్యం కలదు. సంప్రదించగలరు: 93904 03143

■ ప్రముఖ కంపెనీ గుంటూరు నందు ఉచితంగా ఏ.సి మరియు ఎలక్ట్రానిక్ రిపేరు కొరకు శిక్షణ ఇవ్వబడును. సర్టిఫికెట్ & ఏ ప్రదేశంలో అయినా ఉద్యోగం కల్పించబడును. భోజనం & వసతి కలదు. ✆ 9701363586, 7382343839

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము, వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33320

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజిలో ఉద్యోగ ఖాళీలు: సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యార్హత: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతము: 16000/- వరకు ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22246

■ మంగళగిరి ఏరియాలలో ప్రముఖ పురుగు మందుల కంపెనీకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000+3000 సంప్ర॥ 9121469383

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 30సం॥ వయస్సు వారు కావలెను. 9177988077

■ సెక్యూరిటీ గార్డ్స్ రాజధాని ఏరియాలలో అర్జెంటుగా కావలెను డ్యూ 12 గం Q. టెన్త్ పాస్ వ: 50 లోపు భోజనం+ రూమ్ సౌకర్యం. 94902 48039, 9490 380213

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665

■ టెంజ్ మరియు ఫార్చ్యూనర్ కార్లు నడుపుటకు అనుభవం గల డ్రైవరు కావలెను. ✆ 9398991579

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీతం: 17K. Ph: 9640648899, 9848999184.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, CA-5, CFC ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

రూల్-8(1) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (2002 నందు నెం.3) యొక్క 3తో చదువుకోవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేది నుండి 60 రోజులలోపు ఆ నోటీసులలో పేర్కొనబడిన మొత్తములను మరియు వాటిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా క్రింద పేర్కొనబడిన ఋణగ్రహీతలను & హామీదారులను కోరుతూ డిమాండ్ నోటీసులను జారీచేయడమైనది.

ఋణగ్రహీతలు & హామీదారులు బకాయి సొమ్మును సదరు సమయములోపు తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13, సబ్-సెక్షన్ (4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 నందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తులను తేది 26.02.2026 న స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియచేయడమైనది. ముఖ్యంగా ఋణగ్రహీతలు & హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఏవిధమైన లావాదేవీలైనా వారి పేర్ల ఎదురుగా పేర్కొనబడిన బాకీల మొత్తములకు మరియు వానిపై వడ్డీ మరియు ఇతర ఖర్చులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్టప్రకారము ఋణగ్రహీతలు & హామీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడముపై శ్రద్ధ వహించవలెను.

ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు

1 ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీమతి కంభంపాటి సంపూర్ణ, భర్త: బాజీ వెంకయ్య, హెచ్.నెం. 2-16, రాయపూడి, గుంటూరు జిల్లా-522237. హోమ్ లోన్ అకౌంట్ నెం. 40700260931. చెల్లించవలసిన మొత్తం బకాయి : తేది.22.10.2025 నాటికి రూ.5,07,933/- (అక్షరాల ఐదు లక్షలు ఏడు వేల తొమ్మిది వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే) + తేది.23.10.2025 నుండి భవిష్య వడ్డీ, ఖర్చులు, కాస్ట్స్, ఇతర ఛార్జీలు మొ॥వి. డిమాండ్ నోటీసు తేది : 01.11.2025 స్వాధీనత నోటీసు తేది : 26.02.2026
స్థిరాస్తుల వివరములు : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, తుళ్లూరు సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి క్యాపిటల్ సిటీ యొక్క పరిధి, దొండపాడు ఏరియా, పిచికలపాలెం, దొండపాడు, బోరుపాలెం, పిచుకలపాలెం 5 సర్వే నెం నందు మొత్తం విస్తీర్ణం ఎకరా 11.50 సెంట్లులోని మొత్తం విస్తీర్ణం ఎకరా 5.476 సెంట్లు భూమి. హద్దులు : ఉత్తరం : బహిరంగ ప్రదేశం, దక్షిణం : 09.00 మీ॥ల వెడల్పు రోడ్డు, పడమర : బ్లాక్ నెం.C9, తూర్పు : బ్లాక్ నెం.C11.
షెడ్యూల్-బి : అమరావతి, దొండపాడు, PMAY (U)-వైఎస్ఆర్ జగనన్న నగర్ యొక్క పిచుకలపాలెం 5 సర్వే నెం నందు మొత్తం బ్లాక్ ఏరియా 608 చ॥గ॥లులోని అవిభాజ్యమైన వాటాతో ఉన్న విస్తీర్ణం 19 చ॥గ॥లు భూమి నందు గ్రౌండ్ ఫ్లోర్‌లోని విస్తీర్ణం 430 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని ప్రతిపాదిత వాటాతో కలిపి) బ్లాక్ నెం.C10 లోని ఫ్లాట్ నెం.GF-3 తో ఉన్న ఒక ఫ్లాట్. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.GF-3 యొక్క హద్దులు : ఉత్తరం : ఫ్లాట్ నెం.GF-4, దక్షిణం : ఫ్లాట్ నెం.GF-2, పడమర : బ్లాక్ నెం.C9, తూర్పు : ఫ్లాట్ నెం.GF-6.

[Entries 2–15: illegible at this resolution]

... మాత్రమే) + తేది.23.10.2025 నుండి భవిష్య వడ్డీ, ఖర్చులు, కాస్ట్స్, ఇతర ఛార్జీలు మొ॥వి. డిమాండ్ నోటీసు తేది : 01.11.2025 స్వాధీనత నోటీసు తేది : 26.02.2026
స్థిరాస్తుల వివరములు : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, తుళ్లూరు సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి క్యాపిటల్ సిటీ యొక్క పరిధి, దొండపాడు ఏరియా, పిచికలపాలెం, దొండపాడు, బోరుపాలెం, పిచుకలపాలెం 2 సర్వే నెం నందు మొత్తం విస్తీర్ణం ఎకరా 11.50 సెంట్లులోని మొత్తం విస్తీర్ణం ఎకరా 5.476 సెంట్లు భూమి. హద్దులు : ఉత్తరం : బహిరంగ ప్రదేశం, దక్షిణం : 09.00 మీ॥ల వెడల్పు రోడ్డు, పడమర : బహిరంగ ప్రదేశం, తూర్పు : బ్లాక్ నెం.C9.
షెడ్యూల్-బి : అమరావతి, దొండపాడు, PMAY (U)-వైఎస్ఆర్ జగనన్న నగర్ యొక్క పిచుకలపాలెం 2 సర్వే నెం నందు మొత్తం బ్లాక్ ఏరియా 704 చ॥గ॥లులోని అవిభాజ్యమైన వాటాతో ఉన్న విస్తీర్ణం 22 చ॥గ॥లు భూమి నందు మొదటి అంతస్తులోని విస్తీర్ణం 430 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని ప్రతిపాదిత వాటాతో కలిపి) బ్లాక్ నెం.C8 లోని ఫ్లాట్ నెం.FF-4 తో ఉన్న ఒక ఫ్లాట్. మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.FF-4 యొక్క హద్దులు : ఉత్తరం : బహిరంగ ప్రదేశం, దక్షిణం : ఫ్లాట్ నెం.FF-3, పడమర : శూన్యాకాశం, తూర్పు : ఫ్లాట్ నెం.FF-5.

16 ఋణగ్రహీత పేరు & చిరునామా: శ్రీమతి వెలుకూరి హెప్సీ రాణి, భర్త: బాబూరావు, H.No. 1-66, SC కాలనీ, వెంకటపాలెం తుళ్లూరు, గుంటూరు జిల్లా-522503. హోమ్ లోన్ అకౌంట్ నెం. 40639792605. చెల్లించవలసిన మొత్తం బకాయి : తేది 22.10.2025 నాటికి రూ. 5,04,306/- (అక్షరాల ఐదు లక్షల నాలుగు వేల మూడు వందల ఆరు రూపాయలు మాత్రమే) + తేది. 23.10.2025 నుండి భవిష్య వడ్డీ, ఖర్చులు, కాస్ట్స్, ఇతర ఛార్జీలు మొ॥వి. డిమాండ్ నోటీసు తేది : 01.11.2025 స్వాధీనత నోటీసు తేది : 26.02.2026
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, అనంతవరం సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి క్యాపిటల్ సిటీ యొక్క పరిధి, ఐనవోలు సర్వే నెం.131/3 (భాగం), 131/5 (భాగం), 131/6A (భాగం), 132/1 (భాగం), 132/3A (భాగం), 132/4A (భాగం) నందు మొత్తం విస్తీర్ణం ఎకరా 5.138 సెంట్లులోని భూమి. హద్దులు : ఉత్తరం : 17 మీ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం : బ్లాక్ నెం.C5, పడమర : 9 మీ॥ల వెడల్పు రోడ్డు, తూర్పు : బ్లాక్ నెం.A2.
షెడ్యూల్-బి : అమరావతి, ఐనవోలు, PMAY (U)-వైఎస్ఆర్ జగనన్న నగర్ యొక్క సర్వే నెం.131/3 (భాగం), 131/5 (భాగం), 131/6A (భాగం), 132/1 (భాగం), 132/3A (భాగం), 132/4A (భాగం) నందు మొత్తం బ్లాక్ ఏరియా 704 చ॥గ॥లులోని అవిభాజ్యమైన వాటాతో ఉన్న విస్తీర్ణం 22 చ॥గ॥లు భూమి నందు మొదటి అంతస్తులోని విస్తీర్ణం 365 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని ప్రతిపాదిత వాటాతో కలిపి) బ్లాక్ నెం.C10 లోని ఫ్లాట్ నెం.FF-8 తో ఉన్న ఒక ఫ్లాట్. మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.FF-8 యొక్క హద్దులు : ఉత్తరం : శూన్యాకాశం, దక్షిణం : ఫ్లాట్ నెం.FF-7, పడమర : శూన్యాకాశం, తూర్పు : ఫ్లాట్ నెం.FF-1.

తేది: 26.02.2026, ప్రదేశం : మంగళగిరి సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మహంకాళీ అమ్మవారి ఆలయం మూసివేత

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం చంద్రగ్రహణం కారణంగా ఉదయం 10 గంటలకు మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని ఈఓ పేర్కొన్నారు.

యుగయుగాల రాయుడు

మంగళాద్రీశుడు

- నేటి అర్ధరాత్రి స్వామివారి కల్యాణం
- రేపు ఉదయం దివ్య రథోత్సవం

మంగళగిరి టౌన్: భక్తుల కోర్కెలు తీర్చే యుగయుగాల రాయుడు.. మన మంగళాద్రీశుడు. మంగళగిరి నారసింహుని ఆలయంలో గతనెల 22న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా హనుమంత, రాజాధిరాజ, ముత్యాల పల్లకీ, యాలి, చిన్న శేష, సింహ, హంస, గజ, కల్పవృక్ష, పొన్నవాహనాలపై భక్తులకు అభయమిచ్చిన లోకనాయకుడు సోమవారం ఉదయం అశ్వవాహనంపై గ్రామోత్సవానికి వెళ్లనున్నారు. రాత్రి 12 గంటలకు బ్రహ్మాండ నాయకుడి కల్యాణం ఘనంగా జరుగనుంది. ఆలయం వద్ద గల కల్యాణ మైదానంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని పండితులు వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. అందుకు తగిన ఏర్పాట్లును ఆలయ అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు. కల్యాణం అనంతరం నృసింహుడు శ్రీదేవి.. భూదేవి అమ్మవార్లతో మంగళవారం ఉదయం 7 గంటలకు దివ్య రథాన్ని అధిరోహించనున్నారు. చంద్రగ్రహణం కారణంగా రథోత్సవాన్ని రద్దు చేసిన ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ఎప్పటిలానే రథాన్ని అలంకరించి స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేసి దర్శనం కల్పించనున్నారు.

శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి

ఆలయ గాలిగోపురం విశిష్టత..

ఆలయానికి నాలుగు వైపులా గాలిగోపురాలు కలవు. తూర్పున ఉన్న గాలిగోపుర నిర్మాణ శైలి దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధికెక్కింది. కాగా విజయనగర రాజులు ప్రధాన గోపుర నిర్మాణం చేపట్టి మూడంతస్తులు కట్టించారు. తరువాత కాలంలో జమిందార్ రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు క్రీ.శ. 1807–09లో ఈ గోపురంపై మరో 8 అంతస్తులు నిర్మింపజేశారు. 153 అడుగుల ఎత్తు గల ఈ గోపురం వెడల్పు 49 అడుగులు. వెడల్పు తక్కువగా ఉండి ఇంత ఎత్తుగా ఉన్న మంగళగిరి గాలిగోపురం దేశంలోనే అరుదైనదిగా ప్రసిద్ధి చెందింది

విద్యుత్ వెలుగుల్లో ఆలయ గాలిగోపురం

అభివృద్ధి ప్రజలకు శాపం కాకూడదు

మంగళగిరి టౌన్: నగరం అభివృద్ధి ప్రతి ఒక్కరికి వరంగా ఉండాలే కానీ ప్రజారోగ్యానికి శాపంగా మారకూడదని వైద్యురాలు డాక్టర్ సుధానందిని పేర్కొన్నారు. ఖబరస్తాన్‌పై కాంటిలీవర్ బ్రిడ్జి ప్రతిపాదనపై ఆదివారం ఆమె మాట్లాడారు. ఖబరస్తాన్‌పై నిర్మాణం చేపడితే పాతిపెట్టిన మానవ శరీరాల సహజ కుళ్లే ప్రక్రియకు అంతరాయం కలిగే అవకాశం ఉంటుందని.. భూగర్భ జలాలు కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీంతో ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్‌యూలో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం అధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు స్కిల్ పలావర్ మూడో దశ ఫైనల్ స్లాట్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఆదివారం పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వైస్-చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాజేష్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవముల సందర్భంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి విచ్చేయుచున్న భక్తజనులకు స్వాగతం.. సుస్వాగతం...
AVANTHA BANQUET HALL
Looking for a place to celebrate your event?
Avantha Banquet hall is the PERFECT choice
Birthday Parties / Engagement Ceremonies / Weddings & Receptions / Baby Showers & Naming Ceremonies / Anniversary Celebrations / Family Gatherings
CORPORATE EVENTS
Where Business Meets Elegance - Host your next corporate event at Avantha Banquest Hall
12-455/16, Paturu Road, Tadepalli
Guntur Dist - 522501
9966923654 / 9966534449

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
LAND FOR SALE
■ మేడికొండూరు మం॥ మందపాడు రెవెన్యూ గ్రామ పరిధిలో మందపాడు నుండి రావెల వెళ్ళు మెయిన్‌రోడ్డు ఫేసింగ్‌లో 5 1/2 ఎకరముల పొలం అమ్మబడును. 8074296588

WANTED
■ అకౌంట్స్ మేనేజర్ కావలెను. బికాం, 5సం॥ల అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్ వేయగలిగిన వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.
■ మా సంస్థ నందు పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్‌గర్ల్స్ కావలెను. జీతం: 10,000/- వరకు, పార్ట్ టైం సౌకర్యం కలదు. సంప్రదించగలరు: 93904 03143
■ ప్రముఖ కంపెనీ గుంటూరు నందు ఉచితంగా ఏ.సి మరియు ఎలక్ట్రానిక్ రిపేరు కొరకు శిక్షణ ఇవ్వబడును. సర్టిఫికెట్ & ఏ ప్రదేశంలో అయినా ఉద్యోగం కల్పించబడును. భోజనం & వసతి కలదు. ✆ 9701363586, 7382343839
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము, వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33320
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజిలో ఉద్యోగ ఖాళీలు: సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యార్హత: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతము: 16000/- వరకు ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22246
■ మంగళగిరి ఏరియాలలో ప్రముఖ పురుగు మందుల కంపెనీకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000+3000 సంప్ర॥ 9121469383
■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 30సం॥ వయస్సు వారు కావలెను. 9177988077
■ సెక్యూరిటీ గార్డ్స్ రాజధాని ఏరియాలలో అర్జెంటుగా కావలెను డ్యూ 12 గం Q. టెన్త్ పాస్ వ: 50 లోపు భోజనం+ రూమ్ సౌకర్యం. 94902 48039, 9490 380213
■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665
■ బెంజ్ మరియు ఫార్చ్యూనర్ కార్లు నడుపుటకు అనుభవం గల డ్రైవరు కావలెను. ✆ 9398991579
■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీతం: 17K. Ph: 9640648899, 9848999184

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు 7075167663 7075167541

శ్రీ శేష సాయి కన్‌స్ట్రక్షన్స్ — గెయిటెడ్ కమ్యూనిటీ వెంచర్ — CRDA Approved — సెల్: 99596 46509
మంగళగిరి తిరునాళ్ళ — PLNM PRABHALA Degree College — M.Com, M.A. (English) MSW — LAST DATE : 31-03-2026 — for PG Science Courses Contact Cell : 9177408565, 9642656449
TRISUL ENCLAVE FOR SALE — అమరావతి సమీపంలో ఆధునిక అపార్ట్‌మెంట్లు — + 91 9121715559, 9515895559 — Visit our website www.saiganeshassociates.in
SIVAGAMINI PHARMA MEDICAL & FANCY (WHOLESALE & RETAIL) — Free Home Delivery — 20% OFF
బెస్ట్ డెంటల్ & ఇంప్లాంట్ సెంటర్ — Dental Implants, Cosmetic Dentistry, Prosthodontics, Laser Treatments — సెల్: 9441453157, 9281453157
మిఠాయి — Taste of Tradition - Mittai — ఇప్పుడు మన తాడేపల్లిలో... — సెల్: 957 567 8555
MPM MUSUNOORI DEVELOPERS — Managing Partner Musunoori Prasad — 93470 40538
శ్రీ భారతి ఫిల్లింగ్ స్టేషన్ — Visit us today and feel the difference — సెల్: 98495 82369
మంగళగిరి తిరునాళ్ళ మహోత్సవము — VJ JUNIOR & DEGREE COLLEGE
సేనాపతి మిలటరీ హోటల్ — మంగళగిరి 9111 944 46 — విజయవాడ 8441 899 899
దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు మంగళగిరి
సాయిశ్రీ కార్స్ — మా వద్ద అన్ని మోడల్స్ కార్లు అమ్మబడును మరియు కొనబడును. ఎక్స్చేంజ్ మరియు ఫైనాన్స్ సౌకర్యం కలదు. — Opp. SBI, NH-16 తాడేపల్లి, గుంటూరు జిల్లా. 9703934444, 9642814444
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవముల సందర్భంగా నేడు (02-03-2025) స్వామి వారి కళ్యాణ మహోత్సవం మరియు ది.03-03-2026న జరిగే దివ్య రథోత్సవమునకు విచ్చేయుచున్న భక్తులకు స్వాగతం సుస్వాగతం — BAPUJI VIDYALAYAM (Recognised by the Govt. of A.P.) ENGLISH MEDIUM — Near Tenali Bypass Junction, Srisaila Nagar Road, Mangalagiri-522503 — Ph: 08645-233678, Cell : 9492928678, 9247042344
HF CONVENTION — Where Grand Celebrations Come to Life — Capacity: 150 to 2000 Guests — Book Your Date Today! 93985 23569
శ్రీ బాలాజీ జూనియర్ కాలేజి — సెల్: 998 5788 111, 9985 799 111
నాగార్జున హైస్కూల్ — ఫోన్: 08645-242800, 242262, సెల్: 9848674449
విలేజ్ కిచెన్ — సెల్: 9956781177, 9956781188
లింగంశెట్టి కిషోర్ కుమార్ — లింగంశెట్టి అసోసియేట్స్ & కన్సల్టెన్సీ, ఉండవల్లి
మంగళగిరి తిరునాళ్ళ — నేడు (ది.02-03-2026) — రేపు (ది.03-03-2026)
గంజి చిరంజీవి — జనసేన నాయకులు — మాజీ మున్సిపల్ ఛైర్మన్ & మాజీ ఆప్కో ఛైర్మన్

యుగయుగాల దేవుడు పానకాలరాయుడు
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం
మంగళగిరి - గుంటూరు జిల్లా, ఫోన్: 8500149595, 08645-232945
వార్షిక బ్రహ్మోత్సవములు
ది. 02-03-2026 రాత్రి గం॥12-00 లకు శ్రీ స్వామివారి కళ్యాణోత్సవం
ది. 03-03-2026 ఉదయం గం॥ 6-30 నుండి గం॥ 7-30 వరకు దివ్యరథంపై శ్రీ స్వామి వారి దర్శనం
ది.03-03-2026 చంద్రగ్రహణం సందర్భముగా ఉ॥ గం. 9-00 లకు ఆలయ తలుపులు మూసివేసి తిరిగి 04-03-2026 దర్శనం ప్రారంభం
శ్రీ స్వామివారి మాలధారణ భక్తులచే ది. 04-03-2026 బుధవారం సాయంత్రం గం॥4-00 లకు గిరి ప్రదక్షణ నిర్వహించబడును. కావున శ్రీ స్వామి వారి మాలధారణ భక్తులు అందరు పాల్గొని శ్రీ స్వామి వారి కృపకు పాత్రులు కాగోరుచున్నాము.
శ్రీ నారా లోకేష్ గారు గౌ॥మంత్రివర్యులు
శ్రీ స్వామివారి సేవలో... సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సామ్సన్

సెమీస్ చేరాలంటే వెస్టిండీస్‌పై తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ విజయలక్ష్యం 196 పరుగులు... పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నా... ఆరంభం చూస్తే కాస్త సందేహం. హిట్టర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తొందరగా వెనుదిరగ్గా, సూర్యకుమార్ కూడా ప్రభావం చూపించలేదు. కానీ ఒకే ఒక్కడు నిలబడ్డాడు. చాలా కాలంగా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడని సంజు సామ్సన్ అసలు సమయంలో సత్తా చాటాడు. ప్రత్యర్థి బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ ఎక్కడా తడబాటు లేకుండా ఈడెన్ గార్డెన్స్‌లో జట్టును గెలుపుతీరం చేర్చాడు. అంతకు ముందు విండీస్ మరింత పెద్ద స్కోరు చేయకుండా నిలువరించడంలో మన బౌలర్లు సఫలమయ్యారు. తాజా ఫలితంతో 2024 తరహాలోనే ఈసారి కూడా రెండో సెమీఫైనల్లోనే ఇంగ్లండ్‌ను ఎదుర్కొనేందుకు టీమిండియా సిద్ధమైంది. మరో రెండు నాకౌట్ పంచ్‌లతో భారత్ చరిత్ర సృష్టించడమే మిగిలింది.

సామ్సన్ ఆట... సెమీస్ బాట...

టి20 వరల్డ్‌కప్ సెమీఫైనల్లో భారత్

- వెస్టిండీస్‌పై 5 వికెట్లతో ఘన విజయం
- సామ్సన్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్
- గురువారం ముంబైలో ఇంగ్లండ్‌తో సెమీస్ పోరు

కోల్‌కతా: డిఫెండింగ్ చాంపియన్ భారత్ టి20 ప్రపంచకప్‌లో ఆరోసారి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. వెస్టిండీస్‌తో చివరి 'సూపర్–8' మ్యాచ్‌లో కాస్త పోటీ ఎదురైనట్లు కనిపించినా, చివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందంజ వేసింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (25 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రావ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్ (33 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) భారీ స్కోరులో తలా ఓ చేయి వేశారు. బుమ్రాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసి విజయాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (50 బంతుల్లో 97 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటి చేత్తో ఛేదనను సులువుగా మార్చేశాడు. గురువారం వాంఖెడే మైదానంలో జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది.

సమష్టి ప్రదర్శన...

తొలిసారి అంతర్జాతీయ టి20ల్లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఛేజ్ మెరుగ్గానే ఆడినా... మరో ఎండ్‌లో కెప్టెన్ హోప్ నెమ్మదైన ఇన్నింగ్స్ వెస్టిండీస్‌కు నష్టాన్ని కలిగించింది. వరుణ్ ఏమరుపాటుగా ఉండడంతో వ్యక్తిగత స్కోరు '1' వద్ద రనౌట్ కాకుండా తప్పించుకున్న ఛేజ్... 14 పరుగుల వద్ద అభిషేక్ సునాయాస క్యాచ్ వదిలేయడంతో బతికిపోయాడు. పవర్‌ప్లేలో విండీస్ 45 పరుగులు చేయగలిగింది. వరుణ్ తన తొలి ఓవర్లోనే హోప్‌ను బౌల్డ్ చేయడంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లంతా క్రీజ్‌లో ఉన్నంతసేపు దూకుడు కనబర్చడంతో జట్టు మెరుగైన స్కోరు సాధించగలిగింది. వరుణ్ ఓవర్లో సిక్స్ ఫోర్ కొట్టిన హెట్‌మైర్‌తో పాటు ఛేజ్‌ను బుమ్రా ఒకే ఓవర్లో వెనక్కి పంపాడు. '1' వద్ద తిలక్ క్యాచ్ వదిలేయడంతో రూథర్‌ఫర్డ్ (14) కొన్ని పరుగులు జోడించగలిగాడు. 15 ఓవర్లలో జట్టు స్కోరు 125/4 వద్ద నిలిచింది. ఆఖరి 5 ఓవర్లలో విండీస్ 70 పరుగులు రాబట్టింది. 16వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ 24 పరుగులు ఇచ్చినా... తన తర్వాతి ఓవర్లో అతను 6 పరుగులే ఇచ్చాడు. బుమ్రా 2 ఓవర్లలో విండీస్ 26 పరుగులు స్కోరు చేయగలిగింది. పావెల్, హోల్డర్ ఐదో వికెట్‌కు 35 బంతుల్లో అభేద్యంగా 76 పరుగులు జోడించారు.

రాణించిన తిలక్...

ఛేదనలో భారత్‌కు మరోసారి సరైన ఆరంభం లభించలేదు. తడబడుతూనే ఆడిన అభిషేక్ శర్మ (10)తో పాటు ఇషాన్ కిషన్ (10) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. అయితే సామ్సన్ పదునైన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించడంతో భారత్‌కు ఇబ్బంది ఎదురు కాలేదు. ముందుగా సూర్యకుమార్ (18) కొద్దిసేపు సామ్సన్‌కు సహకరించగా, ఆ తర్వాత తిలక్ వర్మ (15 బంతుల్లో 27; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా అండగా నిలిచాడు. జోసెఫ్ ఓవర్లలో వరుసగా మూడు ఫోర్లతో ఆకట్టుకున్న తిలక్ అవుటైన తర్వాత హార్దిక్ పాండ్యా (17) మరికొన్ని పరుగులు జోడించాడు. చివర్లో శివమ్ దూబే (8 నాటౌట్)తో కలిసి సామ్సన్ మ్యాచ్ ముగించాడు.

> క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన రోజు నుంచి దేశం కోసం ఆడాలని కలలుగన్నా. ఇలాంటి ఇన్నింగ్స్ కోసమే ఇంత కాలంగా ఎదురు చూస్తున్నా. ఎన్నో ఎత్తుపల్లాలతో ప్రయాణం సాగింది. నా ఆటపై నాకే సందేహం వచ్చేది. అయితే దేవుడు నన్ను కరుణించాడు. ఈ ఇన్నింగ్స్‌తో ప్రపంచమే నా చేతికి అందినట్లు అనిపిస్తోంది. ఈ ఫార్మాట్‌లో సుదీర్ఘ కాలంగా ఆడుతున్నా. పలువురు దిగ్గజాల నుంచి ఎంతో నేర్చుకోవడంతో పాటు నా అనుభవం కూడా పనికొచ్చింది. గొప్పవారు ఎలా ఆడతారు, పరిస్థితికి తగినట్లుగా ఆటను ఎలా మార్చుకుంటారో తెలుసుకున్నా. అతిగా ఆలోచించకుండా జాగ్రత్తగా బ్యాటింగ్ చేశా. ఇలాంటి ఇన్నింగ్స్ ఆడగలనని అనుకోలేదు. నా జీవితంలో ఇది అత్యుత్తమ రోజు.
>
> **-సంజు సామ్సన్**

సంజు సరైన సమయంలో...

సంజు సామ్సన్‌కు సరైన అవకాశాలు ఇవ్వడం లేదు... అతడిని ఉద్దేశపూర్వకంగా ప్రతీసారి పక్కన పెడుతున్నారు... అతడిని అభిమానించే వారి నుంచి తరచుగా వినిపించే మాట ఇది. కానీ ఇలా వరుస విమర్శల తర్వాత అప్పుడప్పుడు అవకాశాలు పొందుతున్నా సామ్సన్ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేక ప్రతీసారి చేతులెత్తేస్తూ వచ్చాడు. ఏదో కారణంతో అదృష్టవశాత్తూ చాన్స్ దక్కినా దానిని అతను వాడుకోలేక పోయాడు. ఈ వరల్డ్ కప్‌లో కూడా ఆడిన రెండు మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. సరిగ్గా చెప్పాలంటే 2024 నవంబర్‌లో దక్షిణాఫ్రికాపై సెంచరీ తర్వాత సామ్సన్ 18 ఇన్నింగ్స్‌లు ఆడితే ఒకే ఒక అర్ధ సెంచరీ... అదీ బలహీన జట్టు ఒమన్‌పై వచ్చింది. వరల్డ్ కప్ జట్టులోకి ఎంపికైన తర్వాత కూడా కివీస్‌తో సిరీస్‌లో వైఫల్యంతో తన స్థానాన్ని అతను ఇషాన్ కిషన్‌కు కోల్పోవాల్సి వచ్చింది. ఇలాంటి స్థితిలో ఆదివారం ఇన్నింగ్స్ అతని కెరీర్‌కు కొత్త ఊపు తెచ్చింది. కీలక మ్యాచ్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఆడుతూ చక్కటి షాట్లతో అతను జట్టును గెలుపు వరకు తీసుకెళ్లి ఎప్పటికీ గుర్తుంచుకునే ప్రదర్శన నమోదు చేశాడు. అన్ని రకాల షాట్లతో అతను చెలరేగాడు. ఈసారి 20.. 30... దాటిన తర్వాత అతను వికెట్ పారేసుకోలేదు. హొసీన్ ఓవర్లో ఫోర్, 2 సిక్స్‌లతో జోరు మొదలు పెట్టిన అతను షెఫర్డ్ ఓవర్లో వరుసగా 6, 4 బాది 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. టి20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఛేదనలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన అతను... ఆఖరి ఓవర్లో వరుస బంతుల్లో 6, 4తో మ్యాచ్‌ను ముగించాడు. 2024లో విజేతగా నిలిచిన జట్టులో సభ్యుడైన సామ్సన్‌కు నాడు ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశమే రాలేదు. ఇప్పుడు అసలు సమరంలో సత్తాను ప్రదర్శించిన అతను ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే సెమీస్, ఆపై ఫైనల్లో కూడా అద్భుతం చూడవచ్చు.

మ్యాచ్ ముగిశాక తన టోపీ తీసి సామ్సన్‌కు అభివాదం చేస్తున్న కెప్టెన్ సూర్యకుమార్

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హోప్ (బి) వరుణ్ 32; ఛేజ్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 40; హెట్‌మైర్ (సి) సామ్సన్ (బి) బుమ్రా 27; రూథర్‌ఫర్డ్ (సి) సామ్సన్ (బి) పాండ్యా 14; పావెల్ (నాటౌట్) 34; హోల్డర్ (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 195. వికెట్ల పతనం: 1–68, 2–102, 3–103, 4–119. బౌలింగ్: అర్ష్‌దీప్ 4–0–43–0, పాండ్యా 4–0–40–1, అక్షర్ 4–0–35–0, బుమ్రా 4–0–36–2, వరుణ్ 4–0–40–1. **భారత్ ఇన్నింగ్స్:** అభిషేక్ (సి) హెట్‌మైర్ (బి) హొసీన్ 10; సామ్సన్ (నాటౌట్) 97; ఇషాన్ కిషన్ (సి) హెట్‌మైర్ (బి) హోల్డర్ 10; సూర్యకుమార్ (సి) రూథర్‌ఫర్డ్ (బి) జోసెఫ్ 18; తిలక్ (సి) హెట్‌మైర్ (బి) హోల్డర్ 27; పాండ్యా (సి) హోల్డర్ (బి) జోసెఫ్ 17; దూబే (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (19.2 ఓవర్లలో 5 వికెట్లకు) 199. వికెట్ల పతనం: 1–29, 2–41, 3–99, 4–141, 5–179. బౌలింగ్: హొసీన్ 2–0–22–1, ఫోర్డ్ 3–0–22–0, హోల్డర్ 4–0–38–2, మోతీ 2–0–18–0, షెఫర్డ్ 2.2–0–34–0, జోసెఫ్ 4–0–42–2, ఛేజ్ 2–0–18–0.

97 టి20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఛేదనలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా సామ్సన్ నిలిచాడు. గతంలో కోహ్లి రెండు సార్లు 82 నాటౌట్ (ఆస్ట్రేలియా, పాక్‌లపై)గా నిలిచాడు.

'సూపర్–8' గ్రూప్–1 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
దక్షిణాఫ్రికా	3	3	0	6	2.259
భారత్	3	2	1	4	0.106
వెస్టిండీస్	3	1	2	2	0.993
జింబాబ్వే	3	0	3	0	-3.415

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

బాగానే ఉన్నాం కానీ... భయంగా ఉంది

- సోషల్ మీడియాలో పీవీ సింధు పోస్ట్
- దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు దుబాయ్‌లో భయం భయంగా గడుపుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. ఆమె తన వ్యక్తిగత కోచ్ ఇర్వన్‌స్యా అది ప్రతమతో కలిసి ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో ఆడేందుకు శనివారం ఇంగ్లండ్‌కు పయనమైంది. బర్మింగ్‌హామ్ ఫ్లయిట్ ఎక్కేందుకు దుబాయ్ విమానాశ్రయంలో దిగిన ఆమెకు ఊహించని విధంగా భయానక పరిస్థితులు ఎదురయ్యాయి. అమెరికాపై ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ సైన్యం... దుబాయ్ సహా గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై వైమానిక దాడులకు తెగబడింది. విమానాశ్రయానికి అతి సమీపంలో దాడులు జరగడంతో విమాన సర్వీసుల కోసం అక్కడ ఉన్న వేలాది మంది హతాశులయ్యారు. ఇందులో సింధు, ఆమె కోచ్ కూడా ఉన్నారు. 'దుబాయ్‌లో మాకు భయానక పరిస్థితులు ఎదురయ్యాయి. ఇక్కడి విమానాశ్రయంలో మేమున్న ప్రదేశానికి సమీపంలో పేలుడు సంభవించింది. దీంతో దట్టమైన పొగ పెద్ద ఎత్తున వ్యాపించింది. కోచ్, నేను, మిగతా వారంతా భయంతో పరుగు పెట్టాం. విమానాశ్రయ సిబ్బంది, దుబాయ్ పోలీసులు మమ్మల్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు కష్టపడ్డారు. వారికి ధన్యవాదాలు' అని ఆదివారం సింధు పోస్ట్ చేసింది. ప్రస్తుత విపత్కర పరిస్థితులు, విమాన సర్వీసుల రద్దుతో షట్లర్లకు ఎదురవుతున్న సవాళ్లను సమీక్షిస్తున్నట్లు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తెలిపింది. ఆటగాళ్ల భద్రతకే తమ తొలి ప్రాధాన్యత అని అవసరమైతే చిక్కుపోయిన ప్లేయర్ల మ్యాచ్‌ల షెడ్యూల్ మార్చేందుకు ఆల్ ఇంగ్లండ్ వర్గాలతో చర్చిస్తామని పేర్కొంది. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీ మంగళవారం ప్రారంభంకానుండగా... సింధు మ్యాచ్ బుధవారం ఉంది.

సింగపూర్ మీదుగా సాత్విక్, లక్ష్యసేన్

ఈ టోర్నీలో ఆడేందుకు మిగతా భారత షట్లర్లకు ఇబ్బందికర పరిస్థితులే ఎదురవుతున్నాయి. అయితే సింగపూర్ మీదుగా బయల్దేరిన భారత నంబర్‌వన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టితో పాటు స్టార్ సింగిల్స్ ప్లేయర్ లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి, మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ఇంగ్లండ్ చేరుకున్నట్లు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా తెలిపారు. మాళవిక బన్సోద్ కూడా చేరుకుంది. న్యూఢిల్లీ నుంచి బర్మింగ్‌హామ్‌కు బయల్దేరాల్సిన విమాన సర్వీస్ రద్దు కావడంతో ఉన్నతి స్వదేశంలోనే ఉన్నట్లు పేర్కొంది. 'బాయ్', బీడబ్ల్యూఎఫ్ వర్గాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నానని ఆమె చెప్పింది. డబుల్స్ కోచ్ బి.సుమిత్ రెడ్డి, మిక్స్‌డ్ డబుల్స్ జంట రోహన్ కపూర్–రుత్విక శివాని సింగపూర్ మీదుగా బర్మింగ్‌హామ్ చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

సలీమా టెటె సారథ్యంలో...

మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ బరిలో భారత్

సాక్షి, హైదరాబాద్: స్వదేశంలో జరిగే మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ఆదివారం హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు మిడ్‌ఫీల్డర్ సలీమా టెటె సారథ్యం వహిస్తుంది. సీనియర్ స్టార్ గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ సవితా పూనియా కుటుంబ కారణాలరీత్యా ఈ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 8 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ మెగా టోర్నీ జరుగుతుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఇంగ్లండ్, స్కాట్లాండ్, దక్షిణ కొరియా, ఇటలీ, ఉరుగ్వే, వేల్స్, ఆస్ట్రియా జట్లు ఈ టోర్నీలో పోటీపడతాయి. పూల్ 'ఎ'లో ఇంగ్లండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా... పూల్ 'బి'లో భారత్, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌ను 8న ఉరుగ్వేతో, తర్వాత 9న స్కాట్లాండ్‌తో, 11న వేల్స్‌తో తలపడుతుంది. ఈ టోర్నీ ద్వారా మూడు జట్లు ఈ ఏడాది ఆగస్టులో బెల్జియం–నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

భారత మహిళల హాకీ జట్టు: బన్సారి, బిచ్చూ దేవి (గోల్‌కీపర్లు), సుశీలా చాను, నిక్కీ ప్రధాన్, మనీషా, ఉదిత, ఇషిక చౌధరీ (డిఫెండర్లు), నేహా, సలీమా టెటె, సునెలితా టొప్పో, సాక్షి రాణా, వైష్ణవి, రుతుజా, దీపిక (మిడ్‌ఫీల్డర్లు), నవ్‌నీత్ కౌర్, ఇషిక, లాల్‌రెమ్‌సియామి, బ్యూటీ డుంగ్‌డుంగ్, బల్జీత్ కౌర్, అన్ను (ఫార్వర్డ్స్).

నాకౌట్‌కూ అజేయంగానే...

దక్షిణాఫ్రికా వరుసగా ఏడో విజయం

జింబాబ్వేపై 5 వికెట్లతో గెలుపు • సికందర్ రజా ఆల్‌రౌండ్ ప్రదర్శన వృథా

న్యూఢిల్లీ: గత మెగా ఈవెంట్ రన్నరప్ దక్షిణాఫ్రికా ఈ టి20 ప్రపంచకప్‌ను కసిమీద ఆడుతోంది. లీగ్ దశలో గ్రూప్ 'డి'లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన దక్షిణాఫ్రికా అజేయంగా 'సూపర్–8'కు చేరింది. 'సూపర్–8'లోనూ తమ జోరు కొనసాగిస్తూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి నాకౌట్ పోరుకు సై అంటోంది. దక్షిణాఫ్రికా ఇదివరకే సెమీస్ చేరడంతో.... జింబాబ్వేతో ఆదివారం జరిగిన గ్రూప్–1 'సూపర్–8' నామమాత్రమైంది. అయినప్పటికీ సమష్టి ఆటతీరుతో మెరిపించిన మార్క్‌రమ్ బృందం 5 వికెట్ల తేడాతో జింబాబ్వేపై గెలుపొంది ఈ టోర్నీలో వరుసగా ఏడో విజయం నమోదు చేసింది. కోల్‌కతాలో బుధవారం జరిగే తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్ జట్టుతో దక్షిణాఫ్రికా తలపడుతుంది. సెమీఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే కేటాయించారు.

దక్షిణాఫ్రికాతో పోరులో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (43 బంతుల్లో 73; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. కార్బిన్ బాష్, మఫాక చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసి గెలిచింది. బ్రెవిస్ (18 బంతుల్లో 42; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారీ సిక్స్‌లతో విరుచుకుపడగా, జార్జ్ లిండే (21 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. బ్రెవిస్ అవుటయ్యాక లిండే, స్టబ్స్ ఆరో వికెట్‌కు అజేయంగా 53 పరుగులు జోడించి దక్షిణాఫ్రికాను విజయతీరాలకు చేర్చారు. బౌలింగ్‌లోనూ 3 వికెట్లు తీసిన జింబాబ్వే కెప్టెన్ రజాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

సికందర్ రజా

5 టి20 ప్రపంచకప్ చరిత్రలో సికందర్ రజా అందుకున్న 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో అత్యధిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారాలు నెగ్గిన జాబితాలో విరాట్ కోహ్లి (8), ఆడమ్ జంపా (6) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. మూడో స్థానంలో షేన్ వాట్సన్, క్రిస్ గేల్, జయవర్ధనే, సికందర్ రజా (5 చొప్పున) ఉన్నారు.

స్కోరు వివరాలు

జింబాబ్వే ఇన్నింగ్స్: మరుమని (బి) మఫాక 7; బెనెట్ (సి) మార్క్‌రమ్ (బి) నోర్జే 15; మైయెర్స్ (సి) బ్రెవిస్ (బి) లిండే 11; సికందర్ రజా (సి) మిల్లర్ (బి) మఫాక 73; బర్ల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఎన్‌గిడి 5; మున్‌యోంగా (బి) బాష్ 2; మడండె (నాటౌట్) 26; ఇవాన్స్ (బి) బాష్ 8; మసకద్జా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 153. వికెట్ల పతనం:** 1–14, 2–28, 3–66, 4–82, 5–87, 6–126, 7–146. **బౌలింగ్:** లిండే 3–0–22–1, మఫాక 4–0–21–2, ఎన్‌గిడి 4–0–29–1, నోర్జే 4–0–29–1, బాష్ 4–0–40–2, మార్క్‌రమ్ 1–0–11–0. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (బి) సికందర్ రజా 4; డికాక్ (సి) మరుమని (బి) సికందర్ రజా 0; రికెల్టన్ (సి) బర్ల్ (బి) ఇవాన్స్ 31; బ్రెవిస్ (సి) బర్ల్ (బి) సికందర్ రజా 42; మిల్లర్ (సి) మైయెర్స్ (బి) ముజరబాని 22; స్టబ్స్ (నాటౌట్) 21; లిండే (నాటౌట్) 30; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.5 ఓవర్లలో 5 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1–1, 2–14, 3–43, 4–93, 5–101. **బౌలింగ్:** సికందర్ రజా 4–0–29–3, ముజరబాని 3.5–0–32–1, ఇవాన్స్ 3–0–22–1, క్రెమర్ 2–0–27–0, మసకద్జా 2–0–23–0, బర్ల్ 2–0–12–0, బెనెట్ 1–0–9–0.

బ్రెవిస్

అలీసా హీలీ

ఆస్ట్రేలియా 'హ్యాట్రిక్'

- మూడో వన్డేలోనూ భారత మహిళల జట్టు ఓటమి
- 'శత'క్కొట్టిన అలీసా హీలీ, బెత్ మూనీ
- ఇరు జట్ల మధ్య 6 నుంచి పెర్త్‌లో ఏకైక టెస్టు

హోబర్ట్: ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా టి20 సిరీస్ చేజిక్కించుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు... వన్డే సిరీస్‌లో 'వైట్‌వాష్'కు గురైంది. ఇప్పటికే తొలి రెండు వన్డేలు ఓడి సిరీస్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు... చివరి మ్యాచ్‌లోనూ పరాజయం పాలైంది. ఆదివారం జరిగిన ఈ పోరులో వన్డే ప్రపంచ చాంపియన్ టీమిండియాపై 185 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించి 3–0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా... నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 409 పరుగులు చేసింది. కెరీర్‌లో చివరి వన్డే ఆడిన ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ (98 బంతుల్లో 158; 27 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు శతకం చేసింది. బెత్ మూనీ (84 బంతుల్లో 106 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో ఆకట్టుకోగా... జార్జియా వోల్ (52 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీ సాధించింది. ఆఖర్లో నికోలా కేరీ (15 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ షాట్‌లతో స్కోరును నాలుగొందలు దాటించింది. భారత బౌలర్లలో శ్రీచరణి, స్నేహ రాణా చెరో 2 వికెట్లు పడగొట్టారు. తెలుగమ్మాయి శ్రీచరణి 10 ఓవర్లలో 106 పరుగులిచ్చింది. తద్వారా అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు ఇచ్చుకున్న భారత బౌలర్‌గా చెత్త రికార్డును ఆమె మూటగట్టుకుంది.

వరుస వికెట్లు కోల్పోయి...

అనంతరం భారీ లక్ష్యఛేదనలో టీమిండియా తడబడింది. 45.1 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌటైంది. కొండంత లక్ష్యఛేదనలో టీమిండియా ఏ దశలోనూ పోటీలో కనిపించలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన హర్మన్ బృందం లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (0) డకౌట్ కాగా... ప్రతీక రావల్ (27; 6 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (29 బంతుల్లో 42; 9 ఫోర్లు) కాస్త పోరాడారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 35 బంతుల్లో 54 పరుగులు జోడించారు. ఆ తర్వాత వచ్చిన వాళ్లు దాన్ని కొనసాగించలేకపోయారు.కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (25; 2 ఫోర్లు), హర్లీన్ డియోల్ (14), దీప్తి శర్మ (29; 2 ఫోర్లు), రిచా ఘోష్ (18; 2 ఫోర్లు, 1 సిక్స్) విఫలమయ్యారు. స్నేహ రాణా (74 బంతుల్లో 44; 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలినవాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో అలానా కింగ్ 4 వికెట్లు పడగొట్టింది. అలీసా హీలీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 6 నుంచి పెర్త్‌లో ఏకైక టెస్టు జరగనుంది. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ వన్డేలకు గుడ్‌బై చెప్పిన అలీసా తన కెరీర్‌లో 126 వన్డేలు ఆడి 3777 పరుగులు చేసింది. ఇందులో 8 సెంచరీలు, 19 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

A student noted the number of cars passing through ...

STATISTICS

- Class mark $= \frac{\text{Upper Limit} + \text{Lower Limit}}{2}$
- Mean of ungrouped data $= \frac{\text{Sum of observations}}{\text{No.of observations}}$
- $x_1, x_2, \dots x_n$ be observations with respective frequencies $f_1, f_2, \dots f_n$ then the mean of the data $\bar{x} = \frac{f_1x_1 + f_2x_2 + \dots + f_nx_n}{f_1 + f_2 + \dots + f_n} = \frac{\Sigma f_i x_i}{\Sigma f_i}$

Mean of Grouped Data

i. Direct Method

mean $\bar{x} = \frac{\Sigma f_i x_i}{\Sigma f_i}$

f_i = frequency of ith class interval
x_i = class mark of ith class interval
Σf_i = sum of frequencies

ii. Assumed Mean Method

mean $\bar{x} = a + \frac{\Sigma f_i d_i}{\Sigma f_i}$

In this method choose one among the x_i's as the assumed mean, and denote it by 'a'.
deviation $d_i = x_i - a$
Σf_i = sum of frequencies

iii. Step - Deviation Method

mean $\bar{x} = a + \left(\frac{\Sigma f_i u_i}{\Sigma f_i}\right) \times h$

where 'a' is the assumed mean and h is the class size.

$u_i = \frac{x_i - a}{h}$, Σf_i = sum of frequencies.

MODE

A mode is that value among the observations which occurs frequently
Ex: The mode of 4, 9, 5, 6, 5, 8, 6, 5, 5, is 5
In a grouped frequency distribution.

Mode $= L + \left(\frac{f_1 - f_o}{2f_1 - f_o - f_2}\right) \times h$

The class with the maximum frequency is called the 'model class'. The 'mode' lies in this class.
L = lower limit of the modal class
h = Size of the modal class interval
f_1 = frequency of the modal class
f_0 = frequency of the class preceding the modal class.
f_2 = frequency of the class succeeding the model class.

MEDIAN

- The median of a data is the value of the middle - most observation.
- For finding the median of ungrouped data, we first arrange the data values of the observations in the ascending of descending order. Then
  i) If 'n' is odd, then median $= \left(\frac{n+1}{2}\right)^{th}$ observation.
  ii) If 'n' is even, then the median will be the average of the $\left(\frac{n}{2}\right)^{th}$ and $\left(\frac{n}{2}+1\right)^{th}$
  $\left(\frac{n}{2}\right)^{th}$ and $\left(\frac{n}{2}+1\right)^{th}$ observations.
- Median of grouped data $= L + \left(\frac{\frac{n}{2} - cf}{f}\right) \times h$

The class whose cumulative frequency exceeds $\frac{n}{2}$ for the first time. This is called the median class.
L = lower boundary of median class.
h = class size
cf = cumulative frequency of class. preceding the median class.
f = frequency of median class.
n = number of observations.

- Mean is the most frequently used measure of central tendency as it takes into account all the observations. However, it is affected by the extreme values.
- Median is a more appropriate measure of central tendency where individual observations are not important and we wish to find out a 'typical' observation.
- Mode is the best measure of central tendency in those situations where we require to identify the most frequent value of most popular item.

1 MARK QUESTIONS

1. Median $= L + \left(\frac{\frac{n}{2} - cf}{f}\right) \times h$, where cf = —— (A)
   A) Cumulative frequency of the class preceding the median
   B) Cumulative frequency of the median class
   C) Cumulative frequency of the class succeedding the median
   D) Sum of frequencies

2. **For the following distribution**

class	0 – 5	5 – 10	10 – 15	15 – 20	20 – 25
frequency	10	15	12	20	9

Find the lower limit of modal class

Sol: Here the maximum class frequency is 20, and the class corresponding to this frequency is 15 – 20
∴ The modal class is 15 – 20
Lower limit of modal class = 15

3. **In a test, Sagar got 20, 11, 23, 14, 21, 25 marks in different subjects. Find the mean.**

Sol: A) Mean $= \frac{\text{Sum of observations}}{\text{No.of observations}}$

$\frac{20+11+23+14+21+25}{6} = \frac{114}{6} = 19$

4. **Find the mode of the data**
20, 3, 7, 13, 3, 4, 6, 7, 19, 15, 7, 18, 3.

Sol: A mode is that value among the observations which occurs most frequently given data
20, 3, 7, 13, 3, 4, 6, 7, 19, 15, 7, 18, 3.
Let us arrange the observations in order i.e. 3, 3, 3, 4, 6, 7, 7, 7, 13, 15, 18, 19, 20
Clearly we know that 3 and 7 occurs most frequently (3 times)
∴ mode = 3 and 7.

5. **Find the median of the observations**
6, 49, 14, 46, 16, 42, 26, 32, 28.

Sol: Let us arrange the observations in ascending order.
i.e.
6, 14, 16, 26, 28, 32, 42, 46, 49.
Median = middle most observation = 28
(∵ If No. of observations (n) is odd (9) then the $= \left(\frac{n+1}{2}\right)^{th}$ i.e. $\left(\frac{9+1}{2}\right)^{th}$
i.e. 5th observation is the median.)

6. **Write the formula to find the median of a grouped data and explain the terms in it.**

Sol: Median $= l + \frac{\left(\frac{n}{2} - cf\right)}{f} \times h$

l = lower boundary of median class
n = number of observations
cf = cumulative frequency of class preceding the median class
f = frequency of median class
h = class size

7. **Mean and median of a grouped data are 35 and 33 respectively. Using empirical relation find the mode of the data**

Sol: Mode = 3 Median – 2 Mean
= 3 × 33 – 2 × 35 = 99 – 70 = 29.

8. **For the following distribution**

Class	20-30	30-40	40-50	50-60	60-70
Frequency	13	12	20	11	15

Find the Modal Class

Sol: Highest frequency class can be treated as the model class.
Here highest frequency is 20
Modal Class : 40-50

4 MARKS QUESTIONS

1. **For the following distribution**

class	0 – 5	5 – 10	10 – 15	15 – 20	20 – 25
frequency	10	15	12	20	9

Find the median class

Sol: sum of frequency n = 10 + 15 + 12 + 20+9 = 66

$\frac{n}{2} = \frac{66}{2} = 33$

Class	*frequency*	*cf*
0 – 5	10	10
5 – 10	15	25
10 -15	**12**	**37**
15 – 20	20	57
20 – 25	9	66

n = 66

$\frac{n}{2} = \frac{66}{2} = 33$ ∴ *Median class* = 10 – 15

Locate the class whose cumulative frequency is greater then n/2 is called median class.

2. **Prepare less than cumulative frequency and also greater than cumulative frequency for the following distribution**

Continued on next page..

Class interval	5-10	10-15	15-20	20-25	25-30	30-35	35-40
Frequency	2	12	2	4	3	4	3

Sol:

Class interval CI	frequency f	less than cumulative frequency	greterthan cumulative frequency
5-10	2	2	30
10-15	12	14	28
15-20	2	16	16
20-25	4	20	14
25-30	3	23	10
30-35	4	27	7
35-40	3	30	3

8 MARKS QUESTIONS

1. A student noted the number of cars passing through a spot on a road for 100 periods each of 3 minutes and summarised it in the table given below. Find the mode of the data.

No. of cars	0 – 10	10 – 20	20 – 30	30 – 40	40 – 50	50 – 60	60 – 70	70 – 80
fraquency	7	14	13	12	20	11	15	8

Sol:

No.of cars	*frequency*
0 – 10	7
10 – 20	14
20 – 30	13
30 – 40	$12(f_0)$
40 – 50	$20(f_1)$
50 – 60	$11(f_2)$
60 – 70	15
70 – 80	8

We can only locate a class with the maximum frequency, called the modal class maximum of frequency is 20

∴ modal class = 40 – 50

f_1 = frequency of the modal class = 20

L = lower limit of modal class = 40

h = size of the model class internal = 10

f_0 = frequency of the class preceding the modal class = 12

f_2 = frequency of the class succeeding modal class = 11

$$\text{mode } = l + \frac{f_1 - f_0}{2f_1 - f_0 - f_2} \times h$$

$$= 40 + \frac{20 - 12}{2 \times 20 - 12 - 11} \times 10$$

$$= 40 + \frac{8}{17} \times 10 = 40 + 4.7 \quad = 44.7 \text{ (Aprroxmatly)}$$

2. The following table gives the literacy rate (in percentage) of 35 cities. Find the mean literacy rate.

Literacy rate in%	45-55	55-65	65-75	75-85	85-95
Number of cities	3	10	11	8	3

Literacy rate in% (C.I.)	Numbers of cities f_i	class mark x_i	$d_i = x_i - 70$	$u_i = \frac{x_i - a}{h}$	f_ix_i	f_id_i	f_iu_i
45-55	3	50	−20	−2	150	−60	−6
55-65	10	60	−10	−1	600	−100	−10
65-75	11	70 (a)	0	0	770	0	0
75-85	8	80	10	1	640	80	8
85-95	3	90	20	2	270	60	6
	$\Sigma f_i = 35$				$\Sigma f_ix_i = 2430$	$\Sigma f_id_i = -20$	$\Sigma f_iu_i = -2$

A) **i) Direct Method**

$$\text{Mean } \bar{x} = \frac{\Sigma f_i x_i}{\Sigma f_i}$$

$$= \frac{2430}{35} = 69.428$$

ii) Assumed mean method

Assumed mean a = 70

$$\text{Mean } (\bar{x}) = a + \frac{\sum f_i d_i}{\sum f_i}$$

$$= 70 + \frac{(-20)}{35} = 70 - 0.57 = 69.43$$

iii) Step - Deviation method

Class size

(h) = 10

$$\text{Mean } (\bar{x}) = a + \frac{\sum f_i u_i}{\sum f_i} \times h$$

$$= 70 + \frac{(-2)}{35} \times 10$$

= 70 – 0.57 = 69.43

Note: *In public exams use any one method to find mean.*

3. The following distribution shows the daily pocket allowance of children of a locality. The mean pocket allowance is Rs.18. Find the missing frequency f.

Daily pocket allowance (Rs)	No. of children
11 - 13	7
13 - 15	6
15 - 17	9
17 - 19	13
19 - 21	f
21 - 23	5
23 - 25	4

Sol:

daily pocket allowance (C.I.)	No. of children (f_i)	class mark(x_i)	f_ix_i
11-13	7	12	84
13-15	6	14	84
15-17	9	16	144
17-19	13	18	234
19-21	f	20	20f
21-23	5	22	110
23-25	4	24	96

$\Sigma f_i = 44 + f \quad \Sigma f_ix_i = 752 + 20f$

$$\text{Mean } \left(\bar{x}\right) = \frac{\Sigma f_i x_i}{\Sigma f_i}$$

$$18 = \frac{752 + 20f}{44 + f}$$

⇒ 18 (44+f) = 752 + 20f

⇒ 792 + 18f = 752 + 20f

⇒ 20f – 18f = 792 – 752

⇒ 2f = 40

$$\Rightarrow f = \frac{40}{2} = 20$$

4. The following data gives the information on the observed life times (in hours) of 225 electrical components.

Life times (in hrs)	Frequency
0-20	10
20-40	35
40-60	52
60-80	61
80-100	38
100-120	29

Determine the modal life times of the components.

Sol: We can only locate a class with the maximum frequency, called the modal class.

Life times (in hours) (C.I.)	frequency (f)
0-20	10
20-40	35
40-60	52 (f_0)
60-80	61 (f_1)
80-100	38 (f_2)
100-120	29

Modal class 60-80

L= Lower boundary of the modal class = 60

h = Size of the modal class interval = 20

f_1 = Frequency of the modal class = 61

f_0 = Frequency of the class preceding the modal class = 52

f_2 = Frequency of the class succeeding the modal class = 38

$$\text{Mode } = L + \frac{f_1 - f_0}{2f_1 - f_0 - f_2} \times h$$

$$= 60 + \frac{(61 - 52)}{2 \times 61 - 52 - 38} \times 20$$

$$60 + \frac{9 \times 20}{32} = 60 + 5.625 = 65.625$$

∴ Modal life time = 65.625 hrs.

5. The distribution gives the weights of 30 students of a class. Find the median weight of the students.

Weight (in kgs)	No. of students
40-45	2
45-50	3
50-55	8
55-60	6
60-65	6
65-70	3
70-75	2

Sol:

weight (in kgs) C.I.	Number of students (f)	cumulative frequency
40-45	2	2
45-50	3	5
50-55	8	13 (cf)
55-60	6(f)	19
60-65	6	25
65-70	3	28
70-75	2	30

n = 30,

$$\frac{n}{2} = \frac{30}{2} = 15$$

Now 55-60 is the class whose cumulative frequency 19 is greater than (and nearest to) $\frac{n}{2}$ (i.e., 15)

∴ 55-60 is the median class.

L = Lower boundary of median class = 55

n = No. of observations = 30

cf = Cumulative frequency of class preceding the median class = 13

f = Frequency of median class = 6

h = class size = 5

$$\text{Median } = L + \frac{\left(\frac{n}{2} - cf\right)}{f} \times h$$

$$= 55 + \frac{(15 - 13)}{6} \times 5 \quad = 55 + \frac{5}{3}$$

= 55 + 1.67

= 56.67 (approximately)

Hence the median weight of the students = 56.67 (approx).

Y. Vanamraj
Subject Expert
Kurnool

'మహిళల హక్కుల కోసం చేసే పోరాటం కేవలం వ్యక్తిగత స్వేచ్ఛ కోసం చేసే పోరాటం కాదు, సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం'
- క్లారా జెట్కిన్

విధుల్లో కంతి రాణి..

సాఫ్ట్‌వేర్ రంగంలో 'నైట్ డ్యూటీ' అనే మాట వింటూనే ఉంటాం. బతుకు పోరాటంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డును ఊడ్చే మహిళా స్వీపర్లు రాత్రిపూట విధులను నిర్వర్తిస్తుంటారు. సికింద్రాబాద్‌లోని రేతిఫైల్ బస్ స్టేషన్ పరిసరాలలో రాత్రి రెండు గంటల సమయంలో రోడ్డును ఊడుస్తూ కనిపించింది కంతి రాణి. కాసేపు ఆమెతో మాట కలిపితే ఒంటిచేత్తో బతుకుబండిని ఎలా లాక్కొస్తుందో ఇలా మన ముందు ఆవిష్కరించింది..

చీకటి - వెలుగులు

''కష్టాలు వచ్చాయని ఆగిపోతామా? చావో బతుకో తేల్చుకోవాలి. రాత్రిపూట రోడ్డమీద పని అంటే మాకు భయమే ఉంటుంది. కానీ, బతుకు భయం అంతకన్నా పెద్దది. అందుకే, ధైర్యంగానే ఈ పని చేస్తుంటాం. రాత్రి ఏడు గంటలకు డ్యూటీలో చేరితే, మళ్లా తెల్లారి ఐదున్నర అయితది డ్యూటీ దిగేసరికి. ఇంటికి చేరేసరికి ఏడు గంటలు. రాత్రంతా రోడ్లు ఊడ్చి ఊడ్చి దుమ్ము కొట్టుకుపోయి ఉంటాం. అందుకని, ముందుగా స్నానం చేసి, ఇంటి పనులు చేసుకొని, ఇంట్ల వాళ్లకు ఇంత వండి పెట్టి, నేను తిని, పగటీల పన్నెండు గంటలకు పడుకుంటా. మళ్లా సాయంకాలం ఐదు గంటలకు లేచి, పనులు చేసుకొని, ఏడు గంటలకు డ్యూటీకి పోత. పదహారేళ్లుగా ఇదే నా పని.

ఒంటి చేతి కష్టమే!

మా ఊరు జనగాం దగ్గర వెలిగొండ. చిన్నతనంలోనే మా అమ్మనాయిన నాకు పెండ్లి చేశారు. మా అమ్మనాయినకు ముగ్గురు ఆడపిల్లలం, ఓ మగ పిల్లాడు. నా భర్త పేరు ఐక్రయ్య. మా నాయిన సొంత అక్క కొడుకు. చిన్నప్పుడు బావిలో పడి, ఓ కాలు పనిచేయదు. 'కాలు సరిగా పనిచేయని వానికి ఎవరూ పెండ్లి చేసుకోరు' అని నన్ను ఇచ్చి పెళ్లి చేసిండు మా నాయిన. నా పెళ్లి నాటికి నాకు పదిహేనేండ్లు కూడా లేవు. పెళ్లైన కొన్నాళ్లకు [illegible]. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిండ్రు. బతుకుదెరువు కష్టమైతే హైదరాబాద్ వచ్చినం. మొదట హౌజింగ్ బోర్డ్ ఏరియాలో ఉండేవాళ్లం. అక్కడే ఉప్పర్ పనికి పోయిన, ఇండ్లల్ల పనిచేసిన. మా ఆయన పనికెళితే, పడిపోయేటోడు. దీంతో నేనే ఆయన్ని ఇంట్లో ఉంచి, పిల్లలను స్కూల్‌కు పంపించి, పనికి పోయేదాన్ని. ఆ తర్వాత తెలిసినవాళ్ల ద్వారా స్వీపర్ పనిలో చేరిన. అప్పుడు యాప్రాల్‌లోని బాలాజీ నగర్‌కి వచ్చినం. ఇక్కడ ఇల్లు తీసుకొని ఉన్నం. పిల్లలను పదోతరగతి వరకు చదివించిన. ఆ తర్వాత పెండ్లిండ్లు చేసిన. అన్నీ ఒంటి చేత్తోనే.

కలిగిన దాంట్లో సాయం...

మా అక్కచెల్లెళ్లలో ఒక చెల్లెలికి, భర్త చనిపోయి మస్తు కష్టపడతుంది. తమ్మునికి ముగ్గురు ఆడపిల్లలు. తమ్ముడికి ఆరోగ్యం బాలేక చనిపోయాడు. దీంతో మా మరదలు పిల్లలను పెండ్లిచేయడానికి మా లెక్కనే కష్టపడుతుంది. అందుకని నాకు కలిగిన దాంట్లో వాళ్లకు సాయం చేస్తుంటాను. పిల్లల పెండ్లిండ్లకు అప్పు అయ్యింది, మెల్లగా తీర్చుకుంటున్న.

పండగొస్తే మహా కష్టం..

బోనాలు, వినాయక చవితి, జెండా పండగల సమయాలలో, పెద్ద పెద్ద సభలు జరిగినప్పుడు .. చాలా పని ఉంటది. ఎంతంటే... మాపని ఘోరం అని చెప్పన్నూ. గుడుల దగ్గర, స్టేషన్, ట్యాంక్‌బండ్.. వేరే వేరే చోట్లల్లా డ్యూటీ ఉంటుంది. ఆ రోజుల్లో చెత్త చానా ఎక్కువ ఉంటుంది. ఊడ్చి ఊడ్చి చేయి రెక్కలు బాగా నొప్పి పెడతాయి.

ప్రాణాలు అరచేతిలోనే..

యాక్సిడెంట్లు అవుతుంటాయి. అర్ధరాత్రి దాటిందంటే ట్రాఫిక్ ఉండదు కదా! బండ్లు, వ్యానులు మస్తు స్పీడ్‌గా పోతుంటాయి. ఆ సమయంలో రోడ్లు దాటుతుండగా, ఊడుస్తుండగా యాక్సిడెంట్లు అయినయి. మా గ్రూప్‌లోనే నలుగురైదుగురు చనిపోయారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేస్తుంటాం. ఇది కాకుండా తాగినోళ్లు ఉంటారు. తాగి, రోడ్డు పక్కనే పడిపోయిన వాళ్లు ఉంటారు. వాళ్లను లేపలేము.. ఆ మత్తులో గలీజు మాటలు అనేటోళ్లు ఉంటారు. తిడుతుంటరు. మీద మీదకు వస్తుంటరు. పోలీసులు ఉంటారు. కానీ, రోజూ వాళ్లకు ఎన్నని చెబుతం. అందుకే, అలాంటోళ్ల నుంచి దూరంగా ఉంటూ మా పని మేం చేసుకుంటూ పోతుంటం. బతుకుదెరువు కోసం తప్పదు, అన్నీ భరిస్తాం. మా గ్రూప్‌లో పదిహేను మంది దాకా ఉంటాం. అందరివీ సమస్యలే. నెలకు నాలుగు రోజులు సెలవులు ఉంటాయి. అంతకు మించి ఒక్కరోజు సెలవు తీసుకున్నా జీతం కట్ అవుతది. నెలంతా ఊడ్చితే పదివేల రూపాయల దాకా వస్తాయి. అందులోనే అన్నీ సర్దుకుంటాం. ఇప్పుడంటే నా పిల్లలు పెద్దోళ్ళు అయ్యారు. చిన్న చిన్న పిల్లలున్న తల్లుల కష్టం ఇంకా పెద్దది.

ఒకరికి ఒకరం...

మా గ్రూప్ వాళ్లం కలిసినప్పుడు ఒకరి కష్టాలు ఒకరం చెప్పుకుంటాం. కానీ, ఎవరి కష్టాలు వారివే. ఊడ్చి ఊడ్చి మెడలు గుంజుతాయి. మళ్లీ ఇంటికొచ్చి పనులు చేసుకోవాలి. ఈ పనిలో చేరిన కొత్తలో చేతనైంత కాలం పని చేసుకోవచ్చు అన్నారు. కానీ, అరవై ఏళ్లు దాటినవాళ్లు పని నుంచి దిగిపోయారు. వాళ్లకు పెన్షన్ ఏమీ లేదు. కానీ, వాళ్ల ఇంట్ల బిడ్డకో, కొడుకుకో మళ్లీ స్వీపర్ పని ఇస్తరు' అంటూ రాత్రిళ్లు రోడ్లు ఊడ్చే పనుల్లోని చీకట్లను, బతుకులో నింపుకుంటున్న వెలుగును పంచుకుంది రాణి.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వేదకాలం నుంచి నేటి కాలం వరకు...

విదుషీమణులు



ప్రాచీన కాలంలో, అంటే క్రీ.పూ.3000 సంవత్సరాల ముందు కాలం నుండీ కూడా మన దేశం 'స్త్రీ విద్య' ను ప్రోత్సహించి, గౌరవించింది. ఆనాటి నుండీ స్త్రీలు లౌకిక, అలౌకిక విద్యలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. వేదకాలంలోనే మహిళలు ఉపనయన సంస్కారాలు పొంది, వేదాధ్యయనం చేశారు. వేద మంత్రాలు దర్శించారు. తపస్వినులు, ఆధ్యాత్మికవేత్తలైన స్త్రీలను 'ఋషికలు' అంటారు. రోమశ, గార్గి వాచక్నవి, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, ఇంద్రాణి, మైత్రేయి, అపాల, యామి, పౌలోమి, ఘోష, ఖోన, జుహూ, వాగంభ్రణి, సావిత్రి, దేవజామి, కక్షివతి, దక్షిణ ప్రజాపత్య, విశ్వావతి, పశుక్రపత్ని, దేవసూని, శాశ్వతి, అంగీరసి, శ్రీలక్ష్మి, నోధ, శిఖతస్వరి, గౌపాయన, ఉభయభారతి, విజ్జిక, కామాక్షి వంటి స్త్రీలందరూ ఋషికలే. గృహజీవనానికి స్త్రీయే పునాది అని ఋగ్వేదం చెప్పింది. శక్తిస్వరూపిణి అయిన స్త్రీని గౌరవించి, ఆరాధించే సంస్కృతి మనది. పరబ్రహ్మలోని స్త్రీ పరమైన గుణాలు, శక్తులు కలిసి 'స్త్రీ దేవతలు' అవతరించారు. వారి గురించి తెలుసుకుందాం.

లోపాముద్ర: అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర సంస్కృత, తమిళ భాషలలో నిష్ణాతురాలు. లోపాముద్ర అంటే తనలో తానే లీనమైన ఆత్మనిష్ఠాపరురాలు అని అర్థం. అగస్త్యునికి, లోపాముద్రకు మధ్య జరిగిన సంవాదం, లోపాముద్ర పాండిత్యం, గెలుపును ఋగ్వేదం ప్రశంసించింది. అగస్త్యుడు, లోపాముద్ర సాహచర్యంలో సంవాదాలలో భౌతిక, ఆధ్యాత్మిక జీవితంలోని పవిత్రతను, పూర్ణత్వాన్ని గ్రహించాడని చెబుతారు.

ఘోష: ఆమె దుర్గతమసుని మనుమరాలు. కక్షివంతుని కూతురు. దేవ వైద్యులైన అశ్వనీ కుమారులను స్తుతిస్తూ ఆ తండ్రీ కుమా రులు అనేక శ్లోకాలు రచించారు. పదవ ప్రకరణంలోని కొన్ని శ్లోకాలను తండ్రి, తాతగార్లతో సమానంగా ఘోష రచించింది. వాటిలోని ఒక శ్లోకంలో ఆమె అశ్వినులను వివాహం చేసుకోవాలనే ఆకాంక్షను వెల్లడిస్తుంది. కుష్ఠువ్యాధిచే కురూపి అయిన ఆమెను అశ్వనీ దే వతలు తమ వైద్యంతో ఆరోగ్యవంతురాలిని, అందగత్తెను చేసి పెండ్లి చేసు కొంటారు.

ఋగ్వేద మంత్ర ద్రష్ట మైత్రేయి: గొప్ప తాత్వికురాలు, ఋషిక అయిన మైత్రేయి కూడా ఋగ్వేద మంత్రాలను దర్శించింది. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వ, ఆధ్యాత్మిక ఆలోచనలను పరిణితి చెందేలా చేయడంలో ప్రధానపాత్ర వహించింది. యాజ్ఞవల్క్యునికి కాత్యాయని అనే రెండవ భార్య కూడా ఉంది. ధర్మశాస్త్రాలు, వేదాలు బాగా చదివి, బ్రహ్మవాదినిగా మైత్రేయి ఘనత వహిస్తే, కాత్యాయని ఒక సాధారణ ఇల్లాలిగానే ఉండింది. ప్రాపంచిక చింతనలు విడిచి, సన్యాసికి అనువైన స్వీయ నియంత్రణ, సన్యాసి ప్రతిజ్ఞా పాలన చేయదలచి యాజ్ఞవల్క్యుడు ఒకరోజు తన ప్రాపంచిక ఆస్తిపాస్తులను తన ఇద్దరు భార్యలకు పంచదలిచాడు. ప్రపంచ సంపద తనకు శాశ్వతత్వాన్ని, ముక్తిని ఇవ్వలేదని భావించి మైత్రేయి తన భర్త నుండి కేవలం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ముముక్షత్వానికి కావలసిన శిక్షణను కోరుకొని మరీ పొందింది.



బ్రహ్మజ్ఞాని గార్గి: వాచక్న మహర్షి కూతురు, వైదిక ప్రవక్త గార్గి. మానవ అస్తిత్వానికి, ఉనికికి, జీవితానికి మూలమేమిటి అనే అంశంపై గార్గి అనేక వేదమంత్రాలను దర్శించింది. ఎందరో వేదాంత వేత్తలను వాదంలో గెలిచిన యాజ్ఞవల్క్యునికి ఆత్మానాత్మల విచారం గురించి, బ్రహ్మ జ్ఞానం గురించి అనేక ప్రశ్నలను సంధించి గార్గి ఆయనను ముప్పుతిప్పలు పెట్టింది.

గొప్ప విజ్ఞాని ఉభయభారతి: మధ్యయుగంలో తత్వవేత్త, మీమాంస, అద్వైత దర్శనాలలో ప్రవీణుడైన మండనమిశ్రుని భార్య అయిన ఉభయభారతి ఒక గొప్ప విజ్ఞాని. శ్రీ ఆదిశంకరాచార్యులకు, మండనమిశ్రునికి మధ్య జరిగిన అద్వైత సిద్ధాంత సంబంధిత వాదోపవాదాలకు ఆమె న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. పక్షపాత రహితంగా ఆ వాదనలలో తన భర్తను కాక, ఆదిశంకరులనే విజేతగా ప్రకటించిన విదుషీమణి ఆమె.

ఆళ్వార్ ఆండాళ్: ఇంకా ఆ యుగంలో 'తిరుప్పావై ' అనే భక్తి గీతాలను వ్రాసిన మొదటి మహిళా ఆళ్వార్ అండాళ్. స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వంపై కవితలు వ్రాసిన కర్నాటకలోని శివ భక్తురాలు అక్క మహాదేవి. రాజస్థాన్ లోని కృష్ణ భక్తురాలు, సాంఘిక దురాచారాలను ప్రతిఘటించిన కవయిత్రి మీరాబాయి, సరళ భాషలో వేదాంతపరమైన నిగూఢార్థాలు చాటిచెప్పిన తత్వవేత్త లాలాదేవి, గ్రామీణుల సాధారణ జ్ఞానాన్ని వేదాంత విజ్ఞానంతో అనుసంధిస్తూ రచనలు చేసిన తమిళ కవయిత్రి అవ్వయ్యార్, ఇంకా సక్కుబాయి, ముక్తాబాయి, మదాలస, ఈ మధ్యకాలంలో తరిగొండ వెంగమాంబ, ఆదోని లక్ష్మమ్మ, జిల్లెళ్ళమూడి అనసూయమ్మ మొదలైన యోగినులు, అంతర్బుద్ధి సిద్ధులైన మహిళలు ఎందరో ఉన్నారు.

విజ్జిక: దండి మహాకవి తన ఒక రచనలో సరస్వతీ దేవిని తెలుపు దేహరంగు ఛ్చాయ కలదిగా వర్ణించాడు. విజయాంబిక (విజ్జిక) అనే కవయిత్రి నలుపురంగుతో ఉండేది. ఆమె దండి అభిప్రాయాన్ని ప్రతిఘటించింది. నల్లని దేహకాంతిగల అపర సరస్వతినైన నా గురించి తెలుసుకోకుండా సరస్వతి ధవళవర్ణిని అని దండికవి ఎలా అంటాడని ఆమె ప్రశ్నించింది. స్త్రీల ఆత్మవిశ్వాసానికి విజ్జిక ఒక ప్రతీక. ఇంకా గంగాదేవి, తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు రసవత్తర కావ్యాలు వెలువరించి పురుషులతో సమానంగా నిలిచినవారే.

ఆధ్యాత్మిక వేత్త గౌతమి: బౌద్ధయుగంలో గౌతమ బుద్ధుని పెంపుడు తల్లి అయిన మహా ప్రజావతి గౌతమి ఒక ఆధ్యాత్మికవేత్త. ఆమె కాక బౌద్ధ వేదాంత ధ్యాన సన్యాసినులు ఖేమ, ఉప్పలావన, రెండవ భాస్కరుని కూతురైన లీలావతి వంటి ఆధ్యాత్మిక వేత్తలైన స్త్రీలుండేవారు.

– డాక్టర్ గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి

సాక్షి సినిమా

● స్వప్నా దత్, ప్రియమణి, సిమ్రాన్, రాధిక, వరలక్ష్మి, పూజా శరత్‌కుమార్

అమ్మాయిలకు ధైర్యాన్నిచ్చే సినిమా సరస్వతి - రాధిక

''సరస్వతి'లాంటి కథ చెప్పడానికి ధైర్యం కావాలి. ఈ కథను వరలక్ష్మి చెప్పడం నాకు గర్వంగా ఉంది. మౌనంగా ఉన్న చాలా మంది అమ్మాయిలకు ధైర్యాన్నిచ్చే సినిమా ఇది. వరలక్ష్మి చేసిన తొలి సినిమా చూసినప్పుడే మంచి నటి అవుతుందనుకున్నాం. అప్పుడే తనకి తెలుగు సినిమాలపై దృష్టి పెట్టమని చెప్పాను. నేను నా బెస్ట్ సినిమాలన్నీ తెలుగులోనే చేశాను'' అని రాధికా శరత్‌కుమార్ అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'సరస్వతి'. వరలక్ష్మీ సోదరి పూజా శరత్‌కుమార్ ఈ సినిమాకు మరో నిర్మాత. ఈ థ్రిల్లర్ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శరత్‌కుమార్ మాట్లాడుతూ– ''నటిగా వరలక్ష్మి విజయంలో నా పాత్ర ఏమీ లేదు. కాకపోతే ఈ ప్రపంచం ఎలా ఉంటుంది? ఎలా నడుచుకోవాలనే విషయాలను మాత్రం తనకు చిన్నప్పటుంచి చెప్తుండేవాడిని. స్త్రీలను గౌరవించడం మనందరి కర్తవ్యం. 'సరస్వతి' మంచి సబ్జెక్ట్. పూజకి ప్రొడక్షన్‌లో మంచి స్కిల్స్ ఉన్నాయి'' అన్నారు. ''ఈ సినిమాలోని ప్రతి పాత్ర అర్థవంతంగా ఉంటుంది. ప్రొడక్షన్ పరంగా ఈ సినిమాను పూజ చాలా కంట్రోల్ చేసింది. మా నాన్నగారిని గర్వపడేలా చేస్తానని నమ్ముతున్నాను. నా భర్త సపోర్ట్‌తోనే ఈ జర్నీ స్టార్ట్ అయ్యింది. ఫస్ట్ టైమ్ మా సినిమాను చూసిన వారు, ఇందులోని ట్విస్ట్‌ను రివీల్ చేయొద్దని కోరుతున్నా'' అన్నారు వరలక్ష్మి. ''మనసులో నిలిచిపోయే కథ ఇది'' అన్నారు ప్రియమణి. ''మా సినిమాను ఆడియన్స్ థియేటర్స్‌కు వచ్చి చూడాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు పూజా శరత్‌కుమార్. ''సరస్వతి' మంచి సినిమాగా నిలిచిపోతుంది'' అని తెలిపారు సిమ్రాన్, స్వప్నా దత్. ''నటిస్తూ, డైరెక్షన్ చేయడమనేది పెద్ద చాలెంజ్. ఈ సినిమా చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని చెప్పారు దర్శకురాలు బి. నందినీ రెడ్డి. ''స్వరస్వతి'లాంటి మంచి సినిమాను వరలక్ష్మి చేయడం ఆనందాన్నిచ్చింది'' అని చెప్పారు ఆమె భర్త నికోలాయ్ సచ్‌దేవ్. నటుడు సప్తగిరి, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడారు.

టీజర్ బాగుంది - మంచు మనోజ్


● గ్రీష్మ, మంచు మనోజ్, నిరంజన్

''రుక్మిణి' సినిమాతో హీరోగా పరిచయమవుతున్న నిరంజన్‌కి ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలి. ఈ మూవీ టీజర్ బాగుంది. డైరెక్షన్, కెమెరా వర్క్, మ్యూజిక్... అన్నీ బాగున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని హీరో మంచు మనోజ్ తెలిపారు. నిరంజన్, గ్రీష్మ నేత్రికా, ప్రియ జస్పర్, దీప్తీ శ్రీరంగం ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'రుక్మిణి'. సింహాచలం గుడుపూరి దర్శకత్వం వహించారు. నేలబల్లి కుమారి సమర్పణలో నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ని మంచు మనోజ్ విడుదల చేశారు. గంగాధర్ రావు మాట్లాడుతూ– ''మోహన్‌బాబుగారి సినిమాలకు అప్రెంటిస్‌గా వర్క్ చేయడంతో నా కెరీర్ మొదలైంది. మంచి కథతో సింహాచలం ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. త్వరలో సినిమాను రిలీజ్ చేస్తాం'' అని పేర్కొన్నారు. సింహాచలం మాట్లాడుతూ– ''హారర్ కామెడీ కథతో రూపొందించిన చిత్రం 'రుక్మిణి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్.

● స్నేహ, అల్లు అర్జున్, శిరీష్, విజయ్ దేవరకొండ, రష్మిక, ఆనంద్

అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్-నయనికల వివాహం ఈ నెల 6న జరగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో అల్లు శిరీష్‌ను పెళ్లి కొడుకుని చేశారు. ఈ వేడుకలో నూతన దంపతులు విజయ్ దేవరకొండ- రష్మికా మందన్నా సందడి చేశారు. ఇదిలా ఉంటే... అల్లు శిరీష్ పెళ్లి కొడుకుని చేసిన వేడుకలో అల్లు కుటుంబ సభ్యులు, రామ్‌చరణ్, సాయిధరమ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

మరో రికార్డ్

విజయ్ దేవరకొండ – రష్మికా మందన్నా (విరోష్)ల వివాహం 'టాక్ ఆఫ్ ది నేషన్' అయిన విషయం తెలిసిందే. ఈ క్రేజీ కపుల్ తమ పెళ్లి రోజు (ఫిబ్రవరి 26) పెళ్లి ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా... తక్కువ సమయంలోనే ఎక్కువ లైక్స్ దక్కించుకున్నాయి. రష్మిక షేర్ చేసిన ఫొటోలకు ఎక్కువ లైక్స్ దక్కాయి. అప్పటివరకూ బాలీవుడ్ కపుల్ సిద్ధార్థ్ మల్హోత్రా–కియారా అద్వానీల పెళ్లి ఫొటోలు అత్యధిక లైక్స్ (15.8 మిలియన్లు) సాధించిన రికార్డ్‌ని సొంతం చేసుకున్నాయి. ఆ రికార్డ్‌ని 18.5 మిలియన్ల లైక్స్‌తో విజయ్–రష్మికల పెళ్లి ఫొటోలు బ్రేక్ చేశాయి. ఆ తర్వాత కూడా లైక్స్ భారీగా పెరిగాయి. ఎంతగా అంటే... 2024లో టీమ్ ఇండియా వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా విరాట్ కోహ్లీ షేర్ చేసిన ఫొటోకు దక్కిన లైక్స్‌ని 'విరోష్' ఫొటోలకు దక్కిన లైక్స్ అధిగమించాయి. విరాట్ ఫొటోకు 23 మిలియన్ల లైక్స్ దక్కగా విరోష్‌కి 25 మిలియన్లకు పైగా లైక్స్ దక్కాయి. దాదాపు రెండున్నర కోట్లకు పైగా లైక్స్ సాధించి, మరో రికార్డ్‌ని సాధించాయి.

దయచేసి ఆహ్వానం లేనివారు రావొద్దు - విరోష్ టీమ్

● ఈ నెల 4న హైదరాబాద్‌లో వెడ్డింగ్ రిసెప్షన్

విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నాల వెడ్డింగ్ రిసెప్షన్ ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో జరగనుంది. పలువురు రాజకీయ ప్రముఖులు, సినీ ప్రముఖులు ఈ వెడ్డింగ్ రిసెప్షన్‌కు హాజరు కానున్న నేపథ్యంలో కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ వేడుక సజావుగా సాగేందుకు ఆహ్వానం ఉన్న అతిథులు మాత్రమే హాజరు కావాలని, ఆహ్వానం లేకుండా వేడుకకు వచ్చి, ఇబ్బందులకు గురి కావొద్దని తెలియజేస్తూ 'విరోష్' టీమ్ ఓ నోట్‌ను రిలీజ్ చేసింది.

''తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చిత్రపరిశ్రమలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖుల కోసం రిసెప్షన్‌ను ప్లాన్ చేయడం జరిగింది. విరోష్ వెడ్డింగ్, రిసెప్షన్‌ల పట్ల దేశవ్యాప్తంగా ఎగ్జైట్‌మెంట్ నెలకొంది. అధికారులతో సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అతిథుల జాబితాను పరిమితం చేయడం జరిగింది. పెద్ద సంఖ్యలో పబ్లిక్ రావడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండటం, అతిథుల భద్రత వంటి అంశాల విషయంలో పోలీసుల సూచనలను పాటిస్తున్నాం. ఈ వేడుక సజావుగా జరిగేందుకు వధూవరులు, వారి బృందం జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆహ్వానం లేనివారు రిసెప్షన్‌కి రావొద్దు. ఒకవేళ వచ్చినా, ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదు'' అని 'విరోష్' టీమ్ ఓ నోట్‌ను రిలీజ్ చేసింది. ''మీ భద్రత, సంతోషమే మాకు ముఖ్యం. మీ ఆశీర్వాదాలు మాకు సంతోషాన్ని ఇస్తున్నాయి. ఈ వేడుక జరిగేందుకు మీ సహాయ సహకారాలు ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మీరు (ఫ్యాన్స్, శ్రేయోభిలాషులు) ఎక్కడున్నా మీ ఆశీర్వాదాలు మాపై ఉంటాయని ఆశిస్తున్నాం'' అని విజయ్–రష్మిక ఈ నోట్‌లో పేర్కొన్నారు.

స్వీట్స్ పంచిన విరోష్

ఆదివారం హైదరాబాద్‌లోని టీటీడీ ఆలయాన్ని సందర్శించి, శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు విజయ్–రష్మిక. అనంతరం అక్కడి భక్తులు, అభిమానులకు స్వీట్ బాక్సులను అందజేశారు.

● 'రణబాలి'లో విజయ్, రష్మిక

గత జన్మలోని పెళ్లి ఫొటోలా ....

విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'రణబాలి'. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో రణబాలి పాత్రలో విజయ్, జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తున్నారు. విజయ్–రష్మికల వివాహం సందర్భంగా ఫిబ్రవరి 28న ఈ చిత్రంలోని 'ఏందయ్యా సామి..' పాట, ఫొటోను రిలీజ్ చేశారు. ఆదివారం ఈ ఫొటో బ్యాక్‌గ్రౌండ్ స్టోరీని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు రాహుల్ సాంకృత్యాన్. ''రణబాలి' చిత్రం నుంచి వెడ్డింగ్ పోస్టర్ రిలీజ్ చేశాం. మన పూర్వీకుల ఫొటోలను మనం గమనిస్తే అవి సహజత్వంతో నిండి ఉంటాయి. ఆ ఫొటోస్‌లో నిజాయితీ కనిపిస్తుంది. అలాంటి నిజాయితీనే ఈ 'రణబాలి' సినిమాలోని ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపించాలని భావించాను. పెళ్లి దుస్తుల్లో విజయ్, రష్మికలు 'రణబాలి' సినిమా సెట్స్‌లో అడుగుపెట్టినప్పుడు నాకు వాళ్లు యాక్టర్స్‌లా అనిపించలేదు. కాలంతో వెనక్కి ట్రావెల్ చేసి, ఆ కాలపు వ్యక్తుల్లా కనిపించారు. సహజత్వం ఉట్టిపడింది. విజయ్–రష్మిక నిజ జీవితంలో ఒక్కటైనప్పుడు 'రణబాలి'లోని వెడ్డింగ్ సీన్‌ను షూట్ చేసిన సందర్భం గుర్తొచ్చింది. కొన్నిసార్లు సినిమా, నిజ జీవితం ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయనిపించింది. 'రణబాలి'లోని వారి పోస్టర్ చూస్తుంటే, వారి గత జన్మలోని పెళ్లి ఫొటోలా అనిపించింది'' అంటూ ఓ లాంగ్ నోట్‌ను షేర్ చేశారు రాహుల్. ''మీ పోస్ట్ నన్ను భావోద్వేగానికి గురి చేసింది. ఈ చిత్రం మన నేల కథ. ఈ సినిమా ప్రయాణంలో నేను, రష్మిక మీతోనే ఉంటాం'' అని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. టీ సిరీస్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరు 11న రిలీజ్ కానుంది.

వాస్తవ ఘటనలతో టూ మచ్

● ప్రియా భవానీ శంకర్

ప్రియా భవానీ శంకర్, ఎం. ఎస్. భాస్కర్, తంబి రామయ్య, అశ్విన్ కుమార్, ఆదిత్య భాస్కర్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'హాట్ స్పాట్ 2 మచ్'. 2024లో ఆహాలో విడుదలైన 'హాట్ స్పాట్'కి రెండో భాగంగా 'హాట్ స్పాట్ 2 మచ్' రూపొందింది. వాస్తవ ఘటనలతో తొలి భాగం రూపొందింది. ఇటీవల కాలంలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనలను ఆధారంగా చేసుకుని, విభిన్న కథాంశాలతో రెండో భాగాన్ని తెరకెక్కించారు దర్శకుడు విఘ్నేష్ కార్తీక్. మోజ్విత్ – మొవిహాన్ సమర్పణలో అనిల్ రెడ్డి .ఎం, ముని చంద్రారెడ్డి. ఎన్, ఇందుకుమార్ .ఎం నిర్మించారు. ఈ చిత్రం ప్రస్తుతం ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (23-2-26 నుంచి 27-2-26 వరకు)

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
పతనం	1528	393
ముగింపు	81,287	25,179

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	22,664	▽	214
డోజోన్స్	48,929	▽	570
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,910	△	64
డాక్స్	25,284	▽	5
షాంఘై	4,162	△	16
నికాయ్	58,850	△	267

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భామసకత	89.11	92.13
£	బ్రిటన్ పౌండ్	భామసకత	120.52	124.92
€	యూరో	భామసకత	104.96	108.93
¥	జపాన్ యెన్ (100)	భామసకత	47.00	60.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భామసకత	62.16	66.10
S$	సింగపూర్ డాలర్	భామసకత	69.58	73.33
SAR	సౌదీ రియాల్	భామసకత	23.36	24.86
UAE D	యూఏఈ దిర్హామ్	భామసకత	23.87	25.13
¥	చైనా యువాన్	భామసకత	12.36	14.19



రోబో సలహాలు.. మంచివే!

దేశంలో వేగంగా పెరుగుతున్న రోబో అడ్వైజర్లు

- ఇన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ మొత్తం ఆటోమేటిక్‌గానే...
- తక్కువ వ్యయాలతో సలహా, నిర్వహణ సేవలు
- యాప్‌లతో ఈజీ కావటంతో ఆకర్షితులవుతున్న యువత
- తొలిసారిగా ఇన్వెస్ట్ చేసే వారు, బిజీగా ఉండే ప్రొఫెషనల్స్‌కి బెటర్

మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారా? సలహాదారులను ఆశ్రయిస్తున్నారా? వారికి చెల్లించాల్సిన ఫీజు ఎక్కువగా ఉందని ఆలోచిస్తున్నారా? సలహాదారులు ఎందుకులే... అనుకుంటూ మీకు తోచినట్లు ఇన్వెస్ట్‌మెంట్లు చేసి చేతులు కాల్చుకుంటున్నారా? పోనీ సలహాదారులు చెప్పినట్లే చేసినా కూడా వారి ఫీజులు పోను పెద్దగా రిటర్న్స్ రావటం లేదా? 'నేను పెట్టేది తక్కువ మొత్తమే కదా! ఆర్థిక సలహాదారులు ఎందుకులే' అని అనుకుంటున్నారా? ఇలాంటి వాటన్నిటికీ సమాధానమే కొత్తతరం రోబో అడ్వైజర్లు. చౌకగా పోర్ట్ ఫోలియోలను నిర్వహించుకోవటమే కాదు... ఆకర్షణీయమైన లాభాలూ సొంత చేసుకోవచ్చు. ఈ తరం ఎక్కువగా ఆసక్తి చూపుతున్న రోబో అడ్వైజర్ల గురించి సమగ్రంగా చెప్పేదే ఈ 'వెల్త్ స్టోరీ'...

దశాబ్దాలుగా ఇన్వెస్టింగ్ చేయడమంటే ఆర్థిక సలహాదారును కలవడమే కాదు. చాంతాడంత ఫారాలూ నింపాల్సి వచ్చేది. అడ్వైజరీ ఫీజులు ఎక్కువే. దీంతో ఇదంతా చాలా పెద్ద వ్యవహారంగా ఉంటూ వస్తోంది. కానీ ఇప్పుడు కొత్త టెక్నాలజీలు రోబో అడ్వైజర్లను తెచ్చాయి. వీటి సాయంతో అత్యంత చౌకగా పోర్ట్‌ఫోలియోలను నిర్మించుకోవటమే కాదు. నిర్వహణ పనులు కూడా అవే చేసిపెడుతున్నాయి.

ఎవరీ రోబో అడ్వైజర్లు..

రోబో అడ్వైజర్లంటే మరెవరో కారు..(కావు). అల్గోరిథమ్‌లను ఉపయోగించి పోర్ట్‌ఫోలియోలను రూపొందించడంతో పాటు నిర్వహణ సేవలూ అందించే ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారాలు. పోర్ట్ ఫోలియో నిర్వహణకు సంబంధించి ఇవి ప్రధానంగా ఇన్వెస్టర్ రిస్కు సామర్థ్యాలను తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు వేస్తాయి. వాటి సమాధానాలను బట్టి ఏ సాధనానికి ఎంత కేటాయించాలనేది వివిధ మోడల్స్‌ని బట్టి సూచిస్తాయి. అలాగే పెట్టుబడి వ్యయాలు తక్కువగా ఉండే సాధనాలను ఎంపిక చేస్తాయి. ఆటోమేటిక్‌గా రీబ్యాలెన్స్ చేస్తాయి. అంతర్జాతీయంగా చూస్తే... బెటర్‌మెంట్, వెల్త్‌ఫ్రంట్, ఫిడిలిటీ గో, సోఫైలాంటి ప్లాట్‌ఫామ్‌లు ఈ విధానాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చాయి. ఈ మోడల్‌లో తమ ఆదాయం, లక్ష్యాలు, రిస్కు సామర్థ్యాల్లాంటి ప్రశ్నలకు ఇన్వెస్టర్లు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా ఈ రోబో వ్యవస్థ ఒక డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోను సిఫార్సు చేస్తుంది. ఈ ప్రక్రియలో మనిషి జోక్యం చాలా తక్కువ. అంతా సిస్టం చూసుకుంటుంది. అందుకే ఖర్చు తక్కువగా ఉంటుంది.

అసలెలా పని చేస్తాయి..

ఈ రోబో అడ్వైజర్లు ముందుగా రిస్క్ ప్రొఫైలింగ్ చేస్తాయి. ఈ దశలో మీరు ఎంతకాలం ఇన్వెస్ట్ చేయదల్చుకుంటున్నారు? ఒకవేళ మార్కెట్ గానీ 10 శాతం పడితే మీరెలా స్పందిస్తారు? మీ ఆదాయం ఎంత మేర స్థిరంగా ఉంటుంది? వంటి ప్రశ్నలు వేస్తాయి. మీరిచ్చే సమాధానాలను బట్టి మీ రిస్కు సామర్థ్యాన్ని అంచనా వేస్తాయి. మీరు ఎక్కువగా రిస్కు తీసుకోవడానికి ఇష్టపడతారా? లేక ఒక మోస్తరుగా తీసుకోగలరా? లేక రిస్కుకు దూరంగా ఉంటారా? అనేది అర్థం చేసుకుంటాయి.

పోర్ట్‌ఫోలియో నిర్మాణం ఇలా...

మీరు ఓకే చేశాక... రెండో దశలో అల్గోరిథం మీ రిస్కు సామర్థ్యాలకు అనుగుణంగా ఈక్విటీ, డెట్, కొన్ని సందర్భాల్లో బంగారం లేదా అంతర్జాతీయ అసెట్స్‌లాంటి సాధనాలకు ఎంతెంత కేటాయించవచ్చనేది నిర్ణయిస్తుంది. ఆ తర్వాత ఒకవేళ ఈక్విటీ మార్కెట్లు పెరిగి, మీరు నిర్దేశించిన స్థాయికన్నా కేటాయింపులు పెరిగిపోతే, సిస్టం ఆటోమేటిక్‌గా రీబ్యాలెన్స్ చేస్తుంది. చాలా మటుకు ప్లాట్‌ఫామ్‌లు మీ లక్ష్యాలను ట్రాక్ చేసే విధంగా పని చేస్తాయి. రిటైర్మెంట్, పిల్లల చదువులు, ఇంటి కొనుగోలు ఇలాంటి లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడిని నిర్వహిస్తాయి. తద్వారా ఆర్థిక విషయాల్లో స్పష్టతనిచ్చేందుకు ప్రయత్నిస్తాయి.

కొత్త వారికి లాభాలెన్నో..



- **తక్కువ వ్యయాలు:** సంప్రదాయ అడ్వైజరీ సర్వీసులందించే సంస్థలు ఏటా 1- 2 శాతం చార్జీలు లేదా లావాదేవీలకింత కమీషన్ చొప్పున వసూలు చేస్తుంటాయి. అంతా ఆటోమేటెడ్‌గానే ఉంటుంది కాబట్టి రోబో-అడ్వైజర్ల ఫీజులు చాలా తక్కువ ఉంటాయి. ఇలా ఫీజులు తక్కువగా ఉండటం వల్ల దీర్ఘకాలంలో మరింత ఎక్కువగా రాబడులు వచ్చే అవకాశం ఉంటుంది.
- **క్రమశిక్షణ:** సాధారణంగా ఇన్వెస్ట్ చేసేటప్పుడు భావోద్వేగాలు మనల్ని ప్రభావితం చేస్తుంటాయి. భయం వల్ల కావచ్చు లేదా అత్యాశ వల్ల కావచ్చు, రిటైల్ ఇన్వెస్టర్లు సర్వసాధారణంగా ఎక్కువ రేటులో కొని, తక్కువ రేటుకు అమ్మేస్తుంటారు. ఆటోమేటెడ్ సిస్టంలలో ఇలాంటి భావోద్వేగాలు ఉండవు. వాటి తాలూకా తప్పిదాలూ ఉండవు. డేటా ఆధారిత అలొకేషన్ నిబంధనలను ఇవి పాటిస్తాయి. తద్వారా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైనా ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగేలా చూస్తాయి.
- **సరళత్వం:** రోబో అడ్వైజర్లు దన్నుగా ఉంటే డజన్ల కొద్దీ మ్యూచువల్ ఫండ్లను విశ్లేషించుకోవాల్సిన పనిగానీ... ప్రతి రోజూ మార్కెట్ న్యూస్‌ని ట్రాక్ చేస్తూ ఉండటం గానీ చేయనక్కర్లేదు. డైవర్సిఫికేషన్ రీబ్యాలెన్సింగ్ అంతా కూడా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామే చూసుకుంటుంది.
- **అందుబాటు స్థాయిలో:** సాధారణంగా చాలా తక్కువ మొత్తాలతో కూడా పెట్టుబడిని ప్రారంభించవచ్చు. సంపాదన అప్పుడప్పుడే మొదలుపెట్టినవారికి ఇది ఎంతో అనుకూల అంశంగా ఉంటుంది.

మన దగ్గర ఇలాంటి సాధనాలున్నాయా?

భారత్‌లోను ఇప్పుడిప్పుడే ఇలాంటి సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. జెరోధా, గ్రో లాంటి డిస్కౌంట్ బ్రోకరేజీలు, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు.. లక్ష్యాల ఆధారిత ఇన్వెస్టింగ్ సాధనాలు, ఇన్వెస్టర్ల అవసరాలకు తగ్గట్లుగా తీర్చిదిద్దిన పోర్ట్‌పోలియోలను అందిస్తున్నాయి. కొన్ని ప్లాట్‌ఫాంలు మోడల్ పోర్ట్‌ఫోలియోలను రూపొందిస్తున్నాయి. అర్థయంత్ర, కువేర, ఇండ్‌మనీ, స్క్రిప్‌బాక్స్, ఫండ్స్ ఇండియా లాంటివి వివిధ ప్రొఫైల్స్‌కి తగ్గట్లుగా సర్వీసులు ఇస్తున్నాయి. ప్రస్తుతం దేశీయంగా సుమారు 140 రోబో-అడ్వైజరీ స్టార్టప్స్ ఉన్నట్లు అంచనా. కాకపోతే ఇంకా దేశీయంగా పూర్తి స్థాయిలో అమెరికా మాదిరి ఆటోమేట్ చేసిన ఈటీఎఫ్ ఆధారిత రోబో ప్లాట్‌ఫాంలు అందుబాటులో లేవు. హైబ్రిడ్ మోడల్స్ మాత్రం వస్తున్నాయి. ఇవి లక్ష్యాల ఆధారిత మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టింగ్, పెట్టుబడులకు ముందు డిజిటల్‌గా రిస్క్ ప్రొఫైలింగ్ చేయడం, ఆటోమేటిక్‌గా సిప్‌లను సరి చేయడంలాంటివి చేస్తున్నాయి. దేశీయంగా ఫిన్‌టెక్ వినియోగం, సిప్ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో రోబో-అడ్వైజరీ సర్వీసులు మరింత విస్తరిస్తాయనేది సుస్పష్టం.

ఇవి ఎవరికి అనువంటే...

- తొలిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్నవారికి
- బిజీగా ఉండే ప్రొఫెషనల్స్‌కి
- మార్కెట్‌పై పరిమిత స్థాయి పరిజ్ఞానం ఉన్న వారికి
- దీర్ఘకాలంలో సంపదను పెంచుకోవాలనుకునేవారికి

అయితే, అత్యంత సంపన్న వర్గాల వారికి, సంక్లిష్టమైన విధంగా పన్నులు కట్టాల్సిన వారికి మాత్రం వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మనుషులు అందించే అడ్వైజరీ సర్వీసులే అవసరం కావచ్చు.

ఇప్పుడిదే ట్రెండు..

యువ ఇన్వెస్టర్లు ఇప్పుడు పేపర్ వర్క్, సేల్స్‌మెన్ బాదరబందీని కాకుండా సింపుల్‌గా ఉండే యాప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. రోబో-అడ్వైజర్లు సరిగ్గా ఇందుకు సరిపోతాయి. సాధారణంగా చాలా మటుకు ఇండియన్స్ పెట్టుబడి అంటే అదేదో బ్రహ్మపదార్థమనే భావనతో ఇన్వెస్టింగ్‌ని వాయిదా వేస్తుంటారు. రోబో అడ్వైజరీ సాధనాలు ఇలాంటి అపోహలను పోగొట్టి.. పెట్టుబడి పెట్టడాన్ని చాలా సులభతరం చేస్తున్నాయి.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు..

- పెట్టుబడులు పెట్టడం మీకు కొత్తయినా, ఎలా మొదలెట్టాలో తెలియకపోయినా, రిస్క్ ప్రొఫైలింగ్ టూల్‌తో మొదలుపెట్టండి. వైవిధ్యమైన, తక్కువ ఖర్చులు ఉండే ప్రోడక్టులను ఎంచుకోండి. స్వల్పకాలిక గందరగోళం ప్రభావంలో పడకుండా దీర్ఘకాలిక లక్ష్యాలపై ఫోకస్ చేయండి.



- ముఖ్యంగా రోబో-అడ్వైజర్లంటే మ్యాజిక్ చేసేసి, సంపదను సృష్టించే సాధనాలేమీ కాదు. క్రమశిక్షణతో, తక్కువ ఖర్చుతో ఇన్వెస్ట్ చేసేందుకు ఉపయోగపడే శక్తివంతమైన సాధనాలుగా మాత్రం చూడొచ్చు. అడ్వైజర్లతో గంటల తరబడి, రోజుల తరబడి చర్చిస్తూ కూర్చోడం కన్నా సింప్లిసిటీని కోరుకునే బిగినర్స్.. మార్కెట్లలోకి తొలి అడుగు వేసేందుకు ఇది స్మార్ట్ మార్గంగా ఉపయోగపడొచ్చు.

న్యూ ఫండ్ ఆఫర్స్

టాటా ఏఐఏ లైఫ్ గ్లోబల్ ఈక్విటీ ఫండ్

అంతర్జాతీయంగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పించే దిశగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 'టాటా ఏఐఏ గ్లోబల్ ఈక్విటీ ఫండ్'ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మార్చి 5 వరకు అందుబాటులో ఉంటుంది. జీవిత బీమా రక్షణ కల్పించడంతో పాటు గ్లోబల్ ఈక్విటీల్లో పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలికంగా మూలధన వృద్ధికి కూడా దోహదపడేలా ఇది ఉంటుంది. టాటా ఏఐఏ శుభ్ గ్లోబల్ ఇన్వెస్ట్ లాంటి యూనిట్ లింక్డ్ పథకాల ద్వారా ఈ ఫండ్ అందుబాటులో ఉంటుంది. ప్రధానంగా ఈ ఫండ్ నిధుల్లో 70%-100% వరకు భాగాన్ని గ్లోబల్ ఈక్విటీల్లో, మిగతా భాగాన్ని డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తారు.

ట్రస్ట్ ఎంఎఫ్ మిడ్‌క్యాప్ ఫండ్



ప్రధానంగా మిడ్-క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా మిడ్ క్యాప్ ఫండ్‌ని ఆవిష్కరించింది. ఇది మార్చి 13 వరకు అందుబాటులో ఉంటుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా 101 నుంచి 250 ర్యాంకుల వరకు ఉండే సంస్థల షేర్లు, ఈక్విటీ సంబంధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీనికి నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. దేశీయంగా తయారీ, ఆర్థిక సేవలు తదితర రంగాలకు చెందిన పలు మిడ్ క్యాప్ కంపెనీలు గణనీయంగా రాణిస్తున్నాయని సంస్థ తెలిపింది. గత అయిదేళ్లలో ఈ విభాగంలోని 37 కంపెనీలు మూడు రెట్లు రాబడులు అందించాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో మిడ్-క్యాప్ కంపెనీల వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఫండ్ ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో సందీప్ బాగ్లా తెలిపారు.

ఐసీఐసీఐ ప్రు లైఫ్ డివిడెండ్ లీడర్స్ 50 ఇండెక్స్ ఫండ్

యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్ (యులిప్) కింద ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా డివిడెండ్ లీడర్స్ 50 ఇండెక్స్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది. నిలకడగా డివిడెండ్లను చెల్లించే ట్రాక్ రికార్డుతో ఫండమెంటల్‌గా పటిష్టంగా ఉన్న స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలికంగా మెరుగైన రాబడులు అందించడం దీని లక్ష్యం. బీఎస్ఈ 500 నుంచి ఎంపిక చేసిన 50 కంపెనీల ఇండెక్స్‌ని ఇది ట్రాక్ చేస్తుంది. ఐసీఐసీఐ ప్రు సిగ్నేచర్ అష్యూర్, స్మార్ట్‌కిడ్ అష్యూర్, స్మార్ట్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్లస్ (సిప్ ప్లస్) తదితర పథకాలతో ఇది లభిస్తుంది.

పశ్చిమాసియా పైనే మార్కెట్ ఫోకస్

పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధ భయాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను దెబ్బతీసే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఆందోళనలు ఉపశమించే వరకూ సెంటిమెంటు బలహీనపడనున్నట్లు అంచనా వేశారు. వీటికి తోడు చమురు ధరలకు రెక్కలువస్తే అటు వాణిజ్య లోటు, ఇటు రూపాయి బలహీనపడవచ్చని తెలియజేశారు. వివరాలు చూద్దాం.. - సాక్షి, బిజినెస్ డెస్క్

- ఈ వారం భారీ అమ్మకాలకు చాన్స్
- సెంటిమెంటుకు చమురు ధరల సెగ
- హోలీ సందర్భంగా 3న సెలవు
- ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం

ఉన్నట్టుండి పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లను దెబ్బతీసే వీలున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆ దేశం సైతం.. దుబాయ్, తదితర గల్ఫ్‌అరబ్ దేశాలపై మిస్సైళ్లను ప్రయోగించడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు తెలియజేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతుడైనట్లు వెల్లడికావడంతో ఆదివారానికల్లా మధ్యప్రాచ్యంలో పలు దేశాలకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. హుర్ముజ్ ప్రాంతంలో నౌకల రవాణాకు అంతరాయాలు, ఇరాన్‌లో పరిస్థితులు చమురు సరఫరాలను దెబ్బతీయనున్నాయి. ఈ నేపథ్యంలో ముడిచమురు ధరలకు రెక్కలురానున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముడిచమురు ధరలు పెరిగితే దేశీయంగా దిగుమతుల బిల్లు పెరిగిపోనుంది. ఫలితంగా ఓవైపు వాణిజ్య లోటు పెరిగిపోనుండగా.. మరోపక్క దేశీ కరెన్సీ బలహీనపడే వీలుంది. వెరసి తాజా పరిస్థితులు దేశీ మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపనుంది. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్‌కు ద్రవ్యోల్బణ సమస్యలు తలెత్తవచ్చని, దీంతో ఆర్‌బీఐ పరపతి విధానాలపై ప్రభావం పడవచ్చని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా, జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ పేర్కొన్నారు. టెక్నాలజీ స్టాక్స్‌లో బలహీనతలు ఇన్వెస్టర్లను ఆందోళనకు లోనుచేస్తున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా ప్రస్తావించారు.

ఆటో అమ్మకాల ఎఫెక్ట్

రేపు(3న) హోలీ పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. కాగా.. ఫిబ్రవరి నెలకు ఆటో రంగ(వాహన) అమ్మకాల గణాంకాలు వెలువడుతున్నాయి. ఫలితంగా నేడు(2న) ఆటో కౌంటర్లు వెలుగులో నిలిచే వీలుంది. వారాంతాన ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసిక జీడీపీ గణాంకాలు వెలువడిన సంగతి తెలిసిందే. అక్టోబర్-డిసెంబర్ (క్యూ3)లో కొత్త సిరీస్ ఆధారంగా దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం పురోగతి సాధించింది. ఈ బాటలో ఈ వారం పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ), పీఎంఐ గణాంకాలు విడుదలకానున్నాయి. మరోపక్క యూఎస్, చైనా గణాంకాలు సైతం విడుదలకానున్నాయని, వీటి ఆధారంగా ఈ వారం మార్కెట్లలో యాక్టివిటీ నమోదుకానున్నట్లు నిపుణులు ప్రస్తావించారు.

గత వారమిలా

ఆటుపోట్ల మధ్య గత వారం(ఫిబ్రవరి 23-27) దేశీ స్టాక్ మార్కెట్లు వెనకడుగు వేశాయి. సెన్సెక్స్ 1,528 పాయింట్లు(2 శాతం) పతనమై 81,287 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 393 పాయింట్లు(1.5 శాతం) క్షీణించి 25,179 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ 1 శాతం చొప్పున డీలాపడ్డాయి.

సాంకేతికంగా చూస్తే..

గత నెలలో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడిదారులుగా మారి రూ. 22,615 కోట్ల విలువైన దేశీ స్టాక్స్ కొనుగోలు చేశారు. అయితే పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధభయాలు ఇండెక్సులను దెబ్బతీసే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు పేర్కొన్నారు. వీరి అంచనాల ప్రకారం..

- ఈ వారం నిఫ్టీ 25,000 పాయింట్ల దిగువకు చేరవచ్చు. 24,800-24,700 స్థాయిలో సపోర్ట్ లభించే వీలుంది. ఇక్కడినుంచి బౌన్స్ అయితే 25,500-25,700 పాయింట్లవరకూ బలపడవచ్చు.
- సెన్సెక్స్ 81,000 పాయింట్ల దిగువకు చేరవచ్చు. ఆపై 80,500-80,100 పాయింట్లస్థాయిలో మద్దతు కనిపించే వీలుంది. ఇక్కడి నుంచి పుంజుకుంటే 82,000- 82,500 పాయింట్లవరకూ పురోగమించే అవకాశముంది.

స్టాక్స్ వ్యూ

అతుల్ లిమిటెడ్ | బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 6,675 **టార్గెట్: రూ. 8,500**

ఎందుకంటే: డైవర్సిఫైడ్ స్పెషాలిటీ కెమికల్స్ రంగ కంపెనీ అతుల్ లిమిటెడ్‌ను ఇటీవలే సందర్శించాం. గుజరాత్‌లోని అతుల్‌లోగల సమీకృత కాంప్లెక్స్‌ను విజిట్ చేయడంతోపాటు.. కంపెనీ హోల్‌టైమ్ డైరెక్టర్, కార్పొరేట్ స్ట్రాటజీ ప్రెసిడెంట్ వివేక్ గాద్రేతో సమావేశమయ్యాం. 1947లో కొనుగోలు చేసిన ఈ ప్లాంటు 1,350 ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలోని వివిధ విభాగాల ద్వారా కంపెనీ మొత్తం 900 ప్రొడక్టులు, 400 ఫార్ములేషన్లను తయారు చేస్తోంది. అయితే వీటిలో పి-క్రెసోల్ తదితర ఆరోమాటిక్స్ విభాగ ఉత్పత్తులులేవు. నాలుగు జోన్లుగా ఈ కాంప్లెక్స్ ఏర్పాటైంది. ప్రతీ జోన్ ఒక ప్రత్యేక బిజినెస్ విభాగానికి కేటాయించగా.. ప్రతీ బిజినెస్‌కూ కంపెనీ సొంత పారిశ్రామిక వృథా నీటి శుద్ధి(ఈటీపీ) యూనిట్లను కలిగి ఉంది. అంతేకాకుండా వీటన్నిటికీ విడిగా మరో ప్రత్యేక సెంట్రల్ ఈటీపీని సైతం ఏర్పాటు చేసింది. కంపెనీకి సంబంధించిన కీలక అంశాలను పరిశీలిస్తే.. కొత్తగా తెరతీసిన లిక్విడ్ ఎపాక్సీ రెజిన్(ఎల్‌ఈఆర్) ప్లాంటు 75-80 శాతం సామర్థ్య వినియోగంతో పనిచేస్తోంది. దేశీయంగా పవన విద్యుత్(విండ్‌మిల్ అప్లికేషన్స్) రంగం నుంచి డిమాండ్ ఇందుకు తోడ్పాటునిస్తోంది. అయితే టారిఫ్‌ల కారణంగా యూఎస్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. దక్షిణాసియాలో ప్లాంట్ల సామర్థ్య విస్తరణ అందుబాటులోకి రావడంతో ఎపిక్లోరోహైడ్రిన్ (ఈసీహెచ్) భారీ పరిమాణంలో అందుబాటులోకి రానుంది. కాగా.. కాస్టిక్ సోడా ప్లాంటుసహా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు అవసరమైన విద్యుత్ అవసరాలకు సొంత ప్లాంట్లను నెలకొల్పుకుంది. పోటీ ధరలలో యూఎస్‌కు 2, 4డీ ఎగుమతులను చేపట్టగలుగుతోంది. 223 మందితో పటిష్ట ఆర్‌అండ్‌డీ బృందాన్ని కలిగి ఉంది. 18 పేటెంట్లకు దరఖాస్తు చేయగా.. 9కు అనుమతి లభించింది.

సైయెంట్ డీఎల్ఎమ్ | బ్రోకరేజ్: ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 314 **టార్గెట్: రూ. 416**

ఎందుకంటే: రక్షణ రంగ ఇంజినీరింగ్ కంపెనీ సైయెంట్ డీఎల్ఎమ్ ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసిక ఆదాయం అంచనాలను చేరలేదు. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో వార్షికంగా 32 శాతం క్షీణతతో రూ. 303 కోట్లకు పరిమితమైంది. అయితే అంతక్రితం ఏడాది క్యూ3లో భారీ ఆర్డర్‌ను పూర్తిచేయడంతో బేస్ ఎఫెక్ట్ కనిపించింది. ఇక విభాగాలవారీగా చూస్తే ఆదాయంలో.. ఏరోస్పేస్(37 శాతం), డిఫెన్స్(8 శాతం), మెడికల్ టెక్నాలజీ(16 శాతం), ఇండస్ట్రియల్స్(30 శాతం) చొప్పున ఆక్రమించాయి. వార్షిక ప్రాతిపదికన వీటిలో ఏరోస్పేస్ 15 శాతం, ఇండస్ట్రియల్స్ 58 శాతం జంప్‌చేయగా.. డిఫెన్స్ 88 శాతం, మెడికల్ టెక్నాలజీ 39 శాతం చొప్పున క్షీణించాయి. అధిక మార్జిన్లు ఆర్జించే కేబుళ్ల విభాగం 37 శాతం ఎగసింది. పీసీబీఏ 51 శాతం, బాక్స్‌బిల్డ్ 26 శాతం చొప్పున నీరసించాయి. కాగా.. ఈ ఏడాది చివరి త్రైమాసికం(జనవరి-మార్చి) నుంచి ఆదాయం నెమ్మదిగా రికవరీ కానున్నట్లు అంచనా. ఇందుకు పటిష్ట ఆర్డర్‌బుక్, ఆసక్తికర బుక్‌టు బిల్ నిష్పత్తి, వాయిదాపడిన షిప్‌మెంట్స్ ఎగ్జిక్యూషన్ ఇందుకు దోహదపడనున్నట్లు భావిస్తున్నాం. వెరసి వచ్చే ఆర్థిక సంవత్సరం(2026-27)లో ప్రస్తుత ఏడాదికి మించిన పనితీరును సాధించే అవకాశముంది. మార్జిన్లు రెండంకెల స్థాయిలో కొనసాగుతూనే మరింత బలపడే వీలుంది. అమ్మకాల పరిమాణం పుంజుకోవడం ద్వారా మెరుగుపడనున్న లాభదాయకత, నిర్మాణాత్మక ప్రొడక్ట్ మిక్స్, బీటూఎస్ ప్రోగ్రామ్‌ల ద్వారా పెరుగుతున్న ఆదాయం కంపెనీకి బలాన్నివ్వనున్నాయి. దీంతో 2025-28 మధ్య కాలంలో ఆదాయం 10.6 శాతం, నిర్వహణ లాభం 13.7 శాతం, నికర లాభం 19 శాతం చొప్పున పుంజుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

నాయకులు చేయాల్సింది తమను తాము సమీక్షించుకోవడం. 'నేను ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది' అని చెప్పే ధైర్యాన్ని కలిగి ఉండడం'.
- సైమన్ సినెక్, అమెరికన్ రచయిత, వ్యాపారవేత్త

హెల్త్‌కు సూపర్ టాపప్!



ఆరోగ్య బీమా కవరేజీ తగినంత తప్పనిసరి

- వేగంగా పెరుగుతున్న ఆసుపత్రుల ఖర్చులు
- రూ.5 లక్షలు, 10 లక్షలు కూడా సరిపోని పరిస్థితి
- అధిక కవరేజీ కావాలనుకుంటే ప్రీమియం మోపెడు
- దీనికి సమాధానమే టాపప్.. సూపర్ టాపప్‌లు
- ఫ్యామిలీ పాలసీలకు సూపర్ టాపప్ తప్పనిసరి
- తక్కువ ప్రీమియానికే భారీ కవరేజీ పొందే అవకాశం టాపప్
- సూపర్ టాపప్‌తో అదనపు రక్షణ.. ప్రీమియం కూడా చౌక
- గణనీయంగా పెరగనున్న సమ్ అష్యూర్డ్

పదేళ్ల కిందట హెల్త్ ఇన్సూరెన్స్ అంటే... లక్ష రూపాయలు చాలు. ఆ మాత్రం కవరేజీ ఉంటే హ్యాపీ. ఇక రెండు లక్షలంటే లగ్జరీకిందే లెక్క. మరిప్పుడు? చాలామంది తమకు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు కవరేజీ ఉన్నా సరే ధీమాగా ఉండలేని పరిస్థితి. ఎందుకంటే ఒక్కసారి ఆసుపత్రి మెట్లెక్కితే ఎన్ని పరీక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందో తెలియదు. ఏ పరీక్షల్లో ఏం బయటపడుతుందో తెలియదు. దానికి ఎన్ని లక్షలవుతుందో తెలియదు. ఎందుకంటే జీవనశైలి మారిపోయింది. ఆహారపు అలవాట్లు మారిపోయాయి. అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. దానికి తగ్గట్లే అత్యాధునిక హంగులతో కార్పొరేట్ ఆసుపత్రులు పుట్టుకొస్తున్నాయి. ఖర్చు ఏటా 14% చొప్పున పెరుగుతోందన్నది ఒక అంచనా. మరిప్పుడు ఏం చేయాలి? ఈ ప్రశ్నకు సమాధానమే టాపప్. ఆ వివరాలే ఈ 'వెల్త్ స్టోరీ'

అవసరానికి పనికిరాకుంటే హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నా లేనట్టే. ఎందుకంటే మన ఆరోగ్యానికి ఎంత బీమా కవరేజీ ఉన్నదనేది ఇప్పుడు ప్రధానం కాదు. అది ఎంతవరకూ అవసరానికి పనికొస్తుందన్నదే ప్రధానం. చాలామందికి రూ.5 లక్షలు లేదా రూ.10 లక్షల కవరేజీ ఉంటోంది. చాలా సందర్భాల్లో అది సరిపోతుంది. కానీ పెద్ద ప్రమాదం జరిగితేనో, కేన్సర్ వంటి మహమ్మారి చికిత్సలు అవసరమైతేనో అది ఎంతమాత్రం చాలదు. ఎందుకంటే కేన్సర్ చికిత్సకు దాని స్టేజ్‌ను బట్టి ఆరంభంలో రూ.15 లక్షల వరకు కూడా ఖర్చు అవుతుంటుంది. ఇక వైద్యం ఎప్పటికప్పుడు ఆధునికతను సంతరించుకుంటూ ఉండటంతో చికిత్సల వ్యయాలూ అదే స్థాయిలో పెరుగుతున్నాయి. 14 శాతంగా ఉంటున్న వైద్య ద్రవ్యోల్బణం మనకు తెలియకుండానే.. మన బీమా రక్షణ కవరేజీ సామర్థ్యాన్ని తినేస్తోంది. గతంలో రూ.3000 ఉన్న ఆసుపత్రి రూమ్ చార్జీ ఇపుడు రూ.6వేలు దాటిపోయింది. ఇపుడు తీసుకున్న రూ.5 లక్షల బీమా ఐదేళ్ల తర్వాత రూ.2.5 లక్షలకు సమానం. కనుక మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్య బీమానూ సమీక్షించుకోవాలి.

ప్రీమియం భారం..?

వైద్య చికిత్సల వ్యయాలు, క్లెయిమ్‌లకు అనుగుణంగా బీమా సంస్థలు ప్రీమియంను సవరిస్తుంటాయి. దీంతో కరోనా తర్వాతి కాలంలో హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు 50 శాతానికి పైనే పెరిగాయి. అధిక ఆయుర్దాయం, పెరిగిపోతున్న వ్యాధులు, కరోనా విపత్తు అనంతరం ఆరోగ్య సమస్యలతో కంపెనీలపై క్లెయిమ్‌ల భారం పడడం ఈ పరిస్థితికి కారణం. ఇక వయసును బట్టి ప్రీమియంల పెంపు సహజంగానే చూస్తుంటాం. 35- 40, 45-50, 60 తర్వాత ప్రీమియం ఎంతలేదన్నా 20 శాతం మేర పెరుగుతుంటుంది. కనుక చాలా మంది మధ్య తరగతి కుటుంబాలకు భారీ ప్రీమియంతో ప్రాథమిక హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ (బేసిక్ ఇండెమ్నిటీ ప్లాన్) తీసుకోవడం కష్టమే. ఈ పరిస్థితుల్లో తక్కువ ప్రీమియానికి అదనపు రక్షణనిచ్చే టాపప్, సూపర్ టాపప్ ప్లాన్ల గురించి, ఇవి ఏ రకంగా ఉపయోగపడతాయన్నది తప్పకుండా తెలుసుకోవాలి.

టాపప్ ప్లాన్లు..

పరిమిత ప్రీమియానికి అదనపు ఆరోగ్య బీమా రక్షణను టాపప్, సూపర్ టాపప్‌లు అందిస్తుంటాయి. బేస్ పాలసీ కవరేజీని రూ.5 నుంచి రూ.15 లక్షలకు పెంచుకోవాలంటే ప్రీమియం చాలా ఎక్కువుంటుంది. కానీ రూ.15 లక్షల సూపర్ టాపప్ ప్రీమియం చాలా తక్కువ. ఇవి బేస్ పాలసీతో అనుసంధానమై పనిచేస్తాయి. 'డిడక్టబుల్' (తగ్గించడం) ఇక్కడ కీలకం. టాపప్ అయినా, సూపర్ టాపప్ అయినా కనీస డిడక్టబుల్‌తో వస్తాయి. ఉదాహరణకు రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.50 లక్షలకు టాపప్ లేదా సూపర్ టాపప్ తీసుకున్నారనుకుంటే.. హాస్పిటల్ బిల్లు రూ.5 లక్షల్లోపే ఉంటే టాపప్, సూపర్ టాపప్‌తో పని ఉండదు. బేస్ పాలసీలోనే క్లెయిమ్ పరిష్కారం అవుతుంది. బిల్లు రూ.5 లక్షలు దాటినప్పుడు ఈ ప్రత్యేక ప్లాన్లు యాక్టివ్‌గా మారతాయి. అదనపు మొత్తాన్ని అందిస్తాయి. బిల్లు రూ.8 లక్షలు వచ్చిందనుకుందాం. అప్పుడు బేస్ పాలసీ రూ.5 లక్షలు, టాపప్ లేదా సూపర్ టాపప్ రూ.3 లక్షలు చెల్లిస్తాయి.

రెండూ వేర్వేరు..

ఇక్కడ టాపప్, సూపర్ టాపప్ రెండూ డిడక్టబుల్‌తో వచ్చినప్పటికీ.. కొంత స్పష్టమైన వైరుధ్యం ఉంది. టాపప్, సూపర్ టాపప్ రెండూ 'డిడక్టబుల్' దాటిన సందర్భాల్లో అమల్లోకి వస్తాయి. ఇందులో టాపప్ ప్లాన్ అనేది ఒకసారి ఆసుపత్రిలో చేరినపుడు ఆ క్లెయిమ్ మొత్తం డిడక్టబుల్ మొత్తాన్ని మించినప్పుడే అమలవుతుంది. సూపర్ టాపప్ అలా కాదు. ఒక బిల్లు డిడక్టబుల్‌ను మించిన సందర్భాల్లోనూ చెల్లింపులు చేస్తుంది. అలాగే, ఒక పాలసీ సంవత్సరంలో విడిగా ఒక్కో బిల్లు డిడక్టబుల్ దాటకుండా.. అన్నీ కలిసి డిడక్టబుల్‌ను మించిన సందర్భంలోనూ చెల్లింపులు చేస్తుంది.

పాలసీ కవరేజీ

బేస్ ప్లాన్	రూ.10 లక్షలు
టాపప్	రూ.20 లక్షలు
సూపర్ టాపప్	రూ.20 లక్షలు
డిడక్టబుల్	రూ.10 లక్షలు

ఒక ఏడాదిలో క్లెయిమ్‌లు

మొదటి క్లెయిమ్	4 లక్షలు
రెండో క్లెయిమ్	3.50 లక్షలు
మూడో క్లెయిమ్	4.50 లక్షలు
మొత్తం	రూ.12 లక్షలు

- ఇందులో టాపప్ ప్లాన్ కింద ఎలాంటి చెల్లింపులు రావు. ఎందుకంటే విడిగా ప్రతీ క్లెయిమ్ డిడక్టబుల్ రూ.10 లక్షలు మించలేదు.
- సూపర్ టాపప్ ప్లాన్ మాత్రం విడిగా ఒక క్లెయిమ్ అనే కాకుండా, ఒక ఏడాదిలో మొత్తం క్లెయిమ్‌లు రూ.10 లక్షలు మించినా యాక్టివేట్ అవుతుంది. కనుక రూ.10 లక్షలు డిడక్టబుల్ పోను మిగిలిన రూ.2 లక్షలు చెల్లిస్తుంది. ఒక ఏడాదిలో ఎన్ని సందర్భాలు ఆస్పత్రిలో చేరారన్న దానితో సంబంధం లేకుండా డిడక్టబుల్ దాటిన తర్వాత నుంచి ఆ పాలసీ సంవత్సరంలో అయ్యే వ్యయాలు అన్నింటికీ పాలసీ గరిష్ట పరిమితి మేరకు చెల్లింపులు లభిస్తాయి. రూ.10 లక్షల డిడక్టబుల్‌తో రూ.20 లక్షలకు సూపర్ టాపప్ తీసుకుంటే.. ఒక ఏడాదిలో రూ.10 లక్షలు మించి, రూ.20 లక్షల వరకు పాలసీ నిబంధనల మేరకు చెల్లింపులు అందుకోవచ్చు.
- టాపప్‌లో ఈ ఫీచర్ లేదు. ఏ బిల్లు అయినా డిడక్టబుల్ దాటినప్పుడే యాక్టివేట్ అవుతుంది.
- ఒక ఏడాదిలో ఎన్ని సందర్భాల్లో వైద్యం అవసరమవుతుందో తెలియదు. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ అన్నది కుటుంబం అంతటికీ ఉద్దేశించినది. ఒక ఏడాదిలో ఒకరు ఆస్పత్రి పాలై బేసిక్ కవరేజీ ఖర్చయిపోయితే, అదే ఏడాది అదే కుటుంబంలో మరొకరికి వైద్యం అవసరం పడొచ్చు. అటువంటప్పుడు సూపర్ టాపప్ ప్లాన్ ఆదుకుంటుంది. ముఖ్యంగా కరోనా వంటి విపత్తులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ప్రమాదాల కారణంగా ఒకే ఏడాది కుటుంబంలో ఒకరికి మించి వైద్యం అవసరం ఏర్పడొచ్చు.

ఏది తీసుకోవాలి..?

- **వివాహం** కాని వారు, **ఇండివిడ్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్**‌తోపాటు **టాపప్ ప్లాన్ తీసుకోవచ్చు.**
- **కుటుంబం అంతటికీ** ఫ్యామిలీ **ఫ్లోటర్ ప్లాన్ తీసుకునే వారికి** సూపర్ **టాపప్ అనుకూలం.**
- **బేసిక్ ఇండెమ్నిటీ హెల్త్ ప్లాన్** కంపెనీ నుంచే టాపప్ లేదా సూపర్ **టాపప్ తీసుకోవాలని లేదు.** ఐఆర్‌డీఏఐ నిబంధనల ప్రకారం ఇది **తప్పనిసరి కాదు. పాలసీదారులు** తమకు నచ్చిన సంస్థ నుంచి ఈ రక్షణలను ఎంపిక చేసుకోవచ్చు.
- ఒకే కంపెనీ నుంచి బేసిక్ ప్లాన్, టాపప్/సూపర్ టాపప్ ఉంటే క్లెయిమ్‌లు సాఫీగా పరిష్కారం అవుతాయి. టాపప్–సూపర్ టాపప్ క్లెయిమ్ కోసం పెద్దగా శ్రమ పడక్కర్లేదు.
- టాపప్– సూపర్ టాపప్ ప్లాన్ ప్రీమియం తక్కువ కోరుకుంటే, వేర్వేరు కంపెనీల నుంచి ఎంపిక చేసుకోవాల్సి రావచ్చు.
- బేసిక్ ప్లాన్, టాపప్/సూపర్ టాపప్ కవరేజీల్లో ఏకరూపత ఉంటే మంచిది.

వీటిపై ఫోకస్ చేయండి..

- బీమా కంపెనీ ఆస్పత్రుల నెట్‌వర్క్ ఎంత బలంగా ఉందో చూడాలి. తాము నివసించే ప్రాంతంలో దాదాపు అన్ని ముఖ్యమైన ఆస్పత్రులు బీమా కంపెనీ నగదు రహిత ఆస్పత్రుల నెట్‌వర్క్‌లో ఉంటే నయం.
- ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం లేకుండా.. అదే రోజు చికిత్స తీసుకుని వెళ్లిపోయే (డే కేర్ ప్రొసీజర్స్) చికిత్సలకు (అన్నింటికీ) కవరేజీ ఉన్నాయేమో ధ్రువీకరించుకోవాలి.
- ఆస్పత్రిలో చేరడానికి ముందు.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఎక్కువ రోజులకు కవరేజీ ఉండాలి.
- అత్యాధునిక రోబోటిక్, లేజర్ సర్జరీలకు పాలసీలో చెల్లింపుల ప్రయోజనాలు ఉంటే మెరుగు.
- ముందస్తు వ్యాధులకు కవరేజీ ఎంత వెయిటింగ్ తర్వాత అమల్లోకి వస్తాయో తెలుసుకోవాలి.
- ముఖ్యంగా రీస్టోరేషన్ ప్రయోజనం ఉంటే మంచిది. అంటే ఒక ఏడాదిలో కుటుంబంలో ఒకరు ఆస్పత్రిలో చేరడం వల్ల సమ్ అష్యూర్డ్ మొత్తం ఖర్చయిపోతే.. తిరిగి అంతే మొత్తాన్ని తదుపరి వైద్యానికి బీమా సంస్థ పునరుద్ధరిస్తుంది.
- ఎంపిక చేసుకునే పాలసీల ప్రీమియం భరించగలిగే స్థాయిలోనే ఉండేలా చూసుకోవాలి.

తగినంత కవరేజీ..

- చాలా కుటుంబాలు తమ అవసరాలకు సరిపడా రక్షణను (సమ్ అష్యూర్డ్) ఎంపిక చేసుకోవడం లేదని ఎన్నో సర్వేల్లో తేలింది. మెజారిటీ పాలసీదారుల రక్షణ అవసరాని కంటే తక్కువే ఉంటోంది.
- కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉన్నారు, వారికి అప్పటికే ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? తాము నివసించే ప్రాంతం, ఆ ప్రాంతంలో వైద్యానికి అయ్యే వ్యయాల ఆధారంగా కవరేజీని నిర్ణయించుకోవాలన్నది నిపుణుల సూచన.
- కనీసం రూ.10 లక్షల సమ్ అష్యూర్డ్‌తో బేసిక్ ప్లాన్, రూ.10 లక్షల డిడక్టబుల్‌తో రూ.50 లక్షలు లేదా రూ.కోటికి సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవడం సముచితంగా ఉంటుంది. దీనివల్ల నేటి వ్యయాలకే కాకుండా, భవిష్యత్తు వ్యయాలకు సైతం రక్షణను ఏర్పాటు చేసుకున్నట్టు అవుతుంది.



మెరుగ్గా జీఎస్‌టీ వసూళ్లు

- ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లు
- 8.1 శాతం అధిక ఆదాయం

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రూపంలో ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లు స్థూలంగా వసూలైంది. దేశీ విక్రయాలపై ఆదాయం 5.3 శాతం పెరిగి రూ.1.36 లక్షల కోట్లుగా ఉంటే, దిగుమతులపై జీఎస్‌టీ 17.2 శాతం పెరిగి రూ.47,837 కోట్లుగా నమోదైంది. రిఫండ్‌లు 10.2 శాతం పెరిగి రూ.22,595 కోట్లుగా ఉన్నాయి. దీంతో నికర పన్ను వసూళ్లు రూ.1.61 లక్షల కోట్లకు చేరాయి. క్రితం ఏడాది ఫిబ్రవరితో పోల్చితే 7.9 శాతం పెరిగాయి. సెస్సు రూపంలో ఆదాయం రూ.13,481 కోట్ల నుంచి రూ.5,063 కోట్లకు తగ్గింది. గతేడాది సెప్టెంబర్ 26 నుంచి జీఎస్‌టీలో కీలక మార్పులు చోటు చేసుకోవడం తెలిసిందే. 5, 12, 18, 28 శ్లాబులను విలీనం చేసి.. 5, 18, 40 శాతం (పొగాకు, విలాస ఉత్పత్తులు) ఖరారు చేశారు. దీంతో 375 ఉత్పత్తులపై పన్ను రేట్లు దిగొచ్చాయి. అనంతరం నవంబర్‌లో వసూళ్లు రూ.1.70 లక్షల కోట్లుగా ఉంటే, డిసెంబర్‌లో రూ.1.74 లక్షల కోట్లు, 2026 జనవరిలో రూ.1.93 లక్షల కోట్లకు పెరిగింది. పొగాకు ఉత్పత్తులపై అంతకుముందు కాంపన్సేషన్ ఉండగా, దాన్ని తొలగించి అధిక పన్ను రేటు పరిధిలోకి చేర్చారు. దీంతో ఈ పన్ను ఆదాయం తగ్గుతూ వస్తోంది. వినియోగం పెరిగినట్టు జీఎస్‌టీ వసూళ్ల గణాంకాలు తెలియజేస్తున్నాయని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి పేర్కొన్నారు. తమిళనాడులో మైనస్ 6 శాతం, మధ్యప్రదేశ్‌లో మైనస్ 8 శాతం, రాజస్థాన్‌లో మైనస్ 1% చొప్పున ఆదాయం తగ్గిందని.. పశ్చిమబెంగాల్‌లో ఒక శాతం, హరియాణాలో 2 శాతం, యూపీలో 5 శాతం, మహారాష్ట్రలో 6% చొప్పున ఆదాయం వచ్చినట్టు చెప్పారు. ఇది జాతీయ సగటు ఆదాయం 8 శాతం కంటే తక్కువని చెప్పారు.

టాటా ఏఐజీ 'యాక్సిడెంట్ సూపర్ గార్డ్'

ముంబై: టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'యాక్సిడెంట్ సూపర్ గార్డ్ ప్లస్' ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ప్రమాదాల్లో సమగ్ర ఆర్థిక రక్షణను అందించే వ్యక్తిగత ప్రమాద బీమా ప్లాన్ ఇదని, దేశంలో ఏటా ప్రమాదాల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో దీన్ని తీసుకొచ్చినట్టు ప్రకటించింది. వ్యక్తుల ఆదాయం, అప్పులు, జీవనశైలి రిస్క్‌లకు అనుగుణంగా కవరేజీని ఎంపిక చేసుకోవచ్చు. ప్రమాద మరణం, శాశ్వత పాక్షిక, పూర్తి వైకల్యంలో ఏక మొత్తంలో బీమా పరిహారం లభిస్తుంది. ప్రమాదాల కారణంగా అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రిలో చేరాల్సి వస్తే అయ్యే ఖర్చులకు రీయింబర్స్‌మెంట్ పొందొచ్చు. లోన్ షీల్డ్ (రుణాల కోసం), ఈఎంఐ ప్రొటెక్షన్, పెట్‌కేర్ పేరుతో ఐచ్ఛిక కవరేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఐదేళ్ల కాల వ్యవధిపై వ్యక్తులు, కుటుంబ సభ్యులు ఈ ప్లాన్‌ను తీసుకోవచ్చు. వేతన జీవులకు ప్రీమియంలో అదనపు డిస్కౌంట్ లభిస్తుంది.

ఇంటి అద్దె అలవెన్సు క్లెయిమ్... జాగ్రత్తలు

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఇంటి అద్దె అలవెన్సు క్లెయిమ్ విషయంలో వహించాల్సిన జాగ్రత్తలు గతంలో ఎన్నోసార్లు ఉదాహరణలతో తెలుసుకున్నాము. మన్మథరావు గారి కొడుకు, కోడలిది ప్రేమ వివాహం. తల్లిదండ్రుల ఇంట్లోనే కాపురం ఉంటున్నారు. ఇద్దరూ ఉద్యోగం చేస్తున్నారు. అతి తెలివితేటలున్న స్నేహితుల సలహా ప్రకారం... ఇద్దరూ వారికొచ్చిన ఇంటి అద్దె అలవెన్సుని మొత్తం మినహాయింపు పొందడానికి అవసరమైనంత మొత్తానికి రశీదులు ఇచ్చి మినహాయింపు పొందుతున్నారు. మన్మథరావు పలుసార్లు వారించినా ఫలితం లేకపోయింది. ఒకే నగరం, ఒకే చోటు ఉంటూ చెరొక రశీదు సబ్‌మిట్ చేసి నాటకం ఆడుతున్నారు.

ఈ దంపతుల్ని మించిపోయాడు వైకుంఠం గారు. పెళ్లి అయిన నాటి నుంచి మామగారి ఇంట్లోనే మకాం. మామగారికి అద్దె చెల్లిస్తున్నట్లు క్లెయిమ్ చేశాడు. నాలుగేళ్ల తర్వాత మామ చనిపోయారు. వైకుంఠం జీతం పెరిగింది. ఇంటి అద్దె అలవెన్సు పెరిగింది. ఎంత పెరిగిందో.. అంతా, పాతది వెరసి మొత్తానికి ఎంత అద్దె ఉండాలో అంత అద్దె ఇస్తున్నట్లు దొంగ రశీదులు సబ్‌మిట్ చేస్తూనే ఉన్నారు. రెండు మూడేళ్ల తర్వాత ఇంత అద్దె పుచ్చుకుంటున్న ఆ సదరు పెద్ద మనిషి 'ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు' వేస్తున్నారా లేదా అని ఆరా తీసారు అధికారులు. అడ్రసు పట్టుకొని మామ గారి ఇంటికెళ్లారు. గుమ్మం మీద మామ నేమ్ బోర్డు ఉంది. ఇంటి నెంబరు సరిపోయింది. కానీ అడుగు ముందుకేసి అడిగే సరికి అత్తగారు ప్రత్యక్షం. 'సుబ్బారావు గారు ఉన్నారా' అధికారుల ప్రశ్న..! అత్తగారి నోటి నుంచి మాటలు రావడం లేదు పైగా కన్నీళ్లు... 'ఎవరు బాబు మీరు.. ఆయన చనిపోయిన మూడేళ్లకి తీరుబాటు అయ్యిందా పరామర్శకి' అన్నారు. 'అదికాదండీ.. మీ అల్లుడు వైకుంఠం గారు ...' అన్నారు అధికారులు. 'ఆయన ఇక్కడెందుకు ఉంటారు. వీధి చివరి ఇల్లు. అధికారులకు అర్థం అయ్యింది పరిస్థితి. మెల్లగా కూపీ లాగారు. అధికారులు నోటీసులిచ్చి పిలిపించారు. అన్నీ ఒప్పుకున్నాడు వైకుంఠం. దొంగ రశీదులు, దొంగ సంతకాలు, దొంగ క్లెయిమ్‌లు.. అన్నింటిని మించి అద్దె పక్కా ఆదాయంగా డిక్లేర్ చేయకపోవడం... అసెస్మెంటు చూశారు. తప్పులన్నీ సవరించారు. పన్ను, వడ్డీ, పెనాల్టీలు 200%... ఆ షాకుతో ఇంటి అవసరం లేకుండా వైకుంఠం డిపార్టుమెంటు వరండాలోనే తిరుగుతున్నారు.

బహుశా ఇటువంటి బాపతులు చాలా మంది కనిపించి ఉంటారు డిపార్ట్‌మెంట్ వారికి... కొత్త రూలు వచ్చింది. ముసాయిదా రూల్స్ ప్రకారం ఇక నుంచి .. అంటే ఏప్రిల్1వతేదీ, 2026 నుంచి ఏడాది అద్దె రూ.1,00,000 దాటితే.. ఫారం 124 ఇవ్వాలి. ఓనర్ పేరు, అడ్రస్, పాన్.. మీకు ఓనర్‌కి చుట్టరికం ఏమిటి? చుట్టమంటే ... అమ్మ, నాన్న, అత్తగారు, మామగారు, అన్న, అక్క, చెల్లి, తమ్ముడా... ఇలాంటి వివరాలు సంపూర్ణంగా సేకరించి ఓనర్ ఆదాయాన్ని ట్రాక్ చేస్తారు. బ్యాంకు అకౌంటుని చెక్ చేస్తారు. ఆ వ్యక్తి ఈ ఆదాయం తన ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులలో చూపిస్తే సరి.. లేదా కొంప కొల్లేరు అవుతుంది. మన గతంలో ఎన్నోసార్లు చెప్పుకున్నాము. షరా మామూలే అయితే గోవిందా..! ముందు ఓనర్ గారికి నోటీసులు ఇస్తారు అన్నీ ఆరా తీస్తారు. సక్రమంగా అన్ని డిక్లేర్ చేస్తే సరేసరి.. లేదంటే పన్ను, వడ్డీ 200% పెనాల్టీలు.

అలా అని మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు. అటువంటి బంధువుకి ఎటువంటి ఆదాయం లేకుండా ఇంటి అద్దె ఆదాయమే అనుకొండి.. రూ.12,00,000 దాకా పన్ను భారం ఉండదు. కావున నిశ్చింతగా ఆ ఇంట్లోనే ఉండండి. బ్యాంకు ద్వారా అద్దె ఇవ్వండి. కాస్త శ్రమ తీసుకొని ఓనర్ చేత రిటర్ను వేయించండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పెట్టుబడులకు చక్కని వైవిధ్యం

పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

పెట్టుబడులకు వైవిధ్యం ఎంతో అవసరం. దీని వల్ల నష్టాల రిస్క్‌ను గణనీయంగా తగ్గించుకోవచ్చు. అన్ని పెట్టుబడులను ఒకే చోట పెట్టడం కంటే.. వివిధ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల నష్టాల రిస్క తగ్గుతుంది. ఒకే ఫండ్‌తో చక్కని వైవిధ్యం కోరుకునే వారికి పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ చక్కగా సరిపోతుంది. దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులతో, తక్కువ నష్టాల రిస్క్‌తో ఈ పథకం మెరుగ్గా రాణిస్తోంది.

రాబడులు

ఈ పథకానికి మంచి రాబడుల చరిత్రే ఉంది. ఈ పథకం 2013లో ఆరంభం కాగా, నాటి నుంచి నేటి వరకు ఏటా సగటున 19 శాతం చొప్పున రాబడులను అందించింది. గత ఐదేళ్లలోనూ రాబడి ఇదే స్థాయిలో ఉంది. మూడేళ్లలో మాత్రం ఏటా 20.94 శాతం చొప్పున, ఏడాది కాలంలో 10 శాతం మేర పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. ఫ్లెక్సీక్యాప్ విభాగం సగటు రాబడి కంటే 6 శాతం వరకు అధిక ప్రతిఫలం ఈ పథకంలోనే ఉండడం గమనించొచ్చు.

పెట్టుబడుల విధానం

మంచి రాబడుల అవకాశాలు ఎక్కడ ఉంటే అక్కడ ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఈ ఫండ్‌కు ఉంది. స్థానిక కంపెనీలతో పాటు విదేశీ కంపెనీల్లోనూ ఇన్వెస్ట్ చేయడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. ముఖ్యంగా అమెరికాకు చెందిన దిగ్గజ టెక్నాలజీ కంపెనీల్లో ఈ పథకం చెప్పుకోతగ్గ స్థాయిలో ఇన్వెస్ట్ చేసింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఫేస్‌బుక్‌లో ఈ పథకానికి గణనీయమైన పెట్టుబడులు ఉన్నాయి. వ్యాల్యూ స్టాక్స్‌కు ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంటుంది. అంటే కంపెనీ వ్యాపారం, మూలాల పరంగా మంచి విలువ కలిగి, ఆకర్షణీయమైన ధరల్లో ఉన్నప్పుడు ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులు తెచ్చిపెట్టే వ్యూహాన్ని పాటిస్తోంది. వాస్తవ విలువలకు మించి గరిష్ట స్థాయిల్లో ట్రేడవుతున్న స్టాక్స్‌కు దూరంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిస్క్‌ను సాధ్యమైనంత తగ్గించే విధంగా పనిచేస్తుంది. స్టాక్స్‌ను తరచూ మార్చదు. ఒక కౌంటర్‌లో దీర్ఘకాలం పాటు కొనసాగడాన్ని పాటిస్తుంది. స్థూల ఆర్థిక అంశాలు కాకుండా.. ఎంతో విలువ దాగున్న స్టాక్స్‌ను గుర్తించి పెట్టుబడులు పెడుతుంటుంది. పరిస్థితులకు అనుగుణంగా డెట్ సెక్యూరిటీలు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లలో (రీట్)నూ ఇన్వెస్ట్ చేస్తుంటుంది. మధ్యకాల లక్ష్యాలకు (5–7 ఏళ్లు) దీర్ఘకాల లక్ష్యాలకు (10 ఏళ్లకు అంతకుమించి) ఈ పథకాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.1,33,970 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 77.32 శాతం ఈక్విటీల్లో, డెట్ సాధనాల్లో 13.71 శాతం, ఈక్విటీ హెడ్జింగ్ ఇన్‌స్ట్రుమెంట్లలో 2.53 శాతం, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలో 1.33 శాతం చొప్పున పెట్టుబడులు పెట్టింది. 5.11 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. రంగాల వారీ పెట్టుబడులను పరిశీలిస్తే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 33.80 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 25.29 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 7.48 శాతం చొప్పున కేటాయించింది. ప్రతినెలా రూ.1000 నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.04
పవర్‌గ్రిడ్	6
కోల్ ఇండియా	5.26
ఐటీసీ	5.05
ఐసీఐసీఐ బ్యాంక్	4.99
బజాజ్ హోల్డింగ్స్	4.82
ఆల్ఫాబెట్	4.39
కోటక్ బ్యాంక్	3.75
మహీంద్రా అండ్ మహీంద్రా	3.75
యాక్సిస్ బ్యాంక్	3.40

క్లుప్తంగా...

డీఈఓ మందలింపుతో హెచ్‌ఎంకు గుండెపోటు

గుంటూరు ప్రైవేటు ఆస్పత్రి ఐసీయూలో హెచ్‌ఎం

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల పేరుతో విద్యాశాఖాధికారులు పెడుతున్న విపరీతమైన ఒత్తిడితో ఉపాధ్యాయులు హడలెత్తిపోతున్నారు. డీఈఓ హెచ్చరికలతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో ఆస్పత్రి పాలైన సంఘటన గుంటూరులో చోటుచేసుకుంది. గుంటూరు కేవీపీ కాలనీలోని కేఏస్సార్టీ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు శనివారం గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. గతనెల 26న పాఠశాలను తనిఖీ చేసేందుకు వెళ్లిన డీఈఓ సలీమ్ బాషా సెలవులో ఉన్న హెచ్‌ఎం శ్రీనివాసరావును పాఠశాలకు పిలిపించారు. టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన సమయంలో సెలవు పెడతారా అని ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల ముందే మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హెచ్‌ఎం శ్రీనివాసరావు గుండెపోటుకు గురయ్యారు. శనివారం ఉదయం ఆయన్ను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అత్యవసర చికిత్స నిమిత్తం ఐసీయూకి తరలించారు. హైస్కూల్ హెచ్‌ఎంపై ఇలా వ్యక్తిగత దూషణలకు దిగడం, హెచ్చరించడం అధికారులు మానుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించారు.

ఏపీ లా సెట్ దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి రూరల్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి మహిళావిశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్‌కు దరఖాస్తు గడువు మార్చి 20 వరకు పొడిగించినట్టు సెట్ కన్వీనర్ ఆచార్య సీతాకుమారి తెలిపారు. అపరాధ రుసుముతో ఏప్రిల్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్ష మే 4న జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం htt ps://cets.apsche.ap.gov.in చూడవచ్చని ఆమె సూచించారు.

27 ఏళ్ల వయసులో అడవికి.. 72 ఏళ్లకు ఇంటికి

పెద్దపల్లికి వచ్చిన 'మల్లోజుల'

భార్య తార, కుటుంబసభ్యులతో వేణుగోపాల్‌రావు

పెద్దపల్లిరూరల్: మావోయిస్టు పార్టీ మాజీ అగ్ర నేత మల్లోజుల వేణుగోపాల్‌రావు ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన సొంతింటికి వచ్చారు. పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన మల్లోజుల వెంకటయ్య–మధురమ్మల కుమారులు కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రావు మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కోటేశ్వర్‌రావు ఎన్‌కౌంటర్‌లో మరణించగా, వేణుగోపాల్‌రావు కొద్దిరోజుల క్రితం మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోయారు. ఆరాష్ట్ర పోలీసు అధికారుల బృందం పర్యవేక్షణలో ఆయన పెద్దపల్లికి చేరుకున్నారు. 27 ఏళ్ల వయసు ఉన్నప్పుడు అడవికి వెళ్లానని.. ఇప్పుడు తన వయసు 72 అని చెప్పిన మల్లోజుల 'ఫిగర్ అటు..ఇటు అయిందంతే'..అంటూ చమత్కరించారు. వేణుగోపాల్‌రావును కుటుంబీకులు సాదరంగా ఆహ్వానించారు. 45 ఏళ్ల తర్వాత వచ్చిన వేణుగోపాల్‌ను పలువురు కలిశారు.

నిర్బంధంతో ఉద్యమాన్ని అడ్డుకోలేరు

నేడు అంగన్‌వాడీల మహాధర్నా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం నిర్బంధంతో అంగన్‌వాడీల ఉద్యమాన్ని అడ్డుకోలేరని సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఈ మేరకు సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, సిహెచ్.నరసింగరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నారని పేర్కొన్నారు. విజయవాడకు వస్తున్న అంగన్‌వాడీలను కర్నూలు, నంద్యాల రైల్వేస్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండించారు. ఎమ్మెల్యేలు అంగన్‌వాడీలను తమ ఆఫీసులకు పిలిచి మరీ బెదిరించడం సరికాదన్నారు. రెండేళ్ల నుంచి వేతనాల పెంపు ప్రకటన రాకపోవడంతో ఆందోళన బాట పట్టారని స్పష్టం చేశారు.

5న ఆశా వర్కర్ల ఛలో విజయవాడ

సాక్షి, అమరావతి: కనీస వేతనం రూ.26 వేల చెల్లింపు, అన్నిరకాల సెలవుల వర్తింపు సహా వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 5న ఆశావర్కర్ల ఛలో విజయవాడకు పిలుపు ఇచ్చినట్టు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు, ఆశ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి చెప్పారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. ధర్నాకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆశా వర్కర్లు తరలివస్తారని తెలిపారు.

ముంచుకొస్తున్న భారీ భయం!

దేశంలో చాపకింద నీరులా విస్తరిస్తున్న ఊబకాయం

ప్రముఖ వైద్య సంస్థల నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో ఊబకాయం సమస్య చాప కింద నీరులా విస్తరిస్తోంది. ప్రస్తుతం దేశంలోని 9.8 శాతం మంది మహిళలు, 5.4 శాతం మంది పురుషులు ఊబకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్య 2050 నాటికి మహిళల్లో 17.4 శాతం, పురుషుల్లో 12.1 శాతానికి పెరుగుతుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఈ అంశాన్ని ఢిల్లీ ఎయిమ్స్, వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, గురుగ్రామ్‌లోని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, త్రివేంద్రంలోని జ్యోతిదేవ్ డయాబెటిస్ రీసెర్చ్ సెంటర్ వంటి ప్రముఖ సంస్థలకు చెందిన 12 మంది నిపుణులు రూపొందించిన నివేదికలో వెల్లడించారు. అంతర్జాతీయంగా ఊబకాయాన్ని దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించినప్పటికీ.. భారత్‌లో మాత్రం జీవన శైలి సమస్యగా మాత్రమే చూస్తున్నారని పేర్కొన్నారు. వేగంగా విస్తరిస్తున్న ఈ సమస్యను అరికట్టడానికి విధానపరమైన మార్పులు అవసరమని సిఫార్సు చేశారు.



కొంప ముంచుతున్న హెడోనిక్ హంగర్

5 నుంచి 19 ఏళ్ల వయసు పిల్లలు, యువతలో ఊబకాయం సమస్య అత్యధికంగా ఉంటోంది. 1990–2022 మధ్య బాలికల్లో 0.1 శాతం నుంచి 3.1 శాతానికి, బాలురలో 0.2 శాతం నుంచి 3.7 శాతానికి సమస్య పెరిగింది. ఇది కేవలం జన్యులోపంతో వచ్చే సమస్య మాత్రమే కాదని.. జీవక్రియ, నరాల సంబంధిత, పర్యావరణ కారకాల కలయికతో వస్తుందని నిపుణులు స్పష్టం చేశారు. శరీరంలో కొవ్వు కణాలు పెరగడంతో వచ్చే వాపు ఇన్సులిన్ నిరోధకతకు, గుండె జబ్బులు, కాలేయ వ్యాధులకు దారితీస్తోందని.. క్లోమ, మూత్రాశయ, రొమ్ము, గర్భాశయ కేన్సర్ల ముప్పు పెంచుతోందని హెచ్చరించారు. శరీరానికి శక్తి అవసరం లేకపోయినా.. కేవలం నోటికి రుచి కోసం తీసుకునే హెడోనిక్ హంగర్ కొంప ముంచుతున్నట్టు స్పష్టం చేశారు. ఆకలి లేకపోయినా ఆనందం, ఆహ్లాదం, నోటికి రుచి కోసం తీసుకునే స్వీట్లు, బిర్యానీ, పిజ్జా, ఇతర జంక్ ఫుడ్స్ ప్రమాదకరమని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఫుడ్ డెలివరీ సౌకర్యం అందుబాటులోకి వచ్చాక హెడోనిక్ హంగర్ ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. ఇలా హెడోనిక్ హంగర్ అలవాటు ఉన్న వాళ్లు పదేళ్లలో ఊబకాయం బారినపడతారని వైద్య నిపుణులు హెచ్చరించారు.

9.8%	దేశంలో ఊబకాయంతో బాధపడుతున్న మహిళలు
5.4%	ఊబకాయంతో బాధపడుతున్న పురుషులు
17.4%	2050 నాటికి దేశంలో ఊబకాయం సమస్యను ఎదుర్కొనే మహిళలు
12.1%	2050 నాటికి పురుషుల్లో ఊబకాయ సమస్యతో బాధపడేవారు

కార్యాచరణ అత్యవసరం

ఊబకాయాన్ని నిరోధించేందుకు అత్యవసర కార్యాచరణ చేపట్టాలని శ్వేతపత్రంలో నిపుణులు స్పష్టం చేశారు. ఊబకాయం నిర్వహణకు దేశవ్యాప్తంగా ఒకే రకమైన చికిత్స, పర్యవేక్షణకు మార్గదర్శకాలు అవసరమని నొక్కిచెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో క్లినిక్‌ల ఏర్పాటు, పాఠశాల దశలోనే పిల్లల ఆహార అలవాట్లలో మార్పు తెచ్చే కార్యక్రమాలు సహా ఈ చికిత్సలకు బీమా సౌకర్యం వంటివి కూడా తీసుకురావాలని శ్వేతపత్రంలో సూచించారు.

ముప్పిడి సాంబయ్య లొంగుబాటు

బీబీఎన్ డివిజన్ కమిటీ సభ్యులతో కలిసి వనం వీడిన ముప్పిడి సాంబయ్య

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ ఒడిశా రాష్ట్ర కమిటీకి చెందిన ముప్పిడి సాంబయ్య అలియాస్ వికాస్‌తో పాటు 14 మంది మావోలు శనివారం రాత్రి లొంగిపోయారు. ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన బొలాంగిర్–బార్‌ఘడ్–మహాసముంద్ జిల్లాలతో కూడిన డివిజన్ కమిటీ లొంగిపోతామంటూ ఫిబ్రవరి 23న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మకు లేఖ రాసింది. తమ భద్రతకు హామీ ఇస్తే మార్చి 2 లేదా 3వ తేదీలోగా లొంగిపోతామని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ సర్కార్ నుంచి లొంగుబాటుకు గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఫిబ్రవరి 28నే వికాస్ తన దళంతో కలిసి లొంగిపోయారు. సాంబయ్య తెలంగాణకు చెందినవారు కాగా మిగిలిన 14 మంది ఛత్తీస్‌గడ్ వారు.

శానా కాలం యాదుంటది!

- బీఆర్ నాయుడు తప్పు చేసి అదిరేది లేదు.. బెదిరేది లేదంటారా?
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు
- తన అక్రమ సంబంధాలతో సమాజానికేం నష్టం అంటూ బరితెగింపు
- సీఎం చంద్రబాబు ఆయనతో రాజీనామా చేయించాలి
- డీప్ ఫేక్ వీడియోలంటూ ఇప్పటికీ కాపాడాలని చూడటం సిగ్గుచేటు
- నాయుడుకు టీటీడీ చైర్మన్ పదవి పోయేకాలం దగ్గర పడింది

సాక్షి, అమరావతి: కామంతో కళ్లు మూసుకు పోయి, తప్పు చేసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాల్సింది పోయి, అదిరేది లేదు.. బెదిరేది లేదని కోట్లాది మంది భక్తులను ఉద్దేశించి చెప్పడం అత్యంత దారుణమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సమీపంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పు చేసిన బీఆర్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని భక్తుల నుంచి డిమాండ్లు వస్తుంటే.. ఆయన మాత్రం బరితెగించి మరీ ప్రెస్‌మీట్ పెట్టి చేసిన బాగోతాన్ని సమర్థించుకోవడాన్ని భక్తులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. బీఆర్ నాయుడుకు సంబంధించిన అశ్లీల వీడియోలు బయట పడినప్పుడే, వాటికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాల్సిందిపోయి.. 30 ఏళ్లుగా ఆ బంధం కొనసాగుతోందని చెప్పడం బరితెగింపు కాక మరేమిటని ప్రశ్నించారు. ఈ బాగోతం శానా కాలం యాదుంటది అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాజీనామా చేయమంటేనే చేస్తానని చెప్పడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

సీఎంను కూడా భక్తులు ఛీదరించుకుంటున్నారు

'దేవదేవుడైన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడికి ఒకరోజు సేవ చేసుకునే భాగ్యం కలిగినా చాలని, తమ జన్మ తరించి పోతుందని ప్రతి హిందువూ భావిస్తారు. అలాంటిది ప్రపంచ వ్యాప్తంగా ఉండే కోట్లాది మంది భక్తులు కొలిచే శ్రీవారి ఆలయానికి చైర్మన్ స్థానంలో ఉన్నప్పుడు ఎవరైనా అత్యంత నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో వ్యవహరించాలి. కానీ అక్రమ సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా, నా ఇష్టమొచ్చినట్టు ఉంటా.. దీనివల్ల సమాజానికి ఏం నష్టం జరిగిందని బీఆర్ నాయుడు నోటికొచ్చినట్లు మాట్లాడటం అత్యంత హేయం. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఈ వీడియోలు వెలుగులోకి వచ్చిన మరుక్షణమే బీఆర్ నాయుడుతో రాజీనామా చేయించకుండా డీప్ ఫేక్ వీడియోలంటూ పోలీసులకు ఫిర్యాదు చేయించడం చూసి చంద్రబాబును కూడా శ్రీవారి భక్తులు ఛీదరించుకుంటున్నారు' అని పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరితో సంబంధాలు పెట్టుకుంటావో, ఎంత మందితో తిరుగుతావో, ఎంతకాలం ఉంటావో అనేది ఆయన వ్యక్తిగత విషయమే అయినా, అత్యంత పవిత్రమైన శ్రీవారికి ఆలయ చైర్మన్‌గా ఉంటూ.. నా ఇష్టం అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడంటే ఆయనకు పదవి పోయే కాలం దగ్గర పడిందన్నారు.

బీఆర్ నాయుడిని తక్షణమే తొలగించాలి

- అశ్లీల వీడియో బయటపడితే డీప్ ఫేక్ అనడం సిగ్గుచేటు: భూమన
- ఆయనో కామ నాయుడు.. సకల కళావల్లభుడు
- శ్రీవారికి సేవ చేసే అవకాశం వస్తే ఆలయంలో రాజకీయాలు చేశాడు
- వైఎస్ జగన్‌పై ఆయన చేసిన తప్పుడు ప్రచారానికి దేవుడే శిక్ష విధించాడు
- దేవుడిని రాజకీయాల్లోకి లాగే వారంతా ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు నిజంగానే శ్రీవారి భక్తుడే అయితే అశ్లీల వీడియోలతో అడ్డంగా దొరికిపోయిన బీఆర్ నాయుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి తక్షణమే టీటీడీ చైర్మన్ పదవి నుంచి తక్షణమే తొలగించాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి డిమాండ్ చేశారు. సకల కళావల్లభుడు, కామ నాయుడు అయిన బీఆర్ నాయుడు ఆ పదవికి అనర్హుడని వారించినా చంద్రబాబు ఆలకించలేదని విమర్శించారు. ఏడాదిన్నరగా ఆలయ పవిత్రతను మంటగలిపే కార్యక్రమాలు చేస్తున్నారని ఆధారాలతో సహా బయటపెట్టినా చూస్తూ ఊరుకున్నారని ధ్వజమెత్తారు. అశ్లీల వీడియో బయటపడితే మరుక్షణమే రాజీనామా చేయించకుండా డీప్ ఫేక్ వీడియో అంటూ పోలీసులకు ఫిర్యాదు చేసి కాపాడుకునే యత్నం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆలయంలో రాజకీయాలు చేస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ పట్ల బీఆర్ నాయుడు కుట్రలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించే కుట్రలకు ఆ దేవదేవుడే ఈ శిక్ష విధించాడన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగి లబ్ధి పొందాలనుకునే వారు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు. ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో భూమన మీడియాతో మాట్లాడారు.

- 70 ఏళ్లకు పైబడిన వయసులో బీఆర్ నాయుడు పర స్త్రీతో చనువుగా ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చైర్మన్ ఆఫీసులో కూడా ఇలాంటి కార్యక్రమాలే చేస్తున్నారా? అని చర్చించుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా చంద్రబాబు ఎలా నియమించారని ప్రపంచవ్యాప్తంగా స్వామి వారి భక్తులు అసహ్యించుకుంటున్నారు.
- సరిగ్గా 18 ఏళ్ల క్రితం ఉమ్మడి గవర్నర్ వీడియో ఒకటి బయటకు రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేసి రాష్ట్రం వదిలి వెళ్లిపోయారు. మా హయాంలో ఎస్వీబీసీ భక్తి ఛానెల్ అధ్యక్షుడిగా ఉన్న పృథ్వీ అశ్లీల ఆడియో బయటకొచ్చినప్పుడు వెంటనే రాజీనామా చేయించాం.
- బీఆర్ నాయుడి వీడియోలు, ఫొటోలు బయటకు రావడం స్వామి వారి కోపోద్రేకానికి నిదర్శనం. అచ్యుత దేవరాయలు చక్రవర్తిగా ఉన్న సమయంలో తిరుమల ప్రధాన అర్చకుడిగా ఉన్న సిరిఅప్పన్ అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని ఆలయం ముందరే వధించిన చరిత్ర గురించి చంద్రబాబు తెలుసుకోవాలి. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని ఎవరో చెబితే గుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ బీఆర్ నాయుడి అశ్లీల వీడియోలకు ఏం సమాధానం చెబుతారు?
- తిరుమల పవిత్రత, భక్తుల మనోభావాలను కించపరిచే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేశారు. ఆయన వీడియోలు ఆలయ పవిత్రతను కించపరచడం కాదా? బీఆర్ నాయుడు హిందూ ధర్మం పేరుతో ఒక ఛానెల్ కూడా నడుపుతున్నారు. దర్శనాలు చేయించి డబ్బులు వసూలు చేసి ఆ ఛానెల్ బ్యాంక్ అకౌంట్‌లో వేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆ వీడియోలో తప్పేముంది?

- మాది 30–32 ఏళ్ల అనుబంధం.. హాయ్.. బై.. అనుకుంటాం
- మా ఫ్యామిలీకి, ఆ మహిళ ఫ్యామిలీకి లేని ఇబ్బంది మీకెందుకు?
- తన రాసలీలల వీడియోపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దబాయింపు
- సోషల్ మీడియాలో అవి వైరల్ కావడంతో మీడియా సమావేశం
- 32 ఏళ్ల పరిచయం ఉన్న వారితో ఇలానే నడుచుకుంటారు
- నాకూ టీవీ చానల్ ఉంది.. తోలు తీస్తానంటూ ఎదురు దాడి
- చేసిన తప్పును సమర్థించుకుంటూ వైఎస్సార్‌సీపీపై బురదజల్లే యత్నం
- భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలపై ఆరోపణలు
- భగవద్గీతలో ఏమీ లేదని తీవ్ర వ్యాఖ్యలు

చంద్రగిరి: 'ఆ వీడియో ఒక టాపిక్కేనా? అందులో తప్పేముంది? నేనేమి తప్పు చేశాను? ఆ వీడియోలో నాకేమీ తప్పు కనిపించడం లేదు. 30–32 ఏళ్లుగా పరిచయం ఉన్న కుటుంబంతో అలా మెలగడం తప్పా? హాయ్.. బై.. అనుకుంటాం.. అయినా ఆ మహిళ ఫ్యామిలీకి లేని ఇబ్బంది మీకెందుకు?' అంటూ బట్టబయలైన తన రాసలీలల వీడియోపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఎదురు ప్రశ్నలు వేశారు. అందులో ఎలాంటి తప్పు లేదని సమర్థించుకున్నారు. గత రెండు రోజులుగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు సంబంధించిన రాసలీలల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరో మహిళతో ఆయన అత్యంత చనువుగా ఉండే వీడియోలు చక్కర్లు కొట్టడం వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆయన వాటిపై తొలుత 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆ వీడియోలు పూర్తిగా డీప్ ఫేక్ అని, తనపై కొంత మంది వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం కొద్దిసేపటి తర్వాత ఆయన మీడియా సమావేశం కూడా నిర్వహించారు. ఆ వీడియో నిజమేనని చెబుతూనే కొన్నింటిని మార్ఫింగ్ చేశారన్నారు. ఆ వీడియోలో కనిపిస్తున్న మహిళ కుటుంబంతో తనకు 30–32 ఏళ్లుగా పరిచయం ఉందని, దీంతో ఆమెతో చనువుగా ఉన్న వీడియోను ఎవరో ఇలా సోషల్ మీడియాలో పోస్టు చేశారని చెప్పారు. అయినా ఆ వీడియోలో ఏమి తప్పు ఉందంటూ మీడియాను ప్రశ్నించారు. '32 ఏళ్లుగా పరిచయం ఉన్న వారితో అలాగే నడుచుకుంటారు.. నాకేమీ తప్పు అనిపించడం లేదు. వాళ్లింటికి మేము వెళ్తాము.. మా ఇంటికి వాళ్ల వస్తారు.. అందులో తప్పేముంది? మా ఫ్యామిలి, వాళ్ల ఫ్యామిలీకి లేని ఇబ్బంది మీకు ఎందుకు? సోషల్ మీడియాలో వచ్చిన కొన్ని ఫొటోలు 20 ఏళ్ల క్రితం దిగినవి. వాటిని ఎడిటింగ్ చేసి వక్రీకరించారు' అని చెప్పుకొచ్చారు.

భగవద్గీతలో ఏముంది?

గత ప్రభుత్వ హయాంలో రూ.50 కోట్లతో ఐదు భాషల్లో సుమారు 50 లక్షల భగవద్గీత పుస్తకాలను ముద్రించారని, అందులో ఇప్పటికీ 32 లక్షల పుస్తకాలు గోడౌన్‌లో అడ్డంగా పడి ఉన్నాయని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. 'అయినా భగవద్గీతలో ఏముంది.. ఆ భగవద్గీతను చూస్తే మొహాన ఉమ్మేతారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను నిజాయితీగా పని చేస్తున్నందు వల్లే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

నేను ఓ మీడియాకు చైర్మన్..

'నేను కూడా ఓ మీడియా సంస్థకు చైర్మన్‌ను. నా వద్ద సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టులు కూడా ఉన్నారు. మీ (రాజకీయ నాయకుల) తోలు తీస్తాను. పనికిమాలిన మాటలు మాట్లాడుతూ ప్రతి రోజూ నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. మీ లాంటి ఉడతలకు నేను భయపడే వ్యక్తిని కాదు' అని బీఆర్ నాయుడు ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలపై ఆగ్రహంతో ఊగిపోయారు. తన వీడియోలను మార్ఫింగ్ చేసి విడుదల చేస్తే, భయపడే వ్యక్తిని కాదన్నారు. ప్రతి అంశంలోనూ వారే అవినీతికి పాల్పడ్డారని, అవి బయట పడతాయని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. కాగా, సుమారు అరగంటకు పైగా జరిగిన మీడియా సమావేశంలో వైరల్ అయిన తన వీడియో వాస్తవం అని ఒప్పుకుంటూనే.. అందులో ఎలాంటి తప్పు లేదని చెబుతూనే.. మరోవైపు మార్ఫింగ్ చేస్తున్నారని పొంతన లేకుండా మాట్లాడారు. నాయుడు తీరును చూసి, మీడియా ప్రతినిధులతో పాటు వేదికపై ఉన్న వారు సైతం విస్తుపోయారు.

విశాఖలో ఉద్యోగుల 'సాగర ఘోష'

- నల్ల చొక్కాలు ధరించి వేలాది మంది నిరసన
- డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు
- ప్రభుత్వాన్ని మార్చడానికి కూడా వెనుకాడబోం
- ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష వరకూ డీఏ బకాయిలు
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగుల నమ్మకాన్ని కోల్పోతుంది
- ఉద్యోగుల ఐక్యవేదిక చైర్మన్ సూర్యనారాయణ స్పష్టీకరణ



'సాగర ఘోష' కార్యక్రమంలో పాల్గొన్న సూర్యనారాయణ తదితరులు

బీచ్‌రోడ్డు (విశాఖ): తమ సమస్యలు పరిష్కారం కోరుతూ విశాఖలో ఆదివారం నిర్వహించిన 'సాగర ఘోష' కార్యక్రమంలో వేలాది మంది ఉద్యోగులు నల్ల చొక్కాలు ధరించి తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగుల ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు ఉద్యోగుల పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వాలను మార్చడానికి కూడా ఉద్యోగులు వెనకాడబోరని హెచ్చరించారు. ఒక్కో ఉద్యోగికి లక్షలాది రూపాయిల డీఏ బకాయిలు రావాల్సి ఉందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ..చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగుల నమ్మకాన్ని కోల్పోతోందన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ మే 1న కడపలో భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు ప్రకటించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేష్ మాట్లాడుతూ..అనకాపల్లి సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యకు కారణమైన జోనల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికుల దుర్మరణం

విశాఖ జిల్లాలో విషాదం



మృతి చెందిన శ్రీను, సూరీడు

పద్మనాభం (భీమిలి): విశాఖ జిల్లా పద్మనాభం మండలం ఇసకలపాలెంలో ఆదివారం విద్యుదాఘాతానికి ఇద్దరు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొండయ్యపాలేనికి చెందిన తాపీ మేస్త్రీ కంటుబోతు శ్రీను (34), ఇసకలపాలేనికి చెందిన మరో మేస్త్రీ కాళ్ల సూరీడు (60), ఆయన కుమారుడు సూరిబాబు ఇసకపాలెంలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. కొలతలు తీసుకుంటున్న సమయంలో, అక్కడే అడ్డుగా ఉన్న ఒక పొడవైన ఇనుప పోల్‌ను పక్కకు జరిపేందుకు యత్నించారు. ఈక్రమంలో పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల నుంచి ఇనుప పోల్‌కు విద్యుత్ ప్రసరించడంతో శ్రీను, సూరీడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించారు. సూరిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన సూరిబాబును 108లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించా రు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని మరణంతో వారి కుటుంబం రోడ్డున పడింది. సూరీడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సూరీడు మరణం, సూరిబాబుకు గాయాలు కావడంతో ఆ కుటుంబ సభ్యులూ కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కరణ



సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల మూడో తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఆ రోజు ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని తెలిపింది. చంద్రగహణాన్ని వీక్షించే అవకాశం తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉంటుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా గ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలకే ప్రారంభమైనప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాతే ప్రభావం కనిపిస్తుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉంటుందని తెలిపింది. మళ్లీ ఇలాంటి చంద్ర గ్రహణం 2028, జూలై 6న ఏర్పడుతుందని వెల్లడించింది. రాష్ట్రంలోని వివిధ నగరాల్లో గ్రహణ సమయం వివరాలు ఇలా..

- విజయవాడ నగరంలో సాయంత్రం 6.14 గంటలకు చంద్రోదయం కానుంది. గ్రహణం సాయంత్రం 6.48 గంటలకు విడుస్తుంది. సుమారు 34నిమిషాలు గ్రహణ ఛాయలు కనిపించనున్నాయి.
- రాజమహేంద్రవరంలో 6.07గంటలకు చంద్రోదయం అవుతుంది. 6.48గంటలకు గ్రహణం ముగుస్తుంది. సుమారు 41 నిమిషాల పాటు గ్రహణం కనిపిస్తుంది.
- నెల్లూరులో సాయంత్రం 6.18 గంటలకు చంద్రోదయం జరుగుతుంది. గ్రహణం ముగిసే సమయం 6.48 గంటలు. నెల్లూరు వాసులు సరిగ్గా 30 నిమిషాల పాటు ఈ ఖగోళ వింతను చూడవచ్చు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Jagati Publications Limited, Sakshi Press, Sy.No. 766/2, Ankireddypalem Village, Guntur Rural, Guntur District. A.P., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు మానుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

సాక్షి, అమరావతి : ప్రభుత్వ విధానాలు ఉపాధ్యాయుల నైతికతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆదివారం ఓ ప్రకటనలో ఆక్షేపించింది. ఇప్పటికే ఉపాధ్యాయులను బోధనేతర పనులు, పరిపాలనా బాధ్యతలతో తీవ్రమైన ఒత్తిడిలోకి నెట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినమైన హాజరు ఆంక్షలు విధించడం సమంజసం కాదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలాజీ, ప్రధాన కార్యదర్శి, జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ కూడా లేకుండా చేయడం అత్యంత అన్యాయంగా అభివర్ణించారు. లీప్ యాప్‌లో తరచూ కనిపిస్తున్న సాంకేతిక ఇబ్బందులు, సర్వర్ డౌన్ సమస్యలు, నెట్‌వర్క్/సిగ్నల్ లోపాలు, ఇంకా అనేక అంతరాయాలు ఉపాధ్యాయుల నియంత్రణలో ఉండవని.. ఈ పరిస్థితుల్లో ఒక్క నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా గుర్తించడం ఉపాధ్యాయులను అవమానించడమేనన్నారు. స్థానిక పరిస్థితులు బాగా తెలిసిన ఎంఈఓలు, డీఈఓలపై నమ్మకం ఉంచకుండా, విద్యాశాఖ కమిషనరేట్ నుంచే పూర్తిగా కేంద్రీకృత నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. హాజరు ఆంక్షలను తక్షణమే పునఃసమీక్షించాలని, కనీసం పది నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

ద్వారకాతిరుమలకు పోటెత్తిన భక్తులు

శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న క్షేత్రంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది ఆలయానికి తరలివచ్చారు. దీంతో దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతం, కల్యాణకట్ట తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. దీంతో క్షేత్రంలో సందడి నెలకొంది. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

అంగన్‌వాడీల బైండోవర్

పామూరులో అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకుంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికార పార్టీ నాయకులు, అధికారుల ద్వారా అంగన్‌వాడీలపై ఒత్తిడికి గురిచేయడమే కాకుండా పోలీసుల ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపిస్తున్నారు. సంతనూతలపాడు, పొదిలి, పామూరు మండలాల్లో అంగన్‌వాడీ యూనియన్ నాయకుల వద్ద పోలీసులను కాపలా పెట్టడం, అంగన్‌వాడీలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేయించడం వంటి చర్యలతో వారిని కట్టడి చేశారు. ఒకటి రెండు చోట్ల నేరుగా నాయకుల ఇళ్లకు వెళ్లి విజయవాడ ధర్నాకు వెళ్ల వద్దని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

చింతపల్లిలో ఔషధ సిరి!

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఔషధ మొక్కల కొలువు

చింతపల్లి అంటే కేవలం చలికాలపు విడిది మాత్రమే కాదు.. అరుదైన ఆరోగ్య ప్రదాయినుల నిలయం కూడా. తూర్పు కనుమల్లో లభించే సుమారు 500 రకాల ఔషధ మూలికల్లో, ఇప్పటికే 200 రకాలను చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా పెంచుతున్నారు. మారుతున్న జీవనశైలిలో ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, వందలాది మూలికలను మదర్ ప్లాంట్లుగా సంరక్షిస్తూ, చింతపల్లిని ఒక విత్తనోత్పత్తి కేంద్రంగా మార్చేందుకు శాస్త్రవేత్తలు అడుగులు వేస్తున్నారు.

చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఔషధ మొక్కల పెంపక క్షేత్రం

- ప్రత్యేకంగా సంరక్షిస్తున్న శాస్త్రవేత్తలు
- ఇప్పటికే 200 రకాల పెంపకం
- విత్తనోత్పత్తి కేంద్రంగా మార్చేందుకు అడుగులు

చింతపల్లి: ప్రకృతి ప్రసాదించిన వర ప్రసాదాలు.. తూర్పు కనుమల గుండెల్లో దాగి ఉన్న అద్భుత మూలికలు ఇప్పుడు అల్లూరి జిల్లా చింతపల్లిలో కొలువుదీరాయి. మారుతున్న కాలంతో పాటు భారతీయ ప్రకృతి వైద్యానికి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఔషధ మొక్కల పెంపకం, వీటి సంరక్షణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. మదర్ ప్లాంట్ల సంరక్షణ.. విత్తనోత్పత్తి కేంద్రంగా ముందడుగు వేస్తోంది. తూర్పు కనుమల్లో సుమారు 500 రకాల ఔషధ మూలికలు ఉండగా, ప్రస్తుతం చింతపల్లి పరిశోధనా స్థానంలో 200 రకాలను ప్రత్యేక క్షేత్రంలో సంరక్షిస్తున్నారు. వీటిని మదర్ ప్లాంట్లుగా భావిస్తూ, భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని ఔషధ మొక్కల విత్తనోత్పత్తి కేంద్రంగా మార్చేందుకు శాస్త్రవేత్తలు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. పర్యాటకులు సైతం ఈ క్షేత్రాన్ని సందర్శించి ఇక్కడి మొక్కల విశిష్టతను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఏ మొక్క.. ఏ వ్యాధికి?..

ఈ క్షేత్రంలోని ప్రతి మొక్కకూ ఒక ప్రత్యేకత ఉంది. వేరు, ఆకు, కాండం, బెరడు ఇలా ప్రతి భాగం ఏదో ఒక వ్యాధి నివారణకు ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

కొన్ని ముఖ్యమైన మొక్కల ఉపయోగాలు

- **నేల ఉసిరి:** రక్తపోటు, అధిక వేడిమిని తగ్గిస్తుంది. బియ్యం కడిగిన నీటితో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- **అశ్వగంధ:** యవ్వన శక్తిని పెంచుతుంది. అధిక బరువు, పొట్ట తగ్గడానికి, చర్మ వ్యాధుల నివారణకు మేలు చేస్తుంది.
- **కలబంద:** ముఖ సౌందర్యం, చుండ్రు, మధుమేహం, రక్తమొలల నివారణలో కీలకం.
- **వస:** గొంతు సంబంధిత వ్యాధులు, నత్తి మాటలు తగ్గడానికి మరియు చిన్న పిల్లలు త్వరగా మాట్లాడడానికి సహకరిస్తుంది.
- **శతావరి:** కిడ్నీలో రాళ్లు, ఇతర మూత్రపిండ సమస్యలు, కామెర్ల నివారణకు దీని దుంపలు అద్భుతంగా పనిచేస్తాయి.
- **సర్పగంధి:** రక్త ప్రసరణను నియంత్రిస్తుంది. తేనెతో కలిపి తీసుకుంటే తలనొప్పి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- **పాషాణబేరి:** గుండె జబ్బులు, ఉబ్బసం, ఊబకాయం, రక్తపోటును అదుపులో ఉంచుతుంది.

మానవాళి ఆరంభం నుంచి మూలికా వైద్యమే మూలాధారంగా ఉంది. చిన్న చిన్న వ్యాధులను ప్రకృతి సిద్ధమైన ఔషధాలతో నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఈ వారసత్వాన్ని కాపాడటమే కాకుండా, రైతులు, సామాన్యులకు వీటిపై చింతపల్లి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక ప్రాజెక్టు మంజూరుకు కృషి

పరిశోధనా స్థానంలో ఔషధ మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇక్కడికి వచ్చే పర్యాటకులు, సందర్శకులు ఔషధ మొక్కలను ఆసక్తిగా వీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ మొక్కలను మదర్ ప్లాంట్లుగా సంరక్షిస్తున్నందున, సందర్శకులకు వీటిని పంపిణీ చేయడం సాధ్యపడటం లేదు. భవిష్యత్తులో చింతపల్లి కేంద్రంగా 'ఔషధ మొక్కల విత్తనోత్పత్తి కేంద్రం' ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ కేంద్రం ఏర్పాటుకు ఒక ప్రత్యేక ప్రాజెక్టును మంజూరు చేస్తే ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆశిస్తున్నాం.

– డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి,
ఏడీఆర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, చింతపల్లి

ముక్క లెక్క తప్పితే.. చిక్కులే

హోటళ్లు, రెస్టారెంట్లలో వీటికే క్రేజ్

- ఎప్పుడో ఒకసారైతే సమస్య లేదు
- అతిగా తింటే అనారోగ్య సమస్యలు తప్పవంటున్న వైద్యులు
- ఊబకాయం, జీర్ణకోశ సమస్యలు ఖాయం
- ఫలితంగా బీపీ, షుగర్, గుండె జబ్బులు తప్పవు

కర్నూలు(హాస్పిటల్): కంచంలో ముక్క లేనిదే ముద్దదిగని పరిస్థితి కొందరిది. ఎక్కడైనా ఫంక్షన్లలో మాంసాహారం, శాఖాహారాలు వేర్వేరుగా ఏర్పాటు చేస్తే మాంసాహారం వద్దే ఎక్కువగా భోజనప్రియులు బారులు తీరి ఉంటారు. మాంసాహారంలో పోషకాలు అధికంగా ఉంటాయన్నది ఎంత నిజమో అంతకుమించి క్యాలరీలు, కొవ్వు పదార్థాలు కూడా ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి హాని చేస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మాంసాహారం అధికంగా తింటే స్థూలకాయంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులనూ తెచ్చిపెడుతున్నాయంటున్నారు. కర్నూలు జిల్లాలో మాంసాహార ప్రియుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా కోవిడ్ వైరస్ విజృంభణ అనంతరం ఇది మరింత పెరిగింది. కోవిడ్ సమయంలో ప్రొటీన్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని ప్రచారం సాగడంతో చాలా మంది అతిగా నాన్‌వెజ్‌ను తిన్నారు. ఆ అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది. పండగొచ్చినా, పబ్బమొచ్చినా సరే మాంసాహారం ఉండాల్సిందేననే పరిస్థితికి చేరుకుంది. గతంలో కొన్ని వర్గాల వారు వివాహాల్లో శాఖాహారం మాత్రమే వడ్డించేవారు. కానీ వివాహాల్లో కూడా మాంసాహారాన్ని ఏర్పాటు చేసే సంస్కృతి ప్రారంభమైంది. గ్రామదేవతలకు మొక్కులు చెల్లించడం కూడా అధికమైంది. ఇలాంటి సమయంలో మాంసాహారం, మద్యపానం తప్పనిసరిగా మారింది. ఫలితంగా మాంసాహారాన్ని తరచూ తినేవారి సంఖ్య ఎక్కువైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాంసాహారాన్ని విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డుసైడు వ్యాపారాలు చేసే వారి సంఖ్య 16వేలకు పైగానే ఉంటుందని అంచనా. ఆయా కేంద్రాల్లో ప్రతిరోజూ రూ.4 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని సమాచారం. ముఖ్యంగా కర్నూలు నగరంతో పాటు కోడుమూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె వంటి చోట్ల నాన్‌వెజ్ హోటళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు రోడ్డుపక్కన కేవలం చిరుతిండ్లు, బజ్జీల కొట్లు మాత్రమే కనిపించేవి. ఇప్పుడు నాన్‌వెజ్ ఆహార పదార్థాలు విక్రయించే కేంద్రాలు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా వెలుస్తున్నాయి.

డోర్‌డెలివరీలూ ఎక్కువే..!

కోవిడ్ మనిషికి డోర్ డెలివరీని అలవాటు చేసింది. అప్పట్లో ప్రజలు ఎక్కువగా గుమికూడదన్న ఉద్దేశంతో ఈ విధానానికి అనుమతించారు. ఇప్పుడిదే సంస్కృతిగా మారిపోయింది. మనసులో కోరిక పుట్టిందో లేదో వెంటనే అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లో సంబంధిత యాప్‌ను తెరిచి ఆర్డర్ పెట్టి మరీ తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇతర వస్తువుల కంటే ఆహార పదార్థాలే ఎక్కువగా ఉంటున్నాయి. ముఖ్యంగా ఆహార పదార్థాలను డోర్‌డెలివరీ చేసే జొమాటో, స్విగ్గీ వంటి సంస్థలు వచ్చాక డోర్ డెలివరీలు మరింత ఎక్కువయ్యాయి. ఇలా డోర్ డెలివరీ ద్వారా తెచ్చుకున్న ఆహారంలో వివిధ బిర్యానీలదే అగ్రస్థానం.

అతిగా తింటే ఊబకాయం

ప్రతి చిన్న విషయానికి నాన్‌వెజ్ తీసుకోవడం ఎక్కువై పోవడంతో మనిషి తీసుకునే క్యాలరీలకు, ఖర్చయ్యే క్యాలరీలకు పొంతన ఉండటం లేదు. ఈ ప్రభావంతో శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, గుండెజబ్బులు, మానసిక ఒత్తిళ్లు, క్యాన్సర్‌లకు దారి తీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా బిర్యానీలు, ఫ్రైడ్ ఐటమ్స్‌లో నూనె, డాల్డా అధికంగా వాడుతున్నారు. దీనివల్లే శరీరంలో కొవ్వు స్థాయి పెరగడంతో అది కాలేయం, గుండెపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఊబకాయం వల్ల శరీరం చలాకీతనం కోల్పోతుంది. ఫలితంగా వారు చేసే పనుల్లో పెద్దగా వృద్ధి కనిపించదు. పిల్లలైతే చదువులో వెనుకబడిపోతారు. బీపీ, షుగర్, గుండె, కాలేయ జబ్బులు, మానసిక ఒత్తిడి వచ్చే ప్రమాదం ఉంది.

హోటల్‌లో బిర్యానిని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

నాణ్యత పాటించాలి

హోటళ్లు, రెస్టారెంట్లలో తయారు చేసే మాంసాహారానికి వాడే పదార్థాలు నాణ్యతగా ఉండాలి. నిల్వ ఉన్న మాంసంతో నాన్‌వెజ్ వండి పెట్టడకూడదు. ఇలాంటి పదార్థాన్ని తిన్న వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనికితోడు ఆహార పదార్థాల్లో నిషేధిత రంగులు కలపడం కూడా నేరం. ప్రజలు సైతం రంగు, వాసన చూసి మోసపోయి అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవద్దు.

– రాజగోపాల్,
ఫుడ్ సేఫ్టీ అధికారి, కర్నూలు

నాన్‌వెజ్ పడనివారు తినకూడదు

కొందరికి నాన్‌వెజ్ అంటే పడదు. అలాంటి వారు ఈ పదార్థానికి దూరంగా ఉంటేనే మేలు. ఫ్యామిలీ హిస్టరీలో గుండెజబ్బులున్న వారు జాగ్రత్తగా ఉండాలి. కోలన్ క్యాన్సర్ ఉన్న వారు బీఫ్ తినకూడదు. నాన్‌వెజ్ వల్ల ఇబ్బందులు ఎదురయ్యే జనటిక్ డిసీజ్ ఉన్న వారు మాత్రం జాగ్రత్తలు తీసుకోవాలి. నాన్‌వెజ్ తినడం వల్ల జబ్బులు రావు. కానీ అందులో వాడే పదార్థాలు నాణ్యమైనవి కాకపోతే వస్తాయి.

– డాక్టర్ భరత్,
ఎండోక్రైనాలజిస్టు, కర్నూలు

నూరేళ్లూ చల్లగా ఉండాలని..

ఏసీ కల్యాణ మండపాలకే ప్రాధాన్యం



కల్యాణ మండపంలో వివాహ వేదిక

ఖర్చుకు వెనుకాడని పెళ్లి బృందాలు

రాయవరం: ఆకాశమంత పందిరి.. భూదేవంత అరుగు.. ఒకప్పుడు గోదావరి జిల్లాల్లో పెళ్లిళ్లంటే ఇలానే మాట్లాడే వారు. ఫలానా వారి తోటలో కొబ్బరాకులు, పూలంటూ పురమాయించేవారు. ఇంటి వద్దే చలువ పందిళ్లు, మండపాల ఏర్పాటుతో ఐదు రోజుల పాటు చేసే పెళ్లిని పది కాలాల పాటు చెప్పుకొనేవారు. మళ్లీ ఇప్పుడు ఆ రోజులను గుర్తు చేస్తూనే.. హంగూ ఆర్భాటాలు, అంగరంగ వైభోగాలతో దక్షిణాది సంప్రదాయానికి ఉత్తరాది మెరుగులు అద్ది, ఖర్చుకు వెనుకాడకుండా జరిపిస్తున్నారు. ముఖ్యంగా ఏ శుభ కార్యం చేయాలన్నా ముందుగా ఏసీ కల్యాణ మండపాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

జాబితా తయారీలో వధూవరులు

పెళ్లి ఎక్కడ చేసుకోవాలి? ఏ మండపంలో చేయాలి.. మెనూ ఏంటనేది వధూవరులే ఓ పెద్ద జాబితా తయారు చేసుకుంటున్నారు. జీవితకాలం గుర్తుండి పోయేలా వివాహాన్ని చేసుకోవాలని ఆశించే వధూవరులు పెళ్లికి వచ్చే స్నేహితులు, కుటుంబ సభ్యుల రాకను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక ఏసీ కల్యాణ మండపంలోనే చేసుకోవాలని భావిస్తున్నారు. వాటి అద్దె, లంచ్, డిన్నర్, అలంకరణకు కనీసం రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు చేస్తున్నారని రాయవరం గ్రామానికి కల్యాణ మండపం నిర్వాహకుడొకరు చెప్పారు.

ఆర్భాటానికే ప్రాధాన్యం

ఓ కల్యాణ మండపంలో ఓ వ్యాపారి తన కుమారుడికి ఇటీవల పెళ్లి జరిపించారు. సుమారు 10 రకాల స్వీట్లు, నాలుగైదు రకాల స్పెషల్ రైస్, ఆకుపై 20 రకాల కూరలు (పొడులు, పచ్చళ్లతో కలిపి) ఉండాలని చెప్పారు. 2 వేల మందికి ఆర్డర్ ఇచ్చారు. ప్లేటు రూ.500 అయ్యిందని కల్యాణ మండపం నిర్వాహకుడు చెప్పారు. ఒక్క భోజనాలకే ఖర్చు రూ.10 లక్షలు అయ్యిందని చెప్పుకొనే విధంగా చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో పెద్ద, చిన్న కలిపి 200 వరకూ కల్యాణ మండపాలున్నాయి. అతి పెద్ద ఏసీ మండపమైతే అద్దె రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు ఉంటోంది. భోజనాలకు మెనూను బట్టి ఆకుపై వేసిన రకాలను బట్టి రూ.300 నుంచి 450 వరకూ పడుతుంది. ఇక కల్యాణ మండపంలో పచ్చిపూల మండపం ఏర్పాటుకు బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ తదితర నగరాల నుంచి నుంచి తీసుకొచ్చిన పూలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణకు మరో రూ.లక్షన్నర వరకూ పెడుతున్నారు. ఇవి కాకుండా బాజాభజంత్రీలకు ఖర్చులు అదనం.

ముందుగానే బుకింగ్

వివాహం నిశ్చయమైన వెంటనే ముందుగా పెళ్లి ఎక్కడ చేయాలనే దానిపై అధికంగా చర్చించుకుంటున్నారు. ఆలయాల వద్ద కాకుంటే కల్యాణ మండపాలకే ప్రాధాన్యం ఇస్తూ.. వెంటనే మండపాల బుకింగ్ చేస్తున్నారు. రెండు, మూడు నెలల ముందుగా మండపం బుక్ చేసుకోకుంటే దొరకని పరిస్థితి ఉంది. విదేశాల్లో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అద్దె రెట్టింపు ఇస్తామని ఫోన్లు చేసి అడుగుతున్నారని మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

పల్లెల్లో సైతం..

వాతావరణంలో వస్తున్న మార్పులు.. ఇప్పుడు కాకుంటే ఎప్పుడంటూ వివాహ వేడుకలకు ఇస్తున్న ప్రాధాన్యం నేపథ్యంలో పల్లెల్లో సైతం కల్యాణ మండపాల నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు కొత్త భవనాలను నిర్మిస్తుంటే.. మరికొందరు పాత భవనాలను కల్యాణ మండపాలుగా మార్చేస్తున్నారు. ఏ చిన్న శుభ కార్యం చేయాలనుకున్నా.. సమావేశాలు నిర్వహించాలనుకున్నా.. ఏసీ కల్యాణ మండపాలకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. వివాహ ఆహ్వాన పత్రికల్లో సైతం ఏసీ కల్యాణ మండపం అనే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నారు. వచ్చిన బంధువులు, స్నేహితులు అధిక సమయం ఉండాలంటే ఏసీ కల్యాణ మండపాలే ఉండాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఉన్న కల్యాణ మండపాల్ని ఏసీ కల్యాణ మండపాలుగా మార్చేస్తున్నారు.

బడ్జెట్ అధికమైనా తప్పదు

ఏ శుభకార్యమైనా ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ఏసీ కల్యాణ మండపాల్లోనే నిర్వహిస్తున్నాం. ఇటీవల మా మనమరాలి ఓణీ ఫంక్షన్‌ను ఏసీ కల్యాణ మండపంలోనే నిర్వహించాం. ఒకప్పటి పరిస్థితికి, నేటి పరిస్థితికి చాలా మార్పు వచ్చింది. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా శుభకార్యాలు చేయాల్సిందే.

–ద్విభాష్యం విజయప్రభాకర్,
విశ్రాంత ఉద్యోగి, రాజమహేంద్రవరం

ఇళ్ల వద్ద నిర్వహించే పరిస్థితి లేదు

ఏ కార్యక్రమమైనా ఇళ్ల వద్ద నిర్వహించే పరిస్థితి లేదు. చిన్న, మధ్య తరగతి కుటుంబాలు కూడా ఆర్థిక పరిస్థితిని వెరవకుండా ఏసీ కల్యాణ మండపాల్లోనే నిర్వహిస్తున్నారు. నాన్ ఏసీ అయితే ఏసీ కా దా.. అంటూ వచ్చిన వారు పెదవి విరుస్తున్నారు.

–కొప్పిశెట్టి శ్రీనివాస్,
వ్యాపారి, రాజమహేంద్రవరం

డిమాండ్ ఎక్కువగానే ఉంది

గ్రామీణ ప్రాంతాల్లో కూడా కల్యాణ మండపాలకు డిమాండ్ అధికంగానే ఉంది. రైస్ మిల్లును కల్యాణ మండపంగా మార్చాం. ముహూర్తాల సమయంలో డిమాండ్ మరింత అధికంగా ఉంటుంది. రెండు, మూడు నెలల ముందుగానే కల్యాణ మండపాన్ని బుక్ చేసుకుంటున్నారు.

–మూర్తినీడి వెంకటరాజు,
కల్యాణ మండపం నిర్వాహకుడు, రాయవరం

పర్యాటకం: మధుర

హోలీ.. చూసొద్దాం రండి..

యమునా తీరంలో రంగుల ఆటవెలది... బ్రజ్ భూమిలో రంగుల కథలు...
మాధవుడి నగరంలో రంగుల హరివిల్లు... కృష్ణ నగరంలో వసంత స్వాగతం...
గోపాలుడి జన్మభూమిలో రంగుల ఋతువు...
ఇంద్ర ధనస్సు రంగుల మధ్య ఓ మధురమైన దైవిక స్పర్శ...
ఇవన్నీ కనులవిందుగా దర్శించాలంటే
ఆ ప్రాంతాల గుండా ప్రయాణించాల్సిందే!!

కొన్ని నగరాలు చూడటానికి కాదు అనుభూతి చెందడానికే అన్నట్టు ఉంటాయి. అలాంటి ఒక పవిత్రమైన ప్రదేశమే మధుర. ఇక్కడ రంగులు కూడా ఒక భక్తి భాషలో మాట్లాడుతాయి. ఉత్తర ప్రదేశ్‌లో ఉన్న మధుర, యమునా నదీ తీరం నిదానంగా, ఆగిపోయిన కాలంలా ఉంటుంది. ఇక్కడ ప్రతి గల్లీలో కృష్ణ నామస్మరణ, ప్రతి సంధ్యలో దీపాల ప్రకాశం, ప్రతి వసంతం రంగుల ప్రణయంలా ఉంటుంది. మధుర అంటే కేవలం ఒక చరిత్ర మాత్రమే కాదు. ఇది ఒక జీవన విధానం.

కృష్ణ జన్మభూమి వైభవం

మధురలో ప్రయాణం ప్రారంభమయ్యే ప్రదేశం శ్రీ కృష్ణ జన్మభూమి. ఆ ప్రాంతంలో నడుస్తుంటే అక్కడి ప్రాచీన శిల్పం, మందిర గోపురాలను చూస్తుంటే మది నిండా ప్రశాంతమైన భావం కలుగుతుంది. ఇక్కడ సంధ్యా సమయంలో శంఖ నాదం వినిపిస్తుంది. అలాగే భక్తుల మధ్య ఒక సమన్వయం కనిపిస్తుంది. ద్వారకాదీశ్ మందిరం వద్ద సంధ్యా హారతి సమయంలో దీపాల వెలుగు, భజనల్లో కలిసిన భక్తుల స్వరం ఇవన్నీ ఒక ప్యూర్ డివోషనల్ ఆరాను క్రియేట్ చేస్తాయి.

యమునా తీరంలో నిశ్శబ్ద వేదం

విశ్రామ్ ఘాట్ దగ్గర ప్రతి ఉదయం యమునా తీరాన్ని తాకే సూర్యుడి కిరణాలు కనులకు ఆనందాన్ని, మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. నదిపై అలా అలా సాగుతున్న తెప్ప, నీటిపై ప్రతిబింబించే ఆకాశం, నిదానంగా సాగే జీవితం. ఇదే అక్కడి ప్రతి ఉదయం కనిపించే దృశ్యం.

ఇక్కడ నడుస్తుంటే మధుర అనేది ఒక ప్రదేశంలా కాదు, ఒక ఫీలింగ్ అని అనిపిస్తుంది. ఇక్కడ ప్రయాణం అంటే వేగం కాదు, కాలానికి తగిన విలువ అనిపిస్తుంది.

బ్రజ్ భూమిలో రంగుల ఋతువు

మధురలో హోలి అంటే పండుగ కాదు. ఒక జీవితోత్సవం. వసంత కాలంలో నగరం మొత్తం రంగులతో నవ్వుతుంది. గులాల్ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే గీతాలు, భజనల మధ్య ప్రతి గాలిలో ఉత్సాహం కనిపిస్తుంది. బర్సానా, వృందావన్ ప్రాంతాలు హోలి సందర్భంగా ప్రత్యేక వాతావరణం క్రియేట్ చేస్తాయి. రాధాకృష్ణుల మధుర స్మృతులు, రంగుల మధ్య భక్తి భావం, నగరం మొత్తం ఒక వేదికలా మారుతుంది. ఇక్కడ హోలి అంటే రంగులతో ఆడే ఒక క్రీడ మాత్రమే కాదు. ఒక పరంపర. ఒక సంప్రదాయం. ఒక ఆచారం. కాలం అందించే ఆనందానికి ప్రతీక కూడా.

మధుర అనగానే ముందుగా అక్కడి 'పెడా'గుర్తుకు వస్తుంది. అయితే దీంతో పాటు అక్కడి ప్రత్యేక అల్పాహారాన్ని రుచి చూడడం మర్చిపోవద్దు. పెడా, లస్సీ, చాట్ లాంటి తినుబండారాలు నగరంలో ప్రతి చోట సులభంగా లభిస్తాయి. స్థానికుల జీవితంలో భాగమైన వీటిని ఆస్వాదిస్తూ మీరు కూడా కాసేపు అక్కడి స్థానికులుగా మారిపోవచ్చు.

'రాధే రాధే' అనే పలుకే మధురం...

పర్యాటకులు ఎక్కడికి వెళ్తున్నా అక్కడి స్థానికుల్లా జీవిస్తేనే పర్యటనలోని అందమైన అనుభూతులను సొంతం చేసుకోగలరు. అందుకే అంటారు రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌లా ఉండాలి అని. అలాగే మధురలో ఉన్నప్పుడు మధురవాసిలా మారిపోవాలి. ఇక్కడ ప్రతి గల్లీలో ఒక మిఠాయి దుకాణం, అందులో చిరునవ్వు చిందిస్తూ ''రాధే రాధే'' అని పలకరించే వ్యాపారి కనిపిస్తాడు. మీరు కూడా 'రాధే రాధే' అని పలకరించండి.

చేయాల్సిన పనులు

మధురలో యమునా తీరంలో ఉదయానే కాసేపు అలా తిరగడం ఒక చక్కని అనుభూతిని అందిస్తుంది. అందుకే ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా మార్నింగ్ వాక్ చేసే అవకాశాన్ని ఎవరూ మిస్ చేయకూడదు. ఇది ఎవరూ చెప్పని ఒక ట్రావెల్ హ్యాక్.

వీటితో పాటు సాయంత్రం సమయంలో హారతి చూడటం, గోవర్ధన గిరి పరిక్రమ చేయడం, హోలీ సందర్భంగా రంగుల మధ్య భజనలు వినడం, బృందావన్‌లో సంధ్యా సమయాన భక్తి గీతాలను వినడం ఇవన్నీ మధుర ప్రయాణంలో నిదానంగా మనసును హత్తుకునే విషయాలుగా మిగిలిపోతాయి.

సందర్శనీయ స్థలాలు

మధుర అనేది ఆ నందకిశోరుడు, అతని భక్తుల ప్రపంచం. ఇక్కడ బృందావన్‌లో బాంకే బిహారీ ఆలయం, గోవర్ధన పర్వతం, గోకులం, బర్సానా లాంటి ప్రదేశాలు కనిపిస్తాయి. ప్రతి ప్రదేశానికి ఒక చరిత్ర ఉంటుంది. ప్రతి గల్లీకి ఒక కథ ఉంటుంది. ప్రతీ వీధిలో ఒక జ్ఞాపకాల నిధి ఉంటుంది. గోవర్ధన పరిక్రమ సమయంలో భక్తులు నిదానంగా నడుస్తూ భక్తిలో నిమగ్నమవుతారు. గోకులంలో బాల కృష్ణుడి లీలల గురించి భక్తులు మాట్లాడే విషయాలు మీరు ఇగ్నోర్ చేయలేరు. బృందావన్ వీధుల్లో ప్రతి సంధ్యా సమయంలో భజనలు వినిపిస్తాయి.

- ఎం.జి. కిశోర్, ప్రయాణికుడు

ఎలా వెళ్లాలి ?

- ఢిల్లీ నుంచి రైలు, రోడ్డు మార్గంలో మధురకు సులభంగా చేరుకోవచ్చు.
- రైలు యాత్రలో యమునా నది పక్కనే కనిపించే దృశ్యాలు ప్రయాణాన్ని మరింత మనోహరంగా మార్చేస్తాయి.
- ఆగ్రా, ఢిల్లీ నుంచి రోడ్డుమార్గంలో సాగే ప్రయాణం .. బ్రజ్ భూమిలో అడుగుపెడుతూనే ఆనందానుభూతిని కలిగిస్తుంది.

ఎక్కడ ఉండాలి ?

మధురలో చిన్నా పెద్ద ధర్మశాలల నుంచి ఆధునిక హోటల్స్ వరకు అనేక వసతి సదుపాయాలు ఉన్నాయి. యమునా తీరం దగ్గర ఉన్న వసతి స్థలాలు సంధ్యా సమయంలో ప్రత్యేక ప్రశాంతతను ఇస్తాయి. మీరు అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటే నదీతీరంలో ఉన్న హోటల్స్‌లో తక్కువ ధరకే రూమ్స్ లభించే అవకాశం ఉంది. అందుకే ట్రైన్ లేదా ఫ్లైట్ టికెట్స్ వంటివి బుక్ చేసుకునే సమయంలో రూమ్స్ కూడా బుక్ చేసుకోవడం ఒక మంచి ప్రయాణికుడి లక్షణం.

ఏం చూడాలి ?

మధుర ప్రయాణికులకు ఒక మధురమైన అనుభూతిని కల్పిస్తుంది. ఇక్కడికి వస్తే మీరు కృష్ణ జన్మభూమి, ద్వారకాదీశ్ మందిరం, విశ్రామ్ ఘాట్, బృందావన్, గోవర్ధన్ వంటి అనేక ప్రదేశాలను కవర్ చేయవచ్చు.

ఈ యాత్రను మధురంగా మార్చుకోవాలి అనుకుంటే చెక్ లిస్ట్ పెట్టుకుని వివిధ ప్రాంతాలను అన్వేషించడం కన్నా ప్రశాంతంగా ఒక్కో ప్రాంతాన్ని ఫీల్ అవ్వాలి. ఎందుకంటే మధుర అనేది పర్యాటక ప్రదేశం కన్నా ముందు ఒక పవిత్రమైన ప్రాంతం. ఇక్కడ ప్రతి ప్రదేశం భక్తి, శిల్పకళ, సంప్రదాయం కలిసి ఒక ఆధ్యాత్మిక అనుభవాన్ని అందిస్తాయి.

స్పితి వ్యాలీ

వెలుగులతో రంగులు మార్చే భూమి

హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న స్పితి వ్యాలీ అంటే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది మంచుతో నిండిన పర్వతాలు కాదు వెలుగు, నీడల మధ్య నడిచే ఒక నిశ్శబ్ద నాటకం. మధ్యాహ్నం వెలుగుల్లో భారీ పర్వతాలకు ఒక కొత్త రంగు వస్తుంది. సాయంత్రం వెలుగుల్లో మరో రంగు అక్కడ సందడి చేస్తుంది. ఎడారిలా కనిపించే ఈ భూమిలో ప్రకృతి భాషను అర్థం చేసుకుంటే ఇక్కడి అందాల వెనక భావాలు కూడా అర్థం అవుతాయి.

ఇక్కడి ప్రయాణం అనేది నెమ్మదిగా మనసును కబ్జా చేసే ఒక చక్కని పాటలోని సాహిత్యంలా ఉంటుంది. లోయల మధ్యలో వెలుగు నీడల ఈ ఆటను గమనిస్తే ప్రతీ గంట ఒక పెయింటింగ్లా ఉంటుంది.

సందర్శనీయ స్థలాలు

హిమాచల్ ప్రదేశ్‌లోని లాహోల్ స్పితి జిల్లాలో ఉండే స్పితి వ్యాలీలో ఎన్నో అందమైన సందర్శనీయ స్థలాలు ఉన్నాయి. అందులో కీ మోనాస్టరీ, చంద్రతాల్ లేక్, కిబ్బర్ గ్రామం ఇవన్నీ చూస్తే మనం చూస్తున్నది సీనరీకాదుంకాలమే నిశ్శబ్దంగా సాగుతోంది అనిపిస్తుంది. రోడ్డుపై వచ్చే ప్రతీ మలుపు ఒక పోస్ట్‌కార్డులా ఉంటుంది.

హైదరాబాద్ నుంచి ఎలా చేరుకోవాలి

హైదరాబాద్ నుండి ఢిల్లీకి ఫ్లైట్ లేదా రైలులో వెళ్లవచ్చు. అక్కడి నుంచి మనాలీకి రోడ్డు జర్నీ ప్రారంభించవచ్చు. ఇక మనాలిలో మీకు నచ్చినంత టైమ్ స్పెండ్ చేసి స్పితీ వ్యాలీకి క్యాబ్ లేదా లోకల్ ట్రాన్స్‌పోర్టుతో అందమైన పర్వతాలను చూస్తూ చేరుకోవచ్చు. ఈ ప్రయాణంలో గమ్యస్థానం కన్నా ప్రయాణ అనుభవమే జీవితాంతం గుర్తుండిపోతుంది.

హపుటాలే

చక్కటీ లైఫ్ స్టైల్

శ్రీలంక లోని హపుటాలే అనే చిన్న కొండ పట్టణంలో టీ తోటల మధ్య సాగే జీవన విధానం ఒక నిశ్శబ్ద ప్రయాణ కథలా అనిపిస్తుంది. పొగమంచులో కమ్ముకున్న వెలుగు–నీడలు, టీ ఆకులు సేకరించే చేతులుం ఇవన్నీ ప్రతీ రోజు ప్రశాంతతకు చిహ్నాలుగా కనిపిస్తాయి. ఇక్కడ ప్రతీ ఉదయం హడావిడి లేకుండా మెల్లగా ప్రారంభమవుతుంది. లోయలో మేఘాలు సాఫీగా కదులుతూ ఉంటే, మనుషుల జీవితం కూడా అదే లయలో ముందుకు సాగుతుంది. సమయం ఇక్కడ పరుగెత్తదుం నడుస్తుంది. ఎలాంటి హడావిడి లేకుండా ఇక్కడ సమయం గడుస్తుంది.

సందర్శనీయ స్థలాలు

హపుటాలేలో పర్యాటకులు తప్పక వెళ్లే ప్రదేశాల్లో లిప్టన్ సీట్, డియాలుమా జలపాతం ముఖ్యమైనవి. ఇక్కడ కనిపించేది కేవలం ప్రకృతి అందం మాత్రమే కాదుం సాధారణంగా కొనసాగుతున్న జీవితం యొక్క ఒక నిశ్శబ్ద రాగంలా ఉంటుంది. దగ్గర్లోని తంగమాలే బర్డ్ శాంక్చువరి వద్ద పక్షుల సందడి ఒక స్వచ్ఛమైన సంగీతంలా అనిపిస్తుంది. ప్రతీ ఉదయం ఇక్కడ వినిపించే స్వరాలు హృదయాన్ని తాకుతాయి.

హైదరాబాద్ నుంచి ఎలా వెళ్లాలి?

హైదరాబాద్ నుంచి కొలంబోకి నేరుగా విమాన ప్రయాణం చేసి, అక్కడి నుంచి రైలు లేదా క్యాబ్ ద్వారా హపుటాలే చేరవచ్చు. కొలంబో నుంచి ఈ కొండ ప్రాంతానికి వెళ్లే రైలు ప్రయాణం అత్యంత అందమైన అనుభవంగా ఉంటుంది.

కొంకణ్ రైల్వే యాత్ర

ప్రతీ సీన్ ఒక పోస్టు కార్డు

కొంకణ్ రైల్వేలో ట్రావెల్ చేస్తుంటే అది సాధారణ ట్రైన్ జర్నీలా అనిపించదు. ఒక సినిమాలో మనం భాగమైనట్టుగా అనిపిస్తుంది. ఈ ప్రాంతం మహారాష్ట్ర దక్షిణ తీర ప్రాంతం నుంచి గోవా, కర్ణాటక ఉత్తర తీర వరకు అరేబియా సముద్రం ఒడ్డున విస్తరించి ఉంటుంది. పశ్చిమంలో సముద్రం, తూర్పున పశ్చిమ కనుమలు మధ్య సాగే ఈ మార్గం నేచురల్ బ్యూటికి పెట్టింది పేరు.

రైలు ప్రయాణ సమయంలో విండో సీట్ దగ్గర కూర్చొని బయట చూస్తే నిమిషం నిమిషానికి సీన్ మారిపోతూనే ఉంటుంది. ఒక వైపు కొండలు, మరో వైపు సముద్ర తీరం, మధ్యలో కొబ్బరి తోటలు, సొరంగాలు, వంతెనలు ప్రయాణం కంటే అనుభవమే ఎక్కువగా గుర్తుండిపోతుంది.

టన్నెల్స్ మధ్య వెళుతుంటే లైట్ సడెన్‌గా మారిపోతుంది. ఒక్కసారి అందమైన చీకటి తరువాత చందమైన వెలుగులో పచ్చని కొండలు కనిపిస్తాయి. ఆ కాంట్రాస్ట్‌లోనే ఈ జర్నీ ఒక మ్యాజిక్‌లా అనిపిస్తుంది.

బ్రిడ్జిలు క్రాస్ అయ్యేటప్పుడు ఒక పక్కన వెస్టర్న్ ఘాట్స్ కొండలు, మరోవైపు అరేబియన్ సీ బ్లూ లైన్‌లా కనిపిస్తుంది. కొన్ని ప్రదేశాల్లో సముద్రం హఠాత్తుగా కనిపించి, వెంటనే కొబ్బరి చెట్ల మధ్య మాయమైపోతుంది.

చిన్న చిన్న స్టేషన్ల దగ్గర ట్రైన్ స్లో అయ్యే సమయంలో ప్లాట్‌ఫారమ్ మీద లోకల్ లైఫ్ మణిరత్నం సినిమా ఫ్రేమ్‌లా కనిపిస్తుంది. ఛాయ్ స్టాల్స్, ఫిషింగ్ బాస్కెట్స్, సైలెంట్ బెంచులుం ఇవన్నీ ఒక సినిమాటిక్ ఫీలింగ్ కలిగిస్తాయి.

ప్రతీ స్టేషన్ ఒక పోస్టు కార్డులా..

రత్నగిరిలో ట్రైన్ ఆగే సమయంలో సముద్రం ఒక బ్లూ స్పార్క్‌లా కనిపిస్తుంది. కావర్ దగ్గర కోస్ట్ ఇంకా దగ్గరగా వస్తుంది. సముద్ర గాలి దాదాపు రైలు కిటికీలోకి మనల్ని తాకేందుకే వచ్చినట్టుగా అనిపిస్తుంది. ప్రతీ స్టేషన్ ఒక కోస్టల్ పోస్టుకార్డ్‌లా ఉంటుంది.

హైదరాబాద్ నుండి ఎలా చేరాలి?

హైదరాబాద్ నుండి మడ్‌గావ్ లేదా మంగళూరు వరకు డైరెక్ట్ ట్రైన్స్ దొరుకుతాయి. అక్కడి నుంచి కొంకణ్ కోస్టల్ స్ట్రెచ్‌లో జర్నీ కొనసాగిస్తే రైలు యాత్ర ఒక అందమైన స్మృతిగా మారిపోతుంది. వెలుగు, నీళ్లు, పచ్చని పర్వతాల మధ్య నిలిచిపోయే ఒక అనుభవంగా మిగిలిపోతుంది.

రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని ఆదివారం పంజాబ్‌లోని అమృత్‌సర్ ఇస్కాన్ ఆలయంలో గులాల్ చల్లుకుంటూ వేడుక జరుపుకుంటున్న యువత

సిక్కులకు న్యాయం కోసం కృషి

హింద్-ది-చదర్‌నుద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోదీ

నవీ ముంబై: సిక్కులకు గౌరవం, న్యాయం దక్కేలా కృషి చేసేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే, 1984లో ఇందిర మరణానంతరం సిక్కులపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ జరిపేందుకు తమ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. మూసివేసిన ఎన్నో కేసులను తిరిగి తెరిచి, విచారణ చేపట్టామని తెలిపారు. బాధిత కుటుంబాలకు పరిహారం అందజేశామన్నారు. జాతీయ మైనారిటీ కమిషన్‌లో సిక్కులకు మరింత ప్రాముఖ్యతను కల్పించామన్నారు. గురు తేజ్ బహదూర్ అమరత్వం పొంది 350 ఏళ్లయిన సందర్భంగా ముంబైలోని ఖర్ఘర్‌లో ఆదివారం జరిగిన 'హింద్-ది-చదర్'ను ఉద్దేశించి ప్రధాని వర్చువల్‌గా మాట్లాడారు. అఫ్గానిస్తాన్‌లో పవిత్ర గురుగ్రంథ్ సాహిబ్ ప్రతులు, సిక్కు కుటుంబాల భద్రత ప్రమాదంలో పడగా ప్రభుత్వం తక్షణమే స్పందించి సురక్షితంగా స్వదేశానికి తరలించిందని గుర్తు చేశారు. అఫ్గాన్‌లో యాతనలు పడిన సిక్కులకు సీఏఏ ద్వారా పౌరసత్వం కల్పించామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన సిక్కు కుటుంబాల పునరావాసానికి చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. వేలాది మంది సిక్కుల పేర్లను బ్లాక్ లిస్టు నుంచి తొలగించడంతోపాటు వీసా నిబంధనలను సడలించినట్లు ప్రధాని వివరించారు.

భవిష్యత్తుకు బాటలు పరిచేవి..

హింద్-ది-చాదర్ వంటి కార్యక్రమాలు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడానికి కాకుండా భవిష్యత్తుకు దారులు వేస్తాయన్నారు. 'గురు తేజ్ బహదూర్ కాలంలో ధైర్యం, సత్యసంధతకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో, నేటికీ అంతే సందర్భోచితంగా ఉంది. మన కొత్త తరం ఇటువంటి విలువలని అందిపుచ్చుకున్నప్పుడు, సంప్రదాయం అనేది కేవలం ఒక జ్ఞాపకంలా మిగిలిపోదు; అది భవిష్యత్తుకు మార్గదర్శకంగా మారుతుంది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం కూడా ఇదే. మనం చరిత్రను కేవలం స్మరించుకోవడమే కాదు, దానిని మన జీవితాల్లోకి కూడా తెచ్చుకోవాలి'అని ప్రధాని మోదీ తన వర్చువల్ ప్రసంగంలో పేర్కొన్నారు.



మన గురువుల త్యాగాలు..

దేశ చరిత్ర పరాక్రమం, సమన్వయం మరియు సహకారంతో నిండి ఉందని ఆయన అన్నారు. గురువుల అత్యున్నత త్యాగం దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసిందని ప్రధాని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గం వారి నుంచి స్ఫూర్తిని పొందిందని, అది సమాజం సత్య మార్గంలో ముందుకు స్థిరంగా సాగడానికి సాయపడిందని ప్రధాని తెలిపారు. 'దేశానికి సామాజిక ఐక్యత ఎంతో అవసరమైన ఈ సమయంలో, మన గురువులు, సాధువుల ఆశీస్సులు మనకు ఉన్నాయనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం కలిగిస్తోంది. ఈ ప్రయాణం గత ఏడాది నాగ్‌పూర్ నుంచి ప్రారంభమైంది, ఆ తర్వాత నాందేడ్ వరకు సాగింది. నేడు నవీ ముంబైలో ఈ ప్రయాణం ఒక ముఖ్యమైన దశకు చేరుకుంది'అని ప్రధాని అన్నారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు మృత్యువాత

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం హూస్టన్‌లో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయాలపాలయ్యారు. ఆదివారం వేకువజామున బ్యూఫోర్డ్‌లోని రద్దీగా ఉండే ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. నగరంలోని టెక్నాలజీ రంగ పరిశ్రమలకు సంబంధించిన విద్యార్థులు, వృత్తి నిపుణులు ముఖ్యంగా భారతీయ అమెరికన్లు ఇక్కడికి ఎక్కువగా వస్తుంటారు. ఓ దుండగుడు తుపాకీతో జనంపైకి యథేచ్ఛగా కాల్పులకు దిగాడు. ఘటనలో దుండగుడు సహా ముగ్గురు చనిపోగా, 14 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కాగా, బాధితుల్లో భారతీయులున్నట్లు తమకు సమాచారం అందలేదని హూస్టన్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయం తెలిపింది.

11 రాష్ట్రాల్లో 27 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసులు దేశవ్యాప్తంగా వారం రోజులపాటు దాడులు చేపట్టి 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. వీరిపై 150 వరకు ఫిర్యాదులు అందగా 10 వరకు సైబర్ కేసులున్నాయని పోలీసులు తెలిపారు. 11 రాష్ట్రాలకు చెందిన వీరు ఒక ముఠాగా ఏర్పడి రూ.13.91 కోట్ల వరకు లావాదేవీలు జరిపి, రూ.1.5 కోట్ల మేర మోసాలకు పాల్పడ్డారని చెప్పారు. జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరాఖండ్, యూపీ, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, బెంగాల్‌లో సోదాలు జరిపామన్నారు. సోదాల సమయంలో 25 సెల్‌ఫోన్లు, 28 సిమ్ కార్డులు, 20 డెబిట్ కార్డులు, ఒక పీవోఎస్ మెషీన్, ఒక బైక్, బ్యాంకు పత్రాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

నితీశ్‌కు ప్రధాని మోదీ... పుట్టినరోజు శుభాకాంక్షలు

సీఎంలు స్టాలిన్, ఖేమ్‌చంద్‌కు కూడా

పట్నా/చెన్నై/న్యూఢిల్లీ: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆదివారం 76 ఏట అడుగు పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు ఆయన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ గవర్నర్, ఉప ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అరుణాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం చౌనామెయిన్ తదితరులు నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ అభివృద్ధి కోసం ఆయన అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. దార్శనికత, అభివృద్ధి పథకాలతో లక్షలాది మంది జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేస్తున్న నితీశ్‌కు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదించాలని ప్రార్థించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కూడా ఆదివారం పుట్టిన రోజు జరుపుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, గవర్నర్ ఆర్.ఎన్.రవి, సినీనటుడు రజనీకాంత్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డీఎంకే ప్రముఖులు అన్నాదురై, ఎం.కరుణానిధి స్మారక చిహ్నాల వద్ద స్టాలిన్ పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. తమిళ భాష, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటమే తన జీవిత ధ్యేయమని ఎక్స్ వేదికగా ప్రకటించారు. మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్‌కు కూడా ప్రధాని మోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మణిపూర్ ప్రజల సేవలో ఆయన దీర్ఘకాలం, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ప్రియుడికి వివాహమైందని తెలిసి.. ఏం చేసిందంటే..?

న్యూఢిల్లీ: ఓ యువతి తనతో రెండేళ్లుగా సంబంధం నెరపుతున్న యువకుడికి అప్పటికే పెళ్లయిందని తెలుసుకుని కక్షతో రగిలిపోయింది. నమ్మకంగా పిలిపించుకుని, మత్తు మందిచ్చి, అతడి మర్మావయవాలను కోసేసింది. తీవ్ర గాయాలతో అతడు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఫిబ్రవరి 25వ తేదీన ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు(22) హిందూరావ్ ఆస్పత్రిలో తీవ్ర గాయాలతో చేరాడు. ఆస్పత్రి అధికారుల సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితుడిని యూపీలోని రాంపూర్‌కు చెందిన ఆర్‌ఎంపీగా పనిచేసే విసర్జీత్‌గా గుర్తించారు. ఇతడికి రెండేళ్ల క్రితం ఢిల్లీలోని వజీరాబాద్‌కు చెందిన అమీనా ఖాతూన్‌తో పరిచయమేర్పడింది. ఫిబ్రవరి 24వ తేదీన అమీనా వద్దకు విసర్జీత్ వచ్చాడు. ఆ రోజు రాత్రి అతడికి అమీనా మత్తు పదార్థం కలిపిన పాలను తాగించింది. మత్తులోకి జారుకున్నాక అతడి మర్మాయవాలను పదునైన ఆయుధంతో కోసేసింది. అప్పటికే పెళ్లయినా కాలేదని విసర్జీత్ చెప్పడంతో ఆగ్రహంతోనే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడిందని పోలీసులు భావిస్తున్నారు. తెల్లారాక విసర్జీత్ గాయాలతో దగ్గర్లోని హిందూరావ్ ఆస్పత్రిలో చేరాడు. వివిధ సెక్షన్ల కింద అమీనాపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న ఆమె కోసం గాలిస్తున్నారు. అమీనా స్వస్థలం బిహార్‌లోని కటిహార్ ప్రాంతం.

మండలిలో ఇరాన్, అమెరికా రాయబారుల వాగ్యుద్ధం

పరిస్థితులు చేయిదాటుతున్నాయంటూ గుటెరస్ ఆందోళన

ఐక్యరాజ్యసమితి: అమెరికా, ఇజ్రాయెల్‌ల వైమానిక దాడులు, ఇరాన్ ప్రతిదాడుల ప్రభావం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోనూ కనిపించింది. అమెరికా, ఇజ్రాయెల్ భారీ వైమానిక దాడులు, ఇరాన్ ప్రతిదాడులు మొదలైన కొద్ది గంటల్లోనే న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో భద్రతా మండలి అత్యవసర భేటీ జరిగింది. ఈ సమావేశంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ రాయబారుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఐరాసలో నైతిక అంశాలపై స్పష్టత లోపించడంతో అమెరికా జోక్యం చేసుకుని, దానిని సరిచేసిందంటూ మండలిలో ఆ దేశ రాయబారి మైక్ వాల్జ్ పేర్కొన్నారు. ఇరాన్ అణు సంపత్తిని కలిగి ఉండరాదన్నది ప్రపంచ భద్రతతో ముడిపడి ఉన్న అంశమని చెప్పుకొచ్చారు. అదేవిధంగా, ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ మాట్లాడుతూ..అస్తిత్వమే ప్రమాదంలో పడగా, అది మరింత తీవ్ర రూపం దాల్చకమునుపే, దానిని అడ్డుకోవడానికి తమ దేశం అమెరికాతో కలిసి పనిచేసిందని సమర్థించుకున్నారు. ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానీ వారి వివరణలను తిప్పికొట్టేందుకు ప్రయత్నించారు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి తమ దేశంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, ముందస్తు ప్రణాళికతో దురాక్రమణకు దిగాయని ఆరోపించారు. గత కొద్ది నెలల్లో ఇలా జరగడం ఇది రెండోసారని పేర్కొన్నారు. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆయన అతి ఘోరమైన నేరంగా అభివర్ణించారు. హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్ మినాబ్‌లోని ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 100 మందికిపైగా పిల్లలు చనిపోయారన్నారు. ఇటువంటి యుద్ధ నేర చర్యలకు పాల్పడుతున్న అమెరికా, ఇజ్రాయెల్‌లపై మండలి వెంటనే తగు రీతిలో స్పందించాలని కోరారు. మౌనం నేరంతో సమానమని పేర్కొన్నారు. మర్యాదగా మాట్లాడండి అంటూ ఇరవానీ సూచించగా, స్వేచ్ఛను కోరుకుంటున్న వేలాది మంది సొంత ప్రజలను చంపి, మరెంతో మందిని జైల్లో పెట్టిన నిరంకుశపాలకులకు ప్రతినిధిగా ఇక్కడ కూర్చున్న మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ వాల్జ్ తిప్పికొట్టారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో పరిస్థితులపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాడులు, ప్రతిదాడులను ఆయన ఖండించారు. ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఈ ప్రాంతంలో తాజా సైనిక చర్యల వల్ల పరిస్థితి మరింతగా చేయిదాటి పౌరుల ప్రాణాలు, ప్రాంతీయ సుస్థిరత ప్రమాదంలో పడిందన్నారు. తక్షణమే ఉద్రిక్తతల నివారణకు చర్యలు తీసుకోవాలని, దాడులను నిలువరించాలని సంబంధిత దేశాలకు ఆయన పిలుపునిచ్చారు.

బీజేపీ పాలనకు కౌంట్‌డౌన్

జంతర్‌మంతర్ ర్యాలీలో కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ కోర్టు తీర్పుతో మద్యం పాలసీ కేసు నుంచి బయటపడిన 48 గంటలైనా గడవకమునుపే ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలపై విమర్శల దాడి మొదలుపెట్టారు. అధికార పీఠం నుంచి బీజేపీని కిందికి దించేందుకు కౌంట్‌డౌన్ మొదలైందంటూ విరుచుకుపడ్డారు. ఆదివారం జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆప్ ర్యాలీలో కేజ్రీవాల్ మాట్లాడారు. మద్యం విధానం కేసులో తనను అక్రమంగా ఇరికించేందుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కుట్రపన్నారని ఆరోపించారు. అయితే, కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు తాను కరుడుగట్టిన నిజాయతీపరడన్నది రుజువైందంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీలో భయమొదలైందంటూ ఆయన..నిరంకుశుడు ఇలా భయపడుతున్నాడంటే దానర్థం..అతడి పాలనకు ముగింపు దగ్గరపడున్నట్లేనని పేర్కొన్నారు. చిన్నారుల విద్య కోసం పోరాడిన, శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను మోదీయే జైలులో పెట్టించారు. మహిళా ఎంపీలు దాడి చేస్తారనే భయంతోనే ఆయన ఒక రోజు పార్లమెంట్‌కు వెళ్లలేదు. ట్రంప్ అన్నా మోదీకి భయమే'అని కేజ్రీవాల్ దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ 12 ఏళ్ల పాలనలో అన్ని రంగాలు నాశనమయ్యాయన్నారు. రహదారులు, ఆరోగ్య రంగం, విద్య, పారిశుధ్యం..ఇలా అన్నీ దారుణంగా మారాయని విమర్శించారు. జీవించగలిగే భారత్‌ను ప్రజలు కోరుకుంటుండగా వికసిత్ భారత్ అంటూ ప్రధాని మోదీ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పరీక్షా పే చర్చ పేరుతో డ్రామాలు ఆపి, పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టాలన్నారు. ఏడాది పాలనలోనే ఢిల్లీని బీజేపీ నాశనం చేసిందని మండిపడ్డారు. దేశానికి మోదీ చేసిందేమీ లేదంటూ కేజ్రీవాల్..కుట్రలు, ఓటర్ల జాబితా అవకతకల ద్వారానే ఆయన అధికారంలో కొనసాగుతున్నారంటూ ఆరోపించారు.

ఖమేనీ హత్యపై పలు చోట్ల నిరసనలు

శ్రీనగర్/లక్నో: ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ హత్యకు నిరసనగా ఆదివారం కశ్మీర్ నుంచి కర్నాటక వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో షియా ముస్లింలు నిరసనలకు దిగారు. దాదాపు 15 లక్షల మంది షియాలున్న కశ్మీర్‌లోని లాల్ చౌక్, సైదా కాదల్, బుద్గాం, బందిపొర, అనంత్‌నాగ్, పుల్వామా ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. నిరసనకారులు గుండెలు బాదుకుంటూ అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేశారు. యూపీ రాజధాని లక్నోలో బారా ఇమాంబారా మసీదు వద్ద పెద్ద సంఖ్యలో జనం చేరి నిరసన తెలిపారు. మహిళలు ఖమేనీ చిత్ర పటాలను చేబూని కంటతడి పెట్టుకున్నారు. సోమవారం కూడా జరిగే నిరసనల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూల దిష్టిబొమ్మలను దహనం చేయాలని నిరసనకారులకు ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డ్ ప్రధాన కార్యదర్శి మౌలానా యాసూబ్ అబ్బాస్ పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు సంతాప దినాలను పాటించాలన్నారు. నల్లదుస్తులు ధరించి, ఇళ్లపై నల్లజెండాలను ఎగురవేయాలని, ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించాలని కోరారు. పంజాబ్‌లోని లుధియానా, రాజస్తాన్‌లోని అజ్మేర్‌లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. తెలంగాణ, జార్ఖండ్, బిహార్, ఢిల్లీల్లో ఖమేనీ పోస్టర్లతో నిరసన ప్రదర్శనలు జరిపారు. ఇలా ఉండగా, కర్నాటకలోని చిక్కబళ్లాపూర్ జిల్లా అలీపూర్‌లో మాత్రం ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఖమేనీ మృతికి మూడు రోజులు సంతాప దినాలుగా పాటించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలీ ఖమేనీ 1986లో ఈ గ్రామాన్ని సందర్శించినట్లు స్థానికులు తెలిపారు.

శ్రీనగర్‌లో ఖమేనీ చిత్ర పటంతో ర్యాలీలో పాల్గొన్న షియాలు

నిలిచిపోయిన విమాన సర్వీసులు

యూఏఈ, దుబాయ్‌లో వేలాదిగా చిక్కుకుపోయిన భారతీయులు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఆ ప్రాంతంలోని దుబాయ్‌తో పాటు ఇతర ముఖ్యమైన విమానాశ్రయాల్లో వందలాదిగా భారతీయులు చిక్కుబడిపోయారు. తమకు వెంటనే సాయం అందించాలంటూ సామాజిక మాధ్యమ వేదికల ద్వారా వారు భారత ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేసుకుంటున్నారు. దుబాయ్‌లో ఉండిపోయిన వారిలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, కర్నాటక ఎమ్మెల్సీ భోజెగౌడ ఆయన కుటుంబం, బెంగాలీ నటి శుభశ్రీ గంగూలీ, ఆమె కుమారుడు, పలువురు పర్యాటకులు, విద్యార్థి బృందాలు ఉన్నాయి. బర్మింగ్‌హామ్‌లో జరిగే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు ఇండోనేసియాకు చెందిన కోచ్ ఇర్వన్స్యాహ్ ఆది ప్రతమతో కలిసి వెళ్తున్న పీవీ సింధు ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుబడిపోయారు. వారున్న ప్రాంతానికి అతి సమీపంలోనే భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతానికి విమాన సర్వీసులు రద్దు కావడంతో యూఏఈలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సహా 700 మంది నిలిచిపోయారు. వీరిలో పలువురు పర్యాటకులు, వ్యాపార రంగాల వారు ఉన్నారు. పశ్చిమాసియాలోని వివిధ ప్రాంతాల్లో చిక్కుబడి పోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్రం అన్ని రకాలుగా ప్రయతిస్తోందని కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషి చెప్పారు. అయితే, ప్రస్తుతం అక్కడ అత్యంత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

ఖమేనీ హత్యను ఖండించిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ హత్యను ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి. ఖమేనీ హత్యపై కేంద్రం మౌనం వహించడాన్ని ప్రశ్నించాయి. ఇరాన్ మీద యుద్ధంపై మోదీ ప్రభుత్వంపై స్పందించకపోవడం భారత విలువలకు, సూత్రాలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. ఒక దేశ సార్వభౌమ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని నాయకత్వాన్ని హత్య చేయడం, అమాయక ప్రజలను చంపడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ప్రభావిత దేశాల్లోని భారతీయ పౌరులందరినీ స్వదేశానికి క్షేమంగా తీసుకురావడానికి ప్రధానమంత్రి అన్ని ప్రయత్నాలు చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఖమేనీ హత్య అనైతికం, చట్టవిరుద్ధమని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. యుద్ధాన్ని ఆపడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో పరిణామాలపై ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, పవన్ ఖేరా ప్రశ్నించారు. భారత ఇంతకు ముందెప్పుడూ ఇంతటి బలహీనంగా కనిపించలేదని ఆయన ఎక్స్‌లో పోస్ట్ ప్రకటించారు. ఖమేనీ హత్యను సీపీఐ నాయకుడు డి.రాజా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, శివసేన యూబీటీ నాయకురాలు ప్రియాంక చతుర్వేది, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఖండించారు. ఈ అంతర్జాతీయ సమస్యపై కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి... 50 లక్షల చొరబాటుదార్ల తొలగింపు

బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ వ్యాఖ్యలు

కూచ్ బెహార్: రాష్ట్రంలోని ఓటర్ల జాబితా నుంచి 50 లక్షల మందికిపైగా అక్రమ చొరబాటుదారులను తొలగించామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలిపారు. రాష్ట్రం నుంచి అక్రమ వలసదారులను తరిమికొట్టడానికి సమయం ఆసన్నమైందన్నారు. అవినీతిలో కూరుకుపోయిన టీఎంసీ ప్రభుత్వ పాలన నుంచి బెంగాల్‌ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన 'పరివర్తన యాత్ర' కూచ్‌బెహార్‌లో ఆయన ఆదివారం ప్రారంభించారు. ఎస్‌ఐఆర్‌తో ఓటర్ల జాబితాలోని అక్రమ చొరబాటుదారులను తొలగించేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న ప్రయత్నాలను సీఎం మమతా బెనర్జీ అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని నితిన్ నబీన్ ఆరోపించారు. తన పార్టీ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం, చొరబాటుదారులను రక్షించేందుకు ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారని విమర్శించారు. వలసదారులు స్థానిక ప్రజల ప్రయోజనాలను హరించివేస్తున్నారు. దేశ భద్రతకు కూడా ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపించారు. బెంగాల్ యువత ఉద్యోగాలను కొల్లగొడుతున్న అక్రమ వలసదారుల కాలం ముగిసిందన్నారు. రాష్ట్రం నుంచి చొరబాటుదారులను తరిమేయడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించే ఒక నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు.

63.66 లక్షల ఓటర్ల తొలగింపు..

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ శనివారం అధికారిక గణాంకాలను విడుదల చేసింది. ఎస్ఐఆర్‌తో 63.66 లక్షల సరికొత్త ఓటర్ల పేర్లను తొలగించాలని స్పష్టం చేసింది. మరో 60 లక్షల మంది ఓటర్లను పరిశీలనలో ఉంచామని తెలిపింది. దీనితో రాష్ట్ర ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు చేరింది.

బీజేపీ చెప్పుచేతల్లో ఈసీ: టీఎంసీ

బెంగాల్లో భారీగా ఓటర్ల తొలగింపు: అభిషేక్

కోల్‌కతా: రాష్ట్రంలో 1 కోటి మంది ఓటర్లను తొలగించడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభించడానికి ముందే బీజేపీ ఈ లక్ష్యాన్ని ఈసీకి ఫిక్స్ చేసిందన్నారు. శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీని ఓడించడానికి, ఎన్నికలను ప్రభావితం చేయడానికి బీజేపీ ఈసీని ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు. బెంగాల్‌లో ఈసీ ఎస్ఐఆర్ జాబితాను శనివారం విడుదల చేసిన అనంతరం ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి 1.2 కోట్ల పేర్లను తొలగిస్తామని బహిరంగంగా చెప్పారని, ప్రస్తుతం పరిశీలనలో ఉన్న, ఇప్పటివరకు తొలగించిన సంఖ్యలను చూస్తే అందుకు దగ్గరగా ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందే 1 కోటి మంది 1.25 కోట్ల మంది ఓటర్లను తొలగిస్తామని రాష్ట్ర బీజేపీ నాయకులు సువేందు అధికారి, సుకాంత మజుందర్, శంతను ఠాకూర్ చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. బీజేపీ నిర్దేశించిన ప్రకారమే ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ ఏకపక్ష తొలగింపులకు వ్యతిరేకంగా మార్చి 6న ధర్నా నిర్వహిస్తామని చెప్పారు.

భారత భూభాగంలోకి పాక్ డ్రోన్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో భారత భూభాగంలోకి పాకిస్తాన్ డ్రోన్ ప్రవేశించింది. పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ దాటి ఆదివారం తెల్లవారుజామున ప్రవేశించిన డ్రోన్‌ను గుర్తించిన ఆర్మీ దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఉదయం 6.10 గంటల ప్రాంతంలో ప్రవేశించిన డ్రోన్ ను గమనించిన ఫార్వర్డ్ పోస్టును నిర్వహిస్తున్న దళాలు కాల్పులు జరిపాయి. అయితే, దిగ్వార్ ప్రాంతం లో కొద్దిసేపు సంచరించిన డ్రోన్.. భద్రతా దళాల కాల్పులను తప్పించుకుని తిరిగి పీఓకేలోకి వెళ్లింది. పాక్ డ్రోన్ కదలికను గుర్తించి దళాలు కాల్పులు జరపడం మూడు రోజుల్లో ఇది రెండోసారి. ఫిబ్రవరి 27న, అదే ప్రాంతంలో పాకిస్తాన్ డ్రోన్‌పై భారత భద్రతా దళాలు కాల్పులు జరిపాయి.

చేతబడి అనుమానంతో గిరిజన మహిళ హత్య

బారిపద: చేతబడి చేస్తోందనే అనుమానంతో ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో గిరిజన మహిళను హత్య చేశారు. బహాల్డా పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంభిర్దా గ్రామంలో 62 ఏళ్ల జోబా తుడు నివసిస్తోంది. ఆమె మంత్రవిద్యలు అభ్యసిస్తోందని అదే గ్రామానికి చెందిన జుగురు మరాండీ అనే వ్యక్తి అనుమానిస్తున్నాడు. ఆమె వల్లే తన తండ్రి అనారోగ్యానికి గురయ్యాడని భావించాడు. శుక్రవారం రాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న జోబా తుడును.. జుగు మరాండీ కర్రతో కొట్టి చంపాడు. అనంతరం పోలీసులు ఎదుట లొంగిపోయాడు. 26 ఏళ్ల జుగు మరాండీని అరెస్టు చేసిన పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమాసియాలో సీబీఎస్‌ఈ పరీక్షలు వాయిదా

న్యూఢిల్లీ: ఇరాన్‌లో యుద్ధ వాతావరణం నేపథ్యంలో మిడిల్ ఈస్ట్‌లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పరీక్షలు వాయిదా పడ్డాయి. ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈల్లో నేడు జరగాల్సిన 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సీబీఎస్ఈ అధికారులు తెలిపారు. పరీక్ష జరిగే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. పరిస్థితిని సమీక్షించి మార్చి 3, 5 లో జరగాల్సిన పరీక్షలకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎప్పటికప్పుడు తేదీలను తెలుసుకునేందుకు విద్యార్థులు పాఠశాలలను సంప్రదించాలని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించారు.

నాగ్‌పూర్‌లో కర్మాగారంలో పేలుడు

18 మంది దుర్మరణం • మరో 18 మందికి గాయాలు

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 18 మంది మృతి చెందారు. మరో 18 మంది గాయపడ్డారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. నాగ్‌పూర్ జిల్లాలోని రౌలాగావ్‌లో ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సోలార్ ఎక్స్‌ప్లోజివ్స్ గ్రూప్ సంస్థ ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఉదయం 7 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, అత్యవసర సహాయ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. గాయపడిన వారిని నాగ్‌పూర్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలు, రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రధాని జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఫడ్నవీస్ ప్రకటించారు. పేలుడుకు గల కారణాలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు.

‘అమిత్ర ఘాత’ అనేది ఎవరి బిరుదు?

కళింగ యుద్ధం అశోకుడు పూర్తిగా ధర్మం వైపుగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ధర్మ ప్రచారం కోసం ఈయన ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను నియమించాడు. వీరిని పశ్చిమాసియా, శ్రీలంకకు పంపించాడు. మానవుడిని నైతికంగా, ఉన్నతంగా చేసేవిధంగా, సమాజాన్ని ఉద్ధరించేలా దమ్మ సూత్రాలను రూపొందించాడు. అంతేగాని ప్రజలపై మతాన్ని రుద్దడం వీటి ఉద్దేశం కాదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

జైనమతం (క్రీ.పూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను ‘తీర్థంకరులు’ అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న ‘కుంద’ గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. ‘జృంబిక’ గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత ‘మహావీరుడు’గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను ‘త్రిరత్నాలు’గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో ‘పావాపురి’ వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని ‘సల్లేఖన వ్రతం’గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్ధి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ‘గంధర్వ’ అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగాలోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.

జైనమత మహత్వ సూత్రాలు:

1) అహింస 2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు:

- అబూ పర్వతం–మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ–గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి – జైన దేవాలయాలు

అజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు అజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు సన్నిహితంగా ఉంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీ.పూ.542-490)

క్రీ.పూ. 542–490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే ‘షోడశ మహాజనపదాలు’ అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజం, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రధ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.

అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495–464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్లు యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు.

హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగ వంశం (క్రీ.పూ. 490–458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు ‘మహాక్షత్రాంతక’ అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీ.పూ. 327–325):

భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో ‘సైరస్’, ‘డేరియస్’ గొప్పవారు. పారశీక చక్రవర్తి ‘సైరస్’ గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.



మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు:

విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన ‘ఇండికా’, స్ట్రాబో, డియోడరస్, ఏరియస్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి ‘అర్థశాస్త్రం’, విశాఖదత్తుడి ‘ముద్రారాక్షసం’.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్య వదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వణ్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి.

వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. ‘సల్లేఖన వ్రతం’ ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ.303లో ‘సెల్యూకస్ నికేటర్’తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.

బిందుసారుడు (క్రీ.పూ. 298–273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి ‘అమిత్రఘాత’, ‘సింహసేనుడు’ అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్య రక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు. బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీ.పూ. 273–232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262–61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం ‘ధర్మాశోకుడు’గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని ‘దేవానాం ప్రియ’, ‘ప్రియదర్శిని’ బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన ‘ధర్మం’లోని సూత్రాలు. ‘అహింసా’ అనేది ‘ధర్మం’లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్లు పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షహబద్‌గిరి, మాన్‌షేషరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిందై శాసనం ఈశాన్య సరిహద్దును, సోపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగడ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిందై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో ‘దేవానాం ప్రియ’ అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీ.పూ. 232 – 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రధుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల ‘శ్రేణులు’ బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో ‘ఖరోష్టి’, ‘బ్రాహ్మి’ లిపులను వాడారు.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

ఆధునిక కవితోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన ‘లలిత’.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు – అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి – కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి – నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి – గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి ‘హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్’ అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని ‘**లిరికల్ పోయెట్రీ**’నే తెలుగులో ‘**భావ కవిత్వం**’ అని పిలుస్తున్నారు.
- ‘లిరిక్’ అంటే ‘**గాన గుణం అమరిన రచన**’ అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి ‘**ముసలమ్మ మరణం**’ నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం.** దీనికి మూల పురుషుడు **రూసో.**
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత – **రూసో.**
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన ‘**రొమాంటిసిజమ్**’ను అనుసరించిన కవులనే ‘**కాల్పనికవాద కవులు**’ అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయెట్రిగా పిలుస్తారు.
- ‘**లిరికల్ పోయెట్రీ**’ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712–88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో ‘న్యూ హెలాయిన్’ రచనలో ప్రణయతత్వాన్ని, ‘సోషల్ కాంట్రాక్ట్’ గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం – **ఆత్మాశ్రయ సిద్ధాంతం.**
- భావకవితోద్యమం మూడు (1910–40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. ‘కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత’ – **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి ప త్రికలో)
2. ‘కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం’ – **విశ్వనాథ సత్యనారాయణ.**
3. ‘కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత’ – **శ్రీశ్రీ.**
4. ‘వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం’ – **సి.నా.రె.**

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు – లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి,మధుకలశం,స్నేహలత,కష్టకమల,వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు – సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి – కాటూరి కవులు – తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు – గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి – కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి – పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

నండూరి సుబ్బారావు – యెంకి పాటలు

నాయని సుబ్బారావు – సౌభద్రుని ప్రణయయాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనావాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి–దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు–మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు – శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ – ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిధూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవితోద్యమం **అభ్యుదయ కవిత్వం.** ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని ‘ప్రోగ్రెస్’ అనే పదానికి సమానార్థకంగా తెలుగులో ‘**అభ్యుదయం**’ అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి ‘**పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం**’ అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే.**

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో ‘**పారిస్**’లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో ‘**ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్**’ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే ‘**ది డెయిలీ ట్రిబ్యూన్**’ పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో ‘**మున్షీ ప్రేమ్ చంద్**’ అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో ‘**న్యూ సిగ్నేచర్స్**’ అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **చాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. ‘ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించింది, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసింది **అభ్యుదయ కవిత్వం**’.
2. ‘ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం’ – **దేవులపల్లి కృష్ణశాస్త్రి.**
3. ‘చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం’ – **వేల్చేరు నారాయణరావు.**

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ – **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ ‘**జ్వాల**’ పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం ‘**నయాగరా**’. 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలసి రచించారు.
- **శ్రీశ్రీ మహాప్రస్థానం** సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ): మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర: త్వమేవాహం, సినీవాలి, గాయాలు – గేయాలు

ఆవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహాంధ్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ: సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి, భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు – మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి – నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్, పఠాభి పంచాంగం (1964)

శిష్ట్లా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
   1) కులపాలికా ప్రణయం
   2) కరుణ విప్రలంభం
   3) అమలిన శృంగారం
   4) విప్రలంభ శృంగారం
2. ‘కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే’ అది?
   1) విప్లవ కవిత్వం 2) అభ్యుదయ కవిత్వం
   3) ఆధ్యాత్మిక కవిత్వం
   4) భావ కవిత్వం
3. ‘వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం’ అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
   1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
   3) భావ కవిత 4) విప్లవ కవిత
4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
   1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
   3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈసీఐఎల్, నోయిడాలో 10 డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) ఆధ్వర్యంలో భారత ఎన్నికల సంఘం కార్యాలయంలో పనిచేయడానికి ఒప్పంద ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.

» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఎంఎస్–ఎక్సెల్‌లో ప్రావీణ్యం ఉండాలి. ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి కనీసం 35 పదాల వేగం ఉండాలి.

» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.24,356 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బీఈసీఐఎల్, బీఈసీఐఎల్ భవన్, సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా–201307(ఉత్తరప్రదేశ్) చిరునామకు స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.03.2026

» **వెబ్‌సైట్:** https://www.becil.com

రైల్వే వీల్ ఫ్యాక్టరీ, బెంగళూరులో వివిధ పోస్టులు

బెంగళూరులోని రైల్ వీల్ ఫ్యాక్టరీ 2025–26 సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ కోటాలో హాకీ(పురుషులు) విభాగంలో టెక్నీషియన్ గ్రేడ్–3/జూనియర్ క్లర్క్/అకౌంట్స్ క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.

» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ గ్రేడ్3–01, జూనియర్ క్లర్క్/అకౌంట్స్ క్లర్క్–01.

» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి/ఐటీఐ/ఇంటర్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** అభ్యర్థులు 02.01.2001 నుంచి 01.01.2008 మధ్య జన్మించి ఉండాలి.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్–4, రైల్ వీల్ ఫ్యాక్టరీ,యలహంక, బెంగళూరు–560064 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 03.03.2026.

» **వెబ్‌సైట్:** https://rwf.indianrailways.gov.in

క్షీర విప్లవ పితామహుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం- వ్యవసాయం

మనదేశంలోని ఆహార పంటలు మొత్తం పంటల సాగు విస్తీర్ణంలో 75 శాతం. వ్యవసాయ ఉత్పత్తుల్లో వీటి విలువ 50 శాతం. ఆహార పంటలను కాయధాన్యాలు, పప్పు ధాన్యాలుగా విభజించవచ్చు.

1. **కాయధాన్యాలు:** వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, బార్లీ.
2. **పప్పుధాన్యాలు:** పెసలు, కందులు, మినుములు, ఉలవలు, సెనగలు మొదలైనవి.

వరి: మనదేశంలో వరి ముఖ్యమైన ఆహారపంట. ఇది ప్రధానంగా ఖరీఫ్ కాలానికి చెందిన పంట. కానీ రబీలోనూ పండిస్తున్నారు.

వరి పండించడానికి అనువైన పరిస్థితులు:

1) ఒండలి నేలలు అనుకూలం.
2) వార్షిక వర్షపాతం 150 సెం.మీ. నుంచి 200 సెం.మీ. వరకు ఉండాలి.
3) 22° సెంటీగ్రేడ్ నుంచి 32° సెంటీ గ్రేడుల ఉష్ణోగ్రత ఉండాలి.
4) వ్యవసాయ కూలీల లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అను వైనవి.

- వరి ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది.
- భారతదేశంలో ఉత్పత్తి పరంగా పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- దేశంలో వరిని అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతం.

గోధుమ: గోధుమ ప్రధానంగా 'రబీ' కాలపు పంట. శీతాకాలం ఈ పంటకు అనుకూలమైంది. విస్తీర్ణపరంగా, ఉత్పత్తిపరంగా వరి తర్వాత ఇది రెండో ప్రధాన ఆహార పంట.

- గోధుమ ఉత్పత్తిలో చైనా మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో భారత్ ఉంది.
- గోధుమ పంట ఉత్పత్తి పరంగా భారత్‌లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో, పంజాబ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- వరి, గోధుమ పంటలకు సంబంధించి భారతదేశంలో ఎక్కువ ఉత్పత్తి 1960వ దశాబ్దంలో (1965 తర్వాత) ప్రారంభమైంది. దీన్నే 'హరిత విప్లవం' అంటారు.

భారతదేశంలో హరిత విప్లవం (1965-66)

పురాతన వ్యవసాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ.. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనిక ఎరువులు, నీటిపారుదల వసతులను ఉపయోగించి, కొత్త సాంకేతిక పద్ధతులతో చేసే వ్యవసాయాన్ని హరిత విప్లవం (Green Revolution) అంటారు. దీన్నే సస్యవిప్లవం అని కూడా అంటారు.

- ఇందులో భాగంగా 1965-66లో అధిక దిగుబడులనిచ్చే వంగడాల కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రవేశ పెట్టారు.
- హరిత విప్లవం అనే పదాన్ని మొదటగా వాడిన వ్యక్తి విలియం గాండ్.
- హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్ (మెక్సికో).
- భారత్‌లో హరిత విప్లవాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన వ్యక్తి M.S. స్వామినాథన్. ఈయననే భారతదేశ హరిత విప్లవ పితామహుడు అంటారు.
- హరిత విప్లవం వల్ల అధికంగా ప్రయోజనం పొందిన పంటలు వరుసగా..
  1. గోధుమ, 2. వరి, 3. జొన్న, 4. మొక్కజొన్న.
- దీనివల్ల తక్కువ ప్రయోజనం పొందిన పంటలు 1. పప్పుధాన్యాలు, 2. నూనెగింజలు.

రెండో హరిత విప్లవం (2006):

2004లో వాజ్‌పేయి ప్రభుత్వం రెండో హరిత విప్లవం గురించి 11వ ప్రణాళికలో పేర్కొన్నప్పటికీ అది అమలు కాలేదు.

- 2006 మే 26న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని ప్రకటించాడు.
- భారతదేశంలో వర్షపాతం తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలను పండిస్తున్నారు. చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి.. జొన్నలు, కొర్రలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్న.



- ప్రోటీన్లు అధికంగా ఉండే 'లెగుమినేసి' కుటుంబానికి చెందిన పంటలన్నీ పప్పుధాన్యాల కిందకి వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి సెనగలు, కందులు, పెసలు, మినుములు.

వాణిజ్య లేదా నగదు పంటలు

భారతదేశంలో నగదు పంటలు మొత్తం పంట విస్తీర్ణంలో 15 శాతం ఆక్రమిస్తూ, ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

- పత్తిని 'తెల్లబంగారం' అంటారు.
- భారతదేశంలో ఎక్కువగా పొడుగు గింజ, మధ్యరకం గింజ పత్తిని పండిస్తున్నారు.
- పత్తి ప్రధానంగా నల్లరేగడి నేలలో పండుతుంది.
- భారతదేశంలో అధికంగా రబ్బరు ఉత్పత్తి (దాదాపు 85 శాతం) కేరళలో జరుగుతోంది.
- దేశంలో మొదటిసారిగా తేయాకు సాగుచేసిన ప్రాంతం అసోం.

శ్వేత విప్లవం (White Revolution)

- పాల ఉత్పత్తిలో అధిక దిగుబడులను తీసుకురావడానికి శ్వేత విప్లవాన్ని ప్రవేశ పెట్టారు.
- దీని ముఖ్య ఉద్దేశం.. గ్రామీణ ఉత్పత్తి దారులు, పట్టణ వినియోగదారులను కలపడం.
- ఇందులో భాగంగా 1970లో 'ఆపరేషన్ ఫ్లడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- శ్వేత విప్లవ పితామహుడు - **వర్గీస్ కురియన్**
- ప్రస్తుతం ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది.
- ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఉత్పత్తిపరంగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నీలి విప్లవం (Blue Revolution)

ఇది చేపల ఉత్పత్తిలో పెరుగుదల కోసం చేపట్టిన కార్యక్రమం.

- చేపల పెంపకాన్ని 'పిసికల్చర్' అంటారు.
- చేపల గురించి చేసే అధ్యయనాన్ని 'ఇక్తియాలజీ' అంటారు.
- చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా, జపాన్ తర్వాత భారతదేశం ఉంది.
- పట్టు పురుగుల పెంపకాన్ని 'సెరికల్చర్' అంటారు.
- తేనేటీగల పెంపకాన్ని 'ఎపికల్చర్' అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతదేశ 'స్పైస్ గార్డెన్'గా పేరు పొందిన రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్-2012)
   1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
   3) తమిళనాడు 4) కర్ణాటక
2. కిందివాటిలో ఏ రాష్ట్రం సోయాబీన్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది? (డిప్యూటీ జైలర్స్ -2012)
   1) బిహార్ 2) మధ్యప్రదేశ్
   3) ఉత్తరప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్
3. జతపరచండి.

పంట	ముఖ్య ఉత్పాదక రాష్ట్రం
ఎ. కాఫీ	1. కేరళ
బి. పత్తి	2. గుజరాత్
సి. పెండళం	3. ఆంధ్రప్రదేశ్
డి. పొగాకు	4. తమిళనాడు
ఇ. మిరప	5. కర్ణాటక

(డిప్యూటీ జైలర్స్-2012)
   1) ఎ-1, బి-2, సి-3, డి-4, ఇ-5
   2) ఎ-4, బి-5, సి-3, డి-2, ఇ-1
   3) ఎ-3, బి-5, సి-3, డి-2, ఇ-1
   4) ఎ-5, బి-2, సి-1, డి-3, ఇ-4
4. భారతదేశ సహజ సిద్ధ రబ్బరు అవసరాలను ఎక్కువగా తీర్చే రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్ -2012)
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) ఏదీకాదు
5. ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ భాగంతో పాటు హరిత విప్లవం వల్ల ముందు లబ్ధి పొందిన రాష్ట్రాలు? (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్-2013)
   1) పంజాబ్, హర్యానా
   2) పంజాబ్, మహారాష్ట్ర
   3) హర్యానా, ఆంధ్రప్రదేశ్
   4) మహారాష్ట్ర, కర్ణాటక
6. కిందివాటిలో సిల్క్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం? (కానిస్టేబుల్-2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) అసోం
7. భారతదేశంలో అత్యధికంగా జీడిపప్పును పండించే రాష్ట్రం ఏది? (కానిస్టేబుల్-2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) అసోం
   3) కేరళ 4) కర్ణాటక
8. భారతదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం దేని ఎగుమతి ద్వారా లభిస్తుంది? (కానిస్టేబుల్-2012)
   1) ఇనుము 2) టీ
   3) జనపనార 4) పంచదార
9. నీలి విప్లవం అంటే ఏమిటి? (కానిస్టేబుల్-2013)
   1) వాణిజ్య పంటల ఉత్పత్తి
   2) నీలి మందుల ఉత్పత్తి
   3) నీలి లోహ ఉత్పత్తి 4) చేపల ఉత్పత్తి
10. కిందివాటిలో ఏ పంటకు ఒక హెక్టార్‌కు ఎక్కువ నీరు అవసరం? (కానిస్టేబుల్- 2013)
   1) చెరకు 2) గోధుమ
   3) మొక్కజొన్న 4) బార్లీ
11. హరిత విప్లవానికి కారణమైన వ్యవసాయ శాస్త్రజ్ఞుడు ఎవరు? (జైల్ వార్డెన్-2012)
   1) కురియన్ 2) ఎస్.ఎస్. భట్నాగర్
   3) శాంతి స్వరూప్ 4) నార్మన్ బోర్లాగ్

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 1; 5) 1; 6) 3; 7) 3; 8) 2; 9) 4; 10) 1; 11) 4.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో వరి ఉత్పత్తిలో అగ్రస్థా నంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) అసోం
   2) పశ్చిమ బెంగాల్
   3) ఆంధ్రప్రదేశ్
   4) ఉత్తరప్రదేశ్
2. భారతదేశంలో తేయాకును ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
   1) ఉత్తరాంచల్
   2) తమిళనాడు
   3) అసోం
   4) పశ్చిమ బెంగాల్
3. భారత కేంద్రీయ వరి పరిశోధనా సంస్థ ఎక్కడ ఉంది?
   1) కటక్ 2) మైసూర్
   3) కోల్‌కతా 4) బెంగళూరు
4. గ్రీన్ రివల్యూషన్ ప్రభావం దేనిపై ఎక్కువగా కనిపిస్తుంది?
   1) పప్పుధాన్యాలు 2) గోధుమలు
   3) వరి 4) నూనె గింజలు
5. క్షీర విప్లవ పితామహుడు ఎవరు?
   1) రామన్ కురియన్ 2) రామనాథ్ కృష్ణన్
   3) వర్గీస్ కురియన్ 4) జె.ఎం. జోసఫ్
6. పట్టు ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 2.

వివిధ పంటలు - పరిశోధనా సంస్థలు

- జాతీయ వరి పరిశోధనా కేంద్రం - **కటక్ (ఒడిశా)**
- అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం - **మనీలా (ఫిలిప్పీన్స్)**
- భారత చెరకు పరిశోధనా సంస్థ - **లక్నో (ఉత్తరప్రదేశ్)**
- సుగంధ ద్రవ్యాల పరిశోధనా కేంద్రం - **కాలికట్ (కేరళ)**
- కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం - **నాగపూర్ (మహారాష్ట్ర)**
- ఇక్రిసాట్ (International Crops Research Institute for Semi Arid Tropics - ICRISAT) - **హైదరాబాద్**
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ - **న్యూ ఢిల్లీ**
- తేయాకు పరిశోధనా కేంద్రం - **జోర్హాట్ (అసోం)**
- భారత ప్రభుత్వం 2000 జనవరి 28న మొదటిసారిగా 'జాతీయ వ్యవసాయ విధానాన్ని' ప్రకటించింది. ఇందులో భాగంగా 'ఇంద్రధనస్సు' విప్లవాన్ని ప్రకటించింది. ఈ విప్లవంలో మిశ్రమ వ్యవసాయం కూడా ఒక భాగం.

భారతదేశంలో వివిధ రకాల పంటలు - అధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు

పంట	రాష్ట్రాలు
1. వరి	1. పశ్చిమ బెంగాల్ 2. ఉత్తరప్రదేశ్
2. గోధుమ	1. ఉత్తరప్రదేశ్ 2. పంజాబ్
3. జొన్న	1. మహారాష్ట్ర 2. కర్ణాటక
4. రాగి	1. కర్ణాటక 2. తమిళనాడు
5. వేరుసెనగ	1.గుజరాత్ 2. తమిళనాడు
6. పత్తి	1. గుజరాత్ 2.మహారాష్ట్ర
7. జనుము	1. పశ్చిమ బెంగాల్ 2. బిహార్
8. చెరకు	1. ఉత్తర ప్రదేశ్ 2. మహారాష్ట్ర
9. కాఫీ	1. కర్ణాటక 2. కేరళ
10. తేయాకు	1. అసోం 2. పశ్చిమబెంగాల్
11. రబ్బరు	1. కేరళ
12. పాలు	1. ఉత్తరప్రదేశ్ 2. గుజరాత్

Who amongst the five types the fastest?

BANK EXAMS
REASONING



Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "b64@%". How is "DELAY" written in that code?
   1) b4H2%
   2) b4@2%
   3) %42@b
   4) %4@2b
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One
   3) Two 4) Three
   5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin
   2) Nephew
   3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:

394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783
   3) 576 4) 895
   5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394
   3) 576 4) 632
   5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79
   3) 77 4) 80
   5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe
   5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
   1) M is the brother-in-law of Q
   2) M is the uncle of Q
   3) M is the son-in-law of Q
   4) Q is the mother-in-law of M
   5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

RDAK 5 B I 2 M J E N 9 7 U Z V 1 W 3 H 4 F Y 8 P 6 T G

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
   1) None 2) One
   3) Two 4) Three
   5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
   1) M 2) J
   3) 8 4) 5
   5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
   1) E 9 J 2) Z 1 U 3) H W 4
   4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
   1) 5 2) Z
   3) V 4) 1
   5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
   1) None
   2) One
   3) Two
   4) Three
   5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
   I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
   II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
   I) P is heavier than M and T.
   II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
   I) "5 $ # 3" means "flowers are really good".
   II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
   I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
   II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✳	©	β	6	4	%

\ DELAY Þ %4@2b

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 Þ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.

```
               Q
               |
M(+) Û N(–)<—>P(–)
```

11. Ans: 1.
12. Ans: 1. 8th to the left of 17th from left = 17 – 8 = 9th from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6th to the right of 19th from the right = 19 – 6 = 13th from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12th from left
    Mohan = 17th from right
    \ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.